చదువు
రూ॥ 180/-
పేజీలు: 210

నవచేతన పబ్లిషింగ్ హౌస్
ప్రతులకు:
నవచేతన పబ్లిషింగ్ హౌస్
గిరిప్రసాద్ భవన్, బండ్లగూడ(నాగోల్),
హైదరాబాద్-68, ఫోన్: 29884454/53
Email ID: navachethanaph@gmail.com
నవచేతన బుక్ హౌస్
అబిడ్స్, బండ్లగూడ,
హిమాయత్‌నగర్ (హైదరాబాద్)
హన్మకొండ.

www.prajapaksham.in

# ప్రజాపక్షం

ప్రతి అక్షరం ప్రజల కోసం

PRAJAPAKSHAM ★

మంత్రి విజయ్ షాపై కేసు నమోదు చేయండి
బిఎస్ఎఫ్ జవాన్‌ను భారత్‌కు అప్పగించిన పాక్
మహిళలకు సైన్యంలో లీగల్ పోస్టులు ఎందుకివ్వడం లేదు
లోపలి పేజీల్లో

సంపుటి 27, సంచిక: 324 | గురువారం | 15-05-2025 | హైదరాబాద్ Published from: Hyderabad, Khammam, Karimnagar, Mahabubnagar పేజీలు: 12 | వెల రూ. 5.00

# ఒత్తిళ్లకు తలొగ్గొద్దు



ఆనాడు ఎలాంటి సాంకేతికత అందుబాటులో లేకుండా నిర్మించిన ఉస్మాన్‌సాగర్, హిమాయత్‌సాగర్, శ్రీరాంసాగర్ ప్రాజెక్టులు ఇప్పటికీ చెక్కు చెదరలేదు. బిఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో నిర్మించిన కాళేశ్వరం ప్రాజెక్టు మాత్రం మూడేళ్లకే పేకమేడలా కూప్పకూలింది. అధికారిక లెక్కల ప్రకారం కాళేశ్వరం నిర్మాణానికి రూ.1.47లక్షల కోట్లు అంచనా వ్యయం కాగా ఇప్పటివరకు రూ.1.02 లక్షల కోట్లు ఖర్చు చేశారు. మరో రూ.15 వేల కోట్లు కాంట్రాక్టర్లకు చెల్లించాల్సి ఉంది. ఇంత చేసినా కనీసం 50 వేల ఎకరాలకు కూడా సాగు నీరు అందించలేకపోయారు. చివరికి ఆ ప్రాజెక్టే కూలిపోయింది.

– సిఎం రేవంత్‌రెడ్డి

• ఎవరి బాధ్యతలు వారు సమర్థవంతంగా నిర్వహించాలి • పరిమిత జ్ఞానం ఉన్న రాజకీయ నేతల మాటలు వింటే నష్టపోతారు • ఇంజనీర్లకు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఉద్బోధ • నీటిపారుదల శాఖలో నూతనంగా ఉద్యోగాలు పొందిన 432 మంది అభ్యర్థులకు నియామక పత్రాలు అందజేత • గత ప్రభుత్వ హయాంలో రూ.రెండు లక్షల కోట్లు ఖర్చుపెట్టినా ఏ ఒక్క ప్రాజెక్టు పూర్తి కాలేదని సిఎం ఆగ్రహం

ప్రజాపక్షం/హైదరాబాద్

ప్రాజెక్టుల నాణ్యత విషయంలో ఇంజనీర్లు ఎవరి వత్తిళ్లకు తలొగ్గొద్దని, ఎవరి బాధ్యతలు వారు సమర్థవంతంగా నిర్వహించాలని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఉద్బోధించారు. నీళ్లే మన నాగరికత అని, ఈ నీళ్లే తెలంగాణ ఉద్యమానికి దారితీసిందని, ఆ ఉద్యమమే ప్రత్యేక రాష్ట్రాన్ని సాధించి పెట్టిందని గుర్తు చేశారు. రాజకీయ నాయకుడు ఐదేళ్లలో ఎంఎల్ఎ, మంత్రి, ముఖ్యమంత్రి కూడా కావచ్చుని, అదే ఇంజనీరింగ్ ఇన్ చీఫ్ పదవి పొందాలంటే కనీసం 35 ఏళ్లు శ్రమ పడాలన్నారు. రైతులు ఆత్మగౌరవంతో బతికేందుకు నిర్మించే ప్రాజెక్టు నిర్మాణంలో పరిమిత జ్ఞానం ఉన్న రాజకీయ నాయకులు మాటలు వింటే చివరికి నష్టపోయేది ఇంజనీర్లు లేన్నారు. హైదరాబాద్‌లోని జలసౌధలో బుధవారం నీటి పారుదల శాఖలో నూతనంగా ఉద్యోగాలు పొందిన 432 మంది అసిస్టెంట్ ఇంజనీర్లు, జూనియర్ టెక్నికల్ ఆఫీసర్లకు నియామక పత్రాలను ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అందజేశారు. ఈ సందర్భంగా నీటిపారుదల శాఖ మంత్రి ఎన్.ఉత్తమ్ కుమార్‌రెడ్డి అధ్యక్షతన జరిగిన సభకు ముఖ్యఅతిథులుగా సిఎం రేవంత్‌రెడ్డి విచ్చేశారు. మంత్రి పొన్నం ప్రభాకర్, ప్రణాళిక సంఘం ఉపాధ్యక్షులు డాక్టర్ జి.చిన్నారెడ్డి తదితరులు పాల్గొన్నారు. సిఎం రేవంత్‌రెడ్డి మాట్లాడుతూ దేశ ప్రథమ ప్రధానమంత్రి జవహర్ నెహ్రూ ఇరిగేషన్, విద్యకు ప్రథమ ప్రాధాన్యత ఇవ్వడం ద్వారా సాధించిన

తరువాయి 2లో



## 52వ సిజెఐగా జస్టిస్ బిఆర్.గవాయ్ ప్రమాణస్వీకారం

నవంబర్ 23 వరకు పదవిలో కొనసాగనున్న నూతన ప్రధాన న్యాయమూర్తి

**న్యూఢిల్లీ :** సుప్రీంకోర్టు 52వ ప్రధాన న్యాయమూర్తిగా బిఆర్.గవాయ్ బుధవారం ప్రమాణస్వీకారం చేశారు. రాష్ట్రపతి ద్రౌపది ముర్ము రాష్ట్రపతి భవన్‌లోని గణతంత్ర మండపంలో 64ఏళ్ల బిఆర్.గవాయ్‌తో ప్రమాణం చేయించారు. మంగళవారం నాటికి 65సంవత్సరాల వయస్సు పూర్తి చేసి సిజెఐగా పదవీవిరమణ పొందిన జస్టిస్ సంజీవ్‌ఖన్నా స్థానంలో జస్టిస్ భూషణ్ రామకృష్ణ (బిఆర్) గవాయ్ భారత ప్రధాన న్యాయమూర్తిగా ప్రమాణస్వీకారం చేశారు. మహారాష్ట్రకు చెందిన బిఆర్.గవాయ్ హిందీలో ప్రమాణం చేశారు. ఉప రాష్ట్రపతి జగ్‌దీప్ ధన్‌కర్, ప్రధానమంత్రి నరేంద్రమోదీ, మాజీ రాష్ట్రపతి రామ్‌నాథ్ కోవింద్,

తరువాయి 2లో

## నేటినుంచి సరస్వతి పుష్కరాలు

త్రివేణి సంగమం వద్ద సరస్వతీ ఘాట్‌ను ప్రారంభించనున్న సిఎం రేవంత్‌రెడ్డి

ప్రజాపక్షం/హైదరాబాద్

జయశంకర్ భూపాలపల్లి జిల్లా కాళేశ్వరంలో గురువారం నుంచి ప్రారంభం కానున్న సరస్వతి పుష్కరాల సందర్భంగా త్రివేణి సంగమం వద్ద సరస్వతి ఘాట్ ను రాష్ట్ర ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి ప్రారంభిస్తారు. ఈ పుష్కర ఘాట్ ప్రారంభం అనంతరం, కాళేశ్వర త్రివేణి సంగమంలో ముఖ్యమంత్రి పుణ్యస్నానం ఆచరిస్తారు. 12 సంవత్సరాలకు ఒకసారి వచ్చే ఈ సరస్వతి పుష్కరాలకు రాష్ట్ర ప్రభుత్వ దేవాదాయ శాఖ విస్తృత ఏర్పాట్లు చేసింది. పుష్కరస్నానం ఆచరించేవారికి తాత్కాలిక టెంట్ సిటీ లను ఏర్పాటు చేశారు. వీటితో పాటు రోజూ రాత్రి కళా, సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేశారు.



## రంగంలోకి ‘భార్గవాస్త్రం’

అస్త్ర పరీక్ష విజయవంతం


**గోపాల్‌పూర్(ఒడిశా) :** స్వదేశీ శక్తితో రూపొందించిన అత్యంత శక్తివంతమైన భార్గవ అస్త్ర పరీక్ష విజయవంతంగా నిర్వహించింది. ఒడిశాలోని గోపాల్‌పూర్ సీవార్డ్ ఫైరింగ్ రేంజ్‌లో బుధవారం ఈ పరీక్ష నిర్వహించింది. ‘హార్డ్ కిల్’ మోడ్‌తో భార్గవస్త్ర కౌంటర్ డ్రోన్ వ్యవస్థను భారత్ ప్రయోగించింది. ఈ పరీక్ష విజయవంతంగా ముగిసింది. ఇటీవల పాకిస్థాన్ భారత్‌పైకి విరివిగా డ్రోన్లు

తరువాయి 2లో

## ఒఆర్ఆర్ పరిధిలో మూడు నగరాలు

త్వరలో జిహెచ్ఎంసి కనుమరుగు ?

• మూడు కార్పొరేషన్‌లకే ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మొగ్గు • ప్రతిపాదనలు సిద్ధం చేసిన మున్సిపల్ శాఖ అధికారులు



మల్లం వెంకటేశ్

త్వరలోనే గ్రేటర్ హైదరాబాద్ మహానగర పాలక సంస్థ(జిహెచ్ఎంసి) కనుమరుగుకానుంది. జిహెచ్ఎంసితో పాటు ఔటర్ రింగ్ రోడ్డు(ఒఆర్ఆర్) పరిధిలోని 27 మున్సిపల్ సంస్థలను విలీనం చేసి, మూడు నగరాలు ఏర్పాటు చేయనున్నారు. దీంతో ఒఆర్ఆర్ పరిధిలో కొత్తగా మూడు మున్సిపల్ కార్పొరేషన్‌లు ఏర్పాటు కానున్నాయని అత్యంత విశ్వసనీయంగా తెలిసింది. కొత్తగా ఏర్పాటు కానున్న మున్సిపల్ కార్పొరేషన్‌లకు సంబంధించిన ప్రతిపాదనలను ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డికి మున్సిపల్ శాఖ అధికారులు పంపించారు. ఈ అంశంపై సిఎం అధికారులతో సుదీర్ఘంగా సమాలోచనలు జరిపినట్లు తెలిసింది. అధికారుల ప్రతిపాదనలకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి దాదాపుగా గ్రీన్ సిగ్నల్ ఇచ్చినట్లు సమాచారం. ముఖ్యమంత్రి పలు సూచనలు చేసినట్లు తెలిసింది. ముఖ్యమంత్రి సూచనల మేరకు మార్పులు చేర్పులతో మూడు నగరాలకు చెందిన మున్సిపల్ కార్పొరేషన్‌ల ఏర్పాటు మూసాయిదా ప్రతిపాదనలు తుది దశకు వచ్చినట్లు సమాచారం. దాదాపుగా మూడు నగరాలు ఏర్పాటుకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సుముఖత వ్యక్తం చేసినట్లు తెలిసింది. తుది ప్రతిపాదనకు ముఖ్యమంత్రి

తరువాయి 2లో

## జూన్ 2 నుంచి రాష్ట్ర వ్యాప్తంగా భూభారతి రెవెన్యూ సదస్సులు

ప్రజాపక్షం/హైదరాబాద్

రాష్ట్ర అవతరణ దినోత్సవమైన జూన్ 2వ తేదీ నుంచి భూభారతి చట్టంలో భాగంగా రాష్ట్ర వ్యాప్తంగా రెవెన్యూ సదస్సులు నిర్వహించనున్నట్లు రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి తెలిపారు. తద్వారా గత 10ఏళ్లుగా రాష్ట్రంలో పేరుకుపోయిన భూ సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపనున్నమన్నారు. భూ భారతి అమల్లో భాగంగా గతనెల 17వ తేదీ నుంచి 30వ తేదీ వరకు నాలుగు జిల్లాల్లోని నాలుగు మండలాల్లో ప్రయోగాత్మకంగా రెవెన్యూ సదస్సులు నిర్వహించగా, ఈనెల 5వ తేదీ నుంచి 30వ తేదీ వరకు 28 జిల్లాల్లోని 28 మండలాల్లో రెవెన్యూ సదస్సులు నిర్వహిస్తున్నామని తెలిపారు. తద్వారా ఆయా మండలాల్లో ఎదురైన అనుభవాలను దృష్టిలో పెట్టుకొని జూన్2వ తేదీ

తరువాయి 2లో

## ప్రధాని మోదీ వాస్తవాలు వెల్లడించాలి


• పహల్గామ్ ఘటన, ఆపరేషన్ సిందూర్‌పై పార్లమెంట్ ప్రత్యేక సమావేశాలు ఏర్పాటు చేయాలి • సిపిఐ(ఎం) జాతీయ ప్రధాన కార్యదర్శి ఎంఎ.బేబీ డిమాండ్ • భారత్ పాక్ మధ్య మూడవ దేశం మధ్యవర్తిత్వం అవసరం ఏమిటని నిలదీత

ప్రజాపక్షం/హైదరాబాద్

పహల్గామ్‌లో ముష్కరుల దాడి మొదలు ఆపరేషన్ సిందూర్‌తో ఉగ్రవాదల శిక్షణా కేంద్రాల ధ్వంసం నుంచి పాకిస్తాన్‌తో జరిగిన కాల్పుల విరమణ ఒప్పందం వరకు అన్ని అంశాలపై ప్రధాని మోదీ వాస్తవాలను వెల్లడించాలని ఇందుకు తక్షణమే ప్రత్యేక పార్లమెంట్ సమావేశాలు ఏర్పాటు చేయాలని సిపిఐ(ఎం) ప్రధాన కార్యదర్శి ఎంఎ.బేబీ డిమాండ్

తరువాయి 2లో





## పారాదీప్ పోర్టులో భద్రత కట్టుదిట్టం

నౌకలో 21 మంది పాక్ సిబ్బంది

**పరదీప్ :** భారత్–పాకిస్థాన్ మధ్య ఉద్రిక్తతల నేపథ్యంలో దేశవ్యాప్తంగా అన్ని ఓడరేవుల వద్ద భద్రతను కట్టుదిట్టం చేసిన విషయం తెలిసిందే. ఈనేపథ్యంలో ఒడిశాలోని పారాదీప్ పోర్టుకు వచ్చిన ఓ షిప్ కలకలం రేపింది. అందులో 21 మంది పాకిస్థాన్ సిబ్బంది ఉన్నట్లు అధికారులు గుర్తించడమే అందుకు కారణం. దీంతో ఆ పోర్టులో భద్రతను పెంచారు. ఆ ప్రాంతంలో హైఅలర్ట్ ప్రకటించారు. బుధవారం ఉదయం దక్షిణ కొరియా నుంచి సింగపూర్ మీదుగా ఓ నౌక పారాదీప్ పోర్టుకు చేరింది. ఎంటి సైరెన్ – II పేరుతో ఉన్న ఈ షిప్‌లో మొత్తం 25 మంది సిబ్బంది ఉన్నారు. ఇది ఇండియన్ ఆయిల్ కార్పొరేషన్ సంస్థ కోసం

తరువాయి 2లో

## సులభతరంగా అనుమతులు



• తెలంగాణ కోర్ అర్బన్ రీజియన్ పరిధిలో వివిధ రకాల నిర్మాణాలకు పర్మిషన్ ఇవ్వాలి • పూర్తి అధ్యయనంతో సాధ్యమైనంత త్వరగా నివేదిక అందించాలి • అధికారులకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆదేశం • ఆస్తులు, వనరుల గుర్తింపునకు రైడర్ సర్వే చేయాలి • సులభతర విధానాల అధ్యయనానికి నిపుణుల సలహా తీసుకోవాలని సూచన

ప్రజాపక్షం/హైదరాబాద్

తెలంగాణ కోర్ అర్బన్ రీజియన్ పరిధిలో వివిధ రకాల నిర్మాణాలు, ఇతర సదుపాయాల కల్పనకు సంబంధించిన అనుమతుల ప్రక్రియ సులభతరంగా ఉండాలని ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్‌రెడ్డి అన్నారు. ఇందుకు సంబంధించి పూర్తి అధ్యయనంతో సాధ్యమైనంత త్వరగా నివేదిక సమర్పించాలని అధికారులను ఆదేశించారు. కోర్ అర్బన్ రీజియన్ పరిధిలోని పౌర సేవలు, అనుమతులపై రాష్ట్ర సచివాలయంలో ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి బుధవారం సాయంత్రం సమీక్ష నిర్వహించారు. ఔటర్ రింగు రోడ్డు పరిధిలోని జిహెచ్ఎంసి, హెచ్ఎండిఎ పరిధిలోని కోర్ అర్బన్ రీజియన్‌లో వివిధ రకాల నిర్మాణాలకు ప్రజలు పలు విభాగాలకు దరఖాస్తులు చేసుకుని వివిధ కార్యాలయాల చుట్టూ తిరగాల్సి వస్తోందన్నారు. ఏదైనా నిర్మాణం లేదా గృహాలు, వాణిజ్య సముదాయాలకు అవసరమైన సేవలకు ఒకే ప్లాట్‌ఫ్లామ్‌పై దరఖాస్తు అందజేస్తే వారికి అవసరమైన సేవలన్నింటికి సింగిల్ విండోలో అనుమతి లభించేలా ఉండాలన్నారు. ఇందుకు రెవెన్యూ, పురపాలక, జల వనరులు, నీటి సరఫరా, మురుగు నీటి పారుదల, పోలీసు, అగ్నిమాపక, విద్యుత్ తదితర విభాగాలు సంయుక్తంగా పనిచేయాలని ముఖ్యమంత్రి సూచించారు. వివిధ శాఖలు వసూలు చేసే బిల్లులు సైతం ఒకేసారి, ఒకే విండో ద్వారా చెల్లించే విధానం

తరువాయి 2లో

## శాంతి చర్చలకు మేమెప్పుడూ సిద్ధమే

• మోదీ ప్రభుత్వ వైఖరి స్పష్టం చేయాలి • శాంతి చర్చల ఒప్పందానికి ముందుకు రండి • మావోయిస్టుల బహిరంగ లేఖ




ప్రజాపక్షం/ఖమ్మం

శాంతి చర్చల ద్వారా ప్రజా సమస్యలను పరిష్కరించడానికి మా పార్టీ ఎల్లప్పుడు సిద్ధమేనని భారత కమ్యూనిస్టు పార్టీ (మావోయిస్టు ) విడుదల చేసిన ఒక లేఖలో తెలిపింది. కేంద్ర కమిటీ అధికార ప్రతినిధి అభయ్ పేరుతో ఒక లేఖను విడుదల చేశారు. శాంతి చర్చలకు సంబంధించి మావోయిస్టు పార్టీ నుంచి ఇప్పటికే రెండు లేఖలను విడుదల చేసిన విషయం విధితమే. లేఖల తర్వాత కూడా ప్రభుత్వం తన వైఖరిని స్పష్టం చేయలేదని అటు కేంద్ర ప్రభుత్వం ఛత్తీస్‌గఢ్ ప్రభుత్వం స్పందించ లేదని హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్, ఛత్తీస్‌గఢ్ ఉప ముఖ్యమంత్రి విజయ్‌శర్మ ఆయుధాలు వదిలి వస్తేనే చర్చలని ప్రకటించారని మావోయిస్టులు లేఖలో పేర్కొన్నారు. కాల్పుల విరమణ ప్రకటించకుండా మావోయిస్టులు మాత్రం ఆయుధాలు విడిచిపెట్టాలనే షరతు సరి కాదని విప్లవోద్యమం తెలంగాణ ఛత్తీస్‌గఢ్‌లకు పరిమితమై లేదని 16 రాష్ట్రాల్లో మావోయిస్టు పార్టీ పని చేస్తుందని అందువల్ల కేంద్ర హోంమంత్రి మాత్రమే స్పందించాల్సి ఉందని లేఖలో తెలిపారు. 2002 నుంచే శాంతి చర్చల పట్ల మా వైఖరిని ప్రకటించామని 2004లో ప్రజాస్వామిక వాదుల డిమాండ్ మేరకు శాంతి చర్చలు జరిపినప్పటికీ ప్రభుత్వం ఏకపక్షంగా వైదొలిగిందని అప్పుడు కూడా ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి పరిమితమై చర్చలు జరిపామన్నారు. 2010లో పౌర సమాజం ప్రజాస్వామిక వాదుల విజ్ఞప్తి మేరకు కేంద్ర కమిటీ వైపు నుంచి శాంతి చర్చలు జరిపేందుకు తీవ్ర ప్రయత్నం చేశామని అప్పటి పార్టీ పోలీట్ బ్యూరో సభ్యులు మల్లోజుల కోటేశ్వరరావు (రాంజీ) చర్చల ప్రక్రియలోనే హత్య చేశాయన్నారు. శాంతి చర్చలకు మావోయిస్టులు ఎప్పుడు సిద్ధమేనని

తరువాయి 12లో

## అమెరికా పాపా యుద్ధాన్ని ఆపారా?



మోదీ ప్రభుత్వాన్ని ప్రశ్నించిన కాంగ్రెస్

**న్యూఢిల్లీ :** అమెరికా పాపా (తండ్రి) యుద్ధాన్ని ఆపారా?... అమెరికా ఒత్తిడిని ఎదుర్కొని నరేంద్ర మోదీ ప్రభుత్వం భారతదేశ భద్రతా ప్రయోజనాలను తాకట్టు పెట్టిందా అని కాంగ్రెస్ ప్రశ్నించింది. ‘భారత్‌పాక్ మధ్య పెరుగుతున్న సంఘర్షణను ఆపడానికి తన పాలనా యంత్రాంగం చారిత్రక కాల్పుల విరమణకు విజయవంతంగా మధ్యవర్తిత్వం వహించింది’ అని సౌదీ అరేబియాలో డొనాల్డ్ ట్రంప్ మరోసారి ప్రకటించిన తర్వాత కాంగ్రెస్ ఈ మేరకు మోదీ సర్కారును నిలదీసింది. కొన్ని రోజుల క్రితం అమెరికా అధ్యక్షుడి ద్వారా పాకిస్థాన్‌తో కాల్పుల విరమణ గురించి మనకు తెలిసింది. ఇప్పుడు సౌదీ అరేబియాలో జరిగిన ఒక బహిరంగ కార్యక్రమంలో ఆంక్షలు, వాణిజ్య ఒప్పందాలు అనే బెదిరింపును ఉపయోగించి భారతదేశాన్ని ఈ కాల్పుల విరమణకు బలవంతం, బ్లాక్ మెయిల్ చేసి ఉండవచ్చని అధ్యక్షుడు

తరువాయి 12లో


## ఆపరేషన్ కగార్‌లో 31 మంది నక్సల్స్ హతం

కర్రెగుట్టల్లో 21 రోజుల పాటు ఆపరేషన్
ఈనెల 11న విరమించుకున్నాం
ఛత్తీస్‌గఢ్ పోలీసులు, సిఆర్‌పిఎఫ్ అధికారులు వెల్లడి




**బిజాపూర్ :** ఛత్తీస్‌గఢ్–తెలంగాణ సరిహద్దు కర్రెగుట్టలో జరిగి భారీ నక్సల్ ఆపరేషన్స్‌లో మావోయిస్టులకు భారీగానే ఎదురుదెబ్బ తగిలింది. ఆపరేషన్ కగార్ పేరుతో చేపట్టిన ఆపరేషన్‌లో భద్రతా దళాలు 31మంది నక్సలైట్లను హతమార్చినట్లు ఛత్తీస్‌గఢ్ పోలీసులు, సిఆర్‌పిఎఫ్ అధికారులు తెలిపారు. బుధవారం బిజాపూర్‌లో జరిగిన విలేకరుల సమావేశంలో ఆపరేషన్‌కు సంబంధించిన విషయాలు వెల్లడించారు. ఈ సమావేశంలో సిఆర్‌పిఎఫ్ డిజి, ఛత్తీస్‌గఢ్ డిజిపి పాల్గొన్నారు. ‘కర్రెగుట్ట కొండలు చుట్టూ ఏప్రిల్ 21న

తరువాయి 12లో



# ప్రపంచం
WORLD NEWS

## ఇస్తాంబుల్ చర్చలకు ట్రంప్?



**ఇస్తాంబుల్:** ఉత్కంఠ పరిస్థితులమధ్య ఇస్తాంబుల్‌లో ఉక్రేన్–రష్యా మధ్య గురువారంనాడు చర్చలు ప్రారంభం కానున్నాయి. ఐతే ప్రస్తుతం నాలుగు రోజుల మధ్యప్రాచ్య పర్యటనలో ఉన్న ట్రంప్ ఖతార్ నుండి టర్కీకి వెళ్ళే అవకాశాలు ఉన్నాయన్న వార్తలు వెలువడుతున్నాయి. ఇస్తాంబుల్‌లో చర్చలకు ట్రంప్ వెళితే ఈ చర్చలకు మరింత ప్రాధాన్యత ఏర్పడుతుంది. ఉక్రేన్‌తో చర్చలకు సిద్ధంగా ఉన్నట్లు ఇప్పటికే రష్యా ప్రకటించినప్పటికీ, ప్రతినిధివర్గంలో ఎవరెవరుంటారన్న విషయం వెల్లడికాలేదు. పుతిన్–జెలెన్స్కీ మధ్య మాత్రమే చర్చలు జరుగుతాయని రష్యావర్గాలు మంగళవారంనాడు చెప్పాయి. చర్చల ఎజెండాను బట్టి తమ ప్రతినిధివర్గంలో ఎవరుంటారనేది నిర్ణయిస్తామని క్రెమ్లిన్ సహాయకుడు యూరీ ఉషకోవ్ అన్నారు. కాగా రష్యాపై ఆంక్షలకు బదులుగా సమస్య పరిష్కారానికే తాము దృష్టి పెట్టామని నాటో వర్గాలు చెప్పాయి.

## అమెరికా కొత్త ఫ్రెండ్ సిరియాపై ఆంక్షలు ఎత్తివేత

### ఇజ్రాయెల్‌తో బంధాన్ని పునరుద్ధరించండి
### అల్ షరాకు ట్రంప్ వెల్లడి



**రియాద్ :** సిరియాపై 46 సంవత్సరాలుగా అమెరికా అమలు చేస్తున్న ఆంక్షలను ఎత్తివేస్తున్నట్లు అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ ప్రకటించారు. మధ్యప్రాచ్యంలో నాలుగు రోజుల పర్యటన చేస్తున్న ట్రంప్ రెండోరోజు బుధవారం నాడు ఉదయం రియాద్‌లో అమెరికా–గల్ఫ్ దేశాల సహకార మండలి శిఖరాగ్ర సమావేశంలో ప్రసంగించారు. ఈ సమావేశంలోనే సిరియా తాత్కాలిక అధ్యక్షుడు అహ్మద్ అల్–షరాతో బుధవారం ఉదయం ట్రంప్ కీలక సమావేశం నిర్వహించారు. ఆ దేశంపై ఆంక్షలు ఎత్తివేస్తున్నట్లు ప్రకటించారు. ఇజ్రాయెల్‌తో సాధారణ సంబంధాలను పునరుద్ధరించుకోవాలని కోరారు. మధ్యప్రాచ్యంలో, పాశ్చాత్యదేశాలతో వాణిజ్యసంబంధాలలో సిరియా కీలక పాత్ర నిర్వహించాలని అల్ షరాను ట్రంప్ కోరారు. ఆయనకు ఐదు కీలక విషయాలను ట్రంప్ తెలియజేశారు. విదేశీ ఉగ్రవాదులందరినీ సిరియా నుండి పంపేయాలని, ప్రత్యేకించి పాలస్తినా ఉగ్రవాదులందరినీ సిరియా నుండి తరిమికొట్టాలని, ఇజ్రాయెల్‌తో సంబంధాల సాధారణీకరణకు అబ్రహం ఒప్పందాల(2020)పై సంతకాలు చేయాలని అల్ షరాకు ట్రంప్ తెలియజేశారు. ఉగ్రవాదాన్ని ప్రతిఘటించడంలో సిరియాతో సంబంధాలను సమన్వయంతో కొనసాగించే మార్గాలపై ట్రంప్–అల్ షరా చర్చించారు. అదేవిధంగా ఉగ్రవాద నిర్మూలనలో ఇస్లామిక్ ఉగ్రవాద గ్రూపులు సహా ఏ బాహ్యశక్తుల జోక్యం లేకుండా చూడాలని కోరారు. ప్రాంతీయంగా, అంతర్జాతీయ స్థాయిలో తమకు పూర్తి మద్దతు తెలియజేస్తున్న ట్రంప్‌కు అల్ షరా కృతజ్ఞతలు తెలియజేశారు. గడచిన డిసెంబరులో సిరియాపై తనకు ఏ మాత్రం ఆసక్తిలేదని ట్రంప్ చెప్పారు. కానీ టర్కీ, సౌదీఅరేబియా దేశాలు నచ్చజెప్పడంతో ట్రంప్ సిరియాను అక్కునచేర్చుకున్నారు. దశాబ్దాలనాటి ఆంక్షలు ఎత్తివేస్తున్నట్లు ప్రకటించారు. ఇప్పుడు సిరియా–అమెరికా మధ్య కొత్త స్నేహం మొదలైంది. కానీ అన్నిస్థాయిల్లోనూ సిరియాపై ఆంక్షలు ఎత్తివేయడం అంతసులభం కాదనీ, సిరియా తన చిత్తశుద్ధి నిరూపించుకోవాలని అమెరికా వర్గాలు వ్యాఖ్యానించాయి. గత ఏడాది అల్ బషీర్ ప్రభుత్వాన్ని కూల్చివేసిన తర్వాత సిరియా భవిష్యత్తులో రియాద్ కీలకపాత్ర వహిస్తుందని అల్ షరా ప్రకటించారు. తమదేశం కొత్త పుంతలు తొక్కుతుందన్నారు. కాగా, అంతకుముందు మొదటిరోజు సౌదీఅరేబియా రాజు మహ్మద్ బిన్ సల్మాన్‌తో సమావేశమై పలు వాణిజ్య ఒప్పందాలతోపాటు భారీ ఆయుధ ఒప్పందంపై సంతకాలు చేశారు. మొత్తం 600 బిలియన్ డాలర్ల వాణిజ్య పెట్టుబడుల హామీలను ట్రంప్ సంపాదించారు. బుధవారం సాయంత్రం ఖతార్ చేరుకున్నారు. దోహాలోని అమీరీ దివాన్‌లో ఆయనకు ఘన స్వాగతం లభించింది. ఖతార్ ఎమిర్ తమిమ్ బిన్ హమద్ అల్ తహనీ ఆయనకు విమానాశ్రయంలో స్వాగతం పలికారు. అక్కడ లుసాయిల్ ప్యాలస్‌లో అధికారిక విందులో పాల్గొన్నారు. 2003లో జార్జి బుష్ తర్వాత ఖతార్‌లో పర్యటించిన రెండోఅమెరికా అధ్యక్షుడు ట్రంప్ మాత్రమే. ఉక్రేన్–రష్యా శాంతి చర్చల సందర్భంగా ట్రంప్ టర్కీ రాజధాని ఇస్తాంబుల్‌కు గురువారంనాడు చేరుకునే అవకాశం కూడా ఉంది. గల్ఫ్ సహకార మండలి కౌన్సిల్ సమావేశం సందర్భంగా రియాద్‌లో తొలుత అల్ షరా,సౌదీ రాజు సల్మాన్‌లతో ట్రంప్ సంభాషణలు జరిపారు. మధ్యప్రాచ్యంలో ప్రాంతీయ స్థిరత్వం సాధించాల్సిన అవసరం ఉందని ఈ సందర్భంగా సల్మాన్ అన్నారు. మధ్యప్రాచ్యంలో స్థిరత్వానికి, ఇరాన్‌తో సానుకూల ఒప్పందానికి ఏ విధంగా కృషి చేస్తున్నదీ గల్ఫ్ దేశాల నాయకులకు ట్రంప్ వివరించారు.

## అణు కార్యక్రమాన్ని వదిలేస్తే ఇరాన్‌తో ఒప్పందం

### మధ్యప్రాచ్య పర్యటనలో ట్రంప్ వెల్లడి



**దుబాయ్ :** అణ్వాయుధాల తయారీకి స్వస్తి చెబితే ఇరాన్‌తో ఒక ఒప్పందం చేసుకోవడానికి అమెరికా సిద్ధంగా ఉందని డోనాల్డ్ ట్రంప్ ప్రకటించారు. పశ్చిమాసియా పర్యటనలో భాగంగా బుధవారంనాడు రియాద్‌లో జరిగిన శిఖరాగ్ర సమావేశంలో ట్రంప్ మాట్లాడుతూ, ఉగ్రవాదానికి ఇరాన్ మద్దతు ఇవ్వకూడదని, అణ్వాయుధాలు తయారు చేయకూడదని ఇందుకు అంగీకరిస్తే ఆ దేశంలో ఒప్పందానికి తాను సిద్ధఃగా ఉన్నాననీ చెప్పారు. ఇదిలా ఉండగా, ఇరాన్ చేపట్టిన అణు కార్యక్రమంపై ఆ దేశంతో అమెరికా ప్రారంభించిన చర్చల్లో ఎలాంటి తాజా ఒప్పంద పరిష్కారం లభించలేదు. దీంతో చర్చల ప్రక్రియను కొనసాగించాలని రెండు దేశాలూ నిర్ణయించాయి. ఓమన్ మధ్యవర్తిత్వంతో రెండు దేశాలమధ్యా ఇప్పటివరకూ నాలుగు విడతలుగా చర్చలు జరిగినాగానీ ట్రంప్ కోరినట్లు పరిష్కారం లభించలేదు. అమెరికాతో ప్రత్యక్ష చర్చలకు తావులేదని, అందుకు అంగీకరించే ప్రశ్నేలేదని ఇరాన్ స్పష్టం చేసినప్పటికీ పరోక్ష చర్చలకు మాత్రం అంగీకరించడంతో ఒమన్ విదేశీమంత్రి మధ్యవర్తిత్వంతో ఇప్పటివరకూ చర్చలు జరిగాయి. ఏప్రిల్ 12వ తేదీన రెండు దేశాల మధ్య మొదటి విడత చర్చలు ఓమన్ రాజధాని మస్కట్‌లో జరిగాయి. రెండో విడత చర్చలు ఏప్రిల్ 19న రోమ్‌లో, మూడో విడత చర్చలు ఏప్రిల్ 26న నాలుగో విడత చర్చలు మే 11న మస్కట్‌లో జరిగాయి. ఇరాన్ విదేశాంగమంత్రి అబ్బాస్ అఘూర్చీ, ట్రంప్ ప్రత్యేక దూత స్టీవ్ విట్‌కాఫ్ నాయకత్వంలో రెండు దేశాల బృందాలూ చర్చలు కొనసాగిస్తున్నాయి. ఇరాన్‌పై గరిష్ఠస్థాయిలో తీవ్ర ఒత్తిడి తీసుకువస్తామని, ఇక ఆ దేశం చమురును ఎగుమతి అర్హత కోల్పోతుందని ట్రంప్ మంగళవారంనాడు హెచ్చరించారు. తాము విద్యుత్ అవసరాల నిమిత్తం యురేనియంను శుద్ధిచేస్తున్నామని ఇరాన్ వాదిస్తుండగా, ఆరు అణుబాంబులు తయారు చేయడానికి సరిపడినంత యురేనియం ఇరాన్ వద్ద ఉందని ట్రంప్ అంటున్నారు. లొంగిరాకపోతే ఇరాన్‌పై బాంబుల వర్షం కురిపిస్తామని చర్చలముందు ట్రంప్ హెచ్చరించారు. అమెరికా వైఖరిలో స్థిరత్వం లేనందువల్ల ఆ దేశాన్ని నమ్మకపోవడం, దాని చిత్తశుద్ధిని సందేహించడం తప్పుకాదని ఇరాన్ చెబుతున్నది. ఇరాన్ హేతుబద్ధమైన విధానం అవలంబిస్తోందనీ, అంతర్జాతీయ చట్టాలకు,ఇరాన్ ప్రజల ఆలోచనలకు అనుగుణంగా తమ వైఖరి ఉందని, అందువల్ల దృఢసంకల్పంతో ఆ మార్గాన్నే అనుసరిస్తామని ఇరాన్ స్పష్టం చేసింది.

## గాజా ఊచకోతకు కేన్స్ ఫిలిమ్ ఫెస్టివల్ ఖండన

### 350 మంది ప్రపంచ చిత్ర ప్రముఖుల తీర్మానం







**కేన్స్ :** గాజాలో జరుగుతున్న సామూహిక ఊచకోత,హత్యాకాండను కేన్స్ ఫిలిమ్ ఫెస్టివల్ తీవ్రంగా ఖంచింది. ఇంత దారుణమైన ఊచకోత కొనసాగుతుంటే చూస్తూ తాము మౌనంగా ఉండలేమని ఈ ఫిలిమ్ ఫెస్టివల్‌లో పాల్గొన్న ప్రపంచ చిత్రప్రముఖులు పేర్కొన్నారు. వందలమంది ప్రపంచ నటులు, దర్శకులు, ఫొటోగ్రాఫర్లు, చిత్ర నిర్మాతలు వీరిలో ఉన్నారు. ఫ్రాన్స్‌లోని కేన్స్ ప్యాలస్‌లో ఈనెల 13 నుండి ప్రారంభమైన 78వ అంతర్జాతీయ కేన్స్ చలనచిత్రోత్సవం జ్యూరీ ఛైర్మన్ జూలియట్ బినోచే అధ్యక్షతన గాజాలో హింసను ఖండిస్తూ అధికారికంగా తీర్మానం చేసింది. అదీకాకుండా హాలీవుడ్ సహా ప్రపంచంవ్యాప్తంగా ఉన్న 350 మంది చిత్ర ప్రముఖులు ఒక ఖండన లేఖపై సంతకాలు చేశారు. ప్రస్తుతం ఈ ఫెస్టివల్‌కు గాజాలో ప్రస్తుతం కొనసాగుతున్న దారుణ మారణకాండపై ''పుట్ యువర్ సోల్ ఆన్ యువర్ హ్యాండ్ అండ్ వాక్'' అనే పేరుతో దర్శకురాలు సెపిడెహ్ ఫర్సీ (60) ఒక డాక్యుమెంటరీ నిర్మించారు. పాలస్తీనాలో ప్రముఖ మహిళా ఫోటో జర్నలిస్టు ఫాతిమా హస్సౌనా (25)ను ప్రధానాంశంగా తీసుకుని ఈ డాక్యుమెంటరీ చిత్రం తీశారు ఫర్సీ. ఈ డాక్యుమెంటు కూడా కేన్స్‌లో ప్రదర్శిస్తామని ప్రకటించిన మరునాడే ఏప్రిల్ 16వ తేదీన గాజాలో ఇజ్రాయెల్ జరిపిన దాడుల్లో ఫోటోజర్నలిస్టు హస్సౌనాతోపాటు ఆమెకు చెందిన పది మంది కుటుంబసభ్యులు మరణించారు. ఈ చర్యను కేన్స్ ఫెస్టివల్ తీవ్రంగా ఖండించింది.సహా ఆమె కుటుంబ సభ్యులు హతులయ్యారు. ఇజ్రాయెల్ చేసిన దాడులల్లో ఈ డాక్యుమెంటరీలో ఆమె మరణంపట్ల ప్రపంచ చిత్ర ప్రముఖులు తీవ్ర సంతాపం వ్యక్తం చేశారు. గాజాలో ఊచకోతలు ఆపాలని వారు కోరారు. కాగా ఈ డాక్యుమెంటరీకి దర్శకత్వం వహించిన సెపిడెస్ ఫర్సీ 2002 నుండీ నటిగా, దర్శకురాలుగా బహుముఖపాత్రలు చిత్రసీమలో పోషించారు.

## గాజాలో తక్షణ ఆహార సరఫరాకు అగ్రదేశాల డిమాండ్

### తాజా దాడుల్లో 70 మంది మృతి



**గాజా :** గాజాలో సహాయాన్ని పంపిణీ చేసేందుకు ఇజ్రాయెల్–అమెరికా చేసిన ఉమ్మడి ప్రతిపాదనను రష్యా,చైనా,బ్రిటన్ దేశాలు తిరస్కరించాయి. గాజాలోకి ఆహార సరఫరా వెళ్ళకుండా పెట్టిన ఆంక్షలు తక్షణం ఎత్తివేయాలని డిమాండ్ చేశాయి. ఈ ఏడాది మార్చి రెండో తేదీ నుండి గాజాలోకి ఎలాంటి ఆహార సరఫరాను రానివ్వకుండా ఇజ్రాయెల్ అడ్డుకున్నప్పటికీ పట్టించుకోని అమెరికా నేతన్యాహూకు సంబంధం లేకుండా ఆహార సరఫరా పునరుద్ధరణ ప్రతిపాదనకు పైన పేర్కొన్న అగ్రదేశాలు తిరస్కరించాయి. అనేక రోజులుగా 3,000 కు పైగా ఆహారాన్ని మోసుకొచ్చిన లారీలన్నీ గాజా సరిహద్దుల వెలుపల ఆగిపోయాయి. దీంతో గాజాలో క్షామం నెలకున్నది. ఇదిలా ఉండగా, ఒకవైపు ఖతార్‌లో హమాస్–ఇజ్రాయెల్ మధ్య పరోక్షచర్చలు మధ్యవర్తుల ద్వారా కొనసాగుతుండగా మరోవైపు గాజాలో ఇజ్రాయెల్ బుధవారం చేసిన దాడుల్లో 70 మంది మరణించారు. ప్రత్యేకించి ఉత్తరగాజాలో చేసిన దాడుల్లో 50 మంది మరణించారు. వీరిలో 22 మంది పిల్లలు ఉన్నారు. రాత్రికిరాత్రి ఇజ్రాయెల్ చేసిన వరుస గగనతల దాడుల్లో వీరంతా మరణించారని ఇండోనేసియా ఆసుపత్రి వర్గాలు తెలిపాయి. మృతుల్లో 15 మంది మహిళలు కూడా ఉన్నారు. జబాలియా టౌన్‌లో అనేక ఇళ్ళు ఈ దాడుల్లో నేలమట్టమయ్యాయి. శరణార్థ శిబిరాలపై కూడా ఇజ్రాయెల్ దాడుల్లో పాలస్తీనియన్లు మరణించారు. గాజాలో మానవ సంహారాన్ని తక్షణం నిలిపివేయాలని ఐక్యరాజ్యసమితి మానవహక్కుల కమిషన్ హై కమిషనర్ వోల్కర్ టర్క్ ప్రపంచ నాయకులకు విజ్ఞప్తి చేశారు. పాలస్తినా సాయుధ ముఠాలు తమపై రాకెట్ దాడులు చేశాయని, ప్రతిదాడులు చేసే ముందుగా ఈ ప్రాంతంలో ప్రజలను ఖాళీ చేసి వెళ్ళిపోవాలని తాము కోరామని ఇజ్రాయెల్ సైన్యం బుకాయిస్తున్నది. ఒకవైపు డోనాల్ట్రంప్ మధ్యప్రాచ్యంలో పర్యటిస్తున్నారు. గల్ఫ్ దేశాలతో చర్చలు జరుపుతూ, సిరియా–ఇజ్రాయెల్ మధ్య సాధారణ సంబంధాల పునరుద్ధరణకు కృషి చేస్తున్న తరుణంలో ఇజ్రాయెల్ తన దాడులు ఉద్ధృతం చేసింది. ఇజ్రాయెల్ ఉద్దేశపూర్వకంగా దాడులు చేస్తోందని, పౌరులపై అమానవీయమైనస్థాయిలో షరతులు విధిస్తోందని ఐక్యరాజ్యసమితి మానవతా వ్యవహారాల అండర్ సెక్రటరీ జనరల్ థామస్ ఫ్లెచెర్ న్యూయార్క్‌లో విమర్శించారు. తొలుత ఉదయం 48 మంది మరణించినట్లు వార్తలు వచ్చాయి. తర్వాత కొనసాగిన దాడుల్లో మృతులసంఖ్య 70కి పెరిగింది.

## రంగంలోకి 'భార్గవాస్త్రం'

(మొదటి పేజీ తరువాయి)

ప్రయోగించింది. అలాంటి డ్రోన్ల సమూహాన్ని ఒకేసారి 'భార్గవస్త్ర' దీటుగా ఎదుర్కోగలదు. మహాభారతంలో వినియోగించిన అపార శక్తి గల 11 అస్త్రాల్లో భార్గవస్త్ర ఒకని చెబుతారు. గత వారం భారత్‌పాకిస్థాన్ మధ్య తీవ్ర ఉద్రిక్తతలు నెలకొన్న సంగతి విదితమే. పహల్గామ్ ఉగ్ర దాడి తర్వాత పాకిస్థాన్‌పై భారత్ ఆపరేషన్ సిందూర్ చేపట్టింది. దీంతో పాక్‌లోని వివిధ సైనిక స్థావరాలు ధ్వంసం అయ్యాయి. ఈ సమయంలో పాకిస్థాన్.. భారత్‌పై డ్రోన్లు ప్రయోగించింది. భారత్‌లోని ప్రధాన నగరాలను లక్ష్యంగా చేసుకుని డ్రోన్లు ఉపయోగించింది. ఈ నేపథ్యంలోనే డ్రోన్ల సమూహాన్ని ఎదుర్కొనే భార్గవస్త్రం ప్రయోగాన్ని బుధవారం ఒడిశాలో రక్షణ శాఖ చేపట్టింది. సోలార్ డిఫెన్స్ అండ్ ఏరోస్పేస్ లిమిటెడ్ (ఎస్‌డీఏఎల్) భార్గవస్త్రం అభివద్ధి చేసింది. మే 13న ఆర్మీ ఎయిర్ డిఫెన్స్ సీనియర్ అధికారుల సమక్షంలో నిర్వహించిన మూడు పరీక్షల్లో మైక్రో రాకెట్లు అన్ని మిషన్ లక్ష్యాలను ఛేదించగలిగాయి. రెండు పరీక్షల్లో ఒక్కొక్క రాకెట్‌ను ప్రయోగించింది. రెండు సెకన్లలోపు రెండు రాకెట్లను సాల్వో మోడ్‌లో ప్రయోగించడం ద్వారా ఒక ట్రైల్ నిర్వహించారు. నాలుగు రాకెట్లు ఊహించిన విధంగా పనిచేశాయి. అవసరమైన ప్రయోగ పారామితులను సాధించాయి. ఇది పెద్ద ఎత్తున డ్రోన్ దాడులను ఎదుర్కోగలిగిన సామర్థ్యం ఉన్నట్లుగా నిరూపించబడింది.

## సులభతరంగా అనుమతులు

(మొదటి పేజీ తరువాయి)

ఉండాలన్నారు. వినియోగదారులు చెల్లించే మొత్తాన్ని వివిధ విభాగాల ఖాతాల్లో జమయ్యే విధానాన్ని రూపొందించాలన్నారు. ఈ క్రమంలో ఆస్తులు, వనరుల గుర్తింపునకు లైడార్ సర్వే చేయాలని, మరింత సులభతర విధానాల అధ్యయనానికి నిపుణుల సలహాలు తీసుకోవాలని సిఎం సూచించారు. పౌర సేవలు మెరుగ్గా అందేందుకుగానూ వివిధ శాఖల విభజనలో ఏకరూపత ఉండాలని సిఎం సూచించారు. అనుమతుల ప్రక్రియలో అనవసరమైన జాప్యం చేయకూడదని, ఏ కారణం లేకుండా అనుమతులను నిరాకరించడానికి వీల్లేదన్నారు. ఏదైనా కారణం చేత అనుమతులకు ఆలస్యమైతే అందుకు కారణాలు ఏమిటో దరఖాస్తుదారులకు తెలియజేసి వాటి పరిష్కారానికి ఏమి చర్యలు తీసుకోవాలో కూడా అధికారులే సూచించాలని సిఎం రేవంత్ రెడ్డి ఆదేశించారు. సమీక్షలో ముఖ్యమంత్రి సలహాదారు వేం నరేందర్ రెడ్డి, రాష్ట్ర పురపాలక, పట్టణాభివృద్ధి శాఖ కార్యదర్శి ఇలంబర్తి, ముఖ్యమంత్రి కార్యదర్శి మాణిక్‌రాజ్, హెచ్‌ఎండిఏ కమిషనర్ సర్ఫరాజ్ అహ్మద్, జిహెచ్‌ఎంసి కమిషనర్ ఆర్.వి.కర్ణన్, హైదరాబాద్ మెట్రో వాటర్ బోర్డు ఎండి అశోక్ రెడ్డి, టిజిఎస్‌పిడిసిఎల్ సిఎండి ముషారఫ్ అలీ, మూసీ రివర్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ ఎండి ఇ.వి.నరసింహారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## భద్రత కట్టుదిట్టం

(మొదటి పేజీ తరువాయి)

ముడి చమురును తీసుకొచ్చింది. తనిఖీలు చేపట్టగా సిబ్బందిలో 21 మందిని పాకిస్థానీయులుగా గుర్తించారు. ఇమిగ్రేషన్ డిపార్ట్‌మెంట్ నుంచి దీనిగురించి సమాచారం అందడంతో వెంటనే ఒడిశా మెరైన్ పోలీసులు, సిఐఎస్‌ఎఫ్ భద్రతా సిబ్బంది అప్రమత్తమయ్యారు. పోర్టులో భద్రతను మరింత పెంచినట్లు మెరైన్ పోలీసు స్టేషన్ ఇన్ స్పెక్టర్ బబితా దుహేరి తెలిపారు. భారత్–పాక్ మధ్య ఉద్రిక్త పరిస్థితుల నేపథ్యంలో ఓడరేవు ప్రాంతంలో హైఅలర్ట్ ప్రకటించి పరిస్థితిని సమీక్షిస్తున్నారు. ప్రస్తుతం ఈ నౌక పోర్టుకు 20 కి.మీ. దూరంలోని పిఎం బెర్త్ వద్ద లంగర్ వేసి ఉంది. ఇందులో 11,350 మెట్రిక్ టన్నుల ముడి చమురు ఉన్నట్లు అధికారులు తెలిపారు. ముడి చమురు అన్ లోడింగ్ పూర్తయ్యే వరకూ 25 మంది సిబ్బంది నౌకను వీడకుండా భద్రతా ఏర్పాట్లుచేసినట్లు పోలీసు అధికారులు తెలిపారు.

## వెల్లడించాలి

(మొదటి పేజీ తరువాయి)

చేశారు. హైదరాబాద్‌లోని సిపిఐ(ఎం) రాష్ట్ర కార్యాలయం మాకినేని బసవపున్నయ్య భవన్‌లో బుధవారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో సిపిఐ(ఎం) కేంద్ర పొలిట్ బ్యూరో సభ్యులు బి.వి.రాఘవులు, విజయ రాఘవన్, రాష్ట్ర కార్యదర్శి జాన్ వెస్లీలతో కలిసి ఎం.ఎ.బేబీ మాట్లాడారు. భారత్, పాకిస్థాన్‌ల మధ్య కాల్పుల విరమణ ఒప్పందం జరిగినట్లు అమెరికా అధ్యక్షులు డోనాల్డ్ ట్రంప్ అందరి కంటే ముందు ప్రకటించడం పట్ల ఎం.ఎ.బేబీ తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశారు. భారత్ పాకిస్థాన్ మధ్య మూడో దేశం మధ్యవర్తిత్వం అవసరమేమిటని ప్రశ్నించారు. దీనిపై కేంద్ర ప్రభుత్వం వివరణ ఇవ్వాలన్నారు. పహల్గాం ఘటన నేపథ్యంలో ఉగ్రవాదాన్ని నిర్మూలించాల్సిందేనని, అయితే సామాన్య ప్రజలకు నష్టం కలగకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు. పహల్గాం దాడుల అనంతరం రాజకీయాలకు అతీతంగా అన్ని పార్టీల నాయకులు, దేశ ప్రజలంతా ఏకతాటిపై నిలిచున్నారని, ఈ ఐక్యత ఇలాగే కొనసాగేలా కేంద్ర ప్రభుత్వంచర్యలు తీసుకోవాలన్నారు. ఉద్రిక్తత సమయాల్లో కొన్ని ఎలక్ట్రానిక్ మీడియా సంస్థలు తమ టిఆర్‌పిని పెంచుకునేందుకు ఇష్టానుసారంగా ప్రసారాలను చేస్తున్నాయని, ఆలాంటి వాటిని మతోన్మాదులు తమకు అనుకూలంగా మలుచుకుని విద్వేషాలను రెచ్చగొట్టే ప్రమాదం ఉందని, ఇలాంటి వాటిని కట్టడి చేయాలన్నారు. బి.వి.రాఘువులు మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం కగార్ ఆపరేషన్ నిలిపివేయడం అభినందనీయమని, దీనికి కొనసాగింపునకు మావోస్టులతో భేషరతుగా శాంతి చర్చలు జరపాలని కోరారు. మావోయిస్టులు సైతం కాల్పుల విమరణను పాటిస్తున్న నేపథ్యంలో శాంతి చర్చలకు అనుకూలమైన వాతావరణ ఏర్పడిందని, తక్షణమే కేంద్ర ప్రభుత్వం వారితో చర్చలు జరపాలని విజ్ఞప్తి చేశారు. సిపిఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శి జాన్ వెస్లీ మాట్లాడుతూ ఎన్నికల ముందు కాంగ్రెస్ ప్రజలకు ఇచ్చిన అన్ని హామీలను అమలు చేయాల్సిందేనని డిమాండ్ చేశారు. అధికారం కోసం ఇష్టానుసారంగా హామీలిచ్చిన కాంగ్రెస్ నేతలకు రాష్ట్ర ఆర్థిక పరిస్థితి ఆనాడు తెలియదా అని ప్రశ్నించారు. ఇప్పుడు డబ్బులు లేవంటూ పథకాలను నిలిపి వేయాలని చూస్తే ప్రజా ఉద్యమాలు చవిచూడాల్సి వస్తుందని ఆయన ప్రభుత్వాన్ని హెచ్చరించారు.

## జస్టిస్ బిఆర్.గవాయ్ ప్రమాణస్వీకారం

(మొదటి పేజీ తరువాయి)

కేంద్ర మంత్రులు రాజ్‌నాథ్ సింగ్, అమిత్‌షా, జెపి.నడ్డా, అర్జున్ రామ్ మేఘ్‌వాల్, ఇతర అతిథులు ఈ ప్రమాణస్వీకారం కార్యక్రమానికి హాజరయ్యారు. ఈ సందర్భంగా నూతన భారత ప్రధాన న్యాయమూర్తి (సిజెఐ) బిఆర్. గవాయ్‌కి ప్రధానమంత్రి నరేంద్ర మోదీ అభినందనలు తెలియజేశారు. 2019 సంవత్సరం మే 24నుంచి సుప్రీంకోర్ట్ న్యాయమూర్తిగా ఉన్న బిఆర్.గవాయ్ అనేక రాజ్యాంగ ధర్మాసనాలలో సభ్యుడిగాఉండి చరిత్రాత్మక తీర్పులను వెలువరించారు. జమ్ముకశ్మీర్‌కు ప్రత్యేక హోదా కల్పించే ఆర్టికల్ 370ను రద్దు చేస్తూ కేంద్ర ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాన్ని సమర్థించిన రాజ్యాంగ ధర్మా సనం సభ్యులలో బిఆర్.గవాయ్ ఒకరుగా ఉన్నారు. ఐదుగురు సభ్యులతో కూడిన రాజ్యాంగ ధర్మాసనంలో ఒకరుగా ఉన్న బిఆర్.గవాయ్ రాజకీయ ప్రయోజనాల కోసం ఉద్దేశించబడిన ఎన్నికల బాండ్ల పథకాన్ని రద్దు చేశారు.గత ఆరు ఏళ్లలో సుప్రీంకోర్టు న్యాయమూర్తిగా జస్టిస్ బిఆర్.గవాయ్ రాజ్యాంగం, అడ్మినిస్ట్రేషన్, సివిల్, క్రిమినల్ చట్టాలు, విద్య, వాణిజ్య విధానాలు, విద్యుత్, పర్యావరణం వంటి అనేక కేసులను విచారించారు. భారత ప్రధాన న్యాయమూర్తి పీఠాన్ని అధిరోహించిన రెండవ దళిత సిజెఐగా బిఆర్.గవాయ్ పేరొందారు. సిజెఐగా ఆయన ఆరునెలల కాలానికి పైగా మాత్రమే కొనసాగి నవంబర్ 23న పదవీ విరమణ చేయనున్నారు.

**సిజెఐ బిఆర్.గవాయ్ ప్రస్థానం...**

బిఆర్.గవాయ్ 1960 నవంబర్ 24న మహారాష్ట్రలోని అమరావతిలో జన్మించారు. 1985 సంవత్సరం మార్చి 16న న్యాయవాదిగా తన ప్రొఫెషనల్ కెరీర్‌ను ఆరంభించారు. అంచెలంచెలుగా న్యాయవాద వృత్తిలో ఎదిగిన బిఆర్. గవాయ్ గవర్నమెంట్ ప్లీడర్‌గా, ప్రభుత్వ న్యాయవాదిగా నాగ్‌పూర్ బెంచ్‌లో 2000 సంవత్సరం జనవరి 17న నాగ్‌పూర్ బెంచ్‌లో అపాయింట్ అయ్యారు. 2003 నవంబర్ 14న బాంబే హైకోర్టులో అదనపు న్యాయమూర్తిగా నియమితులయ్యారు. శాశ్వత న్యాయమూర్తిగా 2005 నవంబరు 12న పదోన్నతి పొందారు. బాంబే హైకోర్టు ప్రధాన ధర్మాసనం ఉన్నటువంటి ముంబయ్, నాగ్‌పూర్, ఔరంగాబాద్, పనాజీ బెంచ్‌లలో సేవలు అందించి, 2019 మే 24న సుప్రీంకోర్టు న్యాయమూర్తిగా పదోన్నతిని పొందారు.

## రెవెన్యూ సదస్సులు

(మొదటి పేజీ తరువాయి)

నుంచి అన్ని మండలాల్లో రెవెన్యూ సదస్సులు నిర్వహించనున్నామని వెల్లడించారు. ఈ రెవెన్యూ సదస్సులలో వచ్చే దరఖాస్తులకు నిర్దేశిత గడువు పెట్టుకొని భూ భారతి చట్టం పరిధిలోకి వచ్చే ప్రతి దరఖాస్తుకు పరిష్కారం చూపిస్తామని తెలిపారు.ప్రయోగాత్మకంగా నిర్వహించిన నాలుగు మండలాల్లో ఇప్పటికే కొన్నింటిని పరిష్కరించడం జరిగిందని, ఈనెల 30 తేదీ నాటికి దాదాపు 60 శాతం భూసమస్యలను పరిష్కరిస్తామని తెలిపారు. భూభారతి చట్టానికి లోబడి పరిష్కరించాల్సిన అన్ని సమస్యలకు పరిష్కారం చూపుతూ , పరిష్కరించలేనివాటికి ఎందుకు పరిష్కరించలేకపోతున్నామనే విషయాన్ని లిఖిత పూర్వకంగా దరఖాస్తుదారులకు తెలియజేస్తామని వెల్లడించారు. ఎప్పటికీ పరిష్కారం కానివి ఉంటే అసలు పరిష్కార యోగ్యం లేనివి అక్రమమైనవి ఉంటే అవి పరిష్కారం కావు అని చెప్పడం జరుగుతుందన్నారు. .భూ సమస్యలకు పూర్తి స్థాయిలో పరిష్కారం చూపాలి అనేది భూ భారతి చట్టం లక్ష్యమని, ఆమేరకు క్షేత్ర స్థాయిలో అధికారులు సత్వరం స్పందించేలా చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. రెండవ దశలో 28 మండలాల్లో నిర్వహిస్తున్న రెవెన్యూ సదస్సులలో కూడా ఈనెల చివరినాటికి వీలైనంతవరకూ సమస్యలను పరిష్కరించాలని ఇప్పటికే కలెక్టర్లకు స్పష్టమైన ఆదేశాలు ఇచ్చామన్నారు. సాదాబైనామాలకు సంబంధించిన అంశం ప్రస్తుతం కోర్టు పరిధిలో ఉందని, కోర్టులో స్టే వెకేట్ అయిన వెంటనే ఈ సమస్యకు పరిష్కారం చూపిస్తామని అయితే ఆన్ లైన్ లో ఉన్న దరఖాస్తులను మాత్రమే పరిగణనలోకి తీసుకుంటామని అన్నారు. సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల్లో స్లాట్ బుకింగ్ విధానానికి ప్రజల నుంచి మంచి స్పందన లభిస్తుందని తెలిపారు. గత ప్రభుత్వం చేసిన నిర్వాకం వలన మొత్తం రెవెన్యూ సేవలు ప్రజలకు దూరమయ్యాయని మొత్తం వ్యవస్థను ప్రజలకు చేరువు చేసి వారికి మెరుగైన సేవలు అందించడమే లక్ష్యంగా తమ ప్రభుత్వం పనిచేస్తుందని అన్నారు.

## ఒత్తిళ్లకు తలొగ్గొద్దు

(మొదటి పేజీ తరువాయి)

అభివృద్ధి ద్వారా ప్రపంచ దేశాల ముందు తలెత్తుకుని నిలబడిందన్నారు. అదే స్ఫూర్తితో కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వం ముందుకు వెళ్లుతోందని తెలిపారు. గత ప్రభుత్వం 10 ఏళ్ల పాలనలో సాగు నీటి ప్రాజెక్టులపై రూ.2 లక్షల కోట్లు ఖర్చుపెట్టినా ఉమ్మడి రాష్ట్రంలో ప్రారంభమై నిర్లక్ష్యానికి గురైన ఏఒక్క ప్రాజెక్టు కూడా పూర్తి కాలేదన్నారు. నల్లగొండ జిల్లాకు 3.60 లక్షల ఎకరాలకు గ్రావిటీ ద్వారా సాగునీరు అందించే లక్ష్యంతో చేపట్టిన ఎస్‌ఎల్‌బిసి ప్రాజెక్టు ఉమ్మడి రాష్ట్రంలో 25 నుంచి 30 కిలో మీటర్లు తవ్వితే తెలంగాణ వచ్చిన తర్వాత గత ప్రభుత్వం దానిని మూలకు పడేసిందని తెలిపారు. కాంగ్రెస్ అధికారం చేపట్టిన తర్వాత ఎస్‌ఎల్‌బిసి ప్రాజెక్టును పునర్ ప్రారంభించగా, పదేళ్లుగా పనిచేయకుండా నిలిచిపోయి యంత్రాలు మట్టిలో కూరుకుపోయి 8 మందిని బలి తీసుకునేందుకు గత ప్రభుత్వ కారణమైందన్నారు.

**మూడేళ్లలో కూప్పకూలిన ప్రాజెక్టు కాళేశ్వరం**

నాడు ఏలాంటి సాంకేతికత అందుబాటులో లేని కాలంలో నిర్మించిన ఉస్మాన్‌సాగర్, హిమాయత్‌సాగర్, శ్రీరాంసాగర్ ప్రాజెక్టులు ఇప్పటికీ చెక్కు చెదరకుండా నిలిచి ఉండగా, బిఆర్‌ఎస్ ప్రభుత్వ హాయంలో నిర్మించిన కాళేశ్వరం ప్రాజెక్టు కేవలం మూడేళ్లకే పేకమేడలా కూప్పకూలిందని సిఎం రేవంత్‌రెడ్డి అన్నారు. ప్రపంచంలో అత్యంత వెనకబడిన సోమాలియా కూడా ఇలాంటి నిర్మాణం చేపట్టలేదన్నారు. అధికారిక లెక్కల ప్రకారం కాళేశ్వరం నిర్మాణానికి రూ.1.47లక్షల కోట్లు అంచనా వ్యయం కాగా ఇప్పటివరకు రూ.1.02 లక్షల కోట్లు ఖర్చు చేశారన్నారు. మరో రూ.15 వేల కోట్లు కాంట్రాక్టర్లకు చెల్లించాల్సి ఉందన్నారు. ఇంత చేసినా కనీసం 50 వేల ఎకరాలకు కూడా సాగు నీరు అందించలేకపోయారని, చివరికి ఆ ప్రాజెక్టే కూప్పకూలిపోయిందన్నారు. కనీసం పూరి గుడిసె కట్టుకున్నా పునాదులు తవ్వి భూమి గట్టితనాన్ని పరిశీలించుకుంటామని, కానీ 80 వేల పుస్తకాలు చదివిన అపర మేధావి అయిన మాజీ కెసిఆర్ హెలికాప్టర్‌లో తిరుగుతూ గాలిలోనే కాళేశ్వరం ప్రాజెక్టు నిర్మాణానికి వ్యూహారచన చేస్తే కనీసం సాయిల్ టెస్ట్ నిర్వహించకుండా ఆయన చెప్పిన పద్ధతిలో ఇంజనీర్లు ప్రాజెక్టు నిర్మాణం చేపట్టారన్నారు. అదే తక్కువ ఖర్చుతో అనేక ప్రాజెక్టులు పూర్తి చేసే అవకాశం ఉన్నప్పటికి వాటిని మాత్రం పట్టించుకోలేదన్నారు.

**విశ్వేశ్వరయ్య స్ఫూర్తితో ముందుకు : ఉత్తమ్**

నీటి పారుదల శాఖలో కొత్తగా ఉద్యోగంలో చేరుతున్న ఇంజనీర్లు ప్రఖ్యాత ఇంజనీరు మోక్షగుండం విశ్వేశ్వరయ్య స్ఫూర్తిని పుణికి పుచ్చుకుని ముందుకు సాగాలని రాష్ట్ర నీటి పారుదలశాఖ మంత్రి ఎన్.ఉత్తమ్ కుమార్‌రెడ్డి సూచించారు. నీటి పారుదల రంగంలో మొత్తం 12,300 లకు పైగా ఉద్యోగులు ఉండగా ఇందులో 4 వేల మంది ఇంజనీర్లు మరో 8300 మంది వివిధ విభాగాల్లో పనిచేస్తున్నారని తెలిపారు. 1.25 కోట్లు ఎకరాలకు సాగు నీరు అందించడం ప్రభుత్వ లక్ష్యం కాగా, పెద్ద, మధ్య, చిన్న తరహా ప్రాజెక్టును ఇప్పటికే 75 లక్షల ఎకరాలకు సాగునీటి అందించగలుగుతున్నామని, ప్రతి ఏటా 5 లక్షల ఎకరాల కొత్త ఆయకట్టుకు సాగునీరు అందించడమే లక్ష్యంగా ప్రభుత్వం ప్రాజెక్టుల నిర్మాణాలను పూర్తి చేస్తోందని, ఇందుకు అనుగుణంగా ఈ సాగునీటిరంగంలో పనిచేస్తున్న ఉద్యోగులు తమ నైపుణ్యాన్ని, మేధాశక్తిని పెంచుకుంటూ నీటిపారదల శాఖకు సేవలను అందించాలని సూచించారు.

## మూడు నగరాలు

(మొదటి పేజీ తరువాయి)

ఆమోదం సుముఖత వ్యక్తం చేస్తే, త్వరలోనే ఈ మూడు నగరాల ఏర్పాటును కేబినెట్‌లో ప్రతిపాదించే అవకాశాలు ఉన్నాయని విశ్వసనీయంగా తెలిసింది. ప్రస్తుతం కాంగ్రెస్‌కు మిత్రపక్షంగా వ్యవహరిస్తున్న ఎంఐఎం అభిప్రాయాలను కూడా పరిగణనలోకి తీసుకుంటారా? లేదా? చూడాల్సి ఉంది. ఎంఐఎం మూడు కార్పొరేషన్‌లపై అభిప్రాయం ఎం చేప్పుతుందనే విషయం ఆసక్తికారంగా ఉంది. ఎంఐఎం సూచనలు, అభ్యంతరాల మేరకు ప్రతిపాదనల్లో మార్పులు, చేర్పులు చోటు చేసుకునే అవశాలు ఉన్నాయి. జిహెచ్‌ఎంసితో పాటు ఓఆర్‌ఆర్ పరిధిలోని 27 మున్సిపల్ సంస్థలను కలిపి ఒకే మున్సిపల్ కార్పొరేషన్‌గా ఏర్పాటు చేయాలని ముందుగా ము ఖ్యమంత్రి రేవంత్ రెడ్డి భావించారు. అయితే పాలన పరమైన, మౌలిక సౌకర్యాల కల్పనలో ఇబ్బందులు ఎదురవుతాయనే కారణంతో మూడు కార్పొరేషన్‌ల ఏర్పాటుకు ముఖ్యమంత్రి మొగ్గు చూపినట్లు తెలుస్తోంది. హైదరాబాద్, సికింద్రాబాద్‌తో పాటు కొత్తగా మరో కార్పొరేషన్ ఏర్పాటు కానుంది.

**సమాన విస్తీర్ణంతో మూడు నగరాలు..**

జిహెచ్‌ఎంసి విస్తీర్ణం ప్రస్తుతం 625 చదరపు కిలో మీటర్లు కాగా, ఓర్‌ఆర్ వరకు ఉన్న పురపాలికలను కలిపితే దాదాపు 2,500 చదరపు కిలోమీటర్లకు పెరగనుంది. ఏర్పాటు చేసే కార్పొరేషన్ల సంఖ్యను బట్టి అన్నింటి విస్తీర్ణం దాదాపు సమానంగా వచ్చే విధంగా జాగ్రత్తలు తీసుకుంటున్నారు. ఉదాహరణకు మూడు కార్పొరేషన్లు అయితే 600, 650 చదరపుకిలోమీటర్లు, విస్తీర్ణంతో ఏర్పాటు కానున్నాయి. గత సంవత్సరం ఓఆర్‌ఆర్‌కు దగ్గరలో ఉన్న 51 గ్రామపంచాయతీలను సమీప 13 పురపాలికల్లో(శంషాబాద్, పెద్ద అంబర్‌పేట,నార్సింగి, తుక్కుగూడ, మేడ్చల్, దమ్మాయిగూడ,నాగారం,పోచారం,గుండ్లపోచంపల్లి, తూంకుంట,ఘట్‌కేసర్, తెల్లాపూర్,అమీన్‌పూర్) విలీనం చేశారు.

**వచ్చే ఫిబ్రవరి 10వ తేదీతో ముగియనున్న పాలకమండలి పదవికాలం..**

వచ్చే సంవత్సరం ఫిబ్రవరి 10వ తేదీ వరకు ప్రస్తుతం కొనసాగుతున్న జిహెచ్‌ఎంసి పాలకమండలి పదవి కాలం ముగియనుంది. పాలకమండలి పాదవికాలం ముగిసేలోగా మూడు కార్పొరేషన్‌ల ఏర్పాటు ప్రక్రియను పూర్తి చేయాలనే యోచనలో ప్రభుత్వం ఉంది. అందులో భాగంగానే మూడు కార్పొరేషన్‌ల ఏర్పాటు ప్రక్రియ కసరత్తను వేగవంతం చేసింది. ఓఆర్‌ఆర్ పరిధిలో ఇప్పటికే మౌలిక సౌకర్యలు, రవాణా, విద్యుత్, తాగునీరు, పర్యావరణం తదితర అంశాలపై అధ్యయనం చేయడానికి ఇప్పటికే హెచ్‌ఎండిఏ కన్సల్టెన్సీలను ఆహ్వానించింది.

**జిహెచ్‌ఎంసిలో ప్రస్తుతమున్న 6 జోన్‌ల విస్తీర్ణం**

| జోన్ | విస్తీర్ణం (చ.కి.మీ.) |
|---|---|
| ఖైరతాబాద్ | 76.10 |
| ఎల్.బి. నగర్ | 128.21 |
| సికింద్రాబాద్ | 61.37 |
| కూకట్‌పల్లి | 113.15 |
| చార్మినార్ | 98.61 |
| శేరిలింగంపల్లి | 132.22 |



# జనరల్
STATE & REGIONAL NEWS

## కాంగ్రెస్‌లో బిఆర్‌ఎస్ విలీనం కాకపోతే బిజెపిని రాష్ట్రంలో నిషేధిస్తారా?

ప్రజాపక్షం / హైదరాబాద్ : జూన్ 2వ తేదీ లేదా డిసెంబర్‌లో కాంగ్రెస్‌లో బిఆర్‌ఎస్ విలీనం కాకపోతే బిజెపిని రాష్ట్రంలో నిషేధిస్తారా అని కాంగ్రెస్ ఎంఎల్‌సి అద్దంకి దయాకర్ ప్రశ్నించారు. బిజెపి, బిఆర్‌ఎస్ డిఎన్ఎ ఒక్కటేనని, అందుకే బిజెపిని రాష్ట్రంలో జనాలు తొక్కి పెట్టారన్నారు. బిఆర్‌ఎస్‌లో కాంగ్రెస్ ఎందుకు విలీనం అవుతుందని ఆయన ప్రశ్నించారు. గాంధీభవన్‌లో బుధవారం జరిగిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఎన్నికలలో ప్రజలు తగిన గుణపాఠం చెప్పినప్పటికీ బిజెపి నేతల బుద్ధిలో మార్పు రావడంలేదని, అబద్ధాలు ప్రచారం చేయడంలో బిజెపి వారు దిట్ట అని, నియంతలకు అబద్ధాలపై బాగా ప్రేమ ఉంటుందన్నారు. బిజెపితో బిఆర్‌ఎస్‌కు చీకటి రాజకీయ ఒప్పందం ఉందన్నారు. బిఆర్‌ఎస్ గెలవని చోట బిజెపి ఎంపిలు ఎలా గెలిచారని ప్రశ్నించారు.

## గవర్నర్ దత్తత గ్రామాల్లో ఇందిరమ్మ ఇళ్లు

ఇందిరమ్మ ఇళ్లు, భూభారతి అమలును గవర్నర్‌కు వివరించిన మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి



ప్రజాపక్షం/హైదరాబాద్ : రాష్ట్ర గవర్నర్ జిష్ణు దేవ్ వర్మ దత్తత తీసుకున్న అన్ని గ్రామాల్లో ఇందిరమ్మ ఇళ్లను మంజూరు చేశామని రెవెన్యూ, హౌసింగ్, సమాచార పౌరసంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి తెలిపారు. రాష్ట్ర గవర్నర్ జిష్ణుదేవ్ వర్మతో రాజ్‌భవన్‌లో మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి బుధవారం మర్యాదపూర్వకంగా భేటీ అయ్యారు. ఈ భేటీలో ఖమ్మం పార్లమెంట్ సభ్యులు రామసహాయం రఘురాంరెడ్డి కూడా పాల్గొన్నారు. ఈ సందర్భంగా రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా తీసుకువచ్చిన భూభారతి చట్టం అమలు, ఇందిరమ్మ ఇళ్ల పథకాలను మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి గవర్నర్‌కు వివరించారు. ఇందిరమ్మ ఇళ్ల పథకానికి సంబంధించి ఈ ఏడాది ప్రతినియోజకవర్గానికి 3500 చొప్పున రాష్ట్ర వ్యాప్తంగా 4.50లక్షల ఇళ్లను మంజూరు చేస్తున్నామని చెప్పారు. గవర్నర్ ఆలోచన, ముఖ్యమంత్రి సూచనల మేరకు గిరిజన నియోజకవర్గాలకు అదనంగా 500 నుంచి 700 ఇళ్ల చొప్పున మంజూరు చేయడంతో పాటు ఐటిడిఎ పరిధిలో చెంచు కుటుంబాలకు 10వేల ఇళ్లను నిర్మించి ఇవ్వనున్నట్లు తెలిపారు. మొదటిదశలో అత్యంత నిరుపేదలకు ప్రాధాన్యతాక్రమంలో ఇళ్లను మంజూరు చేస్తున్నామన్నారు. గవర్నర్ దత్తత తీసుకున్న భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలోని పూసుకుంట గ్రామం, గోగులపూడి, ఆదిలాబాద్ జిల్లా ఝర్కి, మంగ్లీ, నాగర్ కర్నూల్ జిల్లా అప్పాపూర్, బౌరాపూర్ గ్రామాలకు ఇందిరమ్మ ఇళ్లను మంజూరు చేశామని గవర్నర్‌కు మంత్రి పొంగులేటి వివరించారు. రాష్ట్రంలో గత 10 ఏళ్లుగా నెలకొన్న భూసమస్యలకు శాశ్వత పరిష్కారం చూపించాలన్న లక్ష్యంతో తీసుకువచ్చిన భూభారతి చట్టాన్ని గత నెల 17వ తేదీ నుంచి రాష్ట్రంలోని నాలుగు మండలాల్లో ప్రయోగాత్మకంగా అమలు చేశామని, ఈనెల 5వ తేదీ నుంచి 28 మండలాల్లో అమలు చేస్తున్నామని తెలిపారు. ఎలాంటి రుసుము లేకుండానే ప్రజల నుంచి దరఖాస్తులను స్వీకరించి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తున్నామని తెలిపారు. గవర్నర్‌ను కలిసిన వారిలో ఐడిసి చైర్మన్ మువ్వ విజయబాబు, హౌసింగ్ కార్పొరేషన్ ఎండి విపి గౌతమ్ తదితరులు ఉన్నారు.

## రాష్ట్ర సమాచార కమిషనర్లుగా నలుగురు ప్రమాణ స్వీకారం



ప్రజాపక్షం/హైదరాబాద్ : రాష్ట్ర సమాచార హక్కు చట్టం కమిషనర్లుగా సీనియర్ జర్నలిస్టులు పివి శ్రీనివాస్, అయోధ్యరెడ్డి, న్యాయవాదులు దేశాల భూపాల్, మోహిసినా పర్వీన్‌లు బుధవారం ప్రమాణ స్వీకారం చేశారు. హైదరాబాద్‌లో జరిగిన కార్యక్రమంలో వారితో రాష్ట్ర ప్రధాన సమాచార కమిషనర్ జి.చంద్రశేఖర్‌రెడ్డి ప్రమాణ స్వీకారం చేయించారు. ఈ కార్యక్రమానికి సిఎం రేవంత్‌రెడ్డి, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె.రామకృష్ణారావు హాజరయ్యారు. ఈ సందర్భంగా నూతనంగా ప్రమాణ స్వీకారం చేసిన ఆర్‌టిఐ కమిషనర్లకు సిఎం శుభాకాంక్షలు తెలిపారు. వీరు పదవీ బాధ్యతలు చేపట్టిన నాటి నుంచి మూడేళ్ల పాటు లేదా వయసు 65 ఏళ్లు నిండే వరకు వారు రాష్ట్ర సమాచార హక్కు కమిషనర్లుగా కొనసాగుతారు. కాగా తెలంగాణలో గత కొంతకాలంగా ఆర్‌టిఐ కమిషన్ ఖాళీగా ఉంది. ఈ నేపథ్యంలో సిఎం రేవంత్ రెడ్డి జోక్యంతో ఇటీవలే కమిషన్ నియామకాన్ని ప్రభుత్వం రాష్ట్ర సమాచార కమిషనర్లుగా నలుగురు ప్రమాణ స్వీకారం చేపట్టింది. ఆర్టీఐ ప్రధాన సమాచార కమిషనర్‌గా ఐఎఫ్‌ఎస్ అధికారి జి.చంద్రశేఖర్ రెడ్డి గత శుక్రవారమే బాధ్యతలు స్వీకరించిన సంగతి తెలిసిందే.



## కేంద్ర ప్రభుత్వం మావోయిస్టు ప్రతినిధులతో వెంటనే చర్చలు

ఆదివాసీలపై సైనిక దాడులు అమానవీయం

పీస్ డైలాగ్ కమిటీ విజ్ఞప్తి

ప్రజాపక్షం/హైదరాబాద్ : కేంద్ర ప్రభుత్వం మొండివైఖరి వీడి కూంబింగ్ ఆపడంతోపాటు ఎలాంటి షరతులు లేకుండా మావోయిస్టు పార్టీతో చర్చల ప్రక్రియను తక్షణమే ప్రారంభించాలని పీస్ డైలాగ్ కమిటీ విజ్ఞప్తి చేసింది. పరాయిదేశంతో చర్చల ద్వారా సమస్యలను పరిష్కరించుకుంటున్న క్రమంలో ఆదివాసీ ప్రాంతాలపై సైనిక దాడులు చేయడం అమానవీయమన్నారు. రాష్ట్రపతి ద్రౌపది ముర్ము జోక్యం చేసుకుని ఆపరేషన్ కగార్ ఆపి కేంద్ర ప్రభుత్వం చర్చలకు ఒప్పుకునేలా సూచించాలని వారు విజ్ఞప్తి చేశారు. హైదరాబాద్‌లో బుధవారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో పీస్ డైలాగ్ కమిటీ అధ్యక్షుడు జస్టిస్ బి.చంద్రకుమార్, ఉపాధ్యక్షుడు కందిమళ్ల ప్రతాప్ రెడ్డి, కోఆర్డినేటర్ ప్రొఫెసర్ అన్వర్‌ఖాన్ మాట్లాడారు. ఛత్తీస్‌గఢ్ బీజాపూర్ జిల్లాలో ఇటీవల జరిగిన ఎన్‌కౌంటర్‌లో 22 మంది మృతిపై అనుమానాలు బలంగా వ్యక్తమవుతున్న నేపథ్యంలో సుప్రీంకోర్టు వెంటనే సుమోటోగా స్వీకరించి, విచారణ చేపట్టాలని కోరారు. ఆపరేషన్ కగార్ పేరిట దేశవ్యాప్తంగా భయానక పరిస్థితి నెలకొన్నదని వారన్నారు. ప్రజాస్వామిక వాదులు, రాజకీయ పార్టీలు స్పందించి మానవహనాన్ని ఆపడానికి పూనుకోవాలని జస్టిస్ చంద్రకుమార్ అన్నారు. ఇప్పటికే కాల్పుల విరమణతో మావోయిస్టు పార్టీ చర్చలకు ముందుకొచ్చిందని గుర్తుచేశారు. ఇన్‌ఫార్మర్ల పేరుతో కొన్ని హత్యలు జరిగినట్టు మీడియాలో కథనాలు వస్తున్నాయని, ఈ నేపథ్యంలో మావోయిస్టు పార్టీ చర్చల వాతావరణానికి భంగం కలిగించకుండా ఎటువంటి భౌతిక చర్యలకు దిగవద్దని సూచించారు. మావోయిస్టు ఉద్యమం శాంతిభద్రతల సమస్యగా చూడబోమని, అది సామాజిక, ఆర్థిక, రాజకీయ సమస్యగా చూస్తామని, ఆ దిశగా ప్రభుత్వం నడుచుకుంటున్నదని సిఎం రేవంత్‌రెడ్డి సానుకూలంగా స్పందించడం పట్ల వారు కృతజ్ఞతలు తెలిపారు. సమావేశంలో కమిటీ కోఆర్డినేటర్ బండి దుర్గాప్రసాద్, కమిటీ సభ్యులు జైసింగ్ రాథోడ్, అడ్వకేట్ ఐపిఎల్ వెంకన్న తదితరులు పాల్గొన్నారు.

## వేములవాడ టెంపుల్ ఘటనపై మంత్రి సురేఖ ఆరా

ప్రజాపక్షం/హైదరాబాద్: వేములవాడ దేవాలయం ఘటనపై దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ బుధవారం ఆరా తీశారు. దేవాదాయ కమిషనర్, వేములవాడ ఆలయ ఈవోలను పూర్తి వివరాలు అడిగి తెలుసుకున్న మంత్రి సురేఖ రాజన్న ఆలయ విస్తీర్ణం విషయంలో అపోహలు నెలకొన్నవని మంత్రికి ఆలయ సిబ్బంది తెలిపారు. భక్తులకు పూర్తిస్థాయిలో సౌకర్యాలు అందజేసేందుకు ఆలయ విస్తీర్ణం పెంచాలనే చర్యలు తీసుకున్నట్టు వివరించారు.
ప్రధాన ఆలయ విస్తీర్ణం, భీమేశ్వరాలయంలో భక్తులకు దర్శన సౌకర్యంకు సంబంధించిన పనులు చేపడుతున్నట్టు స్పష్టం చేశారు. అయితే, స్థానికంగా అన్నివర్గాల ప్రజలతో చర్చించి ముందుకు వెళ్ళాలని... ఎక్కడా ఎటువంటి అనుమానాలు, ఇబ్బందులకు తావు ఇవ్వకుండా ముందుకు వెళ్ళాలని అధికారులకు మంత్రి సురేఖ దిశానిర్దేశం చేశారు. ఈ సందర్భంగా ఆలయ కార్యనిర్వహణాధికారి మాట్లాడుతూ జూన్ 15 నుంచి దేవస్థానం మూసివేస్తున్నట్టు వస్తున్న వార్తలు సత్య దూరమైనవని, ప్రధాన ఆలయ విస్తీర్ణం, భీమేశ్వరాలయంలో భక్తులకు దర్శన సౌకర్యం కు సంబంధించిన వివరాలను అతి త్వరలో వెల్లడిస్తామని, భీమేశ్వర ఆలయంలో పూర్తిస్థాయిలో భక్తులకు సౌకర్యాలు ఏర్పాటు చేసిన తర్వాతే ప్రధాన ఆలయ విస్తీర్ణ ప్రక్రియ ప్రారంభమవుతుందని తెలిపారు. శృంగేరి పీఠాధిపతి అనుమతులు, దేవాదాయ ధర్మాదాయ శాఖ సలహాలు సూచనలు మేరకు ప్రధానాలయాన్ని ఆగమశాస్త్ర బద్ధంగా విస్తీర్ణం పెంచబోతున్నామని, అందుకు సంబంధించిన విధివిధానాలు అతి త్వరలో వెల్లడిస్తామని తెలిపారు. ఆలయం మూసివేయడం అంటూ ఏది ఉండదని, ఆలయం అభివృద్ధి చేసేటప్పుడు కూడా పూర్తిస్థాయిలో స్వామివారికి నిత్య కైంకర్యాలు జరుగుతూ ఉంటాయని ఈ సందర్భంగా తెలియజేశారు, ఆలయ అభివృద్ధి విషయంలో అధికారిక ప్రకటన జారీ చేసే వరకు భక్తులు ఎవరు ఆందోళనకు గురికావద్దని తెలియజేశారు. ఆలయ అభివృద్ధిలో భాగంగా చేపట్టే పనులకయ్యే ఖర్చు మొత్తం ప్రభుత్వం మంజూరు చేసిన 76 కోట్ల రూపాయల తోనే జరుగుతుందని, ప్రభుత్వం ద్వారా మంజూరైన రూ. 36 కోట్లతో అన్నదాన సత్రం నిర్మాణం జరుగుతాయని, దేవస్థానమునకు భక్తుల ద్వారా సమర్పించబడిన డబ్బులేవీ కూడా ఇందుకు ఉపయోగించబడవని ఈ సందర్భంగా అధికారులు మంత్రి సురేఖకు స్పష్టం చేశారు.

# సరస్వతీ పుష్కరాలకు సర్వం సిద్ధం!

భక్తులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తవద్దు

స్పష్టమైన ఆదేశాలు ఇచ్చిన మంత్రి సురేఖ

ఇప్పటికే పలుమార్లు అధికారులతో రివ్యూలు, వీడియో కాన్ఫరెన్స్




ప్రజాపక్షం/హైదరాబాద్ : భారతీయ సనాతన హైందవ సాంప్రదాయాలలో పుష్కర స్నానంకు ఒక అచంచలమైన గొప్ప భక్తి విశ్వాసం ఉన్నది. ప్రాణకోటి మనుగడకు ఆధారమైన జలాన్ని ఆరాధించడం ఓ మోక్షప్రదాయమని శాస్త్రపరమైన నమ్మకం. అందుకే జీవరాశులన్నింటికీ జలం యొక్క ప్రాముఖ్యత తెలపడానికి ప్రతి సంవత్సరం ఒక్కొక్క నదికి పుష్కరం వస్తుంది. భారతదేశంలోని 12 నదుల్లోనూ గురుడు మేషం నుండి మీన రాశి వరకు పన్నెండు రాశులలో ఒక్కొక్క రాశిలోకి ప్రవేశించినప్పుడు ఆయా నదులకు పుష్కరాలు వస్తాయి. గురుడు మిథున రాశిలోకి ప్రవేశించినప్పుడు సరస్వతీ నదికి పుష్కరాలు ప్రారంభమవుతాయి. రెండు జీవనదులు కలిసిన చోట సరస్వతి నది ఉద్భవించునని కాళేశ్వర ఖండములో స్పష్టం చేయబడింది. గురువారం కాళేశ్వరంలో సరస్వతి నదీ పుష్కరాలు ప్రారంభం అవుతాయి. ఈనెల 26 వరకు సరస్వతీ నది పుష్కరాలు నిర్వహించబడును. ఇందుకు రాష్ట్ర దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ ఆధ్వర్యంలో అధికారులు అన్ని ఏర్పాట్లు చేస్తున్నారు. కొండా సురేఖ, జిల్లా మంత్రి దుద్దిళ్ళ శ్రీధర్‌బాబు పలుమార్లు సరస్వతీ పుష్కరాలు విజయవంతం చేసేందుకు రివ్యూ సమావేశాలు నిర్వహించారు. జిల్లా యంత్రాంగానికి స్పష్టమైన దిశానిర్దేశం చేశారు. ఈ పుష్కరాలకు వచ్చే భక్తులకు ఇబ్బందులు ఎదుర్కోకుండా చర్యలు తీసుకోవాలని చెప్పారు. కాళేశ్వరం యాప్, వెబ్ పోర్టల్‌ను ప్రారంభించి, భక్తులు సాంకేతికంగా పొందే సేవలను సైతం అందులో పొందుపరిచారు.
జయశంకర్ భూపాలపల్లి జిల్లా, శ్రీ కాళేశ్వర ముక్తీశ్వరస్వామి దేవస్థానం కాళేశ్వరం వద్ద గోదావరి, ప్రాణహిత, సరస్వతి నదులు కలిసి త్రివేణి సంగమంగా ప్రవహించు చున్నందున కాళేశ్వర క్షేత్రం వద్ద త్రివేణి సంగమ తీరంలో 12 రోజులు సరస్వతీ నది పుష్కరాలు నిర్వహించబడుచున్నవి. సదరు పుష్కరాల సందర్భంగా ప్రతి దినము సుమారు 50వేలకు పైగా భక్తులు వచ్చి పుష్కర స్నానం చేయుట, పిండప్రదానం, దంపతీ స్నానం, శ్రీ కాళేశ్వర ముక్తీశ్వరస్వామి వార్ల దర్శనం చేసుకుంటారు. సరస్వతీ నది పుష్కరాల సందర్భంగా వచ్చు భక్తులకు కోసం నూతన ఘాట్ నిర్మాణం, స్నానాల కొరకు షవర్లు ఏర్పాటు, టెంట్లు, చలువ పందిర్లు, లైటింగ్, ఓహెచ్ఆర్ వాటర్ ట్యాంకులు నిర్మించి తాగు నీటి ఏర్పాటు, అదనపు కౌంటర్లు నిర్మాణం, సిమెంట్ రోడ్ల నిర్మాణం, పిండ ప్రదాన మండపం, కేశఖండన మండపం నిర్మాణం, శాశ్వత మరుగుదొడ్లు, స్నానం గదుల నిర్మాణం, పుష్కరఘాట్‌పైన సరస్వతి అమ్మవారి రాతి విగ్రహం ఏర్పాటు, మేన్ ఘాట్ వద్ద స్వాగత తోరణం నిర్మాణం, హారతి ప్లాట్ ఫారం నిర్మాణం, గోదావరి నదిలో నీటివరకు తాత్కాలిక రోడ్డు ఏర్పాట్లు చేయుటకు తెలంగాణ ప్రభుత్వం పెద్ద ఎత్తున నిధులు మంజూరు చేసింది. పుష్కరాలు ప్రారంభమయ్యేనాటికి అన్ని పనులు పూర్తి చేయాలనే ధృడ సంకల్పంతో స్థానిక జిల్లా భూపాలపల్లి రాహుల్ శర్మ, జిల్లా ఉన్నతాధికారులు, ఆలయ ఈఓ మహేశ్ ఇతర అధికారులు తీవ్రంగా కృషి చేస్తున్నారు.

### సరస్వతి నది పుష్కరాలు – 2025 పోస్టర్ విడుదల చేసిన మంత్రి సురేఖ



భూపాలపల్లి జిల్లా కాళేశ్వరంలో మే 15 నుండి 26 వరకు జరగనున్న సరస్వతీ నది పుష్కరాల కోసం తెలంగాణ కాలుష్య నియంత్రణ బోర్డు అధికారిక పోస్టర్‌ను అటవీ, పర్యావరణ, దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ విడుదల చేశారు. ఈ సందర్భంగా పర్యావరణ పరిరక్షణ ఆవశ్యకతని సూచిస్తూ తెలంగాణ కాలుష్య నియంత్రణ బోర్డు అధికారిక పోస్టరును మంత్రి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ నదులను పరిరక్షించడం, సింగిల్ యూజ్ ప్లాస్టిక్‌లు నిషేధించడం, బట్టలు ఉతకడం, వ్యర్థాలను సరిగ్గా నిర్వహణ నీటి కాలుష్యం నుండి చర్మ వ్యాధులను నివారించడానికి పరిసరాలను శుభ్రంగా ఉంచడం అవసరాన్ని నొక్కి చెప్పారు. ప్రజా రవాణాను ఉపయోగించడం వల్ల వాహన కాలుష్యం, రద్దీ తగ్గుతుందని తెలిపారు. మనం సమిష్టి బాధ్యత తీసుకొని మన పర్యావరణాన్ని కాపాడుకోవడానికి పుష్కరాల పవిత్రతను కాపాడుకోవడానికి చేతులు కలపాలని మంత్రి కొండా సురేఖ అన్నారు.

## బిఎస్‌ఎన్‌ఎల్ ఉద్యోగులకు రూ.20కోట్ల టోకరా

కోఆపరేటివ్ క్రెడిట్ సొసైటీలో నిధులు గోల్‌మాల్

మాజీ సూపరింటెండెంట్‌ను అరెస్టు చేసిన సిఐడి

ప్రజాపక్షం/హైదరాబాద్ : బిఎస్ఎన్ఎల్ ఎంప్లాయిస్ కోఆపరేటివ్ క్రెడిట్ సొసైటీ లిమిటెడ్‌లో రూ.20 కోట్లు దుర్వినియోగం చేసి మోసగించిన కేసులో బిఎస్ఎన్ఎల్ సూపరింటెండెంట్ బాషమల్ల అనంతరావు (రిటైర్డ్)ను సిఐడి పోలీసులు బుధవారం అరెస్టు చేసినట్లు సిఐడి డిజి శిఖాగోయల్ ఒక ప్రకటనలో తెలిపారు. బిఎస్ఎన్ఎల్ ఎంప్లాయిస్ సొసైటీలో ఉన్న రూ.20 కోట్ల డబ్బులను బ్యాంక్‌లో డిపాజిట్ చేయకుండా..డిపాజిట్లు చేసినట్లుగా నకిలీ డిపాజిట్ పత్రాలు సృష్టించి కార్యదర్శిగా అప్పట్లో పనిచేసిన నిందితుడు బాషమల్ల అనంతరావు సొసైటీ సభ్యులను మోసగించాడు. సొసైటీకి చెందిన బ్యాంక్‌లో డబ్బులను జమ చేయకుండా ఇతర బ్యాంక్‌లో డిపాజిట్ చేసినట్లు నకిలీ డిపాజిట్ పత్రాలు ఇతను సృష్టించాడు. బిఎస్ఎన్ఎల్ ఎంప్లాయిస్ కోఆపరేటివ్ క్రెడిట్ సొసైటీ లిమిటెడ్‌లో రూ.20కోట్ల డిపాజిట్ల కుంభకోణం నల్గొండ జిల్లాలో వెలుగుచూడడంతో బిఎస్ఎన్ఎల్ మేనేజర్ జి.శ్రీనివాస్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు సిఐడి పోలీసులు 2022 ఏప్రిల్ 30న కేసు నమోదు చేశారు. ఈ కేసులో ప్రధాన నిందితుడిగా బ్యాంక్ ఉద్యోగి సిహెచ్.షణ్ముఖ చారితో పాటు మరికొందరిపై కేసు నమోదుచేశారు. ఈ కేసులో సిఐడి ఇన్‌స్పెక్టర్ ఎస్.మదన్‌మోహన్ రెడ్డి లోతుగా దర్యాప్తు చేయగా బాషమల్ల అనంతరావు హస్తం ఉన్నట్లు తేలింది. దీంతో అతన్ని అరెస్టు చేశారు. ఈ కుంభకోణం కేసుతో మరి కొంత మందికి సంబంధం ఉన్నదని విచారణలో తేలింది. వారిని కూడా త్వరలో అరెస్టు చేస్తామని శిఖాగోయల్ తెలిపారు.

## కల్నల్ సోఫియా ఖురేషిని అవమానించిన బిజెపి మంత్రి విజయ్ షాను తక్షణమే బర్తరఫ్‌చేయాలి : విఎస్.బోస్

ప్రజాపక్షం/హైదరాబాద్ : కల్నల్ సోఫియా ఖురేషిని అవమానించిన బిజెపి మంత్రి విజయ్‌షాను తక్షణమే బర్తరఫ్‌చేయాలని సిపిఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు విఎస్.బోస్ డిమాండ్ చేశారు. పాకిస్తాన్‌తో జరిగిన యుద్ధంలో కీలకపాత్ర పోషించి, తన శక్తియుక్తులన్నీ ఉపయోగించి పాకిస్తాన్ సైన్యాన్ని గడగడలాడిరచిన సోఫియా ఖురేషిని అవమానపర్చటం భారతదేశ సంస్కృతికి విరుద్ధమని ఆయన పేర్కొన్నారు. సోఫియా ఖురేషి ప్రదర్శించిన వీరోచిత పాత్ర భారతదేశంలోనే 140 కోట్ల మంది ప్రజలు ప్రశంసిస్తుండగా మధ్యప్రదేశ్ ప్రభుత్వ బిజెపి మంత్రి విజయ్‌షా ఖురేషిని అవమానించేటట్లు మాట్లాడటం తీవ్రమైన తప్పిదమని ఆయనను తక్షణమే మంత్రివర్గం నుంచి తొలగించాలని డిమాండ్ చేశారు.
అదేవిధంగా డిఫెన్స్ సెక్రెటరీ విక్రమ్ మిశ్రీ ప్రభుత్వ విధానాలను, ప్రభుత్వ నిర్ణయాలను పత్రికలకు తెలియజేసి తన ధర్మాన్ని తను పాటిస్తే ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ అనుయాయులు ఆయనను ట్రోల్ చేయటం కూడా దేశ ప్రతిష్టను దెబ్బతీయడమేనని తెలిపారు. ప్రధాని తన ప్రసంగంలో ఈ రెండు అంశాలను ఖండించకపోవడమంటే ఆయన వారిని సమర్థిస్తున్నారా అని ఆయన ప్రశ్నించారు. మోదీ తన అనుయాయులు, ఆర్‌ఎస్‌ఎస్ చేస్తున్న దుశ్చర్యలను ఖండించపోవడం అతని చేతగానితనానికి నిదర్శనమని బోస్ పేర్కొన్నారు. కశ్మీర్లో జరిగిన ఉగ్రవాదుల కాల్పుల్లో మరణించిన వారిలో 26 మందిలో 15 మంది ముస్లింలు కూడా ఉన్నారనేది బహిర్గతం చేయకపోవడం మోదీకి సరైనది కాదన్నారు.

## అప్పలపై ‘గులాబీ’ స్వరం మారుతున్నది

కెటిఆర్, కవిత భిన్నస్వరాలు

రూ.80వేల కోట్ల అప్పులు చెల్లించారన్న కవిత

ఏడాదికి రూ.27 కోట్లే అవుతుందన్న కెటిఆర్






ప్రజాపక్షం/హైదరాబాద్ : బిఆర్‌ఎస్ పదేళ్ల కాలంలో చేసిన మొత్తం అప్పులు, వాటికి ప్రస్తుతం చెల్లిస్తున్న అసలు, వడ్డీ విషయంలో ప్రభుత్వం పదే పదే చెబుతున్న లెక్కలలో ఎంత వాస్తవం.?, ఎంత వరకు అవాస్తవం? అనే అంశాన్ని పక్కన పెడితే, తెలంగాణ రాష్ట్ర అప్పుల చెల్లింపులపైన ప్రతిపక్ష బిఆర్‌ఎస్‌లో మాత్రం అస్పష్టత, గందరగోళం నెలకొన్నది. ప్రభుత్వానికి ధీటుగా, ప్రభుత్వం చెల్లిస్తున్న అప్పులు లెక్కలను వివరించాల్సిన ప్రతిపక్ష పార్టీ నేతల మధ్యనే అస్పష్టత ఉండడం గమనార్హం. ఆ పార్టీకి చెందిన ముఖ్యనాయకుల మధ్యనే పొంతనలేని లెక్కలతో బిఆర్‌ఎస్‌తో పాటు ఇతర వర్గాలు కూడా అయోమయానికి గురవుతున్నాయనే చర్చ జరుగుతోంది. అప్పులు, వాటికి ప్రభుత్వం చెల్లిస్తున్న అసలు, వడ్డీతో కలిపి ఇటీవల మీడియా సమావేశంలో బిఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కెటి.రామారావు వివరంగా అనేక లెక్కలను వివరించారు. పైగా ఆర్‌బిఐ, కాగ్ లెక్కల ఆధారంగానే తాను అప్పుల లెక్కలను చెప్పినట్టు స్వయంగా కెటిఆర్ ప్రకటించారు. కాంగ్రెస్ ప్రభుత్వం 14 నెలలో రూ.64,768 కోట్ల అప్పులను తిరిగి చెల్లించామనే మాట అవాస్తవమని, ప్రతి నెలా రూ. 4,600 కోట్లు కూడా తప్పేనని కెటిఆర్ వివరించారు. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం కేవలం ప్రతినెలా రూ.2వేల కోట్లు మాత్రమేనని, మొత్తం అప్పులకు వడ్డీతో కలిపి అసలు చెల్లిస్తున్నట్టు చెప్పారు. కానీ తాజాగా కల్వకుంట్ల కవిత చేసిన వ్యాఖ్యలు అప్పుల చెల్లింపుల విషయంలో గందరగోళానికి దారి తీసింది. రాష్ట్ర ప్రభుత్వం తీసుకొచ్చిన రూ.1,80,000 కోట్ల అప్పులను పరిశీలించామని, ఇందులో ఇదివరకు చేసిన అప్పులకు రూ.80వేల కోట్లు మాత్రమే చెల్లించిందని వ్యాఖ్యానించారు. దీంతో అప్పుల చెల్లింపుల విషయంలో కెటిఆర్, కవిత ఇద్దరూ చేసిన వ్యాఖ్యలు పరస్పర భిన్నంగా ఉండడం గమనార్హం. ఇందులో ఎవరి లెక్కలు వాస్తవం అనేది సొంత పార్టీలో కూడా గందరగోళానికి దారి తీసే అవకాశాలు ఉంటాయనే అభిప్రాయాలు వ్యక్తం అవుతున్నాయి. బిఆర్‌ఎస్‌లో ఇప్పటికే కెటిఆర్, కవిత, హరీశ్‌రావు ఇలా మూడు వర్గాలు అంటూ రకరకాల ప్రచారం జరుగుతోంది. ఇలాంటి పరిస్థితుల్లో ఒక అంశంలో భిన్నస్వరాలు వినిపించడం ప్రధాన ప్రతిపక్ష హోదాలో ఉన్న బిఆర్‌ఎస్‌కు భవిష్యత్‌లో ఇరకాట పరిస్థితులు ఉంటాయనే అభిప్రాయాలు వ్యక్తం అవుతున్నాయి.


GHMC గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్
ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్, సర్కిల్ నెం: 6
ఈ – ప్రొక్యూర్మెంట్ షార్ట్ టెండర్ నోటీసు
NIT. No: 02/ఇఇ6/సిఆర్‌జెడ్ /జిహెచ్ఎంసి/2025-26 తేదీ: 13.05.2025; పని యొక్క స్వభావం: సిసి రోడ్డు, వాటర్ లాగింగ్ పనులు మరియు ఇతర నిర్వహణ పనులు; అంచనా విలువ (రూ. లక్షల్లో) 123.60; ప్రారంభ తేదీ / బిడ్ల రసీదులకు చివరి తేదీ మరియు సమయం: డౌన్‌లోడ్ ప్రారంభ తేదీ: 14.05.2025 మధ్యాహ్నం 2 గం.లకు; బిడ్ల రసీదుకు చివరి తేదీ: 17.05.2025 మధ్యాహ్నం 2 గం.లకు; పేరు & చిరునామా అధికారి, సెల్ నం: శ్రీ ఎం. పీర్సింగ్, ఇఇ, డివిజన్-6, సిఆర్‌జెడ్, జిహెచ్ఎంసి, హైదరాబాద్. ఫోన్: 9154960551. మరిన్ని వివరాల కోసం e procurementలో www.tender.eprocurement.gov.in చూడవచ్చు. గమనిక: టెండర్ నోటీసు తేదీ తర్వాత 1% EMD పొందాలి.
Sd/- ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్, సర్కిల్ నెం:6, చార్మినార్ జోన్, జిహెచ్ఎంసి.
DIPR R.O. No: 1834-PP/CL/ADVT/1/2025-26 Date: 14-05-2025

శ్రీ కోటేశ్వరస్వామి దేవాలయము
గ్రా : కోటిలింగాల, మం: వెల్గటూర్, జిల్లా జగిత్యాల
లేఖ నెం. SKST/2025 టెండర్ కమ్ బహిరంగ వేలముల ప్రకటన తేది: 14.05.2025
ఇందుమూలముగా సమస్త ప్రజలకు మరియు భక్తులకు తెలియజేయునది ఏమనగా జగిత్యాల జిల్లా, వెల్గటూర్ మండలం, కోటిలింగాల గ్రామంలోని శ్రీ కోటేశ్వరస్వామి దేవాలయములో తేది. 23.05.2025 శుక్రవారం రోజున ఉదయం 11.00గంటలకు ఒక సంవత్సరము కాలపరిమితితో దేవాలయములో కొబ్బరికాయలు, పూజా సామాగ్రి అమ్ముకొను హక్కు మరియు కొబ్బరి ముక్కలు ప్రోగుచేసుకొనే హక్కుకు గాను టెండర్ కమ్ బహిరంగ వేలము నిర్వహించబడును. వివరములు : 1. కొబ్బరికాయలు, పూజాసామాగ్రి, డిపాజిట్ రూ. 3,00,000/- ; కాలపరిమితి : 01.06.2025 నుండి 31.05.2026 వరకు 2. కొబ్బరి ముక్కలు ప్రోగుచేసుకొనుట డిపాజిట్ రూ. 30,000/- లు (1 సం.రం) పైన తెలిపిన హక్కు వేలములో పాల్గొనువారు దరావత్తు రూపాయలు లేదా డి.డి. ఏదేని జాతీయ బ్యాంకు నందు కార్యనిర్వహణాధికారి, శ్రీ కోటేశ్వరస్వామి దేవస్థానము, కోటిలింగాల పేర డి.డి. తీసుకొని సీల్డ్ టెండరు ఫారముకు జతపరచి, తేది. 23.05.2025 శుక్రవారం రోజున ఉదయం : 10:00గం.లకు కార్యనిర్వహణాధికారి గారి సమక్షంలో టెండర్ బాక్సులో వేయగలరు. టెండర్ కమ్ బహిరంగవేలము తేది. 23.05.2025 శుక్రవారం రోజున ఉదయం 11 గం.లకు నిర్వహించబడును. * మిగతా షరతులు టెండర్ కమ్ బహిరంగ వేలము ముందు చదివి వినిపించబడును. * టెండరు దరఖాస్తు తేది. 20.05.2025 నుండి తేది. 23.05.2025 రోజున ఉదయం : 10.00గం.ల వరకు రూ. 200/- కార్యనిర్వహణాధికారి గారికి చెల్లించి టెండర్ ఫారం పొందవచ్చును. * హెచ్చు పాటదారుడు పాట ముగిసిన తరువాత వారం రోజుల లోపు పూర్తి పేమెంట్ చేయవలెను. లేనియెడల డిపాజిట్ జప్తు చేసి తిరిగి వేలం నిర్వహించబడును.
Sd/- ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్, శ్రీ కోటేశ్వరస్వామి టెంపుల్, కోటిలింగాల (వి) మం. వెల్గటూర్, జిల్లా : జగిత్యాల్
DIPR R.O.No.1825-PP/CL/ADVT/1/2025-26 Date: 14-05-2025

ప్రజాపక్షం
గురువారం, మే 15

# అవామీలీగ్‌పై నిషేధం

డాక్టర్ ముహమ్మద్ యూనుస్ అధిపతిగా ఉన్న బంగ్లాదేశ్ తాత్కాలిక ప్రభుత్వం గతవారం దేశంలో ప్రధానమైన రాజకీయ పార్టీల్లో ఒకటైన అవామీలీగ్ కార్యకలాపాలను నిషేధించి పరోక్షంగా భారత్‌కు షాక్ ఇచ్చింది. వచ్చే సంవత్సరారంభంలో సార్వత్రిక ఎన్నికలు జరుగుతాయని భావిస్తున్న నేపథ్యంలో అవామీలీగ్‌పై నిషేధానికి విస్తృత పర్యవసానాలున్నాయి. మన దేశం పాకిస్థాన్‌తో సైనిక సంఘర్షణలో తలమునకలుగా ఉన్నందున మన దేశంలోని మీడియా బంగ్లా ప్రభుత్వ చర్యపై దృష్టిపెట్టలేదు. బంగ్లాదేశ్ ఆవిర్భావానికి, అది నిలదొక్కుకోవటానికి సైనికంగా, ఆర్థికంగా అండగా నిలబడిన భారతదేశానికి ఇవాళ పొరుగు దేశంలో మిత్ర రాజకీయపక్షం లేకుండా పోవటం చరిత్ర వైచిత్రి!

బంగ్లాదేశ్ రాజకీయ, సాంస్కృతిక జీవనంలో పెనవేసుకున్న పార్టీ అవామీలీగ్. అది ముజిబుర్ రెహ్మాన్ పార్టీ. పాకిస్థాన్ సాంస్కృతిక అణచివేతకు వ్యతిరేకంగా జాతీయోద్యమానికి నాయకత్వం వహించిన పార్టీ అది. తూర్పు పాకిస్థాన్ పేరును ప్రపంచ పటం నుంచి చెరిపివేసి స్వతంత్ర బంగ్లాదేశ్ రాజ్యం ఏర్పాటుకై సాగిన జాతీయవాదుల పోరాటానికి భారతప్రభుత్వం 1970వ దశకంలో ఆర్థికంగా, సైనికంగా తోడ్పడింది. స్వతంత్ర బంగ్లాదేశ్ ఆవిర్భవించి జాతిపిత ముజిబుర్ రెహ్మాన్ అధ్యక్షునిగా ప్రభుత్వం ఏర్పడిన తదుపరి కరడుగట్టిన మతోన్మాదులు, సైనికాధికారులు కుమ్మక్కై తిరుగుబాటుచేసి రెహ్మాన్‌ను, ఆయన కుటుంబాన్ని ఊచకోతకోసి అధికారాన్ని చేజిక్కించుకున్న తదుపరి ప్రజల తరపున నిలబడి పోరాటం చేసిన పార్టీ అవామీలీగ్. ఆ కాళరాత్రి విదేశాల్లో ఉండి బతికిపోయిన ముజిబుర్ కుమార్తె షేక్ హసీనా, ఆ తదుపరి ఆ పార్టీకి నాయకత్వం వహించారు. సైనిక పాలన, ఖలీదా జియా నాయకత్వంలోని బంగ్లాదేశ్ నేషనలిస్ట్ పార్టీ (బిఎన్‌పి) అధికారంలోఉన్న రెండు పదవీకాలాలు మినహా మిగతా కాలం పాలకపార్టీ అవామీలీగ్. 2009 నుంచి వరుసగా 15 సంవత్సరాలు షేక్ హసీనా వాజెద్ ప్రధానమంత్రిగా ఉన్న అవామీలీగ్ ప్రభుత్వం విద్యార్థుల తిరుగుబాటుతో 2024 ఆగస్టు 5న ఆమె రాజీనామాతో కూలిపోయింది. ఆమె భారత్‌లో ‘తాత్కాలిక’ ఆశ్రయం పొందారు. విద్యార్థి ఉద్యమాన్ని అణచివేసే ప్రయత్నంలో వివిధ స్థాయిల్లోని అవామీలీగ్ నాయకులు అనేక అత్యాచారాలు, అకృత్యాలకు పాల్పడినట్లు కేసులు దాఖలైనాయి. వారిపై హింసాత్మక దాడులు జరిగాయి. షేక్ హసీనా అప్పుడప్పుడూ వీడియో ప్రసంగాలు చేయటం మినహా పార్టీ స్తబ్దతలో ఉంది. ఆమెపై అనేక కేసులు మోపారు. ఆమెను తమకు అప్పగించాలని భారత ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తున్నారు.

ఇదిలాఉండగా, విద్యార్థులు ‘నేషనల్ సిటిజన్స్ పార్టీ’ (ఎన్‌సిపి) పేరుతో కొత్త రాజకీయ పార్టీ ఏర్పాటు చేశారు. బిఎన్‌పి నాయకురాలు బేగం ఖలీదా జియా విదేశాల్లో వైద్య చికిత్స నుంచి స్వదేశం తిరిగి వచ్చారు. కాగా విద్యార్థుల పార్టీ ఎన్‌సిపి గతవారం ఢాకాలో 72 గంటలపాటు పెద్ద ర్యాలీ నిర్వహించి అవామీలీగ్ కార్యకలాపాలన్నిటినీ తక్షణం నిషేధించాలని డిమాండ్ చేసింది. అవామీలీగ్‌ను ఏవో ఆంక్షలతోనైనా ఎన్నికల్లో పోటీ చేసేందుకు అనుమతించాలని బిఎన్‌పి క్రితంలో కోరింది. అయితే ఎన్‌సిపి కఠిన వైఖరికి యూనుస్ ప్రభుత్వం తలొగ్గింది. నిషేధ ఉత్తర్వులు జారీ చేసింది. దీంతో ఎన్నికల క్షేత్రం ఎన్‌సిపి, ఖలీదా జియా బిఎన్‌పిలకు పరిమితం కానుంది. చిన్నచిన్న పార్టీలు అనేకం ఉన్నా అవి ఏదోక పార్టీతో పొత్తు పెట్టుకోవలసిందే. ఇస్లామిక్ దేశాలనుంచి ప్రభుత్వానికి విరివిగా ఆర్థిక సహాయం లభించటంతో, జమాతే ఇస్లాంపట్ల ఇటీవల కాలంలో కొంత సదభిప్రాయం ఏర్పడినా, ప్రజల్లో దాని ఆమోదయోగ్యత అత్యల్పమే.

అవామీలీగ్ భవిష్యత్ ఏమిటి? కార్యకర్తలు బలంగా ఉన్నా బహిరంగంగా పనిచేసే పరిస్థితి లేదు. మరోవైపున, తమ పలుకుబడి పెంచుకోవటానికి పాకిస్థాన్ ప్రయత్నిస్తున్నది. భారత్‌కు మిత్రపక్షమే లేకుండా పోయింది. దక్షిణాసియాలో అతిపెద్ద దేశంగా, సాపేక్షికంగా బలమైన ఆర్థిక, సైనిక శక్తిగా ఉన్న భారతదేశం సానుకూల పరిణామాలకోసం వేచిచూడక తప్పదు!

# భారత్, శ్రీలంకలను ప్రచ్ఛన్నయుద్ధంలోకి లాగుతున్న అమెరికా

**షిరాన్ ఇల్లాన్ పెరుమ**

1964లో కైరోలో జరిగిన అలీన ఉద్యమ రెండవ శిఖరాగ్ర సమావేశంలో శ్రీలంక (అప్పటి సిలోన్) ప్రధాన మంత్రి సిరిమావో బండారు నాయకే హిందూ మహాసముద్రాన్ని సైనిక స్థావరాలు, అణ్వాయుధాలు లేని ‘శాంతి ప్రదేశంగా’ మార్చాలని ప్రతిపాదించారు. ప్రచ్ఛన్న యుద్ధ సమయంలో పెరిగిన సైనికీకరణ నేపథ్యంలో ఈ ప్రతిపాదనకు భారత ప్రధాన మంత్రి జవహర్‌లాల్ నెహ్రూ మద్దతు తెలిపారు.

అరవై ఒక్క సంవత్సరాల తరువాత ఈ రెండు దేశాలు రక్షణ సహకారంపై ఒక అవగాహన ఒప్పందం చేసుకున్నాయిజ. హిందూ మహాసముద్రంలో నూతన సైనికీకరణ సంకేతాల నేపథ్యంలో ఇది జరుగుతోంది. ఇది కొత్త ప్రచ్ఛన్న యుద్ధంలో చైనాను నిలువరించడానికి అమెరికా రచించిన ఇండోపసిఫిక్ వ్యూహంలో భాగంగా ఏర్పాటైన క్వాడ్‌లో (అమెరికా, ఆస్ట్రేలియా, జపాన్‌లతో కూడిన సమూహం)భారతదేశానికి కూడా భాగస్వామ్యం ఉంది.

భారత ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ ఏప్రిల్ 5న శ్రీలంకలో అధికారిక పర్యటన సందర్భంగా శ్రీలంక రక్షణ కార్యదర్శి హెచ్. ఎస్.సంపత్ తుయకొంత, భారత విదేశాంగ కార్యదర్శి విక్రమ్ మిస్రీల మధ్య రక్షణకు సంబంధించిన అవగాహన ఒప్పంద పత్రాలను మార్పిడి జరిగింది. శ్రీలంక పార్లమెంటు లో చర్చించబడని ఈ ఒప్పందం ఐదు సంవత్సరాల పాటు అమలులో ఉంటుందని తుయకొంత చెప్పారు.


శ్రీలంక అధ్యక్షుడు అనురా కుమార దిస్సానాయకేతో కలిసి నిర్వహించిన సంయుక్త విలేకరుల సమావేశంలో మోదీ మాట్లాడు తూ రక్షణ సహకార రంగంలో కుదిరిన ‘ముఖ్యమైన ఒప్పందాలను’ స్వాగతించారు. అయితే వాటి గురించి అంతుకు మించి వివరాలు చెప్పలేదు. తరువాత మిస్రీ మాట్లాడుతూ ‘భారతదేశం–శ్రీలంక భద్రతా ప్రయోజనాలు పరస్పరం ముడిపడి ఉన్నాయి’ అని అన్నారు. రక్షణ ఒప్పందంపై సంతకం చేయాలనే ఉద్దేశానికి సంబంధించిన వార్తలు మొదట మార్చి 28న భారతీయ మీడియాలో వచ్చాయి. దీనిని ‘కొలంబోపై తన సైనిక ప్రభావాన్ని పెంచడానికి చైనా చేస్తున్న అవిశ్రాంత ప్రయత్నాల మధ్య వచ్చిన చర్య’గా పిటిఐ వార్తా సంస్థ పేర్కొంది. రెండు పార్టీల నుండి వచ్చిన అధికారిక ప్రకటనలు ఈ చైనా వ్యతిరేక దృక్పథాన్ని ప్రతిధ్వనించనప్పటికీ, రెండు దేశాలు ఒక కొత్త ప్రచ్ఛన్న యుద్ధంలోకి మరింతగా లాగబడే అవకాశం ఉందనే ఆందోళనలను ఇది లేవనెత్తుతుంది.

భారతదేశం క్వాడ్లో వ్యవస్థాపక సభ్యదేశం. ఈ సమూహం మొదట 2007లో స్థాపించబడింది. ఆస్ట్రేలియా వైదొలగడంతో 2008లో నిలిచిపోయినా, 2017లో పునఃస్థాపన జరిగింది. ఈ సమూహం బలమైన భద్రతా కోణాలను కలిగి ఉంది. సభ్య దేశాలు 2024లో భారతదేశం నిర్వహించిన మలబార్ నావికాదళ కసరత్తు వంటి ఉమ్మడి సైనిక విన్యాసాలలో పాల్గొన్నాయి.

డొనాల్డ్ ట్రంప్ రెండవసారి అధ్యక్షుడిగా ఎన్నికైన తర్వాత ఈ సంవత్సరం భారతదేశం క్వాడ్ శిఖరాగ్ర సమావేశాన్ని నిర్వహించనుంది. 2024 జూలై మాసంలో ప్రస్తుతం ట్రంప్ విదేశాంగ మంత్రిగా ఉన్న నాటి రిపబ్లికన్ సెనేటర్ మార్కో రూబియో ఆయుధాల ఎగుమతికి సంబంధించి భారతదేశానికి నాటో సభ్య దేశాలతో సమానమైన హోదాను మంజూరు చేయడానికి కాంగ్రెస్‌లో ఒక బిల్లును ప్రవేశపెట్టారు. ఈ బిల్లు కాంగ్రెస్‌లో పెద్దగా పురోగతి సాధించనప్పటికీ, దాని ప్రాథమిక ఎజెండా ఇతర రూపాల్లో ముందుకు సాగుతున్నట్లు కనిపిస్తోంది.

2025 ఫిబ్రవరిలో మోదీ, ట్రంప్ మధ్య వాషింగ్టన్‌లో జరిగిన సమావేశం తరువాత, ఇద్దరు నాయకులు ‘21వ శతాబ్దపు యుఎస్–ఇండియా కాంప్యాక్ట్ (క్యాటలైజింగ్ ఆపర్చునిటీస్ ఫర్ మిలిటరీ పార్ట్‌నర్ షిప్, ఆక్సిలరేటెడ్ కామర్స్ అండ్ టెక్నాలజీ) అనే ఒక కార్యక్రమాన్ని ప్రకటించారు. ఇది సాంకేతికత బదిలీని సులభతరం చేయడం, ఆయుధాలు సహా ఉత్పత్తిని విస్తరించడం, సైనిక పరస్పర చర్యను బలోపేతం చేయడం, ‘ఇండోపసిఫిక్‌లోని ఇతర దేశాల్లో అమెరికా, భారతీయ సైనిక దళాల మోహరింపులకు మద్దతు ఇవ్వడం, కొనసాగించడం’ కోసం పదేళ్ళ రక్షణ చట్రాన్ని కలిగి ఉంది.

అమెరికా సైనిక పారిశ్రామిక సముదాయంలోకి భారతదేశం



జరగటం, చైనాపై నూతన ప్రచ్ఛన్న యుద్ధం వంటి అంశాలు ఆసియాలో ఉద్రిక్తతలను పెంచే ప్రమాదం ఉంది. అయితే, భారతదేశం కొన్నిసార్లు ‘వ్యూహాత్మక స్వయంప్రతిపత్తి’ పేరుతో రష్యా–ఉక్రెయిన్ సంఘర్షణ వంటి సమస్యలపై స్వతంత్ర వైఖరిని తీసుకుంటోంది. 2024లో భారత విదేశాంగ మంత్రి ఎస్. జైశంకర్ కూడా ‘ఆసియా నాటో’ను ఏర్పాటు చేయాలనే జపాన్ పిలుపును తిరస్కరించారు. భారతదేశానికి ‘భిన్నమైన చరిత్ర, విదేశీ వ్యవహారాలకు సంబంధించి భిన్నమైన వైఖరి’ ఉందని వాదించారు.

2009లో శ్రీలంకలో అంతర్యుద్ధం ముగిసినప్పటి నుండి ఆ దేశం అమెరికా ఇండో పసిఫిక్ వ్యూహంలోకి ఎక్కువగా ఆకర్షించబడుతో ంది. దేశంకోసం అమెరికా స్టేట్ డిపార్ట్మెంట్ రూపొందించిన 2022 ఇంటిగ్రేటెడ్ కంట్రీ స్ట్రాటజీ ప్రకారం ‘యునైటెడ్ స్టేట్స్, సారూప్య ఆలోచనలు కలిగిన వ్యూహాత్మక భాగస్వాములతో శ్రీలంక పరస్పర చర్యను పెంచడం’ ప్రధానమైన ప్రాధాన్యతా లక్ష్యం.

ఇది రెండు దేశాల మధ్య ఎక్కువ సైనిక సహకారంతో పాటు, అమెరికా నుండి శ్రీలంకకు ఆయుధాల అమ్మకాలలో కూడా స్పష్టంగా కనిపిస్తుంది. స్టాక్‌హోమ్ ఆధారిత పరిశోధనా సంస్థ సిప్రి డేటా ప్రకారం, 2009– 2024 మధ్య శ్రీలంకకు జరిగిన ఆయుధ బదిలీలలో దాదాపు 36శాతం అమెరికా నుండి వచ్చాయి. ఈ బదిలీలలో ప్రధానంగా హెలికాప్టర్లు, గస్తీ నౌకలు ఉన్నాయి.

2024లో యెమెన్‌లోని అన్సార్ అల్లా ప్రభుత్వానికి వ్యతిరేకంగా అమెరికా నేతృత్వంలోని ఆపరేషన్ ప్రాస్పరిటీ వాన్‌గార్డ్‌లో శ్రీలంక పాల్గొంది. గాజాలో జరుగుతున్న మారణహోమానికి ప్రతీకారంగా యెమెన్ ఎర్ర సముద్రంలో ఇజ్రాయెల్‌కు అనుబంధంగా ఉన్న నౌకలపై దాడి చేస్తోంది. ఈ ఆపరేషన్ కోసం మోహరించిన శ్రీలంక నావికాదళ నౌక ఎస్ఎల్ఎన్ఎస్ గజబాహు, వాస్తవానికి 1966లో అమెరికా ప్రవేశపెట్టిన కోస్ట్ గార్డ్ నౌక. దీనిని 2018లో శ్రీలంకకు విరాళంగా ఇచ్చారు.

ఇటీవల యుఎస్ ఇండోపసిఫిక్ కమాండర్ అడ్మిరల్ శామ్యూల్ జె.పపారో మార్చిలో చేసిన పర్యటన ఈ ప్రాంతంలో అమెరికా వ్యూహంలో శ్రీలంక పట్ల కొనసాగుతున్న ప్రాముఖ్యతను సూచిస్తుంది. పపారో తన పర్యటన సందర్భంగా శ్రీలంక అధ్యక్షుడు దిస్సానాయకే , విదేశాంగ మంత్రి విజయత హెరాత్‌లను కలిశారు. కొలంబోలోని నేషనల్ డిఫెన్స్ కాలేజీలో ఆయన చేసిన ప్రసంగం లో, ‘నిరంకుశ దేశాల మధ్య పెరిగిన సైనిక సహకా రం’ అనే సవాళ్ళు ‘ప్రజాస్వామ్య భాగస్వామ్యాలను’ బలోపేతం చేయవలసిన ఆవశ్యకతను సృష్టిస్తోందని పపారో అన్నారు.

శ్రీలంకకు దక్షిణంలో 2,000 కిలోమీటర్ల కంటే తక్కువ దూరంలో ఆక్రమిత చాగోస్ దీవులలోని డీగో గార్సియాలోని తన స్థావరంలో అమెరికా కనీసం ఆరు బి2 స్టీల్త్ బాంబర్లను ఉంచింది. ఈ బాంబర్లు యెమెన్‌లోని లక్ష్యాలపై దాడి చేయడానికి ఉపయోగించబడతాయి. ఇరాన్‌కు కూడా ఉనికిపరమైన ముప్పును కలిగిస్తాయి. తూర్పు, పశ్చిమ ఆసియాపై శక్తి ప్రదర్శన కోసం అమెరికాకు హిందూ మహాసముద్రంపై నియంత్రణ కీలకం.

హిందూ మహాసముద్ర శాంతి ప్రతిపాదనను 1971లో యునైటెడ్ రిపబ్లిక్ ఆఫ్ టాంజానియా (అప్పటి జూలియస్ నైరేరే నేతృత్వంలో) మద్దతుతో శ్రీలంకనే ఐక్యరాజ్యసమితి సాధారణ సభ 26వ సమావేశం ఎజెండాలో చేర్చింది. ఫలితంగా ‘హిందూ మహాసముద్రాన్ని శాంతి ప్రదేశంగా ప్రకటించడం’ అనే యుఎన్ తీర్మానం 2832 ఆమోదానికి దారితీసింది. ఈ ప్రకటనలో ఏముందంటే: ఏదైనా తీరప్రాంతం లేదా భూభాగ దేశానికి వ్యతిరేకంగా లేదా బెదిరింపు లేదా బలప్రయోగం కోసం యుద్ధనౌకలు, సైనిక విమానాలు హిందూ మహాసముద్రాన్ని ఉపయోగించకూడదు. అన్ని దేశాల నౌకలు ఈ ప్రాంతాన్ని స్వేచ్ఛగా, నిర్నిరోధం గా ఉపయోగించే హక్కు హామీ ఇవ్వబడుతుంది. హిందూ మహాసముద్రాన్ని శాంతి ప్రదేశంగా కొనసాగించడానికి అంతర్జాతీయ ఒప్పందం కుదుర్చుకోవాలి.

ట్రంప్ రెండవసారి పగ్గాలు చేపట్టిన తరువాత చైనాపై నూతన ప్రచ్ఛన్న యుద్ధాన్ని తీవ్రతరం చేస్తున్నందున, హిందూ మహాసముద్రంలో శాంతి మరోసారి ప్రమాదంలోకి ఉంది. క్వాడ్‌తో భారతదేశం సంబంధాలు, ఇండోపసిఫిక్ వ్యూహంలో శ్రీలంక చిక్కుకోవడం ఈ ప్రాంతంలో యుద్ధ జ్వాలలను ఎగదోసే ప్రమాదం ఉంది. అయితే, సామాజిక సమీకరణలు, ఇరువైపులా సూత్రబద్ధమైన నాయకత్వం ఉంటే, శ్రీలంక, భారతదేశం దక్షిణ భూగోళంలో శాంతియుత అభివృద్ధి, సహకారం కోసం పోరాడగలవని చరిత్ర చెబుతోంది. *(ఐపిఎ)*

# కుటుంబ శ్రేయస్సే దేశ ఉషస్సు!

ప్రేమానురాగాలు, ఆత్మీయ అనుబంధాలు, త్యాగాలు, కలిమిలేముల భావనలు, పరస్పర సహకార భావనలు, దయ కరుణలు బిత్తర పోయి చూస్తున్నాయి. కుటుంబ విలువలు తగ్గి అరాచక పోకడలు పెరుగుతున్నాయి. జీవనశైలిలో అనూహ్య మార్పులు వస్తున్నాయి. అమ్మ నాన్నలు, పిల్లల మధ్య కూడా వాణిజ్య బంధాలు పుట్టుకొస్తున్నాయి. జీవన గమనం వేగం పుంజుకుంది. తెలియని దానిని పొందడానికి ప్రయాసలు పెరుగుతున్నాయి. విలువలకు తూట్లు పొడుస్తూ కొత్త పోకడలు మొలుస్తున్నాయి. కుటుంబ భావనలు తరిగిపోయి అశాంతి జనిస్తున్నది.

**కుటుంబమే ప్రథమ పాఠశాల:**

కుటుంబమే ప్రథమ పాఠశాల, అమ్మనాన్నలే తొలి గురువులుగా లేత వయస్సు నుంచే వ్యక్తిత్వ వికాస పాఠాలు నేర్పాలి. జాతి నిర్మాణంలో కుటుంబ విలువలే పునాదులు. సామాజిక, ఆర్థిక ప్రగతిలో కుటుంబ సభ్యుల భూమిక ప్రధానమైం ది. కష్టనష్టాలను అధిగమించే ‘షాక్ అబ్జార్బర్’లు గా కుటుంబాలు నిలవాలి. సంపదలతో మాత్రమే సంతోషాలు రావని, త్యాగాలతో కూడిన ప్రేమానురాగాలే అసలైన ఆనందాల నిధులని తెలుసుకోవాలి. మానవాళి మనుగడకు కుటుంబమే ప్రధాన యూనిట్. పౌర సమాజానికి కేంద్ర బిందువు కుటుంబం మాత్రమే. కుటుంబ భావనలకు భారత్ ప్రధాన కేంద్రం అయ్యింది. భార్యాభర్తలు, తమ సంతానం, నాన్నమ్మ, తాతలతో కూడిన కుటుంబం ఓ అద్భుత విశ్వవిద్యాలయం. దైనంది న జీవితంలో కుటుంబం మాత్రమే సుఖదుఃఖాల ను తట్టుకోవడం నేర్పతుంది. కుటుంబ విలువలే జాతికి ఊపిరిగా నిలుస్తాయి. జాతి సంస్కృతి వారసత్వాలకు పునాదులు కుటుంబాలు అని తెలుసుకొని కుటుం బ వ్యవస్థలను గౌరవిద్దాం. గృహం అంటే గోడలు, గదులు కావని, ప్రేమలతో కట్టుకున్న గోడలతో కూడిన అందమైన, ఆనందాల హరివిల్లు అని తెలుసుకోవాలి.




**అంతర్జాతీయ కుటుంబ దినోత్సవం:**

పౌర సమాజ క్రమశిక్షణకు పునాదులుగా నిలుస్తున్న కుటుంబాల ప్రాధాన్యాలను వివరించడానికి 1993లో ఐరాస నిర్ణయం ఆధారంగా సాలీనా ప్రతి ఏట 15 మే రోజున అంతర్జాతీయ కుటుంబ దినోత్సవం లేదా ఇంటర్నేషనల్ ఫ్యామిలీ డే పాటించుట 1994 నుంచి ఆనవాయితీగా మారింది. కుటుంబ బంధాలు పటిష్టమైనపుడు విశ్వశాంతి నెలకొంటూ, సమాజాభివృద్ధి వేగం పుంజుకుంటుంది. పౌర సమాజానికి గుండెకాయ కుటుంబం మాత్ర మే. కుటుంబంలోనే మానవీయ విలువలు ప్రారంభం అవుతాయి. సమస్యలకు పరిష్కార వేదికలుగా కుటుంబాలు నిలుస్తున్నాయి. సఖ్యత కొరవడిన కుటుంబాల ప్రభావం పౌర సమాజ సంక్షేమంపై నేరుగా పడుతుంది. పేదరికం, నిరక్షరాస్యత, నిరుద్యోగాలు కుటుంబ శాంతిని హరించి వేస్తాయి.

**కుటుంబం – సుస్థిరాభివృద్ధికి పునాది:**

అంతర్జాతీయ కుటుంబ దినోత్సవం–2025 ఇతివృత్తంగా ‘కుటుంబం : సుస్థిరాభివృద్ధి దిశగా ప్రణాళికలు’ అనబడే అంశాన్ని తీసుకొని అవగాహన కల్పిస్తున్నారు. ప్రేమ, పరస్పర గౌరవం, వివేకం, పరస్పర సహకారం లాంటివి కుటుంబాలను ఏకం చేస్తున్నాయి. దాదాపు 80శాతం కుటుంబాలు వ్యవసాయ ఆధారిత జీవనోపాధుల్లో ఉంటున్నాయి. కుటుంబాలతో వ్యవసాయానికి ప్రత్యక్ష సంబంధం ఉంటుంది. సుస్థిర సాగు పద్ధతులు పాటించిన కుటుంబాలు పర్యావరణ పరిరక్షకులుగా నిలుస్తారు. కుటుంబ ఆహార భద్రత, గ్రామీణ ఉపాధులు, కార్బన్ ఉద్గారాలు, ప్రతికూల వాతావరణ మార్పులు, పేదరికం లాంటి అంశాలు కుటుంబ శ్రేయస్సుకు పునాదులుగా నిలుస్తాయి. అల్ప ఆదాయ దేశాల ప్రజల జీవనోపాధులు సహజ ప్రకృతి వనరులపై మాత్రమే ఆధారపడడంతో రేపటితరం శ్రేయస్సు గాల్లో దీపంగా మారుతోంది. నిన్నటితరం చేయలేని పర్యావరణ పరిరక్షణ యజ్ఞంలో కనీసం నేటితరం కుటుంబాలు నడుం బిగించాలి.

డా: బుర్ర మధుసూదన్ రెడ్డి
9949700037

# జానపద హాస్య కళారూపం తుపాకి రాముడు/పిట్టల దొర

తెలంగాణ జన జీవితంతో పెనవేసుకున్న జానపద కళారూపం పిట్టల దొర. సమాజంలో మంచిని చెపుతూ, చెడును వ్యంగ్యంగా ప్రశ్నిస్తూ, సమాజాన్ని మేల్కొలిపే నిజమైన వైతాళికులు ఈ తుపాకి జానపద కళాకారులు. ఈ కళారూపాన్ని బుడిగె జంగాల వారు ప్రదర్శించేవారు. మొదటగా కూచిపూడి భాగవతుల వారు ఈ జానపద వృత్తిని ఆశ్రయించి జీవనం కొనసాగించేవారు.

అలనాటి తెలంగాణ సమాజంలో పగల్బాలు పలికేవారు తరచుగా తారసపడే రోజుల్లో అలాంటి కోతల రాయుళ్ళను ఎండగట్టి వారి నిజ స్వరూపాన్ని ఆనాటి సమాజానికి బహిర్గతం చేసేవారు. ఈ వేషం వేసే వారిని చూసి నవ్వుకోవడం సమాజానికి పరిపాటి కానీ వారు చెప్పే విషయాలను విని కొందరైన ఆలోచించే వ్యక్తులు లేకపోలేదు సమాజంలో. చాలా జానపద కళారూపాలలో హాస్యం పోషించబడుతుంది. కవిత్వంలో కొంతైనా బూతు లేకపోతే కవిత్వాన్ని తిరస్కరించే వారు కూడా లేకపోలేదు. అలాంటిది జానపద కళారూపాలలో హాస్యానికి ప్రత్యేకమైన స్థానం కల్పించారు జానపదులు. తోలు బొమ్మలాటలో, వీధి భాగవతాల్లో, జంగం కథల్లో, హరి కథల్లో హాస్యాన్ని పోషించడానికి ప్రత్యేకమైన పాత్రలు ఉండేవి.

ఈ తుపాకి రాముడి జానపద కళారూపంలో వేషధారణ కూడా ప్రత్యేకంగా ఉంటుంది. చారిత్రక నేపథ్యంగా చూసుకున్నా, సమాజ సంస్కృతి, సాంప్రదాయబద్ధంగ చూసిన ఈ జానపద కళారూపం వాటిలో ప్రతిబింబిస్తుంది. తుపాకి రాముని వేషం ధరించేవాడు ఖాకీరంగు పాత ప్యాంటు, ఆదే రంగు పాత చొక్కా, తలమీద ఇంగ్లీషు వాళ్ళు ధరించే టోపి, భుజం మీద కర్ర తుపాకితో, ఎడమ భుజానికి జోలె వేసుకొని, ఒక కాలి ప్యాంటు చివరను పైకి మడుస్తాడు. కొంతమంది వేషంలో చిరిగిన మేజోళ్ళు, పాత బూట్లు తొడుక్కుని, జేబులో బీడీలు పెట్టిన సిగరెట్ పాకెట్టు పెట్టుకొని విచిత్రమైన వ్యక్తిగ సమాజానికి కనిపిస్తాడు. దాదాపు తెలంగాణలోని అన్ని జిల్లాలలో వీరు కనిపిస్తారు. పూర్వకాలంలో ‘వెంకట్రాముడు’ అనే బుడిగె జంగం కళాకారుడు ఈ తుపాకి రాముడు వేషం ధరించి సమాజంలో తనకంటూ గొప్ప స్థానాన్ని ఏర్పరచుకున్న కారణంగా ఈ జానపద కళారూపంలో వేషం వేసే ప్రతి ఒక్కరిని ‘తుపాకి వెంకట్రాముడు’ అని పిలవడం పరిపాటయ్యింది. రాను రాను విభిన్నపాఠాంతరాల సమన్వయంతో ‘వెంకట’అనే పదం జారిపోయి తుపాకి రాముడుగా సమాజంలో వ్యవహారమయ్యింది.

ఈ తుపాకి రాముడు జానపద కళారూపం వైయుక్తిక కళారూపం. ఒక్కరే ఈ జానపద కళారూపం ప్రదర్శిస్తారు. తన దగ్గర ఉన్న కర్ర తుపాకితో కాకులు మొదలైన పక్షులకు గురిపెట్టి ‘ఢాం’ అని నోటితో శబ్దం చేస్తూ ఆందరినీ నవ్విస్తుంటాడు కాబట్టి క్రమంగా అతన్ని ‘పిట్టల దొర’అని పిలవటం మొదలయింది. తెలంగాణ సమాజంలో ‘లత్కోర్ సాబ్’ అనే పేరుతో కూడా ఈ జానపద కళారూపం ప్రసిద్ధి.

తుపాకి రాముడు తన ప్రసంగాన్ని యుద్ధ పరాక్రమంతో మొదలు పెట్టి, దేశాన్ని పరిపాలించే రాజువద్ద ఉన్న మంత్రులను పరిచయవాక్యం చేసి, అందులో అందరికంటే తానే రాజుకు అత్యంత సన్నిహితుడనని, రాజు తన సలహా తీసుకోకుండ ఏ పని తలపెట్టడని, తను లేకుంటే రాజుకు ఏ పని చేతకాదని చెప్పుకుంటాడు. తాను గల్లా వసూలుకు బయలుదేరానని, ప్రజలందరికీ ‘బంగ్లా’లు కట్టిస్తున్నానని, తన బంగ్లా(బంగాళా) వద్ద ప్రజలకు విందు ఏర్పాటు చేశానని, ఆ విందు ఏర్పాట్లను వివరిస్తాడు. తన వద్ద ఉన్న బంగారాన్ని కుక్క ముట్టితే బావిలో పారవేశానని, మీకు కావాలంటే మేలు రకానికి వడ్లను పంపిస్తానని తన వద్ద ఉన్న వరి రకాలను పేర్కొంటాడు. తన అత్త పెళ్ళి కోసం గల్లా వసూలు చేస్తున్నానని, దేశంలోని గొప్ప గొప్పవాళ్ళు తన అత్త పెళ్ళికి వస్తున్నారని. పెళ్ళి ఏర్పాట్లు గొప్పగా చేస్తున్నానని చెబుతాడు. కాబట్టి ఊళ్ళోవాళ్ళంతా వెంటనే ఇంటికి మానెడు, ఇంటికి మానెడు ధాన్యం కొలవాలని పురమాయిస్తాడు. హాస్యం పుట్టించే విధంగా పైన పేర్కొన్న ఘట్టాలకు సంబంధించిన మాటలు వల్లిస్తూ, వాచకానికి అనుగుణమైన ఆంగికాన్ని అభినయిస్తాడు. ఈ వేషానికి సంబంధించిన ప్రసంగపాఠానికి మించి, ప్రజల మెప్పు పొందటంలో విజయం సాధిస్తాడు.

తుపాకి రాముడు వస్తు వస్తూనే యుద్ధ వాతావరణాన్ని వర్ణిస్తాడు. ఈ విధంగా తుపాకిరాముని వేషం,పల్లె ప్రజలకుఆనందాన్ని,హాస్యాన్నిఅందిస్తూ, జానవదకళలలో విశిష్టమైన స్థానాన్ని సంపాదించుకుంది.

కర్నె మల్లికార్జున్, 6303744239

# మాట్లాడుకోండి – మౌనంగా ఉండకండి!

**సెక్స్ –సైన్స్**

ఆధునిక జీవన విధానంలో సెక్సు పట్ల సరైన అవగాహన లేని యువత పెరుగుతోంది. ఎన్ని డిగ్రీలు పూర్తి చేసిన లైంగిక విద్యపై అవగాహన ఉండకపోవచ్చు. ప్రస్తుత కాలంలో భార్య, భర్తల మధ్య స్పర్శ, మాటా ముచ్చటకు, శృంగారమునకు నోచుకోని కుటుంబాల సంఖ్య నానాటికి పెరిగిపోతున్నాయి. ఆ మధురానుభూతిని, ప్రేమాను రాగాలను, ఆప్యాయతను పొందలేక మానసిక సమస్యలతో జీవితాన్ని పాడు చేసుకొంటున్నారు. భయాలు, ఆందోళనలు, కుటుంబ ఒత్తిళ్ళు ఆర్థిక కష్టాలు, లైంగిక విద్య పై అవగాహన లేమి కుటుంబ జీవితాలపై తీవ్ర ప్రభావాన్ని చూపుతోంది.మానసిక లైంగిక రుగ్మతలు (సైకో సెక్సువల్ డిజార్డర్స్): మానసిక స్థితి మరియు లైంగిక ఆరోగ్యం మధ్య సన్నిహిత సంబంధం ఉంది. సైకో సెక్సువల్ డిజార్డర్స్ అనేవి మానసిక, భావోద్వేగ లేదా సామాజిక కారణాల వల్ల లైంగిక సామర్థ్యంలో ఏర్పడే సమస్యలు.

**1. లైంగిక కోరికలలో లోపాలు (సెక్సువల్ డిజైర్ డిజార్డర్స్)**

హైపోయాక్టివ్ సెక్సువల్ డిజైర్ డిజార్డర్ అనేది లైంగిక కోరికలు లోపించడం లేదా తగ్గిపోవడం వల్ల వ్యక్తి లేదా దాంపత్య జీవితం పై ప్రతికూల ప్రభావం ఏర్పడుతుంది. ఇది డిప్రెషన్, ఒత్తిడి, హార్మోనల్ మార్పుల వల్ల మెనోపాజ్, టెస్టోస్టెరాన్ తగ్గడం లేదా దీర్ఘకాలిక అనారోగ్యం వల్ల ఏర్పడవచ్చు. హైపోయాక్టివ్ సెక్సువల్ డిజైర్ డిజార్డర్ వల్ల లైంగిక క్రియలపట్ల ఆసక్తి లేకపోవడం, సంభోగం గురించి ఆలోచించకపోవడం మరియు భాగస్వామితో సన్నిహితత్వం కోల్పోవడం జరుగుతుంది. సెక్సువల్ ఎవర్షన్ డిజార్డర్ అనేది లైంగిక చర్యల పట్ల తీవ్రమైన భయం, అసహనం లేదా వైరుధ్యం కలిగించే మానసిక రుగ్మత, ఇది శారీరక సంపర్కాన్ని అసాధ్యం చేస్తుంది. ఇది ప్రధానంగా బాల్యంలో అనుభవించిన లైంగిక దాడి వంటి ట్రామా లేదా భాగస్వామి పై నమ్మకం సన్నగిల్లడం వంటి మానసిక కారణాల వల్ల ఏర్పడుతుంది. లైంగిక సంపర్కం గురించి ఆలోచించినప్పుడు భయం లేదా అనాసక్తి కలగడం, శారీరక స్పర్శకు ప్రతికూలంగా ప్రతిస్పందించడం, హృదయ స్పందన వేగవంతం కావడం మరియు చెమటలు వస్తాయి.

**2. ఉత్తేజన సమస్యలు (ఎరౌజల్ డిజార్డర్)**

ఎరెక్టైల్ డిస్ఫంక్షన్ పురుషులలో ఎరెక్టైల్ డిస్ఫంక్షన్ అనేది అంగం సరిగ్గా కామోద్దీపన చెందకపోవడం లేదా సంభోగం పూర్తిగా జరిగేంత వరకు దాన్ని నిర్వహించలేకపోవడం. ఇది బ్లడ్ సర్క్యులేషన్ సమస్యలు, మధుమేహం, హార్మోన్ లోపాలు, ఒత్తిడి, ఆందోళన, ధూమపానం, మద్యపానం వల్ల ఏర్పడవచ్చు. ఎరెక్టైల్ డిస్ఫంక్షన్ యొక్క లక్షణాలలో అంగంలో తగినంత గట్టిదనం లేకపోవడం, ఎరెక్షన్ కొనసాగించలేకపోవడం మరియు లైంగిక క్రియలపట్ల ఆత్మవిశ్వాసం కోల్పోవడం ఉంటాయి. స్త్రీలలో సెక్సువల్ అరౌజల్ డిజార్డర్ అనేది లైంగిక క్రియల సమయంలో యోనిలో తగినంత రక్తప్రవాహం మరియు తేమలేకపోవడం వల్ల కలిగే సమస్య. ఇది హార్మోన్ మార్పులు మెనోపాజ్, ప్రసవాంతర మార్పులు, మానసిక కారణాలు ట్రామా, సంబంధ సమస్యలు, దీర్ఘకాలిక అనారోగ్యం వల్ల సంభవిస్తుంది.

**3. ఆర్గాజం సమస్యలు**

ఆర్గాజం సమస్యలు అనేవి మహిళలు మరియు పురుషుల్లో లైంగిక అనుభవంలో మానసిక, శారీరక, సామాజిక కారకాల వల్ల తలెత్తే అవరోధాలు. ఇందులో ముఖ్యంగా అనార్గాస్మియా (ఆర్గాజం పొందలేకపోవడం) మరియు ప్రీమేచ్యూర్ ఎజాక్యులేషన్ (అతి త్వరగా వీర్యస్కలనం) ప్రధానమైనవిగా గుర్తించబడతాయి.

అనార్గాస్మియా సమస్య డిప్రెషన్, లైంగిక దాడి, హార్మోన్ లోపాలు, నరాల సమస్యలు వంటి కారకాల వల్ల కలుగుతుంది. దీనిలో భాగంగా వ్యక్తి శారీరక ఉత్తేజన ఉన్నప్పటికీ ఆర్గాజం పొందలేకపోతారు, లేదా చాలా సమయం పడుతుంది. ప్రీమెచ్యూర్ ఎజాక్యులేషన్ అనేది లైంగిక చర్య ప్రారంభించిన వెంటనే వీర్యస్కలనం కావడం వల్ల జరిగే సమస్య. ఇది వ్యక్తి మరియు కపుల్ మధ్య లైంగిక సంతృప్తిని తగ్గిస్తుంది. దీని వెనుక మానసిక ఒత్తిడి, అనుభవం లోపం, లేదా థైరాయిడ్ ప్రోస్టేట్ సంబంధిత ఆరోగ్య సమస్యలు ఉండవచ్చు. లక్షణాల్లో వీర్యస్కలనాన్ని నియంత్రించలేకపోవడం, సంతృప్తి లేకపోవడం ఉంటాయి.

**4. లైంగిక సమయంలో నొప్పి (సెక్సువల్ పెయిన్ డిజార్డర్స్)**

సంపర్క సమయంలో నొప్పి అనుభవించడం అనేది మహిళలు మరియు పురుషుల్లో కనిపించే సాధారణమైన సమస్య కానీ మానసిక మరియు శారీరకంగా బాధ కలిగించే సమస్య. ఇందులో ప్రధానంగా డిస్పేర్యూనియా (లైంగిక చర్య సమయంలో నొప్పి) మరియు వజినిస్మస్ (యోని చుట్టూ డ్రైనెస్ నరాల సంకోచం వల్ల ప్రవేశం అసాధ్యం) రెండు ముఖ్యమైన రుగ్మతలు ఉన్నాయి.

**5. అసాధారణ లైంగిక ప్రవృత్తులు (పారాఫిలిక్ డిజార్డర్స్)**

అసాధారణ లైంగిక ప్రవృత్తులు అనేవి సాధారణ లైంగిక ఆకర్షణలకు భిన్నంగా, నిషేధితమైన లేదా హానికరమైన వస్తువులు, చర్యలు లేదా వ్యక్తులపై లైంగిక ఆసక్తిని కలిగిస్తాయి. ఇవి కేవలం ఊహల స్థాయిలో ఉంటే పారాఫిలియాగా పరిగణించబడతాయి; అయితే ఆ ఊహలు ప్రవర్తనగా మారి ఇతరులకు హాని కలిగిస్తే లేదా వ్యక్తి జీవితాన్ని ప్రభావితం చేస్తే పారాఫిలిక్ డిజార్డర్‌గా గుర్తించబడతాయి. ముఖ్యంగా పీడోఫిలియా, ఎక్సిబిషనిజం, వాయిజరిజం వంటి రుగ్మతలు చట్ట విరుద్ధమై, బాధితులకు తీవ్రమైన మానసిక నష్టాన్ని కలిగించవచ్చు. పీడోఫిలియాలో పిల్లల పట్ల లైంగిక ఆకర్షణ ఉండటం, ఎక్సిబిషనిజంలో అనుమతి లేకుండా జననేంద్రియాలు చూపించడం, వాయిజరిజంలో రహస్యంగా ఇతరులను గమనించడం వంటి లక్షణాలు ఉంటాయి. ఇవన్నీ తీవ్రమైన సైకియాట్రిక్ ఆత్మపరిశీలనను అవసరం చేస్తాయి.

మానసిక లైంగిక రుగ్మతలు అనేవి సరైన చికిత్సతో పూర్తిగా నయం అయ్యేవి. వైద్యుడు, మానసిక వైద్యుడు లేదా సెక్స్ థెరపిస్ట్ సహాయంతో ఈ సమస్యలను అధిగమించవచ్చు. ఈ సమస్యలకు చికిత్స అందుబాటులో ఉంది. నిపుణుల సహాయం తీసుకోవడంలో మొహమాటం ఉండకూడదు. మానసిక ఆరోగ్యం అనేది లైంగిక ఆరోగ్యానికి బలమైన ఆధారం. ఈ సమస్యలు సాధారణమే అయినా, అవగాహన, సంభాషణ, మరియు సరైన నిపుణుల సహాయంతో మెరుగుదల సాధ్యమే.

లైంగిక ఆరోగ్యం కూడా మన ఆరోగ్య ప్రయాణంలో ముఖ్యమైన భాగమే. దీనిని తక్కువగా అంచనా వేయకండి. సరైన మార్గదర్శకంతో ఈ పరిస్థితులు పూర్తిగా నియంత్రించగలుగుతాం. సహాయం కోసం అడగడంలో ఏమీ తప్పులేదు. సోషల్ స్టిగ్మాను వీడండి.

డా. అట్ల శ్రీనివాస్ రెడ్డి
ఫ్యామిలీ కౌన్సెలర్, 9703935321



# జాతీయం

NATIONAL & GENERAL NEWS

## ఆరు రోజుల తర్వాత పంజాబ్‌లో తెరుచుకున్న స్కూళ్లు

**చండగఢ్ :** పంజాబ్‌లోని ఐదు జిల్లాల్లో స్కూళ్లను తెరిచారు. ఆరు రోజుల తర్వాత బుధవారం మళ్లీ పాఠశాలలు ప్రారంభమయ్యాయి. ఇండో, పాక్ ఉద్రిక్తతల నేపథ్యంలో స్కూళ్లను మూసివేసిన విషయం తెలిసిందే. మే 8వ తేదీన మూడు రోజుల పాటు స్కూళ్లను మూసివేస్తూ ఆ రాష్ట్ర ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసింది. అయితే సోమవారం రాష్ట్రవ్యాప్తంగా చాలా వరకు పాఠశాలలను తిరిగి తెరిచారు. ఇక ఆరు జిల్లాల్లో వాటిని బుధవారం నుంచి తెరిచారు. పాకిస్థాన్‌తో పంజాబ్‌కు 553 కిలోమీటర్ల బోర్డర్ ఉన్నది. అమృత్‌సర్, తర్న్ తారన్, పఠాన్‌కోట్, ఫజిల్కా, ఫిరోజ్‌పూర్, గుర్దాస్‌పూర్ జిల్లాలు బోర్డర్‌లో ఉన్నాయి. గురుదాస్‌పూర్‌లో మంగళవారం పాఠశాలలు తెరుచుకున్నాయి. ప్రభుత్వ ఆదేశాల ప్రకారం స్కూళ్లను తెరుస్తున్నట్లు అమృత్‌సర్‌లో ఓ స్కూల్ టీచర్ తెలిపారు. ఉదయం 10.30 నుంచి మధ్యాహ్నం 2.30 వరకు స్కూళ్లు తెరిచి ఉంటాయని అమృత్‌సర్ జిల్లా పాఠశాలల యాజమాన్యం పేర్కొన్నది.

## భుజ్ ఎయిర్‌బేస్‌కు రాజ్‌నాథ్





**న్యూఢిల్లీ:** కేంద్ర రక్షణ శాఖ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ గుజరాత్‌లోని భుజ్ ఎయిర్‌బేస్‌ను సందర్శించనున్నారు. ఈనెల 16న ఆయన భుజ్‌కు వెళ్తారు. రెండ్రోజుల పర్యటనలో భాగగా ఇండియాపాకిస్థాన్ సరిహద్దు ప్రాంతంలో పర్యటిస్తారు. పాకిస్తాన్ ఇటీవల డ్రోన్ దాడులకు విఫలయత్నం చేయడంతో ఆ ప్రాంతంలో భారత సాయుధ బలగాల సన్నద్ధతను, భద్రతా పటిష్టతకు తీసుకోవాల్సిన చర్యలను రక్షణ మంత్రి సమీక్షించనున్నారు. మిలటరీ ఉద్రిక్తతల నేపథ్యంలో పాకిస్థాన్ ఆర్మీ భుజ్ ఎయిర్‌బేస్‌పై ఇటీవల డ్రోన్ల దాడికి దిగింది. పాక్ పదేపదే చేసిన ఈ యత్నాలను ఎయిర్ డిఫెన్స్ సిస్టం సాయంతో భారత బలగాలు విజయవంతంగా తిప్పికొట్టాయి. భారత మిలటరీ చావుదెబ్బ కొట్టడంతో వెనక్కి తగ్గిన పాకిస్థాన్ కాల్పుల విరమణ ప్రతిపాదనతో ముందుకు వచ్చింది. భుజ్‌లోని రుద్ర మాత ఎయిర్ ఫోర్స్ స్టేషన్ భారత వాయుసేనకు కీలకంగా ఉంది. ఇక్కడ సివిలియన్ భుజ్ ఎయిర్‌పోర్ట్‌తో రన్‌వేను వాయిసేన పంచుకుంటోంది. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ పంజాబ్‌లోని ఆదంపూర్ ఎయిర్ బేస్‌ను మంగళవారం సందర్శించిన సంగతి విదితమే.

## 12 మంది మిలిటెంట్లు అరెస్టు

**ఇంఫాల్ :** భద్రతా దళాలు నిషేధిత సంస్థలకు చెందిన 12 మంది మిలిటెంట్లను, మణిపూర్‌కు చెందిన ఇద్దరు ఆయుధ డీలర్లను అరెస్టు చేసినట్లు పోలీసులు బుధవారం తెలిపారు. అన్ని అరెస్టులు మంగళవారం జరిగాయని వారు తెలిపారు. నిషేధిత పీపుల్స్ లిబరేషన్ ఆర్మీకి చెందిన నలుగురు క్యాడర్లు, కాంగ్లీపాక్ కమ్యూనిస్ట్ పార్టీకి చెందిన ఇద్దరు సభ్యులు, కాంగ్లీ యావోల్ కన్నా లూప్‌కు చెందిన ఒకరిని టెంగ్నౌపాల్ జిల్లాలోని యోంగ్ఖుల్ గ్రామ సమీపంలో అరెస్టు చేసినట్లు ఒక పోలీసు అధికారి తెలిపారు. అంతేకాకుండా, తౌబాల్‌లోని లిలాంగ్ నుంగే, వాంగ్బాల్ నుండి నిషేధిత కెసిపి (పిడబ్ల్యుజి) సభ్యులను, ఇంఫాల్ తూర్పులోని కోయిరెంగే కబుయ్ ఖుల్ గేట్ నుండి ప్రీపాక్‌కి చెందిన ఇద్దరు క్యాడర్లను అరెస్టు చేశారు. నిషేధిత యునైటెడ్ నేషనల్ లిబరేషన్ ఫ్రంట్ (పాంబే గ్రూప్) కు చెందిన మరో క్రియాశీల క్యాడర్, ఆయుధ వ్యాపారి కూడా, ఇంఫాల్ తూర్పులోని పుఖ్వావో అహల్లప్ మఖా లైకై నుండి పట్టుబడ్డాడని ఆయన చెప్పారు. భద్రతా సిబ్బంది మంగళవారం మరో ఇద్దరు ఆయుధ వ్యాపారులను కూడా అరెస్టు చేశారు. వారి వద్ద నుండి ఒక రైఫిల్, మందుగుండు సామగ్రిని స్వాధీనం చేసుకున్నట్లు అధికారి తెలిపారు.

## గ్లోబల్ టైమ్స్, జిన్హువా ఎక్స్ ఖాతాలపై నిషేధం

**న్యూఢిల్లీ:** చైనా అధికారిక మీడియా సంస్థలైన గ్లోబల్ టైమ్స్, జిన్హువా ఎక్స్ ఖాతాలను కేంద్ర ప్రభుత్వం భారత్‌లో నిషేధించింది. ఆపరేషన్ సిందూర్‌కు సంబంధించి తప్పుడు సమాచారాన్ని పోస్టు చేసినందుకు చర్యలు తీసుకున్నట్లు తెలిపింది. ఈ మేరకు ఈ వారం ఆరంభంలోనే బీజింగ్‌లోని భారత రాయబార కార్యాలయం గ్లోబల్ టైమ్స్‌ను హెచ్చరించినట్లు తెలిసింది. ఎక్స్‌లో పోస్టు చేసిన సమాచారాన్ని పున:పరిశీలించుకోవాలని, తప్పుడు వార్తలు ప్రచారం చేసే ముందు వాస్తవాలను తెలుసుకోవాలని ఎక్స్ ద్వారా హితవు పలికింది. పాకిస్థాన్‌కు సానుభూతి చూపే వివిధ ఎక్స్ ఖాతాల్లో తప్పుడు ప్రచారం జరుగుతోందని, ఎలాంటి ఆధారాలు లేకుండానే విచ్చలవిడిగా పోస్టులు చేస్తూ, ప్రజల్ని తప్పుదారి పట్టిస్తున్నాయని భారత రాయబార కార్యాలయం మరో పోస్టులో వివరించింది. బాధ్యతాయుతమైన మీడియా సంస్థలు కూడా తప్పుడు సమాచారాన్ని ప్రచురించడం సరికాదని, అది జర్నలిస్టు విలువలను కాలరాయడమేనని పేర్కొంది.

## బిఎస్‌ఎఫ్ జవాన్‌ను భారత్‌కు అప్పగించిన పాక్



**అమృత్‌సర్ :** పొరపాటున అంతర్జాతీయ సరిహద్దు (ఐబి)ని దాటి పాక్ భూభాగంలోకి వెళ్లిన బిఎస్‌ఎఫ్ జవాన్‌ను పాక్ ఎట్టకేలకు భారత్‌కు అప్పగించింది. ఇవాళ అట్టారి చెక్ పోస్ట్ వద్ద జవాన్‌ను పాక్ రేంజర్లు భారత అధికారులకు అప్పగించారు. గత నెల 23న భారత సరిహద్దు భద్రతా దళం (బిఎస్‌ఎఫ్) జవాన్ పూర్ణమ్ కుమార్ షా అనుకోకుండా పంజాబ్‌లోని ఫిరోజ్‌పూర్ సెక్టార్‌లో అంతర్జాతీయ సరిహద్దు (ఐబి)ని దాటి పాక్ భూభాగంలోకి ప్రవేశించిన విషయం తెలిసిందే. దీంతో అతన్ని పాక్ రేంజర్లు తమ అదుపులోకి తీసుకున్నారు. అప్పటి నుంచి అతడి విడుదలపై భారత అధికారులు పాక్‌తో సంప్రదింపులు జరుపుతూ వచ్చారు. ఈక్రమంలో ఇవాళ ఎట్టకేలకు సదరు జవాన్‌ను భారత్‌కు అప్పగించారు. 182 బిఎస్‌ఎఫ్ బెటాలియన్‌కు చెందిన సింగ్ పశ్చిమ బెంగాల్ వాసి. ఫిరోజ్‌పూర్‌లో ఇండోపాక్ సరిహద్దు వద్ద ఆయన కొంతమంది రైతులతో కలిసి అనుకోకుండా భారత సరిహద్దును దాటి పాక్ ప్రాంతంలోకి అడుగుపెట్టడంతో ఈ ఘటన చోటు చేసుకుంది. కాగా, సైనికుడిని విడిపించడానికి భారత ఆర్మీ అధికారులు పాకిస్థాన్ రేంజర్లతో ఫ్లాగ్ మీటింగ్ జరిపారు. అయితే, బిఎస్‌ఎఫ్ జవాన్‌ను అప్పగించేందుకు పాక్ రేంజర్లు నిరాకరిస్తూ వచ్చాయి. ఆ జవాన్ ఆచూకీని కూడా చెప్పలేదు. దీంతో జవాను కుటుంబ సభ్యులు తీవ్ర ఆందోళన వ్యక్తం చేశారు. తమ కుమారుడిని క్షేమంగా తీసుకురావాలని అధికారులను విజ్ఞప్తి చేశారు.

## మహిళలకు సైన్యంలో లీగల్ పోస్టులు ఎందుకివ్వడం లేదు

### కేంద్రాన్ని ప్రశ్నించిన సుప్రీంకోర్టు!

### వారు యుద్ధ విమానాలే నడుపుతున్నారని వ్యాఖ్య



**న్యూఢిల్లీ :** వైమానికదళంలో మహిళలు రాఫెల్ వంటి యుద్ధ విమానాలను నడుపుతున్నారని.. వారికి సైన్యంలోని లీగల్ పోస్టులు ఎందుకు ఇవ్వ డం లేదని సుప్రీంకోర్టు కేంద్రాన్ని ప్రశ్నించింది. సైన్యంలోని జడ్జి, అడ్వకేట్ జనరల్, లీగల్ బ్రాంచ్ పోస్టుల్లో మహిళా అధికారులు తక్కువగా ఉండడంపై సర్వోన్నత న్యాయస్థానం అసహనం వ్యక్తం చేసింది. ఆ పోస్టులకు స్త్రీ,పురుష నిష్పత్తి వర్తించదని నిబంధనలు ఉన్నా.. కేంద్ర ప్రభుత్వం ఎందుకు అనుసరించడం లేదంటూ జస్టిస్ దీపాంకర్ దత్తా, జస్టిస్ మన్మోహన్‌లతో కూడిన ధర్మాసనం సమాధానం కోరింది. సైన్యంలోని జడ్జి, అడ్వకేట్ జనరల్, లీగల్ పోస్టుల కోసం జరిగిన పరీక్షల్లో తాము నాలుగు, ఐదో ర్యాంకులు సాధించామని, అయినా తమను ఎంపిక చేయలేదంటూ అష్నూర్ కౌర్, ఆస్థ త్యాగీ అనే మహిళా అధికారులు సుప్రీంకోర్టును ఆశ్రయించారు.తమకంటే తక్కువ ర్యాంక్ ఉన్న పురుష అధికారులను నియమించారని.. ఈవిభాగంలో ఆరుపోస్టులు మాత్రమే విడుదలయ్యాయని, అందులో మహిళల కోటా లో ఖాళీలు లేవం టూ తమను ఎంపిక చేయలేదనిఆవేదన వ్యక్తం చేశారు. ఈ మేరకు సర్వోన్నత న్యాయస్థానం పిటిషన్లపై విచారణ జరిపింది. ఇద్దరు అధికారుల పిటిషన్‌పై ఈనెల 8న విచారించిన సమయంలోనూ సుప్రీం ధర్మాసనం కీలక వ్యాఖ్యలు చేసింది. ఈ సందర్భంగా జస్టిస్ దీపాంకర్‌దత్తా మాట్లాడుతూ ఇండియన్ ఎయిర్‌ఫోర్స్‌లో మహిళలు రాఫెల్ యుద్ధ విమానాలను నడిపేందుకు అనుమతి ఉన్నప్పుడు.. ఆర్మీలోని లీగల్ బ్రాంచ్‌లలో పురుషుల కంటే ఎక్కువగా మహిళలను విధుల్లోకి తీసుకోవడంలో కష్టం ఏంటి అని సొలిసిటర్ జనరల్ ఐశ్వర్య భాటిని ప్రశ్నించారు. స్త్రీ, పురుష భేదంతో సంబంధం లేకుండా అవి తటస్థ పోస్టులను కేంద్రం చెప్పగా..మహిళలకు ఎందుకు ఎక్కువ పోస్టులను కేటాయించడం లేదని ధర్మాసనం ప్రశ్నించింది. స్త్రీ, పురుష సమానత్వం అంటే మహిళలు, పురుషులకు సమాన అవకాశాలు కల్పించడం కాదని.. అబ్బాయిలైనా, అమ్మాయిలైనా అర్హత ఉంటే అవకాశం ఇవ్వడమని ధర్మాసనం వ్యాఖ్యానించింది. పిటిషన్‌పై తుది తీర్పును రిజర్వ్ చేసిన సర్వోన్నత న్యాయస్థానం.. కేంద్రప్రభుత్వం సమాధానం విన్నతర్వాత తీర్పును వెలువరించనున్నది.

# గగనంలో వాయుసేన... భూతలంపై సైబర్‌సేన ప్రతిభ

### చొరబాట్లను సమర్థవంతంగా తిప్పికొట్టాం

### మే 7 రాత్రి 15 నగరాలపై పాక్ దాడియత్నం భగ్నం

### ఎయిర్ మార్షల్ ఎకె.భారతి వెల్లడి



**న్యూఢిల్లీ:** దేశంలో 15 నగరాలపై పాకిస్థాన్ దాడి చేసేందుకు మే ఏడోతేదీ రాత్రి డ్రోన్లను ప్రవాహంలాగా పంపించిందని, ఈ గగనతల చొరబాటు దాడులను సమర్థవంతంగా వెనక్కు తిప్పికొట్టి డ్రోన్లను నిర్వీర్యం చేశామని భారత గగనతల బలగాల డైరెక్టర్ జనరల్, ఎయిర్ మార్షల్ ఎకె.భారతి బుధవారం మీడియాకు తెలిపారు. ఈ సామూహిక దాడులవల్ల భూతలంపై ప్రజలకు నష్టం కలగకుండా కాపాడామని చెప్పారు. ఒకవైపు భారత గగనతలాన్ని రక్షించేందుకు ఆకాశ బలగాలు శత్రుదేశం చొరబాట్లను తిప్పికొడుతుంటే, మరో వైపు భూతంమీద ఉన్న సైబర్ వారియర్ బృందాలు సైబర్ నిపుణులు పాకిస్థాన్ డిజిటల్ చొరబాట్లను దుష్టప్రచారాన్ని, హ్యాకింగ్‌లను సమర్థవంతంగా ప్రతిఘటించాయన్నారు. భారక్–8 క్షిపణులను, ఎస్–400 వాయు భద్రతావ్యవస్థలను, దేశీయంగా తయారు చేసిన ప్రతిష్ఠాత్మకమైన ‘ఆకాశ్’ క్షిపణులు, దేశీయ గగనతల రక్షణకు సంబంధించిన డ్రోన్ విధ్వంసక పరికరాలను ఉపయోగించి చొరబాట్లను వెనక్కు తిప్పికొట్టామని చెప్పారు. తద్వారా భారత్‌లోని 15 నగరాలపై మే 7వ తేదీ రాత్రి దాడులు చేసేందుకు పాకిస్థాన్ చేసిన ప్రయత్నాలను వమ్ముచేశామన్నారు. దేశీయంగా తయారుచేసుకున్న ‘ఆకాశ్’ క్షిపణులు ఈ నాలుగురోజుల సైనికచర్యలో ఎంతో కీలకపాత్ర వహించాయని భారతి చెప్పారు. ఎంతో శక్తిమంతమైన భారత రక్షణ వ్యవస్థ శత్రుదేశడ్రోన్లను సమర్థవంతంగా గుర్తించి తటస్థీకరించాయన్నారు. వివాద సమయంలో భారత గగనతలాన్ని చీల్చుకుని దేశంలోకి చొరబడేందుకు శ్రీనగర్ నుండి సర్‌క్రీక్ వరకూ ప్రయత్నాలు చేసిందనీ, వాటన్నింటినీ విఫలం చేశామన్నారు. అదేసమయంలో మన సైబర్ నిపుణులు తప్పుడు వార్తలను చీల్చిచెండాడారని చెప్పారు.

నాలుగు రోజులపాటు దాయాదిదేశం పాకిస్థాన్‌పై జరిగిన సైనికచర్యలో గగనతలస్థాయి దాడులు మొదలుకొని సైబర్‌దాడుల స్థాయి వరకూ పాకిస్థాన్ చేసిన అన్నిరకాల దాడులను ఎంతో సమర్థవంతంగా తిప్పికొట్టి వారి సైనికసామర్థ్యాన్ని తటస్థీకరించామని చెప్పారు. పాకిస్థాన్ డ్రోన్లు ఒక ప్రవాహంలాగా రావడాన్ని భారత సాయుధ బలగాలు ముందుగానే పసిగట్టాయని, వాటిరాకకోసం మన బలగాలు ముందునుండే మాటువేసి ఎదురుచూసి దేశీయ సైనిక వ్యవస్థల ద్వారా వాటిని పనికిరాకుండా చేశామని చెప్పారు. ఈ డ్రోన్ల వల్ల భూతలంపైన ఎలాంటి నష్టం రాకుండా తటస్థీకరించి నిర్వీర్యం చేశామన్నారు. అదేవిధంగా ఈనెల మొదటివారంలో బాహాబాహీ పోరు ప్రారంభం కాకముందునుండీ వెబ్‌సైట్ల ద్వారా పాకిస్థాన్ భారత్‌పై సైబర్‌వార్ దుష్ప్రచారం చేస్తోందన్నారు.

ఆపరేషన్ సిందూర్ పేరుతో ఆక్రమిత కశ్మీరు భూభాగంలో తొమ్మిది ఉగ్రవాద స్థావరాలను ధ్వంసం చేయకముందు, పాకిస్థాన్‌లో ఖచ్చితమైన గురిపెట్టి దాడులు చేయకముందు కూడా మనదేశంలోని అనేక భారత వెబ్‌సైట్లను పాకిస్థాన్ లక్ష్యంగా చేసుకుని సైబర్ దాడులు చేసిందన్నారు. ప్రపంచవ్యాప్తంగా ఎంతో క్రియాశీలంగా ఉన్న సోషల్ మీడియా ఛానల్స్ ద్వారా భారతదేశంపై పాకిస్థాన్ చేసిన దుష్ప్రచారాన్ని మన సైబర్ వారియర్ బృందాలు సమర్థవంతంగా తిప్పికొట్టాయన్నారు. పహల్గామ్‌లో దాడిచేసిన కొద్ది రోజులకు జలంధర్ కేంద్రంగా పనిచేసే ఆర్మీ నర్సింగ్ కాలేజీ వెబ్‌సైటును ఉద్రిక్తతలు రెచ్చగొట్టేవిధంగా తప్పుడు సందేశాలతో పాకిస్థాన్ హ్యాక్ చేసిందన్నారు. కనీసం నాలుగు ఆర్మీ ప్రభుత్వ స్కూళ్ళపై హ్యాకర్స్ దాడి చేశారని చెప్పారు. వీటిల్లో నగ్రోటా, సుంజువాన్‌లలో ఉన్న ఆర్మీ పబ్లిక్ స్కూల్స్ కూడా ఉన్నాయని మే ఐదో తేదీన కొన్ని వర్గాలు తమకు సమాచారం తెలియజేశాయన్నారు. హ్యాకింగ్, వెబ్‌సైట్లను ఆక్రమించడానికి ముందుగా పాకిస్థాన్ మనదేశంపైన, భారత సాయుధ బలగాలపై, ఇంటర్నెట్‌పైన విపరీతమైన దుష్ప్రచారం చేసిందన్నారు. జనాదరణపొందిన సోషల్ మీడియా వేదికల ద్వారా కూడా ఏప్రిల్ చివరివారంలో భారీఎత్తున విషం చిమ్మిందని భారతి చెప్పారు.

మే 8న స్థానిక కాలమానం ప్రకారం రాత్రి 8 గంటలకు మానవసహాయం లేని అనేక గగనతల యుద్ధ వ్యవస్థలు, డ్రోన్లు,యుద్ధ వాహనాలు బహుముఖస్థాయిలో భారత వైమానికదళంపైకి దూసుకువచ్చాయని, దీనిని ముందుగానే ఊహించిన భారత వాయుసేన మాటువేసి సర్వసన్నద్ధంగా ఉండి భారత ప్రజలకు ఎలాంటి నష్టం కలగకుండా ఆ చొరబాట్లను సమర్థవంతంగా వెనక్కునెట్టాయని చెప్పారు. జమ్మూ, ఉద్ధంపూర్, పఠాన్‌కోట్, అమృత్‌సర్, భటిండా, నాల్, డల్హౌసీ, తౌసే, జైసల్మేర్, ఉత్తర్‌లై, ఫలోదీ, నలియా ప్రాంతాలలో ఉన్న గగనతల సైనిక స్థావరాలపైకి కూడా పాకిస్థాన్ డ్రోన్లు, ఇతర వస్తువులు దూసుకువచ్చాయని, వాటిని నిర్వీర్యం చేసి వెనక్కు నెట్టేశామని భారతి చెప్పారు. పాకిస్థాన్ దాడులు చేసినప్పటికీ, భారత వాయుసేన అప్రమత్తంగా ఉండటంవల్ల చొరబాట్లను ప్రతిఘటించి భూతలంపై ఎలాంటి నష్టం కలగకుండా ప్రజలను కాపాడామన్నారు. కాగా సైబర్ నిపుణులతోపాటు విదేశీమంత్రిత్వ శాఖ కార్యదర్శి విక్రమ్ మిస్రి, కల్నల్ సోఫియా ఖురేషి, వింగ్ కమాండర్ వ్యోమిక సింగ్ కూడా ఎంతో విజయవంతంగా ప్రపంచ దేశాలకు భారత సైనికచర్యల సమాచారాన్ని ఎప్పటికప్పుడు చేరవేసి మనదేశ విశ్వసనీయత పెంచేందుకు కృషిచేశారన్నారు.

## అరుణాచల్ ప్రదేశ్ ప్రాంతాలకు చైనా పేర్లు

### అది ‘విఫల, అసంబద్ధ’ చర్య : భారత్

### పేర్లు పెట్టినంత మాత్రాన వాస్తవాలను మార్చలేరు



**న్యూఢిల్లీ :** అరుణాచల్ రాష్ట్రంలోని కొన్ని ప్రదేశాలకు చైనా పేరుమార్చే చర్యలు ‘విఫల, అసంబద్ధమైనవ’ని భారతదేశం విమర్శించింది. ఇలాంటి ప్రయత్నాలు ద్వారా వాస్తవాలను మార్చలేరని, అరుణాచల్ ప్రదేశ్ గతంలో, వర్తమానంలో, భవిష్యత్తులో భారతదేశంలోని అంతర్భాగమేనని స్పష్టం చేసింది. అరుణాచల్ ప్రదేశ్‌లోని కొన్ని ప్రాంతాలు టిబెట్‌లోని దక్షిణాది భాగంగా పొరుగుదేశం పేర్కొంటూ, వారికి చైనా పేర్లను బీజింగ్ ప్రకటించడం పట్ల న్యూఢిల్లీ తీవ్రంగా స్పందించింది. భారతీయ రాష్ట్రమైన అరుణాచల్ ప్రదేశ్‌లోని ప్రాంతాలకు పేర్లు పెట్టేందుకు చైనా పదేపదే చేస్తున్న విఫల, అసంబద్ధ ప్రయత్నాలను తాము గమనించినట్లు విదేశాంగ వ్యవహారాల మంత్రిత్వ శాఖ అధికార ప్రతినిధి రణ్‌ధీర్ జైస్వాల్ అన్నారు. ఈ విషయంలో మన సూత్రబద్ధ వైఖరికి నిరంతరం కట్టుబడి ఉన్నామని, ఇలాంటి ప్రయత్నాలను స్పష్టంగా తిరస్కరిస్తున్నామని చెప్పారు. ఈ అంశంపై జర్నలిస్టులు అడిగిన ప్రశ్నలకు జైస్వాల్ సమాధానమిచ్చారు. సృజనాత్మక నామకరణాల ద్వారా గతంలో, వర్తమానంలో, భవిష్యత్తులో భారతదేశంలో అరుణాచల్ ప్రదేశ్ అంతర్భాగం, విడదీయలేని భాగం అనే తిరుగులేని వాస్తవాన్ని మార్చలేరని అన్నారు. గత ఏడాది ఏప్రిల్‌లో కూడా అరుణాచల్‌ప్రదేశ్‌లోని 30 ప్రదేశాలకు పేర్లను స్థిరీకరిస్తూ బీజింగ్ జాబితాను విడుదల చేయడం పట్ల భారతదేశం గట్టిగా స్పందించింది. తూర్పు లద్దాఖ్ సరిహద్దుల్లో ప్రతిష్టంభన తరువాత ఇరు దేశాల మధ్య సంబంధాలను సాధారణ స్థితికి వచ్చేందుకు చర్యలు తీసుకుంటున్న సమయంలో తాజాగా చైనా కొత్తగా అరుణాచల్ ప్రదేశ్‌లోని ప్రాంతాలకు తమ స్వంత పేర్లతో జాబితాను విడుదల చేసింది. ఐదేళ్ళ విరామం తరువాత కైలాష్ మానస సరోవర యాత్రను పునరుద్ధరించాలని భారత్, చైనాలు గత మాసం నిర్ణయించాయి. ఇరు దేశాల మధ్య సంబంధాలు మెరుగవుతున్న ప్రయత్నంలో భాగంగా ఈ చర్యలు తీసుకున్నారు.

## రాష్ట్రపతితో త్రివిధ దళాధిపతుల భేటీ



**న్యూఢిల్లీ :** రాష్ట్రపతి ద్రౌపది ముర్మతో త్రివిధ దళాధిపతులు సమావేశమయ్యారు. సిడిఎస్ అనిల్‌చౌహాన్‌తో కలిసి ఆర్మీచీఫ్ ఉపేంద్ర ద్వివేది, వైమానిక దళాల అధిపతి ఎయిర్ చీఫ్ మార్షల్ ఎపి సింగ్, నావికా దళాల అధిపతి అడ్మిరల్ దినేష్ కె.త్రిపాఠి బుధవారం ఉదయం రాష్ట్రపతి భవన్‌కు వెళ్లారు. అక్కడ రాష్ట్రపతి ముర్ముతో భేటీ అయ్యారు. ఈ సందర్భంగా ‘ఆపరేషన్ సిందూర్’ గురించి రాష్ట్రపతికి వివరించారు. సరిహద్దుల్లో భద్రతా పరిస్థితులను కూడా వివరించారు. ఉగ్రవాదంపై భారత్ ప్రతిస్పందనను అద్భుతమైన విజయంగా రాష్ట్రపతి అభివర్ణించారు. ఈ మేరకు సాయుధ దళాల తెగింపు, అంకిత భావాన్ని ప్రశంసించారు.

## పాక్ కాల్పుల్లో దెబ్బతిన్న ఇళ్లను పునర్నిర్మిస్తాం

### కశ్మీర్ సిఎం ఒమర్ అబ్దుల్లా



**శ్రీనగర్:** కశ్మీర్ సరిహద్దు ఎల్‌ఓసీ వెంబడి పాకిస్థాన్ బలగాలు జరిపిన కాల్పుల్లో ధ్వంసమైన ఇళ్లను జమ్మూకశ్మీర్ ముఖ్యమంత్రి ఒమర్ అబ్దుల్లా పరిశీలించారు. దెబ్బతిన్న ఇళ్లను పునర్నిర్మించడానికి అవసరమైన సాయాన్ని ప్రభుత్వం తరపున అందిస్తామని ఈ సందర్భంగా బాధితులకు హామీఇచ్చారు. వారి బాధ తాను అర్థం చేసుకోగలనన్నారు. ఉత్తర కశ్మీర్‌లోని బారాముల్లా జిల్లాలోని సలామాబాద్, లాగామా, బందీ, గింగల్ సహా ఉరీలోని షెల్లింగ్ ప్రభావిత ప్రాంతాల్లో ఒమర్ అబ్దుల్లా పర్యటించారు. ఈ ప్రాంతాల్లో వ్యక్తిగత బంకర్లను నిర్మించాలనే డిమాండ్‌ను కేంద్రంతో చర్చిస్తానని చెప్పారు. ఈ ప్రాంతంలో దెబ్బతిన్న ఇళ్లను పునర్‌నిర్మించుకోవడానికి ప్రజలకు సాయం అందించడం ప్రభుత్వ బాధ్యత అని ఆయన పేర్కొన్నారు. ఉరీ ప్రాంతంలోని ప్రజలు అనేక సార్లు బాధను భరించారని.. అయితే, ప్రతిసారి ఎంతో ధైర్యంతో తిరిగి కోలుకున్నారని అబ్దుల్లా అన్నారు. ఆపరేషన్ సిందూర్ తర్వాత పాక్ దళాలు సరిహద్దుల్లోని ప్రజలకు ఎక్కువ హాని తలపెట్టాలనే ఉద్దేశంతోనే దాడులు చేశాయని ఒమర్ అబ్దుల్లా తెలిపారు. ప్రస్తుతం కాల్పుల విరమణ ఒప్పందం అమలవుతుండటం ఈ ప్రాంతాలు రెండు రోజులుగా నిశ్శబ్దంగా ఉన్నాయన్నారు. ప్రభావిత ప్రాంతాల్లో నష్టాన్ని అంచనా వేస్తున్నామని.. బాధితులందరికీ సాయంచేసేందుకు ప్రయత్నిస్తున్నామని తెలిపారు.

**పౌరుల రక్షణకు మరిన్ని బంకర్లు ...**పాక్ సైన్యం షెల్లింగ్ నుంచి సరిహద్దు గ్రామాల వారిని కాపాడేందుకు దాదాపు 9,500 బంకర్లు ఏర్పాటుచేసినట్లు జమ్మూకశ్మీర్ చీఫ్ సెక్రటరీ అటల్ దుల్లూ వెల్లడించారు. రాజౌరీలోని సరిహద్దు ప్రాంతాలను సందర్శించిన ఆయన పాక్ శతఘ్ని గుండ్ల దాడులకు గురైన ప్రాంతాలను పరిశీలించారు. సరిహద్దువాసులను రక్షించేందుకు మరిన్ని బంకర్లు ఏర్పాటుచేస్తామన్నారు. ‘పాక్ దళాలు సరిహద్దుల్లోని ప్రజలను లక్ష్యంగా చేసుకొని దాడులు చేయడాన్ని మీరు చూశారు. చాలామంది గాయపడ్డారు. కొందరు ప్రాణాలు కోల్పోయారు. చాలావరకు పశువులు చనిపోవడంతో పాటు.. ఇళ్లు దెబ్బతిన్నాయి’ అని దుల్లూ పేర్కొన్నారు. ముఖ్యంగా కుప్వారా, ఉరీ, పూంచ్‌ల్లో ఇది తీవ్రస్థాయిలో జరిగింది. ప్రస్తుతం స్థానిక అధికారులు ప్రజలకు సహాయ కార్యక్రమాల ఏర్పాట్లతో తలమునకలై ఉన్నట్లు దుల్లూ పేర్కొన్నారు. పరిస్థితిని వేగంగా అంచనా వేసి.. త్వరగా సాయం చేసేందుకు ప్రయత్నిస్తామన్నారు. ప్రస్తుతం సరిహద్దు వెంట 9,500 బంకర్లు ఉన్నాయని.. కానీ మరిన్ని బంకర్ల కోసం డిమాండ్లు వస్తున్నట్లు పేర్కొన్నారు. కాగా రాజౌరీలోని వివిధ గ్రామాల్లో పేలకుండా ఉన్న బాంబులు, శతఘ్ని గుండ్లను భారత సైన్యం నిర్వీర్యం చేసింది.

## పాకిస్థాన్‌కు రెండవ విడత ఐఎంఎఫ్ నిధులు విడుదల



**కరాచీ/ఇస్లామాబాద్ :** పాకిస్థాన్‌కు రెండవ విడత గా1.023 బిలియన్ డాలర్‌లను అంతర్జాతీయద్రవ్య సంస్థ(ఐఎంఎఫ్)బుధవారం విడుదల చేసింది. విస్తరణ నిధి సదుపాయం (ఇఎఫ్ఎఫ్) కింద ఈ మొత్తం మంజూరైనట్లు పాకిస్థాన్ సెంట్రల్ బ్యాంక్ వెల్లడించింది. పాకిస్థాన్ ప్రవేశపెట్టబోయే బడ్జెట్‌పై ఐఎంఎఫ్ వర్చువల్‌గా చర్చలు జరిపిన రోజే రెండవ విడత నిధులను ఐఎంఎఫ్ విడుదల చేసింది. వాస్తవానికి ఐఎంఎఫ్ అధికారులు ఈ సమావేశం కోసం ఇస్లామాబాద్‌కు వెళ్ళాల్సినప్పటికీ, భద్రతా కారణాలతో రద్దయింది. దీంతో విడియో కాన్ఫరెన్స్ ద్వారా పాకిస్థాన్ అధికారులతో సమావేశమయ్యారు. పాక్ ప్రభుత్వం జూన్ 2న 2025–26 ఆర్థిక సంవత్సరం బడ్జెట్‌ను ప్రకటించనుంది. ఐఎంఎఫ్ చర్చలు మే 16వరకు కొనసాగుతాయి. మే 16తో ముగియనున్న వారాంతంలో రెండవ విడత నిధులు విదేశీ మారకం నిల్వల్లో ప్రతిబింబిస్తాయని సెంట్రల్ బ్యాంక్ తెలిపింది. ఈమొత్తాన్ని ఐఎంఎఫ్ బోర్డు ఇప్పటికే కొనసాగుతున్న ఇఎఫ్ఎఫ్ కింద గత వారం ఆమోద ముద్ర వేసింది. రిసిలియెన్స్ అండ్ సస్టేయినెబిలిటీ ఫెసిలిటీ(ఆర్ఎస్ఎఫ్) కింద అదనంగా 1.4 బిలియన్ అమెరికా డాలర్‌లను చెల్లించేందుకు అంగీకరించింది. ఇఎఫ్ఎఫ్ సహకారంతో అమలు అవుతున్న పాకిస్థాన్ ఆర్థిక సంస్కరణల కార్యక్రమంపై ఐఎంఎఫ్ నిర్వహించిన మొదటి సమీక్షలో సంతృప్తి వ్యక్తం చేసిన తరువాత నిధులు విడుదల చేయాలనే నిర్ణయం తీసుకుంది. ఇఎఫ్ఎఫ్ కింద పాకిస్థాన్ తీసుకున్న విధాన చర్యలు ‘మంచి ప్రగతి’ సాధిస్తున్నాయని, ఆర్థిక వ్యవస్థను స్థిరీకరిస్తున్నదని, అంతర్జాతీయ పరిస్థితుల సవాళ్ళ నడుమ విశ్వాసాన్ని పునర్నిర్మిస్తున్నదని ఐఎంఎఫ్ పేర్కొంది. ‘‘ద్రవ్య పనితీరు బలంగా ఉంది. 2025 ఆర్థిక సంవత్సరం మొదటి అర్ధభాగంలో జిడిపి రెండు శాతం మిగులును సాధించింది. ఈఆర్థిక సంవత్సరాంతానికి 2.1 శాతం జిడిపి వృద్ధి సాధించాలనే లక్ష్యానికి అనుగుణంగానే పాకిస్థాన్ సాగుతున్నది’’ అని తెలిపింది. పాకిస్థాన్ స్థూల నిల్వలు ఏప్రిల్ నెలాఖరు నాటికి 10.3 బిలియన్‌ల అమెరికన్ డాలర్లు. అది 2024 ఆగస్టులో ఉన్న 9.4 బిలియన్ అమెరికన్ డాలర్‌ల నుంచి పెరిగింది. ఈ ఏడాది జూన్ చివరి నాటికి 13.9 బిలియన్ అమెరికన్ డాలర్‌లకు నిల్వలు చేరుకుంటాయని అంచనా అని ఐఎంఎఫ్ వెల్లడించింది.

## 16 ఏళ్ల తర్వాత దేశంలో ‘మే’లో వర్షాలు



**న్యూఢిల్లీ:** ప్రస్తుతం దేశంలోని అనేక రాష్ట్రాల్లో ఎండలు మండిపోతున్నాయి. పెరుగుతున్న ఉష్ణోగ్రతల నేపథ్యంలో ప్రజలు ఇప్పుడు నైరుతి రుతుపవనాల కోసం ఎదురు చూస్తున్నారు. అయితే ఈసారి వర్షాలు 16 ఏళ్ల తర్వాత త్వరగా వస్తున్నాయని వాతావరణ నిపుణులు చెబుతున్నారు. ఈ ఏడాది రుతుపవనాలు 16 సంవత్సరాల తర్వాత మే 27 నాటికే కేరళ తీరానికి చేరుకుంటాయని ప్రకటించారు. ఇది దేశవ్యాప్తంగా రైతులు, వ్యవసాయ రంగంతోపాటు సామాన్య ప్రజలకు కూడా శుభవార్త అని చెప్పవచ్చు. దేశంలో దాదాపు 60% వ్యవసాయం వర్షాధారమే. రుతుపవనాలు సమయానికి, సరైన పరిమాణంలో వస్తే, పంటల దిగుబడి పెరిగి, ఆర్థిక వ్యవస్థ బలపడుతుంది. సాధారణంగా నైరుతి రుతుపవనాలు జూన్ 1 నాటికి కేరళ తీరంలో ప్రవేశిస్తాయి. కానీ ఈ సంవత్సరం మే 27 నాటికే కేరళలో రుతుపవనాలు ఎంట్రీ ఇస్తాయని చెబుతున్నారు. ఈ అరుదైన సంఘటన చివరిసారిగా 2009లో జరిగింది. రుతుపవనాలు ముందుగానే రావడం వల్ల దక్షిణ భారతంలోని కేరళ, కర్ణాటక, తమిళనాడు, ఆంధ్రప్రదేశ్, తెలంగాణలలో వర్షాలు త్వరగా మొదలవుతాయి. ఇది వ్యవసాయ కార్యకలాపాలకు, ముఖ్యంగా వరి, చెరకు, కాఫీ, తేయాకు వంటి పంటలకు అనుకూలంగా ఉంటుంది. అయితే రాష్ట్రాల ప్రకారం చూస్తే... అండమాన్ నికోబార్ దీవుల్ని నైరుతి పవనాలు మే 13నే తాకాయి. కేరళకు మే 27న రానుండగా... దక్షిణాది రాష్ట్రాలైన కర్నాటకకు జూన్ 12, తమిళనాడు జూన్ 35, ఆంధ్రప్రదేశ్ మే 30 జూన్ 1, తెలంగాణ జూన్ 46 తేదీలలో రుతుపవనాలు ప్రవేశించనున్నాయి. వాతావరణశాఖ సమాచారం మేరకు మే 13, 2025 నాటికి రుతుపవనాలు అండమాన్ నికోబార్ దీవులలోకి ప్రవేశించాయి. .అక్కడి నుంచి అవి నెమ్మదిగా దక్షిణ భారతదేశం వైపు కదులుతున్నాయి. ఈసారి రుతుపవనాల వేగం సాధారణం కంటే వేగంగా ఉంది. దీని కారణంగా కేరళ, కర్నాటక, తమిళనాడు వంటి రాష్ట్రాలలో మే చివరి వారంలోనే వర్షాలు ఆరంభమయ్యే అవకాశం ఉంది.



# జనరల్
STATE & REGIONAL NEWS

## మైలాన్ ల్యాబొరేటరీస్‌కు వెసులుబాటు

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** సంగారెడ్డి జిల్లా జిన్నారం మండలం ఇండస్ట్రియల్ ఎస్టేట్ బొల్లారంలోని మైలాన్ ల్యాబొరేటరీస్ లిమిటెడ్ (మాట్రిక్స్ ల్యాబొరేటరీస్)కి హైకోర్టులో ఊరట లభించింది. ఆ కంపెనీపై కఠిన చర్యలు తీసుకోరాదని మధ్యంతర ఉత్తర్వులు జారీ చేసింది. విద్యుత్తు సరఫరా నిలిపివేతతోపాటు ఆ కంపెనీపై ఎలాంటి చర్యలు తీసుకోవద్దని పొల్యూషన్ కంట్రోల్ బోర్డు (పిసిబి)ని ఆదేశించింది. ఆకంపెనీలో అగ్నిప్రమాదానికి సంబంధించి పూర్తి వివరాలను అందజేయాలని పిసిబిని జస్టిస్ పుల్లా కార్తీక్, జస్టిస్ నందికొండ నర్సింగ్‌రావులతో కూడిన డివిజన్ బెంచ్ బుధవారం ఆదేశించింది. ఇటీవల ఫైర్ యాక్సిడెంట్ జరిగిన నేపథ్యంలో మైలాన్ ల్యాబ్స్‌కు చెందిన ర్యాండ్ ఫెసిలిటీతోపాటు విద్యుత్ సర్వీస్‌ను నిలిపివేస్తూ పిసిబి ఈనెల 8న నిర్ణయం తీసుకోవడాన్ని ఆ కంపెనీ సవాలు చేసిన పిటిషన్‌పై విచారణను వచ్చే వారానికి వాయిదా వేసింది.

# దేశవ్యాప్తంగా కాంగ్రెస్ ‘జైహింద్’ ర్యాలీలు

## ఆపరేషన్ సిందూర్ నిలిపివేతకు నిరసన

**న్యూఢిల్లీ :** ‘ఆపరేషన్ సిందూర్’ను ఎందుకు నిలిపివేశారో చెప్పకుండా ప్రధానమంత్రి నరేంద్రమోదీ మౌనం పాటించడాన్ని వ్యతిరేకిస్తూ కాంగ్రెస్ పార్టీ దేశవ్యాప్తంగా ర్యాలీలు చేపట్టనున్నది. ‘జైహింద్’ అనే పేరుతో దేశవ్యాప్తంగా ఈ ర్యాలీలు రాబోయే రోజుల్లో చేపడతామని కాంగ్రెస్‌పార్టీ ప్రధాన కార్యదర్శి జైరామ్ రమేశ్, ఆ పార్టీ మీడియా ప్రచార విభాగాధిపతి పవన్ ఖేరా బుధవారంనాడు మీడియాకు చెప్పారు. ఆపరేషన్ సిందూర్‌ను రాజకీయంగా మార్చేశారన్నారు. దీనిని రాజకీయంగా మార్చడాన్ని కాంగ్రెస్ పార్టీ తీవ్రంగా ఖండిస్తోందన్నారు. అఖిలపక్ష సమావేశాలను తూతూ మంత్రంగా, నామ మాత్రంగా మార్చేశారని, ఈ సమావేశాలకు ప్రధానమంత్రి హాజరుకాలేదని విమర్శించారు. భారతదేశాన్ని మోదీ ఎందుకు ఈ విషయంలో పరిగణనలోకి తీసుకోవడంలేదు? ఎందుకు అందరి అభిప్రాయాలను సేకరించి అందుకు అనుగుణంగా ప్రవర్తించడంలేదు? అసలు కాల్పుల విరమణ, మధ్యవర్తిత్వంలో అమెరికా పాత్ర ఏమిటి? ఎందుకు ప్రధానమంత్రి మౌనం పాటిస్తున్నారు? అని ఆయన ప్రశ్నించారు.

పహల్గామ్ దాడి అనంతరం జరిగిన ఆపరేషన్ సిందూర్ సైనిక చర్యను బిజెపి తన సొంత కార్యక్రమంగా, తన పార్టీ బ్రాండ్‌గా మార్చేసిందని, దేశంలో సాయుధ దళాలు సైనిక చర్య చేపడితే అది తన ఘనతగా మార్చుకుంటోందని విమర్శించారు. యావత్ భారతదేశం ప్రధానమంత్రి మౌనాన్ని రాబోయే రోజుల్లో నిలదీయనున్నదన్నారు. భారత్–పాకిస్థాన్ మధ్య ఈనెల పదో తేదీన కుదిరిన కాల్పుల విరమణ అవగాహనను అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ తన మధ్యవర్తిత్వ విజయంగా ప్రకటించుకున్నారని, దీనిపై ప్రధానమంత్రి మౌనం పాటిస్తున్నారని విమర్శించారు. ఈ పత్రికాగోష్టికి ముందుగా, పార్టీ మాజీ అధ్యక్షుడు రాహుల్‌గాంధీ, ఆ పార్టీ ప్రధాన కార్యదర్శులు కె.సి.వేణుగోపాల్, జైరామ్ రమేశ్, ప్రియాంకాగాంధీ వాద్రా, సచిన్ పైలట్ తదితరులు న్యూఢిల్లీలోని అక్బర్ రోడ్‌లో ఉన్న పార్టీ కార్యాలయంలో సమావేశమయ్యారు. దేశవ్యాప్తంగా ‘జైహింద్’ ర్యాలీలు నిర్వహించాలని ఈ సమావేశంలో పార్టీ తీర్మానం చేసింది. పహల్గామ్ దాడుల అనంతరం గడచిన 20 రోజులుగా కాంగ్రెస్ పార్టీ నిర్వహించిన వరుస సమావేశాలలో ఇది మూడవ సమావేశం. కాగా ఈనెల 16వ తేదీ శుక్రవారంనాడు పార్టీ మాజీ అధ్యక్షుడు రాహుల్‌గాంధీ పత్రికాగోష్ఠిలో మాట్లాడతారు. జైహింద్ ర్యాలీలను ఎందుకు నిర్వహిస్తున్నదీ పూర్తిస్థాయిలో వివరంగా చెబుతారు. దేశవ్యాప్తంగా వివిధ రాష్ట్రాలలో ఈ ‘జైహింద్’ ర్యాలీలు నిర్వహిస్తామని, ప్రభుత్వం అనేక ప్రశ్నలకు సమాధానాలు చెప్పలేదని, ఈ ప్రశ్నలకు సమాధానాలు చెప్పాలని కోరుతూ ఈ ర్యాలీలు నిర్వహిస్తామని జైరామ్ రమేశ్ పాత్రికేయులకు చెప్పారు. ఈనెల 22వ తేదీన కాంగ్రెస్ పార్టీ జాతీయ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే, లోక్‌సభలో ప్రతిపక్ష నాయకుడు రాహుల్‌గాంధీ మాట్లాడుతూ, పాకిస్థాన్ చర్యలకు వ్యతిరేకంగా భారతదేశం ఐక్యంగా ప్రభుత్వం వెంట ఉందని చెప్పారు. భారత్ సైనిక చర్యకు తమ పూర్తి మద్దతు తెలియజేశారు. ‘‘మేం ప్రభుత్వానికి అండగా నిలబడ్డాం, కానీ ప్రధానమంత్రి మౌనం పాటిస్తున్నారు. ఇప్పటికి రెండుసార్లు అఖిలపక్ష సమావేశాలు నిర్వహించారు, కానీ ఏ ఒక్క సమావేశానికీ ప్రధానమంత్రి హాజరుకాలేదు, మేం అఖిలపక్ష సమావేశం ఏర్పాటు చేయాలని కోరుతున్నాం, ప్రధాని రావాలని కోరుతున్నాం, పార్లమెంటు ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేయాలని కోరుతున్నాం, అఖిలపక్ష సమావేశాలు కేవలం నామమాత్రంగా మారిపోయాయి’’ అని మల్లికార్జునఖర్గే, రాహుల్‌గాంధీ ఇంతకుముందు చెప్పారు. ఈ అంశంపై పార్లమెంటు ప్రత్యేక సమావేశాన్ని ఏర్పాటు చేయాలని ప్రధానమంత్రి నరేంద్రమోదీకి రాహుల్‌గాంధీ ఇప్పటికే ఒక లేఖ రాశారు. పహల్గామ్ ఉగ్రవాదులకు భారతదేశం ఉమ్మడిగా ఒక సందేశాన్ని చెప్పేందుకు ఈ సమావేశం ఉపయోగపడుతుందని ఆయన అన్నారు. అదేవిధంగా 1994 ఫిబ్రవరి 22న పాకిస్థాన్ ఆక్రమిత కశ్మీరుపై ఒక ఏకగ్రీవ తీర్మానం చేసిన విషయాన్ని ప్రధానమంత్రికి లేఖ సందర్భంగా రాహుల్ పునరుద్ఘాటించారు. డోనాల్డ్ ట్రంప్ కాల్పుల విరమణపై మొదట ప్రకటన చేయడం ఒక అసాధారణ విషయమని, దీనిపై మోదీ మాట్లాడటంలేదని జైరామ్ రమేశ్ చెప్పారు. మే 25వ తేదీన ప్రధానమంత్రి ఎన్‌డిఎ కూటమి పార్టీలకు చెందిన ముఖ్యమంత్రులతో ఒక సమావేశం నిర్వహించారనీ, కానీ మిగిలిన ముఖ్యమంత్రులను మాత్రం ఆయన విస్మరించారని విమర్శించారు. ఈ విధంగా విస్మరించడం రాజకీయం కాదా? అని ఆయన ప్రశ్నించారు. ఆపరేషన్ సిందూర్‌ను ప్రధానమంత్రి రాజకీయంగా మార్చారని విమర్శించారు.

## క్యాన్సర్ బాధిత కుటుంబానికి అండగా సిఎం రేవంత్‌రెడ్డి

### చికిత్సకు రూ.12లక్షలు అందజేత



**ప్రజాపక్షం/హైదరాబాద్ :** క్యాన్సర్ బారిన పడిన వ్యక్తి చికిత్సకు అవసరమైన ఆర్థిక సహాయం అందించి బాధిత కుటుంబానికి ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి అండగా నిలిచారు. సిద్దిపేటకు చెందిన సిరిసిల్ల సాయిచరణ్ (35) అక్యూర్డ్ మైలాయిడ్ లుకేమియా (బ్లడ్‌క్యాన్సర్) బారిన పడ్డారు. ఆయనకు భార్య లక్ష్మి ప్రసన్న, కుమార్తెలు లక్ష్మి సుసజ్ఞ (6), స్మయ (2 నెలలు), తల్లిదండ్రులు రాము, సునీత ఉన్నారు. ఇంటికి ఆధారమైన సాయిచరణ్ క్యాన్సర్ బారిన పడడంతో అతని చికిత్సకు కుటుంబ సభ్యులు సిద్దిపేట మండలం ఎన్‌సాన్‌పల్లిలోని తమ ఇంటిని విక్రయించారు. అయినప్పటికీ చికిత్సకు అవసరమైనంత డబ్బులు సరిపోకపోవడంతో వారు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని గతంలో కలిసి తమ ఇబ్బందులను ఆయన దృష్టికి తీసుకువచ్చారు. చలించిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సాయిచరణ్ చికిత్సకు రూ.5లక్షలు మంజూరు చేశారు. దాంతో హైదరాబాద్ బసవతారకం క్యాన్సర్ ఆసుపత్రిలో సాయిచరణ్‌కు స్టెమ్సెల్ ట్రాన్స్‌ప్లాంటేషన్ పూర్తయింది. చికిత్సకు అదనంగా వ్యయమైన మరో రూ.7లక్షలను సిఎంఆర్‌ఎఫ్ ద్వారా అందించాలని సిఎం రేవంత్ రెడ్డి ఆదేశించడంతో ఆ మొత్తాన్ని అధికారులు అందజేశారు. చికిత్స చేయించుకున్న సాయిచరణ్ కుటుంబ సభ్యులతో కలిసి బుధవారం సాయంత్రం రాష్ట్ర సచివాలయానికి వచ్చి సిఎం రేవంత్ రెడ్డిని కలిసి కృతజ్ఞతలు తెలిపారు. ధైర్యంగా ఉండాలని సిఎం సాయిచరణ్‌కు సూచించారు.

## వేసవి సెలవుల్లో తరగతులపై వివరణ

### ప్రభుత్వానికి హైకోర్టు నోటీసులు

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** వేసవి సెలవుల్లో ప్రైవేటు కాలేజీలు తరగతులు నిర్వహిస్తున్నాయనే పిల్‌ను బుధవారం హైకోర్టు విచారించింది. ప్రభుత్వానికి నోటీసులు ఇచ్చింది. ప్రభుత్వ వాదనలు విన్న తరువాతే తగిన ఉత్తర్వులు ఇస్తామని చెప్పింది. పిటిషనర్ లేదా వాళ్ల పిల్లలు బాధితులు కానప్పుడు పిటిషన్ ఎలా వేస్తారని ప్రశ్నించింది. అంతేకాకుండా వేసవి తరగతులు నిర్వహిస్తున్న కాలేజీలను ప్రతివాదులుగా ఎందుకు చేయలేదని అడిగింది. సమ్మర్ హాలిడేస్‌లో ప్రైవేటు కాలేజీలు తరగతులు నిర్వహిస్తుంటే అధికారులు చర్యలు తీసుకోవడం లేదంటూ లాయర్ క్రాంతి కుమార్ వేసిన పిల్‌ను బుధవారం జస్టిస్ పుల్లా కార్తీక్, జస్టిస్ నందికొండ నర్సింగ్ రావులతో కూడిన డివిజన్ బెంచ్ విచారించింది. పిటిషనర్ తరపు న్యాయవాది వాదిస్తూ, తెలంగాణ ఇంటర్ బోర్డు ప్రకటించిన విద్యా క్యాలెండర్ ప్రకారం వేసవిలో ప్రైవేట్ కాలేజీలు తరగతులు నిర్వహించడానికి వీల్లేదన్నారు. దీనిపై ప్రభుత్వ న్యాయవాది స్పందిస్తూ, ఇప్పుడు కాలేజీలకు వేసవి సెలవులని, జూన్‌లో తిరిగి తెరుచుకుంటాయన్నారు. కొన్ని కాలేజీలు కోచింగ్ మాత్రమే ఇస్తున్నాయన్నారు. కౌంటర్ వేసేందుకు గడువు కావాలని కోరడంతో విచారణ వాయిదా వేసింది.

## 13 నెలల కనిష్ఠస్థాయికి చేరిన టోకుధరల ద్రవ్యోల్బణం

**న్యూఢిల్లీ :** దేశంలో టోకు ధరల ద్రవ్యోల్బణం (డబ్ల్యుపిఐ) ఏప్రిల్ నెలలో 13 నెలల కనిష్ఠస్థాయిలో 0.85 శాతానికి చేరింది. ముఖ్యంగా ఆహార వస్తువుల ధరలు, ఇంధనం, తయారీ ఉత్పత్తుల ధరలలో సడలింపు కారణంగా ఏప్రిల్ నెలలో టోకు ధరల ద్రవ్యోల్బణం గణనీయంగా కనిష్ఠస్థాయకి వచ్చిందని కేంద్ర పరిశ్రమల మంత్రిత్వశాఖ బుధవారంనాడు ఒక ప్రకటనలో తెలియజేసింది. ఈ గణాంకాలలో వచ్చేనెలనాటికి మరింతగా సడలింపు వస్తుందని నిపుణులు చెబుతున్నారు. మార్చినెలలో ఈ టోకు ధరల ద్రవ్యోల్బణం 2.05 శాతంఆ నమోదైంది. గత ఏడాది ఏప్రిల్ నెలలో ఈ ద్రవ్యోల్బణం 1.19 శాతంగా ఉండేది. 2024 మార్చినెలలో ఒకసారి ఈ టోకు ధరల ద్రవ్యోల్బణం 0.85 కంటే తక్కుగా నమోదైంది. ఆనాడు ఈ ద్రవ్యోల్బణం 0.26 శాతానికి చేరింది. 2025 ఏప్రిల్ నెలలో ఆహార ఉత్పత్తుల తయారీ ధరలు, ఇతర తయారీ వస్తువుల ధరలు, రసాయనాలు, రసాయన ఉత్పత్తులు, ఇతర రవాణా తయారీ పరికరాలు, యంత్రాల ఉత్పత్తి ధరలు గణనీయంగా పెరగడంవల్ల ద్రవ్యోల్బణ సానుకూల నిష్పత్తిలో ఉందని పరిశ్రమలశాఖ పేర్కొంది. టోకు ధరల సూచీ గణాంకాల ప్రకారం, తయారీ ఉత్పత్తుల ద్రవ్యోల్బణం నిష్పత్తి తగ్గుదలతోపాటు ఆహారం, ఇంధనం, విద్యుత్‌కు సంబంధించిన టోకు ధరల సూచీ ధరల తరుగుదల ద్రవ్యోల్బణం మంద్రస్థాయికి చేరడానికి కారణమైందని పేర్కొంది. ఏప్రిల్ నెలలో ధరల సాధారణస్థాయీ తరుగుదల 0.86 శాతానికి చేరిందని, అంతకుముందు మార్చినెలలో ఇది 1.57 శాతంగా ఉందని కూరగాయల ధరల సాధారణస్థాయీ తరుగుదల ఏప్రిల్ నెలలో 18.26 శాతంగా నమోదైందనీ మార్చినెలలో 15.88 శాతంగా ఉండేదని పేర్కొంది. ఉల్లిపాయల ద్రవ్యోల్బణం ఏప్రిల్‌నెలలో 0.20 శాతానికి ఉపశమించింది. అంతకుముందు మార్చినెలలో ఈ ద్రవ్యోల్బణం 26.65 శాతంగా నమోదైంది. పండ్లకు సంబంధించిన ద్రవ్యోల్బణం ఏప్రిల్ నెలలో 8.38 ఉండగా, మార్చినెలలో 20.78 శాతంగా ఉండేది. బంగాళా దుంపలు, పప్పుధాన్యాల ద్రవ్యోల్బణం వరుసగా 24.30 శాతం, 5.57 శాతంగా నమోదయ్యాయి.

# దేశ అభివృద్ధికి యువతే మార్గదర్శకులు

### ఇటి నరసింహ : ఎఐవైఎఫ్ ఫ్లాగ్ మార్చ్ ప్రారంభం



**ప్రజాపక్షం/హైదరాబాద్ :** దేశ అభివృద్ధికి యువతే మార్గదర్శకులని, దేశ భవితకు యువతరం కదిలిరావాలని, మత, కుల, రాజకీయాలకు అతీతంగా దేశ అభివృద్ధిలో కీలక భూమిక పోషించాలని సిపిఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు ఇటి.నరసింహ పిలుపునిచ్చారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని తిరుపతిలో మే 1518 వరకు జరగున్న ఎఐవైఎఫ్ 17వ జాతీయ మహాసభల విజయవంతాన్ని కాంక్షిస్తూ ఎఐవైఎఫ్ రాష్ట్ర సమితి ఆధర్వంలో చేపట్టిన ఫ్లాగ్‌మార్చ్‌ను ఇటి నరసింహ బుధవారం హైదరాబాద్‌లో ప్రారంభించారు. గత 16వ జాతీయ మహాసభలు హైదరాబాద్ లో జరిగిన నేపథ్యంలో ఎఐవైఎఫ్ ఆనవాయితీ ప్రకారం యువజన సంఘం జెండాను ప్రస్తుతం తిరుపతిలో జరుగుతున్న సభా ప్రాంగణంలో ఈ జాతాను అందజేయనున్నారు. ఈ సందర్భంగా ఇటి నర్సింహ మాట్లాడుతూ. దేశానికి స్వాతంత్ర్యం సిద్ధించి 77 సంవత్సరాలు గడుస్తున్నా ప్రజల జీవన ప్రమాణాలు ఇప్పటికీ మెరుగుపడలేదని ఆవేదన వ్యక్తంచేశారు. భారత రాజ్యాంగం కల్పించిన హక్కులు ప్రజలందరికీ సమానంగా అందించినపుడే నిజమైన స్వాతంత్ర్యం అని అన్నారు. ప్రతి 5ఏళ్లకు దేశంలో, రాష్ట్రంలో పాలకుల అధికార మార్పిడి జరుగుతున్నా, రాజ్యవ్యవస్థ తీరు మారడంలేదని, ప్రజలను కీలుబొమ్మలుగా మార్చి వికృత రాజకీయాలకు తెరలేపారని ఆయన ధ్వజమెత్తారు. అందుకే ప్రస్తుత యువజనులు దేశ పరిస్థితులను అర్థంచేసుకోవాలని, అధ్యయనం చేయాలని కుళ్ళు రాజకీయాలకు స్వస్తి పలకాలంటే నిస్వార్థంగా దేశం కోసం నేటి యువతరం పనిచేయాలని ఆయన పిలుపునిచ్చారు. ఎఐవైఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు వలి ఉల్లా ఖాద్రీ, ప్రధాన కార్యదర్శి కల్లూరు ధర్మేంద్ర మాట్లాడుతూ దేశంలో మోదీ అనుసరిస్తున్న మత విద్వేష రాజకీయాలకు వ్యతిరేకంగా యువత పోరాడాలని అన్నారు.

నిరుద్యోగ యువతకు కనీస ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించాల్సిన బాధ్యత ప్రభుత్వాలపై ఉన్నా నిర్లక్ష్యం చేస్తున్నారని విమర్శించారు. తిరుపతిలో జరిగే జాతీయ మహాసభలకు తెలంగాణ రాష్ట్రం నుండి పెద్ద ఎత్తున హాజరుకానున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎఐవైఎఫ్ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ నెర్లకంటి శ్రీకాంత్, రాష్ట్ర ఉపాధ్యక్షుడు సత్యప్రసాద్, రాష్ట్ర సమితి సభ్యులు సల్మాన్ బేగ్, షేక్ మహమూద్, మాజీద్ అలీఖాన్, కల్యాణ్, హేమంత్, వంశీ, మోసిన్ ఖాన్, మహేష్, భరత్, మురళి, నవీన్, కీర్తన్ తదితరులు పాల్గొన్నారు.

## దోస్త్ అడ్మిషన్లు యథాతథం

### మధ్యంతర ఉత్తర్వులకు హైకోర్టు నిరాకరణ

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** తెలంగాణ షెడ్యూల్ కులాల (రిజర్వేషన్ల సర్దుబాటు) చట్టం–2025 చెల్లదని పేర్కొంటూ దాఖలైన కేసుల్లో రాష్ట్రానికి హైకోర్టు నోటీసులు ఇచ్చింది. సదరు చట్టం చట్ట వ్యతిరేకమంటూ షెడ్యూల్ కులాల ఐక్య వేదిక తరపున ఉపాధ్యక్షుడు గడ్డం శంకర్, మాల మహానాడు తరపున అధ్యక్షుడు జి.చెన్నయ్య వేసిన పిటిషన్లను బుధవారం హైకోర్టు విచారించింది. దోస్త్ అడ్మిషన్ల ప్రక్రియను నిలుపుదల చేస్తూ మధ్యంతర ఉత్తర్వులు జారీ చేయాలన్న పిటిషనర్ల వినతిని తోసిపుచ్చింది. ఆ మేరకు ఉత్తర్వులు జారీ చేసేందుకు నిరాకరించింది. దోస్త్ అడ్మిషన్ల ప్రక్రియలో జోక్యం చేసుకోబోమంది. ఈ మేరకు జస్టిస్ పుల్లా కార్తీక్, జస్టిస్ నందికొండ నర్సింగ్ రావులతో కూడిన డివిజన్ బెంచ్ ఉత్తర్వులు జారీ చేసింది.

పిటిషనర్ల తరపు సీనియర్ లాయర్లు వాదిస్తూ, రాష్ట్రం జారీ చేసిన జీవో 33, జీవో 9, 10, 99ల అమలును నిలిపివేయాలని కోరారు. ఎస్సీ కులాల మధ్య రిజర్వేషన్ల వర్గీకరణకు ఏక సభ్య కమిషన్ ఇచ్చిన రిపోర్ట్‌కు చట్టబద్ధత లేదన్నారు. కమిషన్ 2011 నాటి జనాభా లెక్కలను ప్రామాణికంగా తీసుకోవడాన్ని తప్పుపట్టారు. ఈ నేపథ్యంలో దోస్త్ తొలి దశ అడ్మిషన్లు, జూన్ 13న తరగతులు ప్రారంభం కానున్నాయని, కాబట్టి ఆ అడ్మిషన్లలో ఎస్సీ వర్గీకరణ చేయకుండా మధ్యంతర ఉత్తర్వులు ఇవ్వాలని కోరారు. కనీసం సీట్ల కేటాయింపు చేయకుండా ఆదేశాలివ్వాలని కోరారు. దీనిపై ఎజి సుదర్శన్‌రెడ్డి వాదిస్తూ, చట్టాన్ని సవాలు చేసిన కేసులో మధ్యంతర ఉత్తర్వులకు ఆస్కారం లేదన్నారు. వాదనల తర్వాత ధర్మాసనం ప్రతివాదులకు నోటీసులు ఇచ్చి విచారణను జూన్ 10వ తేదీకి వాయిదా వేసింది.

# మంత్రి విజయ్ షాపై కేసు నమోదు చేయండి

పోలీసులకు మధ్యప్రదేశ్ హైకోర్టు ఆదేశం



**జబల్‌పూర్ :** ఆపరేషన్ సిందూర్ సమయంలో కీలకంగా వ్యవహరించిన సైనికాధికారిణి కర్నల్ సోఫియా ఖురేషీపై మధ్యప్రదేశ్ మంత్రి విజయ్ షా చేసిన వివాదాస్పద వ్యాఖ్యలపై తీవ్ర వ్యతిరేకత వ్యక్తమవుతోంది. ఈ వ్యవహారంలో ఆయనపై కేసు నమోదు చేయాలని మధ్యప్రదేశ్ హైకోర్టు ఆదేశించింది. ఎట్టిపరిస్థితుల్లోనూ నాలుగు గంటల్లోగా ఎఫ్ఐఆర్ నమోదు చేయాలని రాష్ట్ర డిజిపిని న్యాయస్థానం ఆదేశించింది. ఓ కార్యక్రమంలో మధ్యప్రదేశ్ గిరిజన సంక్షేమ శాఖ మంత్రి విజయ్ షా మాట్లాడుతూ.. సైనికాధికారిణి కర్నల్ సోఫియా ఖురేషీ పేరును పరోక్షంగా ప్రస్తావించారు. ఉగ్రవాదులు మన సోదరీమణుల సిందూరాన్ని తుడిచేసి వితంతువుల్ని చేస్తే.. వాళ్ల (ఉగ్రవాదుల) మతానికి చెందిన సోదరిని సైనిక విమానంలో మోదీజీ పంపించి గుణపాఠం నేర్పించారని అన్నారు. మంత్రి చేసిన వ్యాఖ్యలపై తీవ్ర వ్యతిరేకత వ్యక్తమైంది.

**ఎన్‌సిడబ్ల్యు ఖండన**

మరో వైపు సోఫియా ఖురేషీపై విజయ్ షా చేసిన వివాదాస్పద వ్యాఖ్యలను జాతీయ మహిళా కమిషన్ (ఎన్‌సిడబ్ల్యు) ఖండించింది. బాధ్యతాయుత స్థానాల్లో ఉన్న కొంతమంది వ్యక్తులు స్త్రీల పట్ల అలాంటి వ్యాఖ్యలు చేయడం దురదృష్టకరమని కమిషన్ చైర్‌పర్సన్ విజయ రహాట్కర్ వ్యాఖ్యానించారు. ఇది మన సమాజంలోని మహిళల గౌరవాన్ని దెబ్బతీయడమే కాకుండా దేశ భద్రతలో ముఖ్యపాత్ర పోషిస్తున్న కుమార్తెలను అవమానించినట్లు అవుతుందని పేర్కొన్నారు. మంత్రి పేరు నేరుగా ప్రస్తావించనప్పటికీ గౌరవనీయ స్థానాల్లో ఉన్నవారు స్త్రీల పట్ల గౌరవప్రదమైన వైఖరిని పెంపొందించుకోవడం చాలా ముఖ్యమని అన్నారు. కర్నల్ సోఫియా ఖురేషీ దేశం గర్వించదగ్గ భారత పుత్రిక. దేశాన్ని ప్రేమించే భారతీయులందరికీ సోదరి. ఎంతో ధైర్యం, అంకిత భావంతో ఆమె దేశసేవ చేస్తున్నారు. అటువంటి మహిళలను చూసి దేశం గర్వపడుతోంది. దేశం ప్రగతిశీల అభివృద్ధి వైపు వెళ్లాలంటే స్త్రీలు ప్రతి రంగంలోనూ ముందువచ్చి నాయకత్వం చేపట్టాలి. మహిళలపై అగౌరవ వ్యాఖ్యలు చేయడం దేశాభివృద్ధిని అడ్డుకోవడమే’ అని మహిళా కమిషన్ చైర్‌పర్సన్ విజయ రహాట్కర్ సోషల్ మీడియా వేదికగా పేర్కొన్నారు.

## 28 బార్లకు దరఖాస్తులు ఆహ్వానం

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** తెలంగాణ ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ శాఖ 28 (2బి) బార్లకు దరఖాస్తులకు ఆహ్వానానికి బుధవారం నోటిఫికేషన్ విడుదల చేసింది. ఇందులో గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ (జిహెచ్‌ఎంసి) పరిధిలో 24, మహబూబ్‌నగర్, నిజామాబాద్, బోధన్, సరూర్‌నగర్ జల్పల్లి మునిసిపాలిటీల్ల ఒకొక్క (2బి) బార్లకు దరఖాస్తులు కోరింది. జూన్ 6 వరకు దరఖాస్తుల స్వీకరిస్తామని, గతంలో 2బి బార్లకు పిలిచిన దరఖాస్తులతో బార్ లైసెన్స్ పొంది ఫీజ్ లు చెల్లించ పోవడం, ఇతర కారణాలతో రద్దు చేయబడిన 16 బార్లకు, 2బి బార్ల లైసెన్సు పొంది 90 రోజుల్లో అవసరమైన డాక్యుమెంటేషన్, ఫీజులు చెల్లించకుండా బార్ల నిర్వహణకు ముందుకు రాని 12 బార్లను తిరిగి పునరుద్దారణ కోసం ప్రొహిబిషన్ ఎక్సైజ్ శాఖ దరఖాస్తులను ఆహ్వానించింది. ప్రతి దరఖాస్తు ఫారం రుసుం రూ.లక్షగా ఖరారు చేశారు. దరఖాస్తులతోపాటు రూ.లక్షను డి.డి. చెల్లించాల్సి ఉంటుంది. డి.డి.రూపంలో చెల్లించిన డబ్బు నాన్ రిఫండబుల్‌గా (తిరిగి చెల్లించడం లేకుండా) ఎక్సైజ్ శాఖ పేర్కొంది. 2బి బార్లకు పిలిచిన దరఖాస్తుల ఆహ్వానంలో 28 బార్లకు ఒక్కొక్కరు ఎన్ని దరఖాస్తులైన చేసుకోవచ్చునని, జిహెచ్‌ఎంసి తోపాటు ఇతర మునిసి పాలిటీల్లోని 2బి బార్లకు ఎవ్వరైనా దరఖాస్తులు చేసుకోవచ్చునని పేర్కొన్నారు. డి.డి.లతో పాటు దరఖాస్తులను ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ కమిషనర్ కార్యాలయం, హైదరాబాద్, రంగారెడ్డి డిప్యూటి కమిషనర్ కార్యాలయాల్లోను మిగిలిన అయా ప్రాంతాల్లో దరఖాస్తులను అందించాల్సి ఉంటుందని ఎక్సైజ్ శాఖ అధికారులు తెలిపారు. Tgbcl. Telangana gov.in సైట్ ద్వారా దఋూరఖాస్తుల నమూనా, నియమ నిబంధఋూనలు ఉంటాయి.

2బి బార్లకు దఋూరఖాస్తులను ఈనెల 15 నుంచి జూన్ 6 తేదీ వరకు స్వీకరించబడుతాయని ఎక్సైజ్ అధికారులు పెర్కోన్నారు.

17మంది అక్రమ వలసదారులకు భారతీయ పాస్‌పోర్టుల సహాయం కేసులో...

## బంగ్లాదేశీయుడు, ఏజెంట్ అరెస్ట్

### గుజరాత్ యాంటీ-టెర్రరిస్ట్ స్క్వాడ్ వెల్లడి

**అహ్మదాబాద్ :** భారతీయ పాస్‌పోర్టులను పొందడానికి 17మంది అక్రమవలసదారులకు సహాయం చేసిన ఒక బంగ్లా జాతీయుడు సహా ఏజెంట్‌ను అరెస్ట్ చేసినట్లు గుజరాత్ యాంటీటెర్రరిస్ట్ స్క్వాడ్ (ఎటిఎస్) తెలిపింది. ఫోర్జరీ చేసిన డాక్యుమెంట్లను ఉపయోగించి భారతీయ పాస్‌పోర్టులు సంపాదించి పొరుగుదేశం నుంచి అక్రమవలసదారులు ప్రవేశించేందుకు వీరిద్దరు సహకరించారని బుధవారం అధికారులు చెప్పారు. ఈ ఇద్దరు నిందితుల సహాయంతో మొత్తం 17మంది బ్లంగా జాతీయులు ఇండియన్ పాస్ పోర్టులు సంపాదించారని, వారిని మహమ్మద్ దిడారుల్ ఆలం, షోయెబ్ ఖురేషీగా గుర్తించినట్లు ఎటిఎస్ ఇక్కడ విడుదల చేసిన ఒక ప్రకటన తెలిపింది, మూడవ నిందితుడు రొబియుల్ ఇస్లామ్ దక్షిణ కొరియాలో తలదాచుకున్నాడని ఆ ప్రకటన తెలియజేసింది. ఆలం అలియాస్ రాణా శంకర్ 2012లో బంగ్లాదేశ్ నుంచి భారతదేశంలోకి అక్రమంగా ప్రవేశించినట్లు ఎటిఎస్ తెలిపింది. అతడి అనుచరుడు ఖురేషీ రాజస్థాన్ కు చెందినవాడని, నగరంలోని నరోల్ ఏరియాలో 2015నుంచి ‘అల్ ఖురేషీ ఎంటర్‌ప్రైజెస్’ పేరుతో ఒక షాప్‌ను నిర్వహిస్తున్నాడని, ఆధార్, పాన్, పాస్‌పోర్ట్ కోసం ఆన్‌లైన్ ఫారాలు నమోదు చేసే సేవలు అందిస్తున్నాడని ఎటిఎస్ వెల్లడించింది. బంగ్లాదేశ్‌లోని కిషోర్‌గంజ్ జిల్లాకు చెందిన ఆలం 2015లో అహ్మదాబాద్ నగరానికి వచ్చాడని, నకిలీ పత్రాలను ఉపయోగించి 2017లో అతడు ఇండియన్ పాస్‌పోర్ట్ పొందాడు. 2018నుంచి ఆలం నరోల్ ఏరియాలోని బౌగ్‌ఇకౌసర్ ప్రాంతంలో ‘విఐపి మొబైల్, మనీ ట్రాన్స్‌ఫర్’ అనే పేరుతో షాప్ నడుపుతున్నాడు. ఇస్లామ్ ఖురేషీ సహాయంతో ఆలం అక్రమ వలసదారులకు భారతీయ పాస్‌పోర్టులను పొందేందుకు సహాయపడుతున్నాడని, ఇండియన్ పాస్ పోర్టుల కోసం బోగస్ బర్త్ సర్టిఫికెట్లు, కిరాయి అగ్రిమెంట్లు, ఆధార్, పాన్‌కార్డులు ఉపయోగిస్తున్నారని ఎటిఎస్ తెలియజేసింది. విశ్వసనీయ సమాచారం ప్రకారం కొద్ది రోజుల క్రితం ఎటిఎస్ ఆలమ్ షాప్‌పై దాడులు నిర్వహించి అనేక ఆధార్, పాన్‌కార్డులు, ఎన్నికల గుర్తింపుకార్డులు, బంగ్లాదేశ్ ప్రభుత్వం జారీ చేసిన ఐడి కార్డుతోపాటు ఇతర డాక్యుమెంట్లు ఉన్నాయి. ఖురేషీ షాప్‌పై కూడా అదే సమయంలో జరిపిన దాడిలో ఎటిఎస్‌కు దాదాపు 300 వరకు ఫోర్జరీ చేసిన ఆధార్ కార్డులు, పాన్‌కార్డులు దొరికాయి. యాంటీటెర్రరిస్ట్ స్క్వాడ్ ఈ విషయాన్ని వెల్లడించింది. ఖురేషీ కంప్యూటర్‌లో స్టోర్ అయిన డేటా ప్రకారం ఈ ముగ్గురు నిందితులు 17మంది బంగ్లాదేశీయులు ఫేక్ డాక్యుమెంట్లు ఉపయోగించి ఇండియన్ పాస్‌పోర్టులు పొందేందుకు సహాయం చేసినట్లు చూపింది. అంతేకాకుండా 9మంది బంగ్లాదేశీయుల దరఖాస్తులు పెండింగ్‌లో ఉన్నాయని కూడా స్టోర్ డేటా ద్వారా వెల్లడైంది.

# రెండేళ్లలో అసంపూర్తి ప్రాజెక్టులు పూర్తి

### అధికారులకు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఆదేశం

**ప్రజాపక్షం / హైదరాబాద్ :** రానున్న రెండేళ్లలో (2027 జూన్ నాటికి) రాష్ట్రంలో కృష్ణా నదిపై అసంపూర్తిగా ఉన్న సాగు నీటి ప్రాజెక్టులను పూర్తి చేయాలని ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి అధికారులను ఆదేశించారు. అందుకు అనుగుణంగా నిర్ణీత గడువుతోపాటు లక్ష్యాలను నిర్దేశించుకోవాలని చెప్పారు. తక్కువ ఖర్చుతో పూర్తి అయ్యే ప్రాజెక్టుల పనులను వేగంగా చేపట్టాలని సూచించారు. ప్రాజెక్టులను ప్రాధాన్యత క్రమంలో పూర్తి చేయాలన్నారు. కృష్ణా బేసిన్ లో ప్రాధాన్యంగా ఎంచుకున్న ప్రాజెక్టులకు నిధులకు ఇబ్బంది లేకుండా చూడాలని ఆర్థిక శాఖను సిఎం ఆదేశించారు. భూసేకరణ వేగంగా పూర్తయ్యేందుకు రెవెన్యూ విభాగంతోనూ సమన్వయం చేసుకోవాలని.. స్పెషల్ ఆఫీసర్లు పనులను వేగవంతం చేయాలని చెప్పారు. ఇటీవల కొత్తగా ఉద్యోగాలకు ఎంపికైన 244 మంది అసిస్టెంట్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్లు, 199 మంది జూనియర్ టెక్నికల్ ఆఫీసర్లకు బుధవారం సాయంత్రం జలసౌధ ప్రాంగణంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నియామక పత్రాలను అందించారు. అనంతరం రాష్ట్రంలో పెండింగ్‌లో ఉన్న సాగునీటి ప్రాజెక్టులపై ముఖ్యమంత్రి జలసౌధలో సమీక్ష సమావేశం నిర్వహించారు. సూదిని జైపాల్ రెడ్డి పాలమూరు రంగారెడ్డి ప్రాజెక్టును ఉద్దండాపూర్ వరకు మొదటి ప్రాధాన్యంగా పూర్తి చేయాలని ముఖ్యమంత్రి అధికారులను ఆదేశించారు. ఉద్దండాపూర్ వరకు పెండింగ్‌లో ఉన్న పనులు 18 నెలల్లో పూర్తి చేయాలని, అందుకు వీలుగా కార్యాచరణ ప్రణాళిక చేసుకోవాలని చెప్పారు. కోయిల్ సాగర్ లిఫ్ట్ ప్రాజెక్టును కూడా వచ్చే ఏడాది జూన్ లోగా పూర్తి చేయాలని చెప్పారు.

మహాత్మగాంధీ కల్వకుర్తి లిఫ్ట్, జహహర్ నెట్టెంపాడు లిఫ్ట్, రాజీవ్ భీమా లిఫ్ట్ ప్రాజెక్టులను ఈ ఏడాది డిసెంబర్ లోపు పూర్తి చేయాలని నిర్ణయించారు. వీటికి సంబంధించి పెండింగ్ లో ఉన్న పనులు, కావాల్సిన నిధుల వివరాలను సీఎం అడిగి తెలుసుకున్నారు. కృష్ణా జలాల్లో తెలంగాణకు న్యాయబద్ధంగా రావాల్సిన వాటాల సాధనకు చేస్తున్న ప్రయత్నాలను మరింత ముమ్మరం చేయాలని ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి అధికారులను ఆదేశించారు. తెలంగాణ ప్రయోజనాలను అత్యంత ప్రాధాన్యంగా గుర్తించాలని అన్నారు. కృష్ణా నది పరివాహక ప్రాంతం సుమారు 70 శాతం తెలంగాణలో ఉంటే కేవలం 30 శాతం మాత్రమే ఎపిలో ఉన్నందున.. కృష్ణా జలాల్లో 70 శాతం వాటా తెలంగాణ రాష్ట్రానికి తెచ్చుకునేలా ట్రిబ్యునల్ ఎదుట పట్టుబట్టాలని చెప్పారు. గోదావరి బేసిన్ నుంచి పట్టిసీమ ద్వారా ఎపి తీసుకుంటున్న 90 టిఎంసిలను ఎగువన వాడుకునేలా నీటి కోటా పెంచుకోవాలని చెప్పారు. ఈ అంశాలన్ని కృష్ణా బోర్డు దృష్టికి తీసుకెళ్లాలని సూచించారు.

తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు నాటికి కృష్ణా పై నిర్మాణం లో ఉన్న అన్ని ప్రాజెక్టులకు కేటాయించిన నిర్ణీత నీటి వాటాల విషయంలో ప్రభుత్వ వాదనలు సమర్థంగా ఉండాలని అప్రమత్తం చేశారు. పాలమూరు రంగారెడ్డి ప్రాజెక్టు చేపట్టేటప్పుడు జారీ చేసిన ఉత్తర్వుల ప్రకారం నీటి వాటాల అనుమతులు తీసుకోవాలని ముఖ్యమంత్రి సూచించారు.

## బాధిత కుటుంబానికి ఆర్థికసాయం



**ప్రజాపక్షం/వంగూర్ :** మండలపరిధిలోని తిరుమలగిరి గ్రామానికిచెందిన మూడవత్‌లక్ష్మణ్‌నాయక్ అనారోగ్యంతో గతకొద్దిరోజులుగా చికిత్సపొందుతూ మంగళవారం సాయంత్రం మృతిచెందారు. సమాచారం తెలుసుకున్న ఎమ్మెల్యే డాక్టర్ వంశీకృష్ణ బుధవారం బాధిత కుటుంబాన్ని పరామర్శించి రూ.20వేల ఆర్థికసాయం అందజేశారు. పరామర్శించినవారిలో కాంగ్రెస్‌పార్టీ నాయకులు క్యామమల్లయ్య, కడారివెంకటయ్యయాదవ్, కిషన్‌నాయక్, తిరుపతయ్య, గోవర్ధన్, రవి పాల్గొన్నారు.

## ఉమ్మడి మహబూబ్‌నగర్ ఒబిసి ప్రధాన కార్యదర్శిగా రమేష్ యాదవ్ ఎంపిక



**ప్రజాపక్షం/మహబూబ్‌నగర్ ప్రతినిధి :** ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లా కలెక్టర్ పార్టీ ఓబిసి సెల్ ప్రధాన కార్యదర్శిగా హన్వాడ మండలంలోని గొం డ్యాల గ్రామానికి చెందిన రమేష్ యాదవ్ ఎంపికైయ్యారు. అందుకు సం బంధించిన నియామక పత్రాన్ని మహబూబ్‌నగర్ ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్ రెడ్డి తన క్యాంపు కార్యాలయంలో రమేష్ యాదవ్ కు అందజేసి శుభాకాంక్షలు తెలియజేశారు.ఈ కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ మల్లు నర్సింహ్మారెడ్డి, హ న్వాడ మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు వి.మహేందర్, టంకర కృష్ణయ్య యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

## విద్యార్థులు ఉన్నత శిఖరాలకు చేరుకోవాలి



**ప్రజాపక్షం/ మహబూబ్ నగర్ ప్రతినిధి :** ఎంసెట్‌లో ఉత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థులు ఉన్నత శిఖరాలకు చేరుకోవాలని ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్ రెడ్డి అన్నారు. మహబూబ్ నగర్ పట్టణానికి చెందిన రిషి జూనియర్ కళాశాల విద్యార్థులు ఎంసెట్ అగ్రికల్చర్, ఇంజనీరింగ్ విభాగంలలో అద్భుతమైన ఫలితాలు సాధించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యేని వారి క్యాంపు కార్యాలయంలో కళాశాల డైరెక్టర్లు, విద్యార్థులు, వారి తల్లిదండ్రులు మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా రాష్ట్ర స్థాయిలో అగ్రికల్చర్ విభాగంలో 73వ ర్యాంకు సాధించిన స్వర్ణ కుమారిని, ఇంజనీరింగ్ విభాగంలో 1521వ ర్యాంకు సాధించిన ప్రనీత్ కుమార్ రెడ్డి ని ఎమ్మెల్యే ఘనంగా సన్మానించి అభినందించారు. అనంతరం మౌంట్ బేసిల్ పాఠశాల కు చెదిన విద్యార్థులు సిబిఎస్ఇ ఫలితాలలో 500 మార్కులకు 492 మార్కులు సాధించిన ఎన్ సాయి శ్రీ చరణ్, 484 మార్కులు సాధించిన పి. చేతన్ లను ఆయన ఘనంగా సన్మానించారు. వీరితో పాటుగా పదవ తరగతి లో (సిబిఎస్ఇ) ఉత్తమ ఫలితాలు సాధించిన పలువురు విద్యార్థినీ విద్యార్థులను ఆయన సందర్భంగా సన్మానించి అభినందించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల చైర్మన్ చంద్రకళ వెంకటయ్య, డైరెక్టర్లు, శిరీష్, ప్రవీణ్ కుమార్, పూజిత, మోహన్ రెడ్డి, సుశాంత్ , కృష్ణ, ప్రిన్సిపాల్స్ భూపాల్ రెడ్డి, సోమశేఖర్ రెడ్డి , విద్యార్థులు వారి తల్లిదండ్రులు పాల్గొన్నారు.

## మహిళలను వేధిస్తే చట్ట ప్రకారం చర్యలు





**ప్రజాపక్షం/నారాయణపేట్ :** జిల్లా ఎస్పి యోగేష్ గౌతమ్ ఆదేశాల మేరకు నారాయణపేట్ మండలం, కోటకొండ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల లోని సమ్మర్ క్యాంప్‌లో ఉన్న విద్యార్థులకు షి టీమ్ పోలీసులు పలు సామాజిక అంశాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించి మహిళలను, చిన్న పిల్లలను వేధిస్తే చట్ట ప్రకారం చర్యలు తీసుకోవడం జరుగుతుందని తెలిపారు. ఈ సందర్భంగా షీ టీం పోలీసులు చెన్నయ్య మాట్లాడుతూ విద్యార్థులు చదువుతోపాటు క్రీడల్లో రాణించాలని తెలిపారు. అందరూ సమ్మర్ క్యాంపు ను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. మహిళలకు షి టీమ్ పోలీసులు అండగా ఉంటారని మహిళలను, విద్యార్థులను ఎవరైనా వేధించిన శారీరకంగా మానసికంగా బాధపెట్టిన ధైర్యంగా షి టీమ్ పోలీసులకు నెం: 8712670398కి సమాచారం ఇవ్వాలని సమాచారం ఇచ్చిన వారి వివరాలు గోప్యంగా ఉంచి చట్ట ప్రకారం వేధించిన వారిపై చర్యలు తీసుకోవడం జరుగుతుందని తెలిపారు. అలాగే విద్యార్థులు సైబర్ నేరాల పట్ల అప్రమత్తంగా ఉండాలని తెలిపారు. ఒకవేల సైబర్ నేరానికి గురైతే 1930 టోల్ ఫ్రీ నెంబర్‌కు సమాచారం ఇవ్వాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు షీ టీం పోలీసులు జ్యోతి, కవిత, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

## మక్తల్ బస్టాండ్‌లో తనిఖీలు



**ప్రజాపక్షం/మక్తల్ :** జిల్లా ఎస్పి యోగేష్ గౌతమ్ ఆదేశాల మేరకు మక్తల్ బస్టాండ్‌లో దొంగతనాలు నిర్మూలించడానికి ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నామని మక్తల్ పోలీసు కానిస్టేబుల్ మహేష్ తెలిపారు. బుధవారం మక్తల్ బస్టాండ్‌లో ఫింగర్ ప్రింట్స్ డివైఎస్‌తో ఆకస్మికంగా తనిఖీలు నిర్వహించడం జరిగిందని, బస్టాండ్‌లో ప్రయాణికుల మాటున కొంతమంది వ్యక్తులు రద్దీగా ఉన్న సమయంలో దొంగతనాలకు పాల్పడుతున్నారని అలాంటి వా టికి చెక్ పెట్టడానికి ఆకస్మికంగా తనిఖీలు నిర్వహించడం జరుగుతుందని తెలిపారు. ప్రజలు ప్రయాణికులు దొంగతనాల పట్ల అప్రమత్తంగా ఉండాల ని తెలిపారు. బస్టాండ్‌లో ప్రయాణికులు బస్సు ఎక్కి దిగే సమయంలో జాగ్రత్తలు పాటించాలని, తమ విలువైన బంగారు వస్తువులను బ్యాగులను, పర్సులను జాగ్రత్తగా ఉంచుకోవాలని, అపరిచిత వ్యక్తులు ఏమైనా తినుబండరాలిస్తే తీసుకోరాదని ప్రయాణికులకు సూచించారు. అనుమనాస్పదంగా ఏవరైనా కనిపిస్తే వెంటనే డయల్ 100కి లేదా లోకల్ పోలీసులకు సమాచారం ఇవ్వాలని తెలిపారు.

## గ్రామ దేవతల గుడిల నిర్మాణానికి విరాళం



**ప్రజాపక్షం / పెబ్బేరు :** పెబ్బేరు మున్సిపాల్టీలో అంతర్భాగంగా ఉన్న చెలిమిళ్ల కిష్టారెడ్డి పేట శివార్లలో కొత్తగా నిర్మితమై ప్రతిష్టకు సిద్ధమవుతున్న గ్రామ దేవతల ఆలయాలు పెద్దమ్మ గుడి, కర్రెమ్మ గుడి, కోట మశమ్మ గుడిల నిర్మాణాలకు తమవంతు సహాయంగా బేడ బుడగ జంగం సంఘం తరపున ఒక లక్ష నలభై వేల రూపాయలను పెద్దమ్మ పండుగ ఉత్సవ కమిటీ సభ్యులకు అందజేశారు. విరాళం అందించిన సంఘం సభ్యులకు ఉత్సవ కమిటీ నిర్వాహకులు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో బేడ బుడగ జంగహం సంఘం సభ్యులు, పెద్దమ్మ, పండుగ ఉత్సవ కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

## పేద విద్యార్థులకు ఆర్థిక సాయం

**ప్రజాపక్షం/నారాయణపేట్ :** పేదరికం కారణంగా చదువుకు దూరమవుతున్న విద్యార్థులకు చేయూతనిచ్చేందుకు భీష్మరాజ్ ఫౌండేషన్ కృషి చేస్తుందని ఫౌండేషన్ చైర్మన్ డా.కె.రాజ్‌కుమార్ రెడ్డి అన్నారు. ఇటీవల వెలువడిన పరీక్షా ఫలితాలలో పదవతరగతి, ఇంటర్మీడియట్‌లో అత్యధిక మార్కులు సాధించిన విద్యార్థిని విద్యార్థులకు భీష్మరాజ్ ఫౌండేషన్ ఆర్థిక స హాయాన్ని అందజేశారు. ఈ సందర్భంగా రాజ్ కుమార్ రెడ్డి మాట్లాడుతూ పేదరికం కారణంగా చదువులకు దూరం అవుతున్న పేద విద్యార్థినీ విద్యార్థులకు చేయూతనిచ్చేందుకు తమవంతు కృషి చేస్తున్నామని తెలిపారు. చదువుకునే ఆసక్తి ఉండి ఫీజులు కట్టలేక చదువుకు దూరం అవుతున్న వారికి స హాయం చేసేందుకు తాము సిద్ధంగా ఉన్నామన్నారు. ఈ కార్యక్రమంలో ఫౌండేషన్ సభ్యులు గడ్డం తిప్పన్న, పోలీసు పటేల్ మధుసూదన్ రెడ్డి, సుదర్శన్ రెడ్డి, గోపాల్ గౌడ్, హన్మంతు ముదిరాజ్, శివరాజ్, వై. సంతోష్, జేవీ. రావు, అశోక్ నర్సింహనాయుడు, ఎం. సంతోష్ తదితరులు పాల్గొన్నారు.



# మక్తల్‌లో డయాలసిస్ సెంటర్ ఏర్పాటు చరిత్రాత్మకం

### ఎమ్మెల్యే డాక్టర్ వాకిటి శ్రీహరి



**ప్రజాపక్షం/ మక్తల్ :** మక్తల్ నియోజకవర్గ వాసులకు దశబ్దాలుగా ఎదురుచూస్తున్న డయాలసిస్ సెంటర్ పూర్తిస్థాయి సౌకర్యాలతో అన్ని హంగులతో అందుబాటులోకి వచ్చిందని, ఇక మీదట మక్తల్ నియోజకవర్గం ప్రజలు డయాలసిస్ సేవల కోసం నారాయణపేట లేదా మహబూబ్ నగర్‌కు వెళ్లాల్సిన అవసరం లేదని పూర్తిగా మక్తల్ ప్రభుత్వాసుపత్రి పరిధిలోని డయాలసిస్ సెంటర్ లో సేవలను ఉచితంగా అందుకోవచ్చని ఎమ్మెల్యే డాక్టర్ వాకిటి శ్రీహరి తెలిపారు. బుధవారం డయాలసిస్ సెంటర్లో అయిదు పడకల సామర్థ్యంతో పేషెంట్లకు డయాలసిస్ సేవలను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే వాకిటి శ్రీహరి మాట్లాడుతూ. గత జనవరిలో వైద్యారోగ్య శాఖామంత్రి దామోదర్ రాజనర్సింహ చేతుల మీదుగా డయాలసిస్ సెంటర్ ను దాదాపు కోటి నలభై లక్షల రూపాయలతో ప్రారంభించుకున్నామని, అయితే కొన్ని సౌకర్యాలు అందుబాటులో లేక కాస్త ఆలస్యమైందని, ప్రస్తుతం అన్ని సౌకర్యాలు కల్పించి పూర్తి స్థాయిలో డయాలసిస్ సెంటర్ సేవలను ప్రారంభించుకున్నామని తెలిపారు. దీనిపై ప్రతిపక్షాలు అనవసరంగా రాద్ధాంతం చేశాయని, గత 10 ఏళ్లుగా మక్తల్‌లో డయాలసిస్ సెంటర్ ప్రారంభించాలని ఎందుకు గత పాలకులకు ఆలోచన రాలేదని ప్రశ్నించారు. గత ప్రభుత్వ హయాంలో రాష్ట్ర వ్యాప్తంగా దాదాపు 100కు పైగా నియోజకవర్గాలుంటే 100కు పైగానే నియోజకవర్గాల్లో డయాలసిస్ సెంటర్ సేవలు అందుబాటులోకి రాగా మక్తల్ నియోజకవర్గంలో మాత్రం డయాలసిస్ సెంటర్‌ను గత పాలకులు ఎందుకు ప్రారంభించలేదని ప్రశ్నించారు. సరిహద్దు గ్రామాల్లో ఉన్న ప్రజలు గతంలో నారాయణ పేట లేదా మహబూబ్‌నగర్‌కు వెళ్లాలంటే వందకు పైగా కిలోమీటర్లు ప్రయాణించి వ్యయా ప్రయాసలకోర్చి డయాలసిస్ సేవల కోసం చాలా ఇబ్బందులు పడేవారని అన్నారు. ఇక మీదట మక్తల్ లోనే డయాలసిస్ సెంటర్ సేవలు ప్రారంభంతో ప్రజల ఇబ్బందులు తొలగించామన్నారు. డయాలసిస్ సెంటర్ నిర్వహణ కోసం దాదా పు నెలకు 5 నుంచి 6 లక్షల వరకు వ్యయం అవుతుందని, ఏడాదికి కనీసం 60 లక్షల రూపాయలు డయాలసిస్ సెంటర్ నిర్వహణకు ఖర్చు చేయాల్సి ఉంటుందని తెలిపారు. ఇప్పటికే మక్తల్‌లో 150 పడకల ఆసుపత్రి పనులను ప్రారంభించుకున్నామని. అతి త్వరలో నిర్మాణం పూర్తి చేసుకొని ప్రజలకు అందుబాటులోకి తీసుకొస్తామని హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా డయాలసిస్ సెంటర్ సిబ్బందని ఎమ్మెల్యే వాకిటి శ్రీహరి శాలువా కప్పి సత్కరించారు. ఈ కార్యక్రమంలో మాజీ జెడ్పిటిసి లక్ష్మారెడ్డి, మార్కెట్ వైస్ చైర్మన్ గణేష్ కుమార్, టౌన్ ప్రెసిడెంట్ రవి కుమార్, నేతలు చంద్రకాంత్ గౌడ్, కోళ్ళ వెంకటేష్, మాగనూరు మండల అధ్యక్షుడు ఆనంద్ గౌడ్, శివరాం రెడ్డి, మార్కెట్ డైరెక్టర్లు ఫయాజ్, శాలంబిన్ ఉమర్, నేతలు వల్లంపల్లి లక్ష్మణ్, కావలి తాయప్ప, గాయత్రి అనిల్ తదితరులు పాల్గొన్నారు.

# మెడికల్ కళాశాలను సందర్శించిన కలెక్టర్ సిక్తా పట్నాయక్



**ప్రజాపక్షం/నారాయణపేట్ :** నారాయణపేట్ మండలంలోని అప్పక్ పల్లి సమీపంలో ఉన్న ప్రభుత్వ మెడికల్ కళాశాలను బుధవారం జిల్లా కలెక్టర్ సిక్తా పట్నాయక్ సందర్శించారు. మెడికల్ కళాశాల ఆవరణలో రూ.26 కోట్ల వ్యయంతో నిర్మించబోయే నర్సింగ్ కళాశాల కోసం స్థలాన్ని, అలాగే రూ. 24 కోట్లతో నిర్మించే ఎంసిహెచ్ మదర్ అండ్ చైల్డ్ హెల్త్ సెంటర్ స్థలాన్ని కూడా కలెక్టర్ పరిశీలించారు. ఎంసిహెచ్ నర్సింగ్ కళాశాల నిర్మాణ పనులను వీలైనంత త్వరగా ప్రారంభించాలని టీజీ ఎంఎస్ఐడిసి ఇఇ రాజేందర్‌ను ఆదేశించారు. అనంతరం మెడికల్ కళాశాల నర్సింగ్ కళాశాల తరగతి గదులకు వెళ్లి తరగతులు నిర్వహణను పర్యవేక్షించారు. నర్సింగ్ విద్యార్థినులతో కలెక్టర్ మాట్లాడారు. నర్సింగ్ కళాశాలలో ఏమైనా సమస్యలు ఇబ్బందులు ఉన్నాయా అని విద్యార్థినులతో వాకబు చేశారు. కొందరు విద్యార్థినిలు భోజనం సరిగ్గా ఉండటం లేదని కలెక్టర్ దృష్టికి తీసుకురాగా స్పందించిన కలెక్టర్ వంట ఏజెన్సీ వాళ్లతో మాట్లాడి నాణ్యమైన, రుచికరమైన భోజనాన్ని విద్యార్థినులకు అందించేలా చర్యలు తీసుకోవాలని కళాశాల ప్రిన్సిపల్‌కు సూచించారు. ఇందిరమ్మ ఇంటి నిర్మాణాల పరిశీలన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి గత ఫిబవరి 21న నారాయణపేట్ మండలం అప్పక్‌పల్లి గ్రామంలో భూమి పూజ చేసిన ఇందిరమ్మ ఇంటి నిర్మాణ పనులకు కలెక్టర్ సిక్తా పట్నాయక్ పరిశీలించారు. ఇంటి నిర్మాణ పనులు ఇంకా బేస్ మెంట్ స్థాయిలోనే కొనసాగుతుండగా, నిర్మాణ పనులను వేగంగా చేయించాలని ఇంటి యాజమానినీ, హౌసింగ్ పీడీ శంకర్‌ను ఆమె ఆదేశించారు. అలాగే అదే గ్రామంలో నిర్మిస్తున్న మరో ఇందిరమ్మ ఇంటి నిర్మాణ పనులను కూడా కలెక్టర్ పరిశీలించి, తొందరగా పూర్తి చేయాలని సూచించారు. చివరగా కలెక్టర్ సింగారం చౌరస్తాలో జిల్లా మహిళా సమాఖ్య ఆధ్వర్యంలో నడుస్తున్న పెట్రోల్ బంక్‌ను పరిశీలించి, రోజుకు ఎన్ని లీటర్ల పెట్రోల్, డీజిల్ విక్రమం జరుగుతుందని సిబ్బంది జీతాలు పోగా నెలకు ఎంత లాభం వస్తుందని జిల్లా మహిళా సమాఖ్య అధ్యక్షురాల చంద్ర కళ ను అడిగి తెలుసుకున్నారు. పెట్రోల్ బంక్ ఆర్థిక లావాదేవీల రికార్డులను కలెక్టర్ క్షుణ్ణంగా పరిశీలించారు. ఈ కార్యక్రమంలో డిఆర్డీవో మొగులప్ప, డి జి ఎం ఎస్ఐ డిసిడి ఈ కృష్ణమూర్తి, ఏ.ఈ సాయి మురారి, ఎంపీడీవో సుదర్శన్ తదితరులు పాల్గొన్నారు.

## కొనుగోళ్లు వేగవంతం చేయండి

### ఎమ్మెల్యే అనిరుధ్ రెడ్డి ఆదేశం

**ప్రజాపక్షం/ జడ్చర్ల :** జడ్చర్ల నియోజకవర్గం పరిధిలోని వివిధ మండలాల్లో ధాన్యం కొనుగోళ్ళను వేగవంతం చేయాలని జిల్లా పౌర సరఫరాల శాఖ అధికారి రవి నాయక్‌కు జడ్చర్ల ఎమ్మెల్యే జనంపల్లి అనిరుధ్ రెడ్డి కోరారు. నియోజకవర్గంలోని కొన్ని మండలాలలో ధాన్యం కొనుగోళ్లు సక్రమంగా జరగడంలేదనే ఫిర్యాదులు తన దృష్టికి రావడంతో బుధవారం సాయంత్రం ఈ విషయం గురించి ఎమ్మెల్యే సివిల్ సప్లై డిఎంతో ఫోన్‌లో మాట్లాడారు. అన్ని మండలాల్లో కూడా ధాన్యం కొనుగోళ్లను వేగవంతం చేయాలని రైతులు ఇబ్బంది పడకుండా చూడాలని ఎమ్మెల్యే ఆదేశించారు. ఈ మేరకు చర్యలు తీసుకుంటామని అన్ని ప్రాంతాల్లోనూ ధాన్యం కొనుగోళ్ళను వేగవంతం చేస్తామని ఈ సందర్భంగా సివిల్ సప్లై డిఎం రవి నాయక్ ఎమ్మెల్యేకు హామీ ఇచ్చారు.

## హజ్ యాత్ర దంపతులకు ఆత్మీయ సత్కారం

**ప్రజాపక్షం/కొత్తకోట :** కొత్తకోట పట్టణానికి చెందిన అబ్దుల్ హఫీజ్ దంపతులకు ప్రముఖ కార్పెంటరీ కార్మిక సంఘం నాయకులు హజ్ యాత్రకు వెళ్తున్న సందర్భంగా భారతీయ జనతా పార్టీ ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించడం జరిగింది. బిజెపి నీతి రీతి ఈ సన్మాన కార్యక్రమాన్ని పురస్కరించుకొని కొమ్ము భరత్ భూషణ్ బిజెపి నాయకులు మాట్లాడారు. 44 సంవత్సరాల ఆర్ఎస్ఎస్ కార్యకర్తగా 32 సంవత్సరాల భారతీయ జన తా పార్టీ నాయకుడిగా సంఘ పరివార్ ఈ దేశంలోని అన్ని మత సాంప్రదాయాలను గౌరవిస్తుందని తెలిపా రు. ఈ కార్యక్రమంలో పట్టణ అధ్యక్షులు పట్టణ వనపర్తి శ్రీనివాస్ రెడ్డి, సబిరెడ్డి వెంకట్ రెడి తదితరులు పాల్గొన్నారు.

## బావిలోదూకి వ్యక్తి ఆత్మహత్య

**ప్రజాపక్షం/బిజినేపల్లి :** క్షణికావేశంలో మొల్గర శ్రీనివాసులు(55)అనే వ్యక్తి బావిలోదూకి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. బుధవారం ఎస్ఐ కె.శ్రీనివాస్ తెలిపిన వివరాల ప్రకారం మండలంలోని పాలెంగ్రామానికి చెందిన మృతుడు శ్రీనివాసులు భార్య నీలమ్మ కుటుంబపోషణ భారమై కొట్లాడుకున్నారు. క్షణికావేశానికి గురైన శ్రీనివాసులు గ్రామసమీపంలోని అయ్యగారిబావిలోదూకి ఆత్మహత్యకు పాల్పడినట్లు మృతుడి కుమారుడు సిద్ధు ఫిర్యాదు మేరకు కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.బావిలోనుంచి శవాన్ని బయటకుతీసి నాగర్‌కర్నూల్ జిల్లా ఆస్పత్రికి తరలించి పోస్టుమార్టం అనంతరం కుటుంబసభ్యులకు అప్పగించినట్లు తెలిపారు.

# ధాన్యం సేకరణలో పకడ్బందీగా చర్యలు

### జిల్లా కలెక్టర్ బదావత్‌సంతోష్



**ప్రజాపక్షం/నాగర్‌కర్నూల్‌ప్రతినిధి :** కొనుగోలు కేంద్రాల ద్వారా వరిధాన్యం సేకరణలో జాప్యానికి తావులేకుండా ప్రణాళికబద్ధంగా చర్యలు చేపట్టాలని జిల్లా కలెక్టర్ బదావత్‌సంతోష్ అధికారులకు సూచించారు. బుధవారం నాగర్‌కర్నూల్ మండలం వనపట్ల గ్రామంలో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఆకస్మికంగా తనిఖీచేశారు. ధాన్యం కొనుగోలుప్రక్రియ సజావుగా పూర్తయ్యేందుకుగాను సంబంధిత అధికారులు కేంద్రాల వద్ద క్షేత్రస్థాయిలో అందుబాటులో ఉంటూ ధాన్యం సేకరణను నిశితంగా పర్యవేక్షణ చేయాలని ఆదేశించారు. రైతులు తరలించిన ధాన్యం నిల్వలను పరిశీలించారు. రైతులనుండి ఇప్పటివరకు సేకరించిన ధాన్యం నిల్వలు, మిల్లులకు తరలించిన ధాన్యం గురించి నిర్వాహకులను వివరాలు అడిగి తెలుసుకొని రికార్డులను పరిశీలించారు. వనపట్ల గ్రామంలోగల కేంద్రంలో ధాన్యం కొనుగోళ్లలలో ఒకింత జాప్యం జరుగుతోందని రైతులు కలెక్టర్ దృష్టికితేగా, కేంద్రం నిర్వాహకులతీరుపై కలెక్టర్ ఆగ్రహం వ్యక్తంచేశారు. జిల్లా యంత్రాంగం ఆధ్వర్యంలో అన్ని సదుపాయాలు సమకూరుస్తున్నప్పటికి ధాన్యం సేకరణలో ఎందుకు జాప్యం జరుగుతోందని నిలదీశారు. ఎట్టి పరిస్థితుల్లోను రైతులు ఇబ్బందులుపడకూడదని, కేంద్రాలకు ధాన్యంతెచ్చినవెంటనే నాణ్యత ప్రమాణాలను పరిశీలించి తూకం జరిపించాలని నిర్వాహకులను ఆదేశించారు.

**కొండారెడ్డిపల్లి గ్రామ అభివృద్ధి పనులు వేగవంతం**

వంగూరు మండలం కొండారెడ్డిపల్లి గ్రామ అభివృద్ధిపనులను జిల్లా కలెక్టర్ బదావత్‌సంతోష్ పరిశీలించి సమీక్షించారు. బుధవారం నాగర్‌కర్నూల్ జిల్లా అచ్చంపేట నియోజకవర్గం వంగూరు మండలం కొండారెడ్డిపల్లి గ్రామంలోని గ్రామపంచాయతీ కార్యాలయంలో గ్రామంలో జరుగుతున్న పలు అభివృద్ధిపనులను సంబంధితశాఖల అధికారులతో రైతు కమీషన్‌సభ్యులు కెవి నర్సింహ్మారెడ్డి, జిల్లా ఎస్‌పి వైభవ్‌గైక్వాడ్‌రఘునాథ్‌లతో కలిసి జిల్లా కలెక్టర్ బదావత్‌సంతోష్ సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా జిల్లా కలెక్టర్ బదావత్‌సంతోష్ మాట్లాడుతూ కొండారెడ్డిపల్లి గ్రామంలోని రెండు వరుసల రహదారి పనులు వేగంగా పూర్తిచేయాలని అధికారులకు సూచించారు. పాలశీతలీకరణ నూతన భవననిర్మాణపనులు, గ్రామంలో ప్రతి ఇంటికి సోలార్‌విద్యుత్ కల్పించే పనులను పూర్తిచేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. గ్రామంలో పలు పనులను త్వరగా పూర్తిచేయాలని అధికారులను ఆదేశించారు. అంతకుముందు కొండారెడ్డిపల్లిలో రైతు కమీషన్‌సభ్యులు కెవి నర్సింహ్మారెడ్డి, జిల్లా ఎస్‌పి వైభవ్‌గైక్వాడ్‌రఘునాథ్, సంబంధిత శాఖల అధికారులతోకలిసి క్షేత్రస్థాయిలో జరుగుతున్న పలు అభివృద్ధిపనులను జిల్లా కలెక్టర్ పరిశీలించారు.

**ముఖ్యమంత్రి సభాఏర్పాట్లను పర్యవేక్షన**


నాగర్‌కర్నూల్ జిల్లా అచ్చంపేట నియోజకవర్గం అమ్రాబాద్ మండలం మాచారం గ్రామంలో రాష్ట్రప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగాచేపట్టిన ఇందిరా సౌరగిరి జలవికాసపథకం ప్రారంభోత్సవ ఏర్పాట్లను అదనపు కలెక్టర్ దేవసహాయం, జిల్లా ఎస్‌పి వైభవ్‌గైక్వాడ్‌రఘునాథ్‌లతోకలిసి జిల్లా కలెక్టర్ బదావత్‌సంతోష్ పర్యవేక్షించారు. మే 18న రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, ఉపముఖ్యమంత్రి మల్లుభట్టివిక్రమార్క గిరిజనుల సమగ్రాభివృద్ధికి రూపుదిద్దుకున్న ఇందిరా సౌరగిరిజలవికాస పథకంను అధికారికంగా ప్రారంభించనున్నారు. ఈ పథకంద్వారా రాష్ట్రంలో గిరిజనుల భూముల అభివృద్ధికి, సాగునీటి సదుపాయాలకల్పనకు, జీవనోపాధి మెరుగుదలకు దోహదపడేలా రూ. 12,600 కోట్ల వ్యయంతో ఈపథకం అమలు చేయనున్నారు. మొత్తం 6లక్షల ఎకరాల గిరిజన భూములు ఈపథకానికి ఎంపికకావడంద్వారా ఇందిరా సౌరగిరిజలవికాస పథకం ద్వారా 2.10లక్షలమంది గిరిజన రైతులు లబ్ధిపొందనున్నారని తెలిపారు. కార్యక్రమంలో డిఆర్‌డిఏ అధికారి చిన్న ఓబులేసు, డిపిఓ రాంమోహన్‌రావు, అచ్చంపేట ఆర్‌డిఓ మాధవి, ఉద్యానవనశాఖ అధికారులు వెంకటేశం, జగన్, ఆర్‌డబ్ల్యూఎస్ అధికారిణి హేమలత, సంబంధితశాఖల అధికారులు పాల్గొన్నారు.

## ఆన్‌లైన్‌లో ధాన్యం నమోదు వేగవంతం




**ప్రజాపక్షం/బిజినేపల్లి :** రైతులనుంచి సేకరించిన ధాన్యం ఆన్‌లైన్ నమోదును వేగవంతం చేయాలని ఐకెపి సిబ్బందిని ఏపిఎం విజయ ఆదేశించారు. మండలంలోని మంగనూరులోని ఐకెపి కొనుగోలుకేంద్రాన్ని మార్కెటింగ్‌శాఖ అధికారులతోకలిసి ఆకస్మిక తనిఖీచేసి మాట్లాడారు. ఇప్పటివరకు 688 మంది రైతులనుంచి 40,002క్వింటాల వరిధాన్యం సేకరించగా 626మంది రైతుల వివరాలను ఆన్‌లైన్‌లో నమోదుచేయగా 62మంది వివరాల నమోదు కొనసాగుతుందన్నారు. రైతులు కొనుగోలు కేంద్రానికి తీసుకురావడంతో కేటాయించిన మిల్లుకు ధాన్యం పంపడంతోపాటు వ్యవసాయశాఖ అధికారులతో పంటనమోదు చేపట్టినవారికే ఆన్‌లైన్ నమోదు సాధ్యమవుతుందన్నారు. కౌలు రైతుల వివరాల నమోదుకు ఇబ్బందులు తలెత్తుండటంతోనే భూయజమానుల వివరాలను సేకరించుకొని నమోదు చేపట్టడంతో కొంత ఆలస్యమవుతుందన్నారు. చివరిగింజవరకు వరిధాన్యం రైతులనుంచి కొనుగోలు చేస్తామన్నారు. కార్యక్రమంలో సిసి కళావతి ఉన్నారు.

## వ్యవసాయ అనుబంధ రంగాలతో లాభాలు



**ప్రజాపక్షం/బిజినేపల్లి :** రైతన్నలు ప్రధానంగా పంటలపైనే ఆధారపడకుండా వ్యవసాయరంగ అనుబంధాలైన పాడిపశువుల ద్వారా మంచిలాభాలు పొందవచ్చునని అసిస్టెంట్ ప్రొఫెసర్ శ్రీరామ్ అన్నారు. రైతు ముంగిట్లో శాస్త్రవేత్తలు కార్యక్రమంలో భాగంగా బుధవారం తాడూరు మండలంలో గుంతకోడూరు గ్రామంలో ప్రొఫెసర్ జయశంకర్ వ్యవసాయ విశ్వవిద్యాలయ కళాశాల శాస్త్రవేత్తలు రైతులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ కేవలం వ్యవసాయ పంటలే కాకుండా అనుబంధరంగాలైన పాడిగొర్రెలు యంత్రాలతో రైతన్నలు మంచిలాభాలు పొందవచ్చని సూచించారు.కావున రైతన్నలు వ్యవసాయంతోపాటు అనుబంధరంగాలను కూడా ఏర్పాటు చేసుకోవడంతో ఆర్థికంగా ఎత్తుకు ఎదగవచ్చునని సూచించారు. కార్యక్రమంలో వ్యవసాయ విస్తరణ అధికారి చంద్రప్రకాష్, పిఎసిఎస్‌డైరెక్టర్ కిష్టయ్య, గ్రామమాజీసర్పంచ్ వెంకటయ్య, వ్యవసాయకళాశాల విద్యార్థులు, ఆదర్శ రైతులు పాల్గొన్నారు.

## ధాన్యం కొనుగోలు కాక రైతుల ఆందోళన




**ప్రజాపక్షం / వీపనగండ్ల :** ధాన్యం కొనుగోలు కేంద్రాలు ప్రారంభమైన రెండు నెలలు కావస్తున్నా ధాన్యం కొనుగోలు సరిగ్గా లేకపోవడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. ఆరుకాలం కష్టపడి పంటలను పండిస్తే ధాన్యాన్ని అమ్ముకోవడం కష్టతరంగా మారిందని రైతులు వాపోతున్నారు. గత మూడు రోజులుగా ఈదురుగాలలతో కూడిన వర్షాలు కురుస్తుండటంతో ధాన్యాన్ని భద్రపర్చడం ఇబ్బందిగా మారిందని, కొందరు రైతులకు సరిపడా కవర్లు లేకపోవడంతో వర్షాలకు ధాన్యం తడిచిపోతుందని అంటున్నారు. ప్రతి రోజు ధాన్యం కొనుగోలు చేపట్టి ఎప్పటికప్పుడు రైస్ మిల్లర్లకు గోదాములకు తరలిస్తే ఇబ్బందులు తప్పుతాయని, ఐకెపి సిబ్బంది నిర్వాహకంతో కొనుగోళ్లు సరిగా లేకపోవడం, కొనుగోలు చేసిన ధాన్యం బస్తాలను కూడా తరలించకపోవడంతో రైతులు కొనుగోలు కేంద్రాల వద్దనే రాత్రింబవళ్లు కాపలాకాయాల్సి వస్తుందని రైతులు వాపోతున్నారు. ఇప్పటికైనా పాలకులు అధికారులు చర్యలు తీసుకోని రైతులకు ఇబ్బందులు లేకుండా ఐకెపి కొనుగోలు కేంద్రంతో పాటు సోసైటీ వరి కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేసి ధాన్యం కొనుగోలును వేగవంతం చేయాలని రైతులు కోరుతున్నారు.

## ధాన్యం కొనుగోలులో రైస్ మిల్లర్లకు దోచిపెడుతున్న ప్రభుత్వం

**ప్రజాపక్షం / వీపనగండ్ల :** సీజన్‌లో రైతులు పండించిన వడ్లను ఐకెపి, సహకార సంఘాల ద్వారా వడ్లు కొనుగోలు చేసి జిల్లాలో ఉన్న రైస్ మిల్లర్లకు ఏ మాత్రం తాలు లేకుండా పెట్టాలని ప్రభుత్వమే నిబంధనలు పెట్టి రైతులను దోపిడి చేసి రైస్ మిల్లర్ల కడుపులో నింపే విధంగా ప్రభుత్వం వ్యవహరిస్తుందని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి ఎం. ఆంజనేయులు అన్నారు. బుధవారం మండల పరిధిలోని తూముకుంట గ్రామ ఐకెపి కొనుగోలు కేంద్రాన్ని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి ఎం. ఆంజనేయులు పరిశీలించారు. ఈ సందర్భంగా ఆంజనేయులు మాట్లాడుతూ వరి ధాన్యంలో తాళ్ల శాతం ఉందని చెప్పి మినిమం తాలు శాతాన్ని కూడా మొత్తం లెక్కలో తాలు లెక్కన ఒక బ్యాగుకు ఒక కేజీ నుంచి మూడు కేజీల వరకు తాలు పేరు చెప్పి తీయడం , ఆ తాలును ఆ రైస్ మిల్లర్లు కేజీకి 60 పైసలు చొప్పున అమ్ముకోవడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో గీత కార్మిక సంఘం జిల్లా నాయకులు రామచంద్రయ్య , సిఐటియు నాయకులు ఉన్నారు.



## ప్రజారోగ్యమే కాంగ్రెస్ ప్రభుత్వ ధ్యేయం



**ప్రజాపక్షం /పెబ్బేరు :** వివిధ అనారోగ్య సమస్యల నిమిత్తం ఆసుపత్రిలో చికి త్స తీసుకొని వారికి సంబంధించిన ఆసుపత్రిలో బిల్లులను రాష్ట్ర ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షులు డా.జిల్లెల చిన్నారెడ్డికి దృష్టికి తీసుకెళ్లగా వారు వెంటనే స్పందించి పెబ్బేరు పట్టణ మండల కేంద్రానికి చెందిన 12 మందికి రూ. 2,78,500ల విలువైన సిఎం సహయనిధి చెక్కులను జిల్లా కాంగ్రెస్ పార్టీ అ ధ్యక్షులు రాజేంద్రప్రసాద్ యాదవ్ చేతుల మీదుగా పంపిణీ చేశారు. పెబ్బేరు సింగిల్ విండో కార్యాలయం బాధితులకు చెక్కుల పంపిణీ చేయడం జరిగిం ది. ఈ కార్యక్రమంలో కాంగ్రె పార్టీ సీనియర్ నాయకులు రాంపురం సహదేవుడు, మాజీ ఎంపిటీసీ సభ్యులు మన్యం, పెబ్బేరు పట్టణ కో ఆప్షన్ సభ్యులు ముస్తాక్ , సోషల్ మీడియా పాతపల్లి చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

## కబడ్డీ క్రీడాకారులకు జెర్సీలు

**ప్రజాపక్షం/కొండమల్లేపల్లి:** కొండమల్లేపల్లి మండల కాంగ్రెస్ అధ్యక్షుడు ఊట్కూరి వేమన్‌రెడ్డి సుమారు రూ. 15వేల తన సొంత ఖర్చులతో వెచ్చించి కబడ్డీ క్రీడాకారులకు జెర్సీలను బుధవారం మాజీ ఎంపిపి దూదిపాల రేఖ శ్రీధర్‌రెడ్డి చేతుల మీదుగా అందజేశారు. ఈ సందర్భంగా మాజీ ఎంపిపి మాట్లాడుతూ క్రీడలతో మానసిక ఉల్లాసంతో పాటు శారీరక దారుఢ్యం ఏర్పాడుతుందని అన్నారు. నేటి యువత అన్ని రంగాల్లో రాణించాలని అన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ వైస్ ఎంపిపి కాసర్ల వెంకటేశ్వర్లు, మాజీ ఉప సర్పంచ్ గంధం సురేష్, ఏకుల సురేష్, కాంగ్రెస్ మండల యువ జన అధ్యక్షుడు మూడావత్ మంగ్యానాయక్, రమేష్ నాయక్, ధ్యాన్‌చంద్ స్పోర్ట్స్ క్లబ్ నిర్వాహకులు పిఈటి ఇద్దయ్య, క్రీడాకారులు పాల్గొన్నారు.



## రెవెన్యూ సదస్సులు సద్వినియోగం

యాదాద్రి జిల్లా కలెక్టర్ హనుమంతరావు

**ప్రజాపక్షం/ఆత్మకూర్ (యం)** : భూభారతిలో భాగంగా నిర్వహిస్తున్న రెవెన్యూ సదస్సులను రైతులు సద్వినియోగం చేసుకోవాలని జిల్లా కలెక్టర్ హనుమంతరావు కోరారు. బుధవారం మండల కేంద్రంలో ధర్మాపురం రెవెన్యూ సదస్సును, కొరటికల్ లో నిర్వహిస్తున్న రెవిన్యూ సదస్సులో పాల్గొని మాట్లాడారు. రైతులు తమకు ఉన్న భూ సమస్యలను రెవెన్యూ సదస్సులో దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు. రెవెన్యూ సదస్సులో అదనపు కలెక్టర్ వీరారెడ్డి,తహసిల్దార్ లు లావణ్య,శ్రీనివాస్ రెడ్డి,డిప్యూటీ తహసిల్దార్ సఫీయోద్దీన్,ఆర్ ఐ మల్లికార్జున రావు పాల్గొన్నారు.





## మండల సమగ్రాభివృద్ధికి కృషి

నకిరేకల్ ఎమ్మెల్యే వేముల వీరేశం

**ప్రజాపక్షం/చిట్యాల(నకిరేకల్)** : నల్లగొండ జిల్లా నకిరేకల్ నియోజకవర్గ అభివృద్ధికి నిరంతరం కృషి చేస్తున్నట్లు, అందులో భాగంగా చిట్యాల మండల అభివృద్ధిపై తన దృష్టి ఎల్లపుడూ ఉంటుందని శాసనసభ్యులు వేముల వీరేశం అన్నారు. టియుడబ్ల్యుజె మండల నూతన కార్యవర్గం ఏర్పాటైన సందర్భంగా మర్యాద పూర్వకంగా కలిసిన జర్నలిస్టులతో ఆయన మాట్లాడుతూ మండలంలో డ్రై పోర్టు ఏర్పాటు కోసం తీవ్ర ప్రయత్నాలు జరుపుతున్నట్లు ఆయన తెలిపారు. అలాగే మండలంలోని వెలిమినేడు ఇండస్ట్రియల్ పార్క్‌లో పామాయిల్ తయారీ పరిశ్రమ ఏర్పాటుకు కూడా కృషి చేస్తున్నట్లు ఆయన తెలిపారు. త్వరలోనే చిట్యాల, భువనగిరి రోడ్డు నాలుగు వరసల రోడ్డు పనులకు ముహూర్తం ఖరారు కానుందన్నారు. అర్హులైన జర్నలిస్టులకు ఇండ్ల స్థలాలు, ఇండ్లు కేటాయింపు విషయంలో తన సహకారం జర్నలిస్టులకు ఉంటుందన్నారు. సమాజ శ్రేయస్సులో జర్నలిస్టుల పాత్ర ప్రశంసనీయమైనదని ఈ సందర్భంగా వీరేశం అన్నారు. ఈ సందర్భంగా ప్రెస్ క్లబ్ జిల్లా కార్యదర్శిగా నియామకమైన పెద్ది నరేందర్, మండల టియుడబ్ల్యుజె కార్యవర్గాన్ని శాలువాలతో సత్కరించి అభినందించారు. ఈ కార్యక్రమంలో ప్రెస్ క్లబ్ జిల్లా ఉపాధ్యక్షులు ఏళ్ళ బయ్యన్న, జర్నలిస్టు నాయకులు మెండె వెంకన్న, పోకల కరుణాకర్, చెరుపల్లి శ్రీనివాస్, ఏళ్ళ వెంకన్న, కూనూరు మధు, జిట్ట మల్లేష్, అమరోజు వెంకన్న తదితరులు పాల్గొన్నారు.

## నాణ్యమైన వైద్యాన్ని అందించాలి



**ప్రజా పక్షం/హాలియా:** ప్రైవేట్ ఆసుపత్రుల్లో నిరుపేదలను దృష్టిలో ఉంచుకొని నాణ్యమైన వైద్య సేవలను అందించాలని మాజీ సీఎల్పీ నేత కుందూరు జానారెడ్డి అన్నారు. బుధవారం నల్గొండ జిల్లా హాలియా పట్టణంలోని సాగర్ రోడ్ లో తులసి హాస్పిటల్ ను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ లాభాపేక్ష కాకుండా పేదవాడి ఆర్థిక స్థితిగతులను పరిగణలోకి తీసుకొని అతి తక్కువ ఖర్చులతో వైద్య సేవలను అందించాలన్నారు. అనంతరం హాస్పిటల్ యాజమాన్యం జానారెడ్డిని శాలువాతో ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్సీ ఎంసీ కోటిరెడ్డి, బుసిరెడ్డి ఫౌండేషన్ చైర్మన్ బుసిరెడ్డి పాండురంగారెడ్డి, హాస్పిటల్ డాక్టర్ మాలే సంతోష్ రెడ్డి, మేనేజింగ్ డైరెక్టర్ మల్లు కృష్ణారెడ్డి, మాజీ వైస్ ఎంపీపీ మాలే అరుణ సత్యనారాయణ రెడ్డి, కాంగ్రెస్ జిల్లా కార్యదర్శి కాకునూరి నారాయణ గౌడ్, మండల పార్టీ అధ్యక్షుడు కుందూరు వెంకటరెడ్డి పాల్గొన్నారు.

## ప్రజలకు మెరుగైన సేవలు : ఎస్‌పి




**ప్రజాపక్షం/నల్లగొండ టౌన్:** ప్రజలకు ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటూ సంవర్ధవంతమైన సేవలు అందజేస్తు సత్వర న్యాయం జరిగేలా గ్రామ పోలీసు అధికారులు పని చేయాలని జిల్లా ఎస్పి శరత్ చంద్ర పవార్ అన్నారు. బుధవారం నల్లగొండ జిల్లా పోలీసు కార్యాలయం లో పోలీసు అధికారులతో నిర్వహించిన జూమ్ మీటింగ్ సమావేశంలో జిల్లా ఎస్ పాల్గొని మాట్లాడుతూ గ్రామ పోలీసు అధికారులు ద్వారా ప్రజలకు మెరుగైన సేవలు అందించాలని ప్రతి రోజు వారికి కేటాయించిన గ్రామాలను సందర్శించి ప్రజలతో మమేకం అవుతూ వారి సమస్యల పట్ల పై అధికారులకు తెలియజేస్తూ సత్వర పరిష్కార దిశగా కృషి చేయాలనీ అన్నారు. ప్రజలకు పోలీసులకు మధ్య సత్సంబంధాలు ఏర్పాటు ద్వారా నేర నియంత్రణ సాధ్యం అవుతుందని తెలిపారు. ఇందుకుగాను గ్రామాల్లో కి కొత్తగా వచ్చే అనుమానుమనితుల యొక్క సమాచారం ఎప్పటికప్పుడు గ్రా మ ప్రజలతో సంచారాన్ని సేకరించాలని అప్పుడే గ్రామాల్లో జరిగే నేరా లు నిరోధించడానికి ఉపయోగపడతాయన్నారు. జిల్లా పోలీసు కార్యాలయం లో ఏడుగురు గ్రామ పోలీస్ అధికారులను అభినందించి రివార్డ్ అందజేశారు.

## రానున్న స్థానిక ఎన్నికలలో అన్ని గ్రామాలలో సిపిఐ పోటీ

సిపిఐ మండల కార్యదర్శి పోలేపాక యాదయ్య

**ప్రజాపక్షం/వలిగొండ :** వలిగొండ మండలంలోని నర్సాపురం గ్రామంలో శాఖ మహాసభలు ఓర్సు స్వామి అధ్యక్షతన జరిగినది. ఈ మహాసభకు ముఖ్య అతిథులుగా సిపిఐ మండల కార్యదర్శి పోలేపాక యాదయ్య పాల్గొని మాట్లాడుతూ సంస్థగతంగా అన్ని గ్రామాలలో సిపిఐ పార్టీ గ్రామ శాఖలలో మహాసభలు నిర్వహించుకోవడం జరుగుతున్నది. పార్టీ బలోపేతానికి ఈ మహాసభలు వేదిక కానున్నాయి అని అన్నారు. సంస్థగతపరంగా గ్రామ శాఖ మహాసభలు నిర్వహించి, మండల మహాసభలు నర్సాపురం గ్రామంలో పెద్ద ఎత్తున నిర్వహించబోతున్నామని అన్నారు. ప్రభుత్వం ఎన్నికల సందర్భంగా ఇచ్చిన హామీలను అమలు చేయాలని అన్నారు.రాబోయే స్థానిక ఎన్నికలలో అన్ని గ్రామ శాఖలలో సర్పంచ్, ఎంపీటీసీ, జెడ్పీటీసీ స్థానాలకు పోటీ చేయాలని అన్నారు. అనంతరం నూతన గ్రామ శాఖ ఎన్నుకున్నారు. కార్యదర్శిగా నార్కట్‌పల్లి మచ్చ గిరి, సహాయ కార్యదర్శిగా ఓర్సు స్వామి, కార్యవర్గ సభ్యులుగా ఎల్లంకి మహేష్, కూరెల్ల దేవేందర్, వడ్డేపల్లి లక్ష్మ మ్మలను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.



# చివరి గింజ వరకు ధాన్యం కొనుగోలు

మిల్లర్లు ధాన్యాన్ని వెంటనే దిగుమతి చేసుకోవాలి

సూర్యాపేట జిల్లా కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్



**ప్రజాపక్షం/తిరుమలగిరి:** జిల్లాలో చివరి గింజ వరకు ధాన్యం కొనుగోలు చేయడం జరుగుతుందని రైతులకు జిల్లా కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్ భరోసా ఇచ్చారు. బుధవారం జిల్లా కలెక్టర్ తిరుమలగిరి మండలంలో విస్తృతంగా పర్యటించారు. ముందుగా తిరుమలగిరి ఎఎస్ఆర్ రైస్‌మిల్లును ఆకస్మికంగా తనిఖీ చేశారు. మిల్లర్లు కొనుగోలు సెంటర్‌నుంచి వచ్చిన ధాన్యం లారీలను వెంటనే దిగుమతి చేసుకోవాలని, హమాలీల సంఖ్య పెంచాలని అదేశించారు. అనంతరం రాజన్న కోక్యానాయక్ తండాలోని నర్సరీని సందర్శించి బెడ్‌లో ఉన్న ఖాళీలను అందులో నూతన విత్తనంను వేసి వన మహోత్సవం నాటికి మొక్కలను సిద్ధం చేయాలని పంచాయతీ కార్యదర్శికి అదేశించారు. రాజన్న కొక్యనాయక్ తండాలోని ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణ పురోగతిని పరిశీలించారు. ఇసుక సకాలంలో అందుతుందా అని లబ్ధిదారులను అడిగి తెలుసుకున్నారు. నిర్మాణం చేసి మేస్త్రీని ప్రభుత్వం నిర్దేశించిన ప్రకారం ఇంటి నిర్మాణం పూర్తి చేయాలని తెలిపారు. తొండాలోని ఐకెపి కేంద్రాన్ని సందర్శించారు. కొనుగోలు కేంద్రంలోని సీరియల్ రిజిస్టర్‌ను తనిఖీ చేసి సీరియల్ ప్రకారం కాంటా వేసి మిల్లులకు తరలించాలన్నారు. నాణ్యత కలిగిన ధాన్యంను కొనుగోలు చేసి గ్రేడింగ్‌ను ముందే రైతులకు తెలియజేయాలని నిర్వాహకులకు తెలిపారు. తొండా ఐకెపి కొనుగోలు కేంద్రం నుండి 5539.20 క్వింటాళ్ల ధాన్యం మిల్లులకు తరలించడం జరిగిందని తెలిపారు. మహిళ సంఘాల ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న విద్యార్థుల యూనిఫాం కుట్టు కేంద్రాన్ని సందర్శించారు. యూనిఫాములను పరిశీలించి నాణ్యతగా కుట్టాలని మహిళలను కోరారు. ఈ కార్యక్రమంలో సివిల్ సప్లై మేనేజర్ ప్రసాద్, తహసిల్దార్ బి.ప్రసాద్, ఎంపీడివో లాజర్, మున్సిపల్ కమిషనర్ యాదగిరి, మండల వ్యవసాయ అధికారి నాగేశ్వరరావు, ఎపిఎం మధుసూదన్, ఆర్‌ఐలు, పంచాయతీ కార్యదర్శులు, రైతులు తదితరులు పాల్గొన్నారు.




కార్మిక వ్యతిరేక విధానాలను నిరసిస్తూ

## 20న దేశవ్యాప్త సార్వత్రిక సమ్మె

**ప్రజాపక్షం/నల్లగొండ:** కార్మికులు ఎన్నో పోరాటాలు త్యాగాలు చేసి సాధించుకున్న 44 కార్మిక చట్టాల నుంచి 29 కార్మిక చట్టాలను విడదీసి నాలుగు లేబర్ కోడులుగా చేశారని కార్మిక వ్యతిరేకమైన నాలుగు లేబర్ కోడ్లను వెంటనే రద్దు చేయాలని ఎఐటియుసి జిల్లా ప్రధాన కార్యదర్శి పల్లా దేవేందర్ రెడ్డి డిమాండ్ చేశారు. కార్మిక వ్యతిరేక నాలుగు లేబర్ కోడ్‌లను వెంటనే రద్దు చేయాలని బుధవారం ఎఐటియుసి జిల్లా కార్యాలయంలో సమ్మె వాల్ పోస్టర్లను విడుదల చేశారు.ఈ సందర్భంగా అయన మాట్లాడుతూ ఈనెల 20న జరిగే దేశ వ్యాపిత సమ్మెను జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. కేంద్ర ప్రభుత్వం కార్మిక,కర్షక,ప్రజా వ్యతిరేక విధానాలు అవలంబిస్తుందని అన్నారు. కేంద్రంలోని మోడీ ప్రభుత్వం కార్పొరేట్లకు ఊడిగం చేస్తుందని అన్నారు.ప్రభుత్వ రంగ సంస్థలలో ప్రైవేటీకరణను వెంటనే ఆపివేయాలని, కాంట్రాక్టు ఔట్‌సోర్సింగ్,థర్డ్ పార్టీ కార్మికులను పర్మనెంట్ ఉద్యోగులుగా గుర్తించాలని, గ్రామపంచాయతీ కార్మికులకు మల్టీ పర్పస్ విధానాన్ని వెంటనే రద్దుచేసి,జీవో నెంబర్ 60 ప్రకారం వేతనాలు చెల్లించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎఐటియుసి జిల్లా ఉపాధ్యక్షులు కే ఎస్ రెడ్డి, డివిజన్ కార్యదర్శి వి లెనిన్,భవన నిర్మాణ కార్మిక సంఘం పట్టణ అధ్యక్షులు గుండె రవి, మిషన్ భగీరథ జిల్లా కార్యదర్శి ఎండి జానీ,టి సత్యనారాయణ, ఎస్ మహేష్, నరేందర్, భిక్షం, అశోక్, అక్కలయ్య పాల్గొన్నారు.

# రూ.40 కోట్లతో అదనపు బ్లాక్ నిర్మాణం

82000 చదరపు అడుగులలో నిర్మించనున్న నూతన అదనపు బ్లాక్ పనులకు కలెక్టర్ ఇలా త్రిపాఠి భూమిపూజ

**ప్రజాపక్షం/నల్లగొండ**: జిల్లా కలెక్టర్ కార్యాలయ ఆవరణలో జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠి నూతనంగా నిర్మించనున్న అదనపు బ్లాక్ నిర్మాణానికి భూమి పూజ చేసి పనులు ప్రారంభించారు .ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మీడియా ప్రతినిధులతో మాట్లాడుతూ ఏప్రిల్ 28న రాష్ట్ర రోడ్లు, భవనాలు, నీపారుదల శాఖ మంత్రులు, ఇతర ప్రజాప్రతినిధులు కలెక్టరేట్లో నిర్మించనున్న అదనపు బ్లాక్ నిర్మాణానికి శంకుస్థాపన చేయడం జరిగిందని, 40 కోట్ల రూపాయలతో 82,000 చదరపు అడుగుల విస్తీర్ణంలో జి, ప్లస్ టు విధానంలో ఈ అదనపు బ్లాక్ నిర్మాణాన్ని చేపడుతున్నట్లు చెప్పారు. ఈ బ్లాకులో అవసరమైన మౌలిక సదుపాయాలు, ఎలివేషన్, అత్యాధునిక డిజైన్లతో భవనాన్ని నిర్మించడం జరుగుతుందని తెలిపారు. ప్రస్తుతం ఉన్న 250 సీట్ల సామర్థం కలిగిన సమావేశ మందిరం సమీక్ష సమావేశాలకు, ఇతర పెద్ద పెద్ద సమావేశాలకు సరిపోవటం లేదని తాను ఆర్‌ఆర్బీ శాఖ మంత్రి దృష్టికి తీసుకువచ్చిన వెంటనే అదనపు బ్లాక్ ను మంజూరు చేయడం పట్ల ఆమె కృతజ్ఞతలు తెలియజేశారు. నూతన అదనపు బ్లాకు భవన నిర్మాణాన్ని ఎనిమిది నుండి పది నెలల వ్యవధిలో పూర్తి చేయనున్నామని ఆమె వెల్లడించారు. ఇన్‌చార్జి రెవెన్యూ అదనపు కలెక్టర్ నారాయణ్ అమిత్, స్థానిక సంస్థల ఇంచార్జ్ అదనపు కలెక్టర్ రాజ్ కుమార్, రోడ్లు ,భవనాల శాఖ చీఫ్ ఇంజనీర్ రాజేశ్వర్ రెడ్డి, సూపరింటెండెంట్ ఇంజనీర్ వెంకటేశ్వరరావు ,ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ శ్రీధర్ రెడ్డి ,డిప్యూటీ ఇంజనీర్లు ఫణిజా, గణేష్, ఇన్‌చార్జి జిల్లా రెవెన్యూ అధికారి వై. అశోక్ రెడ్డి, జిల్లా పంచాయతీ అధికారి వెంకయ్య, కలెక్టర్ కార్యాలయ ఏవో మోతిలాల్ హాజరయ్యారు.



## ఉత్సవాలపై అన్ని ఏర్పాట్లు పూర్తి చేయాలి



**ప్రజాపక్షం/ ఉండవెల్లి :** అల్లంపూర్ పట్టణంలో ఈనెల 20 నుండి 23 తేది వరకు జరిగే ఉరుసు ఉత్సవాల పై ఆయా శాఖల అధికారులు చర్యలు తీసుకోవాలని గద్వాల ఆర్డీవో టి. శ్రీనివాసరావు అన్నారు. బుధవారం సాయంత్రం వేళల్లో అల్లంపూర్ తహసీల్దార్ కార్యాలయంలో సమావేశాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ శాంతి వాతావరణం లో షా పైల్వాన్ ఉత్సవాలు జరిగేందుకు ముస్లిం మత పెద్దలు ఉత్సవాలను శాంతియుత వాతావరణాలు నిర్వహించేందుకు తగు చర్యలు తీసుకుంటున్నట్లు వారు తెలిపారు. పట్టణంలో పరిశుభ్రత, శాంతియుత వాతావరణంలో పోలీస్ శాఖ, తాగునీరు ,విద్యుత్తు తదితర అంశాల పై ఆయా శాఖల అధికారులు చర్యలు తీసుకోవాల్సిందిగా ఆదేశించారు. ఈ కార్యక్రమంలో తాసిల్దార్ మంజుల , మండల శాఖ అధికారులు పాల్గొన్నారు.

## జీనియస్ విద్యార్థులకు సన్మానం




**ప్రజాపక్షం/భువనగిరి** : సీబీఎస్ఈ బోర్డు ప్రకటించిన పదవ తరగతి వార్షిక ఫలితాలలో స్థానిక జీనియస్ పాఠశాల విద్యార్థులు అత్యుత్తమ ప్రతిభ కనబరిచి యాదాద్రి భువనగిరి జిల్లాలో ప్రథమ స్థానంలో నిలిచి తమ ప్రతిభ చాటారు. ఈ సందర్భంగా బుధవారం 10వ తరగతి ఫలితాలలో ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు పాఠశాల ఆవరణంలో వారికి పాఠశాల కరస్పాండెంట్ డాక్టర్ బి.సూర్యనారాయణ రెడ్డి, చైర్మన్ పడాల శ్రీనివాస్, డైరెక్టర్ తోట శ్రీధర్ వారిని శాలువాతో సన్మానించి జ్ఞాపికలు బహుకరించి అభినందించారు. అనంతరం కరస్పాండెంట్ మాట్లాడుతూ గత 12 సంవత్సరాల నుండి వరస విజయాలతో ముందుకు సాగుతూ జిల్లాలో ఉత్తమ విద్యాసంస్థగా నిలిచింది అనడానికి మా విద్యార్థుల ఫలితాలే నిదర్శనం అన్నారు. విద్యారంగంలో వస్తున్న మార్పులకు అనుగుణంగా మా సంస్థలో అన్ని వసతులను సమకూరుస్తూ నాణ్యమైన విద్యను అందిస్తున్నామని అన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపల్ బి.స్వర్ణలత, పిఈటి కే.శ్రీకాంత్, కే.కృష్ణకుమార్, ఉపాధ్యాయులు సిహెచ్ విజయ, లావణ్య, కీర్తి, రాజేశ్వరి, సౌజన్య, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

# ప్రజల పక్షాన సిపిఐ నిరంతర పోరాటం

నల్లగొండ జిల్లా సహాయ కార్యదర్శి లొడంగి శ్రవణ్‌కుమార్

**ప్రజాపక్షం/చిట్యాల:** పేద ప్రజల పక్షాన నిలబడి నిరంతరం పోరాడే పార్టీ సిపిఐ పార్టీ అని ఆ పార్టీ జిల్లా సహాయ కార్యదర్శి లొడంగి శ్రవణ్‌కుమార్ అన్నారు. నల్లగొండ జిల్లా చిట్యాల మండలం గుండ్రాంపల్లి గ్రామంలో మంగళవారం రాత్రి జరిగిన పార్టీ గ్రామ శాఖ సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. దోపిడీ రహిత సమాజ నిర్మాణం కోసం పార్టీ పోరాటాలు, ఉద్యమాలను నిర్వహిస్తూ వస్తుందన్నారు. టెర్రరిజాన్ని అంతమొందించే విషయంలో కేంద్ర ప్రభుత్వానికి సిపిఐ చేయూతనిస్తుందన్నారు. కాగా కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం దేశంలో మత విద్వేషాలను రెచ్చగొడుతూ హింసా మార్గం వైపు పయనిస్తుందని విమర్శించారు. మోదీ ప్రభుత్వం పెట్టుబడిదారులకు, కార్పోరేట్ వ్యవస్థకు వత్తాసు పలికే విధానాలకు స్వస్తి పలకాలని అన్నారు. ఈ నెల 16న గుండ్రాంపల్లిలో జరిగే మండల పార్టీ మహాసభలో కార్యకర్తలు, అభిమానులు పెద్ద సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని శ్రవణ్‌కుమార్ కోరారు. ఈ కార్యక్రమంలో జిల్లా సమితి సభ్యులు బొడిగె సైదులు, మండల పార్టీ కార్యదర్శి ఎండి అక్బర్, నాయకులు సీమ అంజయ్య, బొడిగె బక్కశెట్టి, జిల్లా యాదయ్య, గోపగోని శేఖర్, జిల్లా లింగస్వామి, పానుగుల శివ, నమ్ముల స్వామి, సర్గాల అశోక్, రత్నం లింగస్వామి, రెడపాక రవి, కాసర్ల శంకర్, బొడిగె గోపిచంద్, గరిసె శంకరయ్య, బేధరకోట సైదులు తదితరులు పాల్గొన్నారు.



**గ్రామశాఖ నూతన కమిటి ఎన్నిక :** సమావేశ అనంతరం గ్రామ శాఖ నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. గ్రామ శాఖ అధ్యక్షులుగా జిల్లా సత్యం ఎన్నిక కాగా, సహాయ కార్యదర్శులుగా కేతరాజు అంజయ్య, సీమ అంజయ్య, కార్యవర్గ సభ్యులుగా జిల్లా లింగస్వామి, గోపగోని శేఖర్, రత్నం లింగస్వామి, రెడపార రవి, పానుగుల శివ, బొబ్బల శంకర్‌రెడ్డి, బెదరకోట సైదులు తదితరులు పాల్గొన్నారు.

# పోలీస్ యూనిఫామ్‌కు సమాజంలో ఒక గుర్తింపు

సూర్యాపేట ఎస్‌పి కె.నర్సింహ్మా

**ప్రజాపక్షం/సూర్యాపేట:** పోలీస్ యూనిఫాం అనేది సమాజంలో ఒక గుర్తింపు మాత్రమేనని, ప్రతి పోలీస్ ఉత్తమ సేవలు అందించడం కోసం కృషి చేయాలని సూర్యాపేట జిల్లా ఎస్పీ కె.నర్సింహా అన్నారు. బుధవారం జిల్లాలో వివిధ పోలీస్‌స్టేషన్‌లో పనిచేస్తూ ఐదు సంవత్సరాలు పూర్తి చేసుకున్న 64 మంది కానిస్టేబుళ్లను కౌన్సిలింగ్ నిర్వహించి బదిలీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సమాజ రక్షణ, పౌరుల రక్షణ మన ప్రధాన విధి, గురుతరమైన బాధ్యతగా అన్నారు. జిల్లా పోలీస్ సిబ్బంది కష్టపడి పనిచేస్తారు అని పేరు ఉన్నదని, ఆ పేరును పోలీస్‌శాఖ గౌరవాన్ని, యూనిఫాం గౌరవాన్ని కాపాడుతూ పనిచేయాలన్నారు. మీరు కష్టపడి పని చేయాలని కోరుతున్నానని, తోటి సిబ్బందికి పనిలో సలహాలు ఇస్తూ ఆదర్శంగా ఉండాలని తెలిపారు. స్టేషన్ పరిధిలో జరిగే సాంఘిక కార్యకలాపాలు గుర్తించి, నిరోధించడంలో కృషి చేయాలని సూచించారు. మంచి ఆహార అలవాట్లు కలిగి ఆరోగ్యాన్ని కాపాడుకోవాలని, సమయం దొరికినప్పుడు వ్యాయమం చేయడం, యోగా చేయడం లాంటివి చేయాలని అన్నా రు. అదనపు ఎస్పీ నాగేశ్వరరావు మాట్లాడుతూ మీరు కోరుకున్న పోలీస్ స్టేషన్‌కు పోస్టింగ్ ఇచ్చారు. అధికారుల అంచానలకు అనుగుణంగా పని చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో అడ్మినిస్టేషన్ అధికారి మంజు భార్గవి, ఎఆర్ డిఎస్పీ నర్సింహాచారి, స్పెషల్ బ్రాంచ్ ఇన్స్‌పెక్టర్ నాగభూషణరావు, పోలీస్ సంఘం అధ్యక్షులు రామచందర్, ఆర్ఎస్ఐ మహేష్, సిబ్బంది ఉన్నారు.



## అగ్నికి ఆహుతైన బత్తాయి చెట్లు

మంటల్లో కాలిపోయిన బత్తాయి చెట్లు : ఆందోళనలో రైతులు



**ప్రజాపక్షం/పెద్దఅడిశర్లపల్లి :** మండలంలోని దుగ్యాల శివారులో గల బత్తాయి తోటలోని చెట్లు కాలిపోవడంతో రైతులు తీవ్ర ఆందోళనలకు గురి అయ్యారు. బాధితరైతులు,పీఏపల్లి తహసిల్దార్ తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. పీఏపల్లి గ్రామానికి చెందిన నారాయణదాసు శ్రీనివాస్ సర్వే నెంబర్ 409 లో నాలుగు సంవత్సరాల బత్తాయి చెట్లు దాదాపు 30 అదేవిధంగా ఏరుకొండ లింగయ్య 405 సర్వే నెంబర్ లోని ఎనిమిది సంవత్సరాల బత్తాయి చెట్లు 30 గణపురం సంతోష్ కుమార్ సర్వేనెంబర్ 405 లో నాలుగు సంవత్సరాల ఐదు చెట్లు ప్రమాదవశాత్తు అగ్నికి ఆహుతైనట్లు తెలిపారు. మధ్యాహ్న సమయంలో సమీపంలోని వరి చేల లోని కొర్లు కాలుతూ కాలు తూ దగ్గరలో ఉన్నటువంటి ఈ ముగ్గురి రైతుల బత్తాయి చెట్లు ప్రమాదవశాత్తు అగ్నికి ఆహుతి అయినట్లు పేర్కొన్నారు. రైతులు సమయస్ఫూర్తి ప్రదర్శించి మంటలను ఆర్పటంతో పెద్ద ఎత్తున ప్రమాదాన్ని నిలుపుదల చేయడం జరిగింది.రైతులకు జరిగినటువంటి నష్టాన్ని పై అధికారుల దృష్టికి తీసుకువెళ్లి తగిన న్యాయం జరిగేలా ప్రయత్నం చేస్తానని తహసిల్దార్ తెలిపారు.రైతులు ఎవరు ఆందోళన చెందవలసిన అవసరం లేదని వేసవికాలంలో ఇటువంటి ప్రమాదాలు జరిగే అవకాశం ఉందంటూ రైతులు జాగ్రత్త వహించి ఎండల నుండి కాపాడుకునేందుకు తగిన ప్రయత్నం చేసుకోవాలని సూచిస్తూ రైతులకు ఎల్లవేళలా అధికారుల నుండి సాయసహకారాలు అందిస్తామంటూ ఆయన తెలిపారు.



# హాల్ టికెట్లు ఇవ్వకుండా ఇబ్బందులకు గురి చేయెద్దు

**ప్రజాపక్షం/భువనగిరిరూరల్** : ప్రైవేటు డిగ్రీ కళాశాల యాజమాన్యాలు విద్యార్థులకు హాల్ టికెట్లు ఇవ్వకుండా ఇబ్బందులకు గురి చేయవద్దనీ ఎన్ఎస్‌యుఐ నాయకులు సురుపంగ చందు అన్నారు. యాదాద్రి భువనగిరి జిల్లాలోని ప్రైవేటు డిగ్రీ కళాశాలల యాజమాన్యం ఎలాంటి షరతులు లేకుండా విద్యార్థులకు హాల్ టికెట్లు ఇవ్వాలని జిల్లా కలెక్టరేట్ పరిపాలన అధికారికి ఎన్ఎస్‌యుఐ నాయకులు సురుపంగ చందు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా సురుపంగ చందు మాట్లాడుతూ సెమిస్టర్ రెగ్యులర్, బ్యాక్లాగ్ పరీక్షలకు హాల్ టికెట్లు ఇవ్వకుండా విద్యార్థులను తీవ్ర ఆందోళనలకు, ఇబ్బందులకు గురి చేస్తున్నారని చెప్పారు. కళాశాలలో చేర్చుకునేటప్పుడు ఎలాంటి ఫీజులు ఉండవని కేవలం పరీక్ష ఫీజు మాత్రమే చెల్లించాలని కోరారు. చెప్పి నేడు అదనపు ఫీజు చెల్లిస్తేనే హాల్ టికెట్లు ఇస్తామని విద్యార్థులను బెదిరింపులకు గురి చేస్తున్నారని తెలిపారు. హాల్ టికెట్లు ఎందుకు ఇవ్వరు అని విద్యార్థులు యాజమాన్యాలను అడిగితే వారి పై అహంకారపు దూషణలకు పాల్పడుతున్నారని చెప్పారు. ప్రైవేటు డిగ్రీ కళాశాలలు తమ ఇష్టానుసారంగా వ్యవహరిస్తూ, విద్యార్థుల దగ్గర నుండి అధిక మొత్తంలో ఫీజులు వసూలు చేస్తున్నారని, దీనివలన పేద విద్యార్థులు డిగ్రీ పరీక్షలకు దూరం అవుతున్నారని అన్నారు. వీటిపై అధికారులు దృష్టి సారించి విద్యార్థులకు తగిన న్యాయం చేయాలని ఎన్ఎస్‌యుఐ పక్షాన కోరారు.




ఫోకస్

# కళారంగం

## 'తెలుగు'కు ప్రత్యేక స్థానం

తెలుగు నాటకరంగం అనేది భారతీయ నాటకరంగ చరిత్రలో ప్రత్యేక స్థానం సంపాదించుకున్నది. అది మతపరమైన నాట్యప్రదర్శనల నుండి సామాజిక చైతన్యాన్ని సృష్టించిన ఆధునిక నాటకరూపానికి విశేషమైన పరిణామక్రమాన్ని అనుసరించింది. ఈ పరిణామక్రమం కాలక్రమేణా ప్రజల భావోద్వేగాలు, ఆచార వ్యవహారాలు, సమాజంలోని మార్పులను ప్రతిబింబిస్తూ కొనసాగింది. ఆరంభ దశలో ధార్మిక ప్రదర్శనలుతెలుగు నాటకరంగం మూలాలు ఆధ్యాత్మిక, మతపరమైన ఉత్సవాలకు వెళ్లి చేరుతాయి. ప్రాచీన కాలంలో ఆలయాల్లో జరిగిన యక్షగానాలు, భగవతమేళలు వంటి ప్రదర్శనలు నాటకరంగానికి పునాది వేశాయి. దేవతల విజయగాథలు, పురాణగాథలు ముఖ్యమైన కథాంశాలుగా మారాయి. నాటకాలు పూజా కార్యక్రమాల భాగంగా ప్రదర్శించబడేవి. అభిజ్ఞానశాకుంతలం వంటి సంస్కృత నాటకాలను కూడా తెలుగు ప్రజలు స్వీకరించారు. మతపరమైన నేపథ్యం, సంగీతం, నాట్యం, సంభాషణల మేళవింపు మొదలైనవి కీలకం. అనంతరం, కవుల నాటకాల దశ (16వ – 18వ శతాబ్దాలు) మొదలైంది.ఈ దశలో తెలుగు కవులు రచించిన నాటకాలు ప్రధానంగా లభించాయి. ప్రముఖ కవులు వెంపాటి చిన్న సత్యం, వెంకటపతిరాయలు, తెనాలి రామకృష్ణుడు వంటి వారు నాటకరచనలో పాల్గొన్నారు. వీరి నాటకాలలో రాజశ్రేయస్సు, మతపరమైన కథాంశాలు ప్రాధాన్యం పొందాయి. వేదికపై నటనకంటే, పద్యాల పఠనం ముఖ్యం. వ్యాస నాటకం (ఎన్నో కవితలతో నడిచే నాటకం) ప్రధానంగా ఉండేది. పాశ్చాత్య ప్రభావం దశ (19వ శతాబ్దం)లో, బ్రిటిష్ పాలన సమయంలో పాశ్చాత్య నాటకశైలులు తెలుగు నాటకరంగాన్ని ప్రభావితం చేశాయి. 19వ శతాబ్దం మధ్య నాటికి మద్రాసు (చెన్నై) వంటి నగరాల్లో నాటక ప్రదర్శనలు ప్రారంభమయ్యాయి. థియేటర్ హాళ్ళు, కుర్చీలపై కూర్చుని నాటకాలు వీక్షించే సంస్కృతి ఏర్పడింది. ప్రొఫెషనల్ నాటక మండళ్లు స్థాపించబడ్డాయి. ముద్రిత పుస్తకాలుగా నాటక రచనలు వెలువడాయి. గురజాడ యుగంగురజాడ అప్పారావు తెలుగు నాటకరంగంలో ఒక కొత్త శకానికి తెరతీశారు. ఆయన రాసిన "కన్యాశుల్కం" (1892) నాటకం తెలుగు నాటకరంగాన్ని నూతన దిశగా మలిచింది. కన్యాశుల్కం లో పాతనమ్మకాలను, మానవత్వాన్ని, విద్యాభివృద్ధిని మేళవిస్తూ రచించారు. సంభాషణలు నిక్షిప్తమైన తెలుగు భాషలో ఉండడం, వాస్తవికతను ప్రతిబింబించడం ఈ దశ ప్రత్యేకత. సామాజిక మాలిన్యాలపై విమర్శ, వాస్తవిక సంభాషణలు, పాత్రల జీవన నైజాన్ని ప్రతిబింబించడంలో స్పష్టత.5. 20వ శతాబ్దం: రాజకీయ, సామాజిక నాటకాల దశస్వాతంత్ర్య పోరాటంతో పాటు తెలుగు నాటకరంగంలో రాజకీయ చైతన్యం పెరిగింది. రాజబహదూర్ వెంకటపథి, బెల్లారి రాఘవ, దుర్గభావి వెంకటేశ్వరశాస్త్రి వంటి ప్రముఖులు రాజకీయ, సాంఘిక అంశాలపై నాటకాలు రాశారు. బల్లారి రాఘవ నటనను అభిజాత నాటకీయంగా తీర్చిదిద్దాడు. స్వాతంత్ర్య ఉద్యమాన్ని ప్రోత్సహించే నాటకాలు, సాంఘిక సమస్యలపై ప్రదర్శనలు, మహిళల పాత్రలకు ప్రాధాన్యం పెరగడం తదితర పరిణామాలు చోటు చేసుకున్నాయి. స్వాతంత్ర్యానంతర నాటకరంగం విషయానికి వస్తే, సామాజిక, ఆర్థిక సమస్యలు ప్రధాన అంశాలుగా మారాయి.నూతన రచయితలు మాచిరాజు కశీనాథుని, మద్దిపాటి హనుమంతరావు, ఆచార్య అట్లూరి కృష్ణారావు వంటి వారు నాటకరంగ అభివృద్ధికి తోడ్పడ్డారు. ప్రజానాట్యమండళి వంటి వామపక్ష నాట్యసంఘాలు ఏర్పడటం. ప్రజలలో రాజకీయ చైతన్యం కల్పించే ప్రయోగాత్మక నాటకాలు ప్రదర్శించడం.7. ఆధునిక నాటకరంగంప్రస్తుతం నాటకరంగం సాంకేతికతతో కలిసిపోయి, కొత్త శైలులు ఆవిష్కరించుకుంటోంది. మల్టీమీడియా మద్దతుతో వేదికాప్రదర్శనలు. ప్రయోగాత్మక నాటకాలు, మానవ సంబంధాల్లో లోతైన అధ్యయనాన్ని చూపించే కథలు. న్న చిన్న నాటికలు (మోనోడ్రామాలు), వర్క్‌షాపులు, నాటకోత్సవాలు పెరిగాయి. మొత్తం దీ ప్రజల ఆలోచనలను ప్రభావితం చేసే నాటకాలు, ఆధునిక జీవనశైలిని ప్రతిబింబించే కథాంశాలు.సారాంశంతెలుగు నాటకరంగం మతపరమైన ప్రదర్శనల నుండి ప్రారంభమై, సామాజిక, రాజకీయ చైతన్యాన్ని ప్రసారించిన ఒక శక్తివంతమైన వేదికగా ఎదిగింది. ఆధునిక కాలంలో కూడా, నాటకం ఒక శక్తివంతమైన కళారూపంగా ప్రజల హృదయాలలో నిలిచిపోయింది.ఈ పరిణామక్రమం మనం తెలుగువారిగా గర్వపడాల్సిన విషయమే.




## రాగం.. లయ సమ్మేళనమే సంగీతం

ఫలానా సంగీతం మాత్రమే గొప్పదని చెప్పడానికి వీల్లేదు. సంగీత ప్రపంచంలో జానపదాలు ఒక భాగం మాత్రమే. సంగీతం అనేది శబ్దం, స్వరం, లయం, తాళం మరియు భావాల సమన్వయంతో కూడిన ఒక కళా రూపం. ఇది మానవుని అంతర్గత భావాలను, భావోద్వేగాలను, ఆలోచనలను అత్యద్భుతంగా వ్యక్తపరచగలిగే మాధ్యమం. సంగీతం అనేది ఫైన్ ఆర్ట్స్ లో ఒక ముఖ్యమైన భాగం. సంగీతం యొక్క ముఖ్యమైన అంశాల్లో మొదటిది స్వరాలు (Notes). సంగీతంలో 'స, రి, గ, మ, ప, ధ, ని' అనే ఏడు ప్రాథమిక స్వరాలు ఉన్నాయి. ఇవే సంగీతానికి మూలాలు. ఇక రెండోది తాళం (Rhythm). సంగీతంలో సమయ నియమాన్ని సూచిస్తుంది. తాళం లేకుండా సంగీతం చక్కగా ఉండదు. ఉదాహరణకు: ఆది తాళం, త్రిపుట తాళం, రూపక తాళం మొదలైనవి. సంగీతంలో మూడో లక్షణం లయ (Tempo). ఇది సంగీతం నడిచే వేగాన్ని సూచిస్తుంది..మెల్లిగా (విలంబితం), మధ్యంగా (మధ్య లయం), వేగంగా (ద్రుతం). కాగా, స్వరాల యొక్క ప్రత్యేకమైన క్రమాన్ని రాగంగా పిలుస్తారు. ప్రతి రాగం ఒక ప్రత్యేకమైన భావాన్ని



కలిగిస్తుంది. సంగీతాన్ని ప్రధానంగా, శాస్త్రీయ సంగీతం (Classical Music/ దక్షిణాది శైలీ – కర్ణాటక సంగీతం ఉత్తరాది శైలీ – హిందుస్థానీ సంగీతం), లలిత సంగీతం (Light Music/ శాస్త్రీయ నియమాల్ని పాక్షికంగా పాటిస్తూ, సులభంగా అర్థమయ్యే స్వరాలలో రూపొందించే పాటలు), జానపద (Folk) సంగీతం (ప్రాంతీయ సంస్కృతిని ప్రతిబింబించే పాటలు) అనే మూడు రకాలు ఉంటాయి. సాంప్రదాయ కళారూపాల్లో వినిపించే పాటలు. 4.భక్తి సంగీతం (Devotional Music): దేవుడి పట్ల భక్తిని వ్యక్తపరచే కీర్తనలు, భజనలు, త్యాగరాజ కృతులు మొదలైనవి.సంగీతం యొక్క ప్రాముఖ్యత: భావప్రకటనకు మార్గం మనసుకు ఆహ్లాదం సాంస్కృతిక వారసత్వం ఆధ్యాత్మిక అభివృద్ధికి సహాయకం ఒత్తిడిని తగ్గించడంలో ఉపయోగకరం.

### సమాజ మూలాలు తెలిపే జానపద సంగీతం

జానపద సంగీతం మానవ సమాజ మూలాలు, పరిణామ క్రమానికి నిలువుటద్దం. జానపద సంగీతం అనేది ప్రజల జీవితం, జీవనశైలి, భావోద్వేగాలు, సంస్కృతి, సంప్రదాయాలను ప్రతిబింబించే ప్రాంతీయ సంగీత రూపం. ఇది గ్రామీణ ప్రజల మధ్య జన్మించి, తరతరాలుగా మౌఖికంగా వ్యాప్తి చెంది ఉండే సంగీతం. దీనిని 'పీపుల్స్ మ్యూజిక్' (ప్రజల సంగీఎతం) అని కూడా అంటారు .జానపద సంగీతం యొక్క లక్షణాల్లో మొదటిది సహజత్వం. సులభంగా అర్థమయ్యే పదాలతో, సహజమైన బాణీలతో పాటలు ఉంటాయి. ప్రజల భాషలో, అంటే స్థానిక భాష, మాండలికాల్లో ఈ పాటలు ఉంటాయి. ఉదా: తెలంగాణలో తెగల పాటలు, ఆంధ్రాలో కొలాటాలు, జమ్మికుంట గీతాలు. ఈ పాటలు జీవిత చిత్తరువులు. ప్రేమ, పని, పంటలు, పండుగలు, వానలు, వివాహాలు మొదలైన అనేక అంశాలను ఈ పాటలు ప్రతిబింబిస్తాయి. వాడుకపదార్థాలతో వాయిద్యాలు తయారు చేయడం మరో ప్రత్యేకత. డోల్లు, తపే, బుర్రకథ వాద్యాలు, వంకర మొదలైన స్థానిక వాద్యాలతో పాటలు పాడుతారు. కాగా, తెలుగులో బుర్రకథ:కథ చెప్పడం, పాటలు, సంభాషణల మేళవింపుతో కూడిన వంటి ప్రసిద్ధ జానపద సంగీత రూపాలు ఉన్నాయి. ఇవన్నీ జానపద కళా రూపాలకు కొనసాగింపుగా ఉంటాయి. తెలంగాణ ప్రాంతంలో ప్రసిద్ధమైన ఒగ్గుకథ మిగతా ప్రాంతాల్లో లేదని చెప్పలేకపోయినా, చాలా అరుదు అనవచ్చు. మల్లన్న, యల్లమ్మల వంటి దేవతల కథలు ఇందులో పాడతారు. పండుగల సమయంలో గ్రూపులుగా గుండ్రంగా తిరుగుతూ పాడేవి కొలాటం పాటలు. బంజారా తెగల జీవనశైలిని ప్రతిబింబించే గీతాలు. జానపద గీతాలలో ప్రేమ, గ్రామీణ ప్రేమకథల పాటలు ఏక్కువ. అదే విధంగా రైతులు, కూలీలు వంటి వృత్తిపరమైన పాటలు ఎంతో ప్రాచుర్యం పొందాయి. బతుకమ్మ, సంక్రాంతి, బోనాలు వంటి ఉత్సవాలలో పాడే పాటలు కూడా జానపద సంగీతంలో భాగమే. అదే విధంగా దేవతల గుణగానాలు ఉన్నాయి. జానపద సంగీతం సాంస్కృతిక వారసత్వానికి ప్రతీక. గ్రామీణ భావాల శబ్ద రూపం. వినోదానికి, విద్యకు ఉపయోగపడే మాధ్యమం. ఒక్కో ప్రాంతానికి ప్రత్యేకమైన గుర్తింపును కలిగిస్తుంది. వెరసి జానపద కళారూపాలు, ప్రత్యేకించి సంగీతం సామాజిక మార్పులను తనలో ఇముడ్చుకుంటుంది.

## పునరుజ్జీవ కాలంలో కళారంగం..

కళారంగం పునరుజ్జీవ కాలంలో కొత్తపుంతలు తొక్కింది. ఇది 14వ శతాబ్దం చివర ఇటలీ (ప్రత్యేకంగా ఫ్లోరెన్స్)లో మొదలైంది. ప్రాచీన గ్రీకు, రోమన్ సాహిత్యం, శిల్పకళ, తత్త్వశాస్త్రం పునరావిష్కరణ వల్ల ఇది అభివృద్ధి చెందింది. మానవత్వవాదం ప్రభావం ఎక్కువగా ఉంది. మానవుడి శక్తుల మీద విశ్వాసం పెరిగింది. మానవ శరీరాన్ని శాస్త్రీయంగా, సహజంగా చిత్రించడంపై దృష్టి. పర్స్పెక్టివ్ వాడకం అమల్లోకి వచ్చింది. చిత్రాలకు గాఢమైన అర్థాన్ని ఇవ్వడం ఇందులో ప్రధాన లక్ష్యం. చైతన్యంతో కూడిన శరీర భంగిమలు కూడా కీలక పాత్ర పోషించాయి. ప్రకృతిని నిజమైన రూపంలో చూపడం. ప్రకాశం, నీడల పరిపక్వ ప్రయోగం సంచలనం సృష్టించింది. ఆ సమయంలోనే 'చైరోస్కూరో' వాడకం ప్రారంభమైంది. లియానార్డో డా విన్సీ చిత్రం మోనాలిసా, లాస్ట్ సప్పర్, మైకేంజెలో గీసిన డేవిడ్ స్టాచ్యూ, రాఫెల్ చిత్రం ది స్కూల్ ఆఫ్ ఏథెన్స్ తదితర కళాకృతులు



ఇప్పటికీ ప్రపంచ కళారంగంలో తిరుగులేని స్థానంలో కొనసాగుతున్నాయి. కోట్లాది మంది కళాభిమానులను ఆకట్టుకుంటున్నాయి. కాగా, మైకేంజెలోప్రభావం కూడా కనిపించింది. యూరప్ అంతటా మానవీయ భావోద్వేగాల ప్రాధాన్యత పెరిగింది. విజ్ఞాన శాస్త్రం, కళ మధురంగా కలిసిన కాలమది. భవిష్యత్తు కళా శైలులపై పునరుజ్జీవ కళ తీవ్ర ప్రభావం చూపింది. మొత్తం మీద పునరుజ్జీవ కళ అంటే మానవ స్వరూపాన్ని ఒక శాస్త్రీయ, భావోద్వేగాత్మక కళాత్మక ప్రయోగంగా చూపించడమే. మానవ శరీర శాస్త్రాన్ని, గణిత శాస్త్రాన్ని కలిపి కళాసృష్టి జరిగింది. న్యాయాన్సుల (సూక్ష్మ వైవిధ్యాల)తో కూడిన భావ ప్రకటనలకు పునర్జన్మ కళను ఆదర్శంగా తీసుకుంటారు. చివరగా:పునర్జన్మ కళ వలన కళాకారులు "కళ"ని ఒక వ్యాసంగంలా గుర్తించి, స్వీయ వ్యక్తిత్వాన్ని కళ ద్వారా వ్యక్తపరిచే ప్రారంభాన్ని చేశారు.

---

## తెలుగు సాంప్రదాయాన్ని అవమాన పరుస్తున్న ప్రపంచ సుందరీమణులు

**భారత జాతీయ మహిళా సమాఖ్య రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నేదునూరి జ్యోతి**



**ప్రజాపక్షం/హనుమకొండ:**తెలుగు సాంప్రదాయాన్ని అవమానపరుస్తూ ప్రపంచ సుందరీమణులు పర్యటించడాన్ని ఖండిస్తున్నామని భారత జాతీయ మహిళా సమాఖ్య రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నేదునూరి జ్యోతి అన్నారు. బుధవారం భారత జాతీయ మహిళా సమాఖ్య, సిఎంఎస్,పౌరహక్కుల సంఘం,డిఎస్ఓ ఆధ్వర్యంలో వెయ్యి స్తంభాల దేవాలయం ఎదురు అందాల పోటీలను రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ నిరసన తెలిపారు. అనంతరం పోలీసులు వారిని అరెస్టు చేసి హన్మకొండ పోలీస్ స్టేషన్‌కి తరలించారు. ఈ సందర్భంగా భారత జాతీయ మహిళా సమాఖ్య రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నేదునూరి జ్యోతి మాట్లాడుతూ దేశంలో, ఇటు తెలంగాణ రాష్ట్రంలో వరంగల్‌కు ఒక ప్రత్యేకత ఉందని అన్నారు. వరంగల్ అంటేనే సంస్కృతి, సాంప్రదాయాలకు పెట్టింది పేరు అని, ఇలాంటి సాంప్రదాయాన్ని సంస్కృతి సాంప్రదాయాన్ని కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు తుంగలో తొక్కుతున్నాయని ఆరోపించారు. ఈరోజు సాంప్రదాయాన్ని మరిచి సగం దుస్తులు ధరించి మిస్ వరల్డ్‌గా నిలిచిన ప్రపంచ సుందరీమణులు వరంగల్ గడ్డపై తిరిగే అర్హత వారికి లేదన్నారు. తెలుగు ప్రజలకు సాంప్రదాయం నేర్పే నగరం ఓరుగల్లు నగరం అని, ఇలాంటి ఓరుగల్లు నగరంపై ప్రపంచ సుందరీమణులు వారి అందాలుతో వారి వేసుకున్న పొట్టి,పొట్టి దుస్తువులతో తెలంగాణ, తెలుగు సాంప్రదాయాన్ని అవమాన పరుస్తున్నారని తెలిపారు. ఈ ప్రపంచ సుందరీమణుల పోటీలకు సహకరించే నాయకులు, వారికి సపోర్ట్ చేసి మూడంచల భద్రత కల్పించడం సిగ్గుచేటున్నారు. దేశములో, రాష్ట్రాల్లో రోజురోజుకు పెరిగిపోతున్న హత్యలు, మానభంగాలకు కారణం ప్రపంచ సుందరీమణులు ధరించిన దుస్తులే వారికి శాపంగా మారుతున్నాయని, వారితో పాటు ప్రతి ఒక్క మహిళలను అదోలా చూస్తున్నారన్నారు. మహిళలు వారు ధరించే వస్తువులు ధరించవద్దని సాంప్రదాయంగా ధరించి సాంప్రదాయ పద్ధతులు పాటించాలని కోరారు. ఈ నిరసనలో మహిళా సమాఖ్య రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ మండ సదా లక్ష్మి, సిఎంఎస్ సభ్యులు అనిత, కళ, మంచాల రమ, పౌరహక్కుల సంఘం నాయకులు జయంత్, డిఎస్ఓ నాయకులు శివ పాల్గొన్నారు.

## రెసోనెన్స్ పబ్లిక్ స్కూల్‌పై చర్యలు తీసుకోవాలి : ఎఐఎస్ఎఫ్



**ప్రజాపక్షం / హనుమకొండ టౌన్:** రెసోనెన్స్ పబ్లిక్ స్కూల్ పై చర్యలు తీసుకోవాలని ఎఐఎస్ఎఫ్ ఆధ్వర్యంలో జిల్లా విద్యాశాఖాధికారికి వినతి పత్రం అందించారు. ఈ సందర్భంగా ఎఐఎస్ఎఫ్ హన్మకొండ జిల్లా ప్రధాన కార్యదర్శి భాషబోయిన సంతోష్ మాట్లాడుతూ హనుమకొండ జిల్లా కేంద్రంలో హసన్ పర్తి ఎర్రగట్టు వద్ద ఈ విద్యా సంవత్సరం ప్రారంభానికి సిద్ధమైన రెసోనెన్స్ పబ్లిక్ స్కూల్ కి ఆన్‌లైన్‌లో ఫైల్ అప్లై చేసుకోకుండానే విద్యాశాఖ ఓపెనింగ్ పర్మిషన్ ఇల్లీగల్ గా ఇవ్వడం జరిగిందన్నారు. కానీ రికగ్నైషన్ లేదు అని, రికగ్నైషన్ లేకుండా రికగ్నైషన్ రాకుండా పాఠశాల నడపడానికి వీలు లేదని, దాంతోపాటు బిల్డింగ్ ప్రభుత్వ నియమ నిబంధనల ప్రకారం లేదని, భవిష్యత్తులో పర్మిషన్ వచ్చే అవకాశం కూడా లేదని, కాబట్టి ఈ పాఠశాలలో చదువుకునే విద్యార్థుల భవిష్యత్తు ప్రశ్నార్థకంగా మారకముందే చర్యలు తీసుకోవాలని కోరారు. అనుమతి లేకుం డా నడుస్తున్న పాఠశాలలపై చర్యలు తీసుకోకుంటే జిల్లా విద్యాధికారి కార్యాలయాన్ని 5000 మంది విద్యార్థులతో ముట్టడిస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఎఐఎస్ఎఫ్ జిల్లా ఉపాధ్యక్షులు వేల్పుల చరణ్, జిల్లా సహాయ కార్యదర్శి రవితేజ, జిల్లా సమితి సభ్యులు శ్రీపతి వినయ్, వచ్చు జ్యోతి పాల్గొన్నారు.

## నియోజకవర్గాభివృద్ధి, ప్రజాసంక్షేమమే ధ్యేయం

**రూ.2.56 కోట్ల అభివృద్ధి పనులకు ఎంఎల్‌ఎ కూనంనేని సాంబశివరావు శంకుస్థాపన**



**ప్రజాపక్షం/భద్రాద్రి కొత్తగూడెం :** నియోజకవర్గాభివృద్ధి, ప్రజా సంక్షేమానికి ప్రాధాన్యత ఇస్తున్నట్లు కొత్తగూడెం శాసనసభ్యులు కూనంనేని సాంబశివరావు అన్నారు. బుధవారం పాల్వంచ మున్సిపాలిటీ పరిధిలోని మంచికంటినగర్, పాలకోయతండా, నవభారత్, జగ్గుతండా, గోవర్ధనగిరి కాలనీ, కొమ్ముగూడెం, గొల్లగూడెం, సీతారామపట్నం, ప్రియదర్శిని కాలనీలో ఆయన రూ.2 కోట్ల 56 లక్షల నిధులతో సిసి రోడ్లు, డ్రైన్ల నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా కూనంనేని మాట్లాడుతూ ముందస్తు ప్రణాళికతో నియోజకవర్గాన్ని అన్ని విధాలు అభివృద్ధి పరిచేందుకు కృషి చేస్తున్నట్లు చెప్పారు. బస్తీలు, గ్రామాలాభివృద్ధికి నిధుల కేటాయింపులో వివక్షకు తావులేకుండా అభివృద్ధి చేసి తీరుతామన్నారు. అధికారులు పనుల పర్యవేక్షణలో బాధ్యతాయుతంగా ఉండాలని, నాణ్యతా ప్రమాణాల విషయంలో రాజీపడేది లేదన్నారు. గడిచిన ఏడాది కాలంలో మునుపెన్నడూ లేనివిధంగా అభివృద్ధి నిధులు మంజూరయ్యాయని, మున్సిపాలిటీ పరిధిలో అంతర్గత రోడ్లు, పారిశుద్ధ్య సమస్యల పరిష్కారానికి పనులు వేగవంతంగా సాగుతున్నాయని చెప్పారు. పట్టణ ప్రజలు ఎదుర్కొంటున్న తాగునీటి సమస్యకు శాశ్వత పరిష్కారాన్ని చూపేందుకు కృషి చేస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపాలిటీ కమీషనర్ సుజాత, సిపిఐ జిల్లా కార్యదర్శి ఎస్‌కే సాబీర్ పాషా, డిసిఎంఎస్ మాజీ చైర్మన్ కొత్వాల శ్రీనివాసరావు, పట్టణ కార్యదర్శి అడుసుమిల్లి సాయిబబా, సహాయ కార్యదర్శి ఉప్పుశెట్టి రాహుల్, నాయకులు బండి నాగేశ్వరరావు, సుధాకర్, అన్నారపు వెంకటేశ్వర్లు, శ్రీనివాసరావు, వెంకట్రావు, చెరుకు శేఖర్, మన్నెం వెంకన్న, పల్లపు యాకయ్య, గౌస్, ఎస్ఏ రెహమాన్, కరీం, అహ్మద్ జానీ, కొత్తసురేష్, బిక్కులాల్, బివి సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

## తడిసిన ధాన్యం ప్రభుత్వమే కొనాలి

సిపిఐ జిల్లా కార్యదర్శి తాండ్ర సదానందం



**ప్రజాపక్షం/పెద్దపల్లి రూరల్ :** తడిసిన ధాన్యాన్ని ప్రభుత్వమే కొనుగోలు చేసి రైతులను ఆదుకోవాలని సిపిఐ జిల్లా కార్యదర్శి తాండ్ర సదానందం అన్నారు. బుధవారం రోజున ఓదెల మండలం పొత్కపల్లి గ్రామంలో ఐకెపి సెంటర్లో తడిసి న వడ్లను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మంగళవారం రోజున రాత్రి కురిసిన భారీ వర్షానికి ఆరుగాలం కష్టపడి పండించిన పంట నీటి పాలు కావడంతో రైతులు కంటతడి పెడుతున్నారని ,రాష్ట్ర ప్రభుత్వం తడిసిన వడ్లను కొనుగోలు చేసి ఆదుకోవాలని, తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం రైతులకు తడిసిన వడ్లకు ఎలాంటి షరతులు లేకుండా కొనుగోలు చేయాలని, తడిసిన వడ్లకు ప్రభుత్వం రైతులకు ఆర్థిక సహాయం అందించాలని తాండ్ర సదానందం డిమాండ్ చేశారు. ఈ కా ర్యక్రమంలో సిపిఐ ఓదెల మండల కార్యదర్శి కోడం స్వామి, మండల సహాకారదర్శి శ్రీనివాసరెడ్డి సిపిఐ కార్యకర్తలు రైతులు పాల్గొన్నారు.



## పేదలపక్షానే కమ్యూనిస్టు పార్టీ

సిపిఐ జాతీయ సమితి సభ్యులు బాగం హేమంతరావు

**ప్రజాపక్షం/నేలకొండపల్లి :** నిరంతరం ప్రజల పక్షాన నిలబడి పోరాటం చేసేది భారత కమ్యూనిస్టు పార్టీ అని భారత కమ్యూనిస్టు పార్టీ వందేళ్ల చరిత్ర కలిగిన పార్టీ అని సిపిఐ జాతీయ సమితి సభ్యులు బాగం హేమంతరావు పేర్కొన్నారు. బుధవారం నేలకొండపల్లి మండల సిపిఐ కౌన్సిల్ సమావేశంను మండల కేంద్రంలోని కర్నాటి కృష్ణయ్య భవనం వద్ద నిర్వహించారు. ఈ సమావేశంకు రైతు సంఘం మండల కార్యదర్శి పాల్తియ శ్రీనివాస్ అధ్యక్షతన ముఖ్యఅతిథిగా బాగం హేమంత రావు హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. కేంద్రంలో బిజెపి అధికారంలోకి వచ్చి 11 సంవత్సరాలు గడుస్తున్న పేద ప్రజలకు ఒరిగిందేమీ లేదన్నారు. నరేంద్ర మోడీ పరిపాలనలో కార్పొరేట్ శక్తులకు పెట్టుబడిదారులకు మేలు కలిగించే విధానాలకు పాల్పడుతుందన్నారు. కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం మతవిద్వేషాలను రెచ్చగొడుతూ కులాలు, మతాల మధ్య చిచ్చు పెడుతూ రాజకీయ పబ్బం గడుపుతుందని విమర్శించారు. రాష్ట్రంలో సిపిఐ సహకారంతో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిందని, ఎన్నికలకు ముందు ప్రజలకు ఇచ్చిన హామీలన్నీటిని అమలుపరచాల్సిన బాధ్యత రేవంత్ రెడ్డి సర్కార్‌పై ఉందన్నారు. సంక్షేమ పథకాలు అమలులో అర్హులైన పేదలకు ఇండ్లు, ఇళ్ల స్థలాలు, సంక్షేమ పథకాలు అందించాలన్నారు. పూర్తిస్థాయిలో రుణమాఫీ చేసి, భూ సమస్యలు పరిష్కరించాలని కోరారు. వందేళ్ళ చరిత్ర కలిగిన ఏకైక పార్టీ భారత్ కమ్యూనిస్ట్ పార్టీ అన్నారు. ఉద్యమాలతోనే పార్టీకి గుర్తింపు వస్తుందన్నారు. అధికారంలో ఉన్నా లేకున్నా ప్రజల పక్షాన ఉండి పోరాటాలు నిర్వహిస్తూ ప్రజల సమస్యలపై బలమైన ఉద్యమాలు నిర్వహించాలని పిలుపునిచ్చారు. మండలంలో పార్టీని బలోపేతం చేయడం కోసం శక్తివంచన లేకుండా కృషి చేయాలన్నారు. రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో పార్టీని బలోపేతం చేయడంతో పాటు సర్పంచులుగా ఎంపిటిసిగా పోటీ చేసేందుకు సిద్ధంగా ఉండాలని పిలుపునిచ్చారు. పార్టీ గ్రామ శాఖలు, ప్రజా సంఘాలను ఏర్పాటు చేసుకొని మండల మహాసభ నిర్వహించుకొని సిద్ధంగా ఉండాలని పేర్కొన్నారు ఈ సమావేశంలో సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు కర్నాటి భాను ప్రసాద్, జిల్లా కౌన్సిల్ సభ్యులు కనకబండి సీతారాములు, సీపీఐ మండల సహాయ కార్యదర్శి మారిశెట్టి వేంకటేశ్వరరావు, ఏఐవైఎఫ్ ఖమ్మం జిల్లా సహాయ కార్యదర్శి మల్లెబోయిన ఉపేందర్, మండల కౌన్సిల్ సభ్యులు కర్నాటి నళిని రాణి, భాగం నరసింహారావు,రాయల మాదవ్, కాశ బోయిన అయోధ్య, మేకల పుల్లయ్య, అనంత పుల్లయ్య, యలగాల నరసరావు, నంబూరి నారాయణ, తమ్మిశెట్టి మమత, శ్రీమతి, పాలపాటి అశోక్, ఆలేటి మహేష్ తదితరులు పాల్గొన్నారు.

## ఇంజినీరింగ్ కళాశాలల్లో ఫీజులు పెంచవద్దు

- ప్రైవేట్ విద్యాసంస్థల్లో ఫీజుల నియంత్రణ చట్టాన్ని అమలు చేయాల్సిందే : మణికంఠరెడ్డి



**ప్రజాపక్షం/కరీంనగర్ ప్రతినిధి :** రాష్ట్రంలో ప్రైవేట్ ఇంజినీరింగ్ కళాశాలల యాజమాన్యాలు పేద విద్యార్థులకు ఉన్నత విద్య అందకుండా బిటెక్ విద్యను డబ్బుల విద్యగా మారుస్తున్నాయని ఎఐఎస్ఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు కసిరెడ్డి మణికంఠరెడ్డి వాపోయారు. బిటెక్ ఫీజులు పెంచాలని టిజిఎఫ్ఆర్‌సి ముందు పెట్టిన ప్రతిపాదనలను ఉన్నత విద్యామండలి, టిజిఎఫ్ఆర్‌సి తిరస్కరించాలని డిమాండ్ చేశారు. ప్రైవేట్ ఇంజినీరింగ్ కళాశాలలు చేస్తున్న విద్యావ్యాపారాన్ని అరికట్టాలన్నారు. కళాశాలల ఆడిట్ రిపోర్టులపై ప్రత్యేక విచారణ జరిపించాలన్నారు. రాష్ట్రంలోని అన్ని ప్రైవేట్ కేజీ నుంచి పీజీ వరకు విద్యా సంస్థల్లో ఫీజుల నియంత్రణ చట్టాన్ని కఠినంగా అమలు చేసే బాధ్యత సిఎం రేవంత్ రెడ్డి తీసుకోవాలని, అప్పుడే ప్రజాపాలన అవుతుందని డిమాండ్ చేశారు. బుధవారం స్థానిక బద్దం ఎల్లారెడ్డి భవన్‌లో ఏర్పాటు చేసిన ముఖ్య కార్యకర్తల సమావేశానికి మణికంఠరెడ్డి హాజరై మాట్లాడారు. ఒక్కో కళాశాల వారు ప్రస్తుతం ఉన్న ఫీజులో 50 శాతం పైగా ఫీజులు పెంచాలని ప్రతిపాదించడం దారుణమన్నారు. అనేక కళాశాలల యాజమాన్యాలు ఇచ్చిన ఆడిట్ రిపోర్టులపై ప్రత్యేక విచారణ జరిపించాలని, ఇప్పటికే ప్రైవేట్ ఇంజినీరింగ్ కళాశాలల యాజమాన్యాలు అధిక ఫీజుల దోపిడీ చేస్తున్నాయన్నారు. ఇంజినీరింగ్ విద్యను పూర్తిగా వ్యాపారమయంగా మార్చారన్నారు. యాజమాన్య కోటా సీట్లను లక్షలాది రూపాయలకు అమ్ముకుంటూ విద్యావ్యాపారం చేస్తున్నాయని, కొన్ని కళాశాలలు కౌన్సిలింగ్ తేదీలు ప్రకటించకముందే యాజమాన్య కోటాలో డిమాండ్ ఉన్న కోర్సుల సీట్లకు అడ్వాన్స్ బుకింక్ పేరిట లక్షలాది రూపాయలు వసూలు చేస్తున్నారన్నారు. ఇంజినీరింగ్ కళాశాలలు యాజమాన్య సీట్ల భర్తీలో భారీగా అక్రమాలు చేస్తున్నాయన్నారు.అధికారులు తనిఖీలకు వెళ్లే సమయంలోనే విద్యార్హత కలిగిన టీచింగ్ సిబ్బందిని తాత్కాలికంగా నియమించుకుంటూ తక్కువ జీతాలు ఇస్తూ ఆడిట్‌లో ఎక్కువ జీతాలు చూపెడుతున్నారన్నారు. సిఎం వద్ద విద్యాశాఖ ఉన్న సందర్భంగా ఇంజనీరింగ్ కళాశాలల ఫీజుల దోపిడీని నియంత్రించాలన్నారు. ఇంజనీరింగ్ కళాశాలల వారు చేసిన పెంపు ప్రతిపాదనను ప్రభుత్వం, విద్యాశాఖ తిరస్కరించి ఇంజనీరింగ్ విద్య అందరికీ అందుబాటులో ఉండేలా ఫీజులను నిర్ణయించాలని, రాష్ట్రంలో అన్ని ప్రైవేట్ విద్యాసంస్థల్లో కెజి నుంచి పీజీ వరకు ప్రతి విద్యాసంస్థల్లో నియంత్రణ చట్టాన్ని కఠినంగా అమలు చేయాలన్నారు. పాఠశాల, కళాశాలలు ఒకే రకమైన ఫీజులు తీసుకునేలా ఆ ఫీజు అమలు చేయకపోతే విద్యాసంస్థ గుర్తింపు రద్దు చేసేలా కఠిన చట్టాలు తీసుకురావాలని, రాష్ట్రంలో విద్యావ్యాపారాన్ని అరికట్టాలని డిమాండ్ చేశారు. సమావేశంలో ఎఐఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి మచ్చ రమేష్, నగర కార్యదర్శి మామిడిపల్లి హేమంత్, నగర నాయకులు సందీప్ రెడ్డి, శ్రవణ్ తదితరులున్నారు.

# మహానగరి
గ్రేటర్ హైదరాబాద్ GREATER HYDERABAD

## సిఎం రేవంత్ రెడ్డిని కలిసిన నగర మేయర్ గద్వాల విజయ లక్ష్మి



**ప్రజాపక్షం/హైదరాబాద్ :** గ్రేటర్ హైదరాబాద్ నగర మేయర్ గద్వాల విజయ లక్ష్మి రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని మర్యాద పూర్వకంగా సచివాలయంలో బుధవారం కలిశారు. ముఖ్యమంత్రి ఇచ్చిన హామీ మేరకు జిహెచ్ఎంసి నిధులు మంజూరు చేసినందుకు మేయర్ ధన్యవాదాలు తెలిపారు. జిహెచ్ఎంసి అభివృద్ధిపై సమీక్ష నిర్వహించాలని సిఎంను మేయర్ కోరారు.



## సిఎం సహాయనిధి నిరుపేదలకు వరం
### కూన శ్రీశైలం గౌడ్

**ప్రజాపక్షం/నిజాంపేట్ :** ముఖ్యమంత్రి సహాయనిధి నిరుపేదలకు వరం లాంటిదని కుత్బుల్లాపూర్ నియోజకవర్గం మాజీ ఎమ్మెల్యే, రాష్ట్ర కాంగ్రెస్ నేత కూన శ్రీశైలం గౌడ్ అన్నారు. కుత్బుల్లాపూర్ నియోజకవర్గం పరిధిలోని షాపూర్‌నగర్‌లో పలు డివిజన్‌లు, బస్తీలకు చెందిన ముగ్గురికి ముఖ్యమంత్రి సహాయ నిధి నుండి లక్ష ముప్పై ఐదు వేల చెక్కులను కూన అందజేశారు. ఈ సందర్భంగా శ్రీశైలం గౌడ్ మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీతోనే నిరుపేదలకు న్యాయం జరుగుతుందని అన్నారు. రాష్ట్రంలోని ప్రతి ఒక్క సామాన్యుడికి సంక్షేమ ఫలాలు అందించడమే ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి లక్ష్యమని అన్నారు. నిరుపేదల ఆరోగ్యం బాగుపడాలని ముఖ్యమంత్రి సహాయ నిధులను భారీగా విడుదల చేస్తున్నారని తెలిపారు. పేదలకు కార్పొరేట్ వైద్యం అందించడంలో కాంగ్రెస్ ప్రభుత్వం ప్రత్యేకంగా దృష్టి సారించిందని అన్నారు. సిఎం రిలీఫ్ ఫండ్ నిధులను పేదలు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ ఏనుగుల శ్రీనివాస్ రెడ్డి, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.




## కబడ్డీ క్రీడాకారులను ప్రోత్సహించడమే లక్ష్యం
### కబడ్డీ అసోసియేషన్ అధ్యక్షుడు కాసాని వీరేశ్ ముదిరాజ్

**ప్రజాపక్షం/నిజాంపేట్ :** తెలంగాణ రాష్ట్రంలోని కబడ్డీ క్రీడాకారులను ప్రోత్సహించడమే తమ కబడ్డీ అకాడమీ లక్ష్యమని రాష్ట్ర కబడ్డీ అసోసియేషన్ అధ్యక్షులు కాసాని వీరేశ్ ముదిరాజ్ అన్నారు. కుత్బుల్లాపూర్ నియోజకవర్గం పరిధిలోని బాచుపల్లిలో గల కాసాని కృష్ణ ముదిరాజ్ కబడ్డీ అకాడమీలో వేసవి కాల కబడ్డీ శిక్షణ తరగతులు జరుగుతున్నాయి. ఈ సందర్భంగా బాలుర క్రీడాకారులకు క్రీడా దుస్తులు, కబడ్డీ కిట్‌లను కబడ్డీ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి కే.జగదీశ్వర్ యాదవ్‌తో కలిసి రాష్ట్ర కబడ్డీ అసోసియేషన్ అధ్యక్షులు కాసాని వీరేశ్ అందజేశారు.

ఈ సందర్భంగా కాసాని వీరేశ్ మాట్లాడుతూ రాష్ట్రవ్యాప్తంగా కబడ్డీ క్రీడాకారులను తెరపైకి తీసుకువచ్చి వారికి ప్రోత్సహిస్తూ జాతీయ స్థాయిలో ఎదిగే విధంగా తమ అకాడమీ పాటుపడుతుందని అన్నారు. ముఖ్యంగా నిరుపేద కబడ్డీ క్రీడాకారులకు అన్ని విధాలుగా తమ అకాడమీ శిక్షణతో పాటు భోజన సదుపాయం, క్రీడకు సంబంధించిన కిట్‌లను అందజేస్తున్నామని తెలిపారు. కబడ్డీ క్రీడలో తెలంగాణ రాష్ట్రానికి మంచి పేరుని తీసుకు వచ్చే విధంగా క్రీడాకారులు తయారు కావాలని అన్నారు. జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో తెలంగాణ రాష్ట్ర కబడ్డీ క్రీడాకారులు సత్తాను చాటాలని, కోచ్‌లు ఆ విధంగా క్రీడాకారులను తయారు చేయాలని సూచించారు. కార్యక్రమంలో రాష్ట్ర కబడ్డీ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి మద్ది మహేందర్ రెడ్డి, కబడ్డీ కోచ్‌లు జ్యోతీశ్వర్, లింగంపల్లి శ్రీనివాస్ రెడ్డి, గంగాధర్ మల్లేశ్, రమేశ్ పాల్గొన్నారు.



## సిసి రోడ్డు పనులు ప్రారంభం

**ప్రజాపక్షం/మల్కాజిగిరి :** ఓల్డ్ నేరేడ్‌మెట్ బొ్ద్రాయి, షిర్డీ సాయి కాలనీ, యాదవ్ బస్తీ ప్రాంతాల్లో రూ.20లక్షల వ్యయంతో చేపట్టిన భూగర్భ డ్రైనేజి, సిసి రోడ్డు పనులను బుధవారం మల్కాజిగిరి కార్పొరేటర్ శ్రవణ్ ప్రారంభించారు. సెయింట్ థామస్ స్కూల్, యాదవబస్తీ, కుమ్మరిబస్తీ,గీతానగర్ ప్రాంతాల్లో వాటర్ వర్క్స్ అధికారులు జిహెచ్ఎంసి మల్కాజిగిరి సర్కిల్‌కు చెందిన ఎఇ నవీన్, ఎఎంహెచ్ఓ మంజుల, ఎఇ తేజస్విని, జలమండలి జనరల్ మేనేజర్ సునీల్, రమేష్, ప్రణయ్, అజయ్ జోషి, అచ్యుత్‌కుమార్, మాధవ్, మురళీగౌడ్, బాబు, సునీల్, నాగరాజ్, కృష్ణ,దేవదాస్, అంజన్న, సాయి, శ్రీంకాంత్‌బాబులతో కల్సి పర్యటించారు. విష్ణుపురి ఎక్స్‌టెన్షన్ ప్రాంతంలో ఇటీవల వేసిన డ్రైనేజి పైపులైన్ పనుల్లో నాణ్యతా ప్రమాణాలు పాటించలేదని, ఈ విషయంలో విచారణ జరిపించాలని ఈ సందర్భంగా అధికారులను కోరారు. గీతానగర్ ప్రాంతంలో నూతన డ్రైనేజి పనుల కోసం ప్రతిపాదనలు ఇచ్చానంటూ ఆయన తెలిపారు.

## దివ్యాంగుడిపై యువకుల దాడి

**ప్రజాపక్షం/శామీర్‌పేటః** దివ్యాంగుడని కూడ చూడకుండా బతుకుదెరువుకు వలసవచ్చి ఐస్‌క్రీమ్‌లు అమ్ముకుంటున్న వ్యక్తిపై కొందరు యువకులు విచక్షణరహితంగా దాడికి పాల్పడిన సంఘటన శామీర్‌పేట పోలీస్‌స్టేషన్ పరిధిలో బుధవారం చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మూడుచింతలపల్లి మండలం లక్ష్మాపూర్ గ్రామానికి చెందిన పారుపల్లి నాగరాజు, కొత్త సాయి, పారుపల్లి అకాష్, మరోక గుర్తు తెలియని వ్యక్తి ఐస్‌క్రిమ్‌లు అమ్ముకునే ప్రదీప్‌కుమార్‌ను ఐస్‌క్రిమ్‌లు ఉన్నాయా అని అడిగారు. లేవని నేను ఇంటికి పోతున్నానని చెప్పడంతో ఆగ్రహంతో ఊగిపోయిన యువకులు అసభ్యపదజాలంతో దూషిస్తు విచక్షణ రహితంగా ప్రదీప్ కుమార్ ముఖంపై పిడిగుద్దులతో దాడి చేశారు. రక్త గాయాలు కావడంతో భయభ్రాంతులకు గురైన బాధితుడు రోడ్డుపక్కన ఉన్న కిరణాషాపులో దాచుకోగా గల్లాపట్టి బయటకు ఈడ్చడంతో బాదితుడికి గాయాలు అయ్యాయి. కిరాణ సామానులు చెల్లాచెదురుగా పడిపోయాయి. అక్కడ ఉన్న స్థానికులు గొడవను ఆపడానికి ప్రయత్నించగా వారిపై దురుసుగా ప్రవర్తించారు. స్థానికుల సహాయంతో శామీర్‌పేట పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నామని పోలీసులు తెలిపారు.






## ట్రాన్స్‌జెండర్‌ల గౌరవప్రదమైన జీవన భృతికి కృషి
### జిహెచ్ఎంసి అదనపు కమిషనర్లు స్నేహ శబరీష్, చంద్ర కాంత్ రెడ్డి

**ప్రజాపక్షం/హైదరాబాద్:** సమాజంలో ట్రాన్స్ జెండర్‌లకు గౌరవమైన జీవన భృతి కల్పించే దిశగా రాష్ట్ర ప్రభుత్వం అడుగులు వేస్తోందని జిహెచ్ఎంసి అదనపు కమిషనర్లు స్నేహ శబరీష్, చంద్ర కాంత్ రెడ్డిలు అన్నారు. జిహెచ్ఎంసి ప్రధాన కార్యాలయంలో బుధవారం పన్వర్ హాల్‌లో ట్రాన్స్ జెండర్‌ల ప్రతినిధులు, ఎన్‌జిఓలతో యుసిడి విభాగం ఆధ్వర్యంలో సమావేశం నిర్వహించారు.

ఈ సమావేశంలో ట్రాన్స్‌జెండర్‌ల సేవలను జిహెచ్ఎంసిలో వివిధ విభాగాలలో వినియోగించే అంశంపై వారి సూచనలు, అభిప్రాయాలను తీసుకున్నారు. ఈ సందర్భంగా అదనపు కమిషనర్ స్నేహ శబరీష్ మాట్లాడుతూ ట్రాన్స్ జెండర్‌ల ఆసక్తి, అర్హతల మేరకు జిహెచ్ఎంసిలో ఉద్యోగ ఉపాధి అవకాశాలు కల్పించడానికి చేపట్టే చర్యల్లో భాగంగా ఈ సమావేశం ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. జిహెచ్ఎంసిలో మాత్రమే కాకుండా ఇతర విధాల ఉపాధి పొందడానికి వారికి శిక్షణలు కూడా ఇస్తారన్నారు. యుసిడి అదనపు కమిషనర్ చంద్రకాంత్ రెడ్డి మాట్లాడుతూ ముఖ్యమంత్రి ఆదేశాల మేరకు జిహెచ్ఎంసిలో పలు ఉద్యోగ అవకాశాలు, ట్రాన్స్ జెండర్ వినియోగించుకొని ఆర్థికంగా నిలదొక్కుకోవాలన్నదే ముఖ్యమంత్రి ఆశయమని, అందుకు తమతమ విద్యార్హతలు, నైపుణ్యత, ఆసక్తుల మేరకు అనువైన రంగాన్ని ఎంచుకోవాలని, దానికి తగ్గట్టుగా శిక్షణ ఇచ్చి ఉపాధి కల్పించడానికి చర్యలు తీసుకోనున్నట్లు వివరించారు. ఉద్యోగ అవకాశాలకు అర్హత లేని ట్రాన్స్‌జెండర్లను స్వయం సహాయక గ్రూపులు ఏర్పాటుచేసి ఆర్థిక ఎదుగుదలకు దోహద పడే విధంగా కూడా జిహెచ్ఎంసి కృషి చేస్తుందన్నారు. ఇప్పటికే మూడు ట్రాన్స్‌జెండర్‌ల ఎస్‌హెచ్‌జి గ్రూపులను ఏర్పాటుచేసి బ్యాంకు లింకేజీ లభించే విధంగా చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. మరిన్ని ఎస్‌హెచ్‌జి గ్రూప్‌ల ఏర్పాటుకు ముందుకు రావాలన్నారు. ట్రాన్స్‌జెండర్ కమ్యూనిటీ అభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం గొప్ప నిర్ణయం తీసుకుందన్నారు.

**జిహెచ్ఎంసిలో ఉద్యోగాలు..**

జిహెచ్ఎంసిలోని వివిధ విభాగాల్లో పలు ఉద్యోగ అవకాశాలు ఉన్నాయన్నారు. వివిధ ఎన్‌జిఓ ల ద్వారా పలు రంగాల్లో శిక్షణనిచ్చి స్వయం ఉపాధికి చేయూతనివ్వనున్నట్లు తెలిపారు. సెక్యూరిటీ గార్డ్స్, క్లీన్ డ్రైవ్ అమలులో గ్రీన్ మార్షల్స్, పార్కు లు, జల మండలి రిజర్వాయర్ల వద్ద, స్పోర్ట్స్ గ్రౌండ్స్ వద్ద సెక్యూరిటీ గార్డ్‌లుగా, మెట్రో స్టేషన్‌లో ఉద్యోగ అవకాశాలు, అమృత్ స్కీం కింద నీటి నాణ్యత పరీక్షలో సహకారం, శిక్షణ అనంతరం స్ట్రీట్ లైట్ల నిర్వహణ, బస్తీ దవాఖానాలలో పారా మెడికల్‌గా ఉపాధి పొందే అవకాశం ఉందని, అర్హత గల వారందరిని భర్తీ చేస్తామన్నారు. స్పోర్ట్స్ అదనపు కమిషనర్ యాదగిరి రావు మాట్లాడుతూ స్పోర్ట్స్ విభాగంలో ఎలాంటి విద్యార్హత లేని అభ్యర్థుల నుండి అత్యధిక విద్యార్హతలు ఉన్న వారి వరకు పలు రకాల ఉపాధి అవకాశాలు ఉన్నాయని, ఆయా వివరాలను వివరించారు.

సమావేశానికి హాజరైన ట్రాన్స్ జెండర్ ఎన్‌జిఓలు పలువురు ఈ సందర్భంగా స్కిల్ డెవలప్‌మెంట్ సెంటర్ల ద్వారా అందిస్తున్న శిక్షణలను వారికి వివరించారు. ఆయా శిక్షణ సంస్థలు ఇస్తున్న ట్రైనింగ్స్, మార్కెట్ లింకేజి తదితర విషయాలను వివరించారు. పలువురు ట్రాన్స్ జెండర్‌ల ప్రతినిధులు వారివారి అభిప్రాయాలను తెలియజేయడంతో పాటు ఉద్యోగ ఉపాధితో జీవనోపాధికి సంబంధించిన వివిధ అంశాలపై గల సందేహాలను నివృత్తి చేసుకున్నారు. ఈ సమావేశంలో అదనపు ఎస్.పి. శ్రీనివాస్, హార్టికల్చర్ ఆఫీసర్ డాక్టర్ సునంద, అడ్మినిస్ట్రేషన్ జె.సి. శ్రీనివాస్, ఎన్‌జిఓలు, వివిధ ట్రాన్స్‌జెండర్స్ అసోసియేషన్స్ ప్రతినిధులు పాల్గొన్నారు.

## పాకిస్థాన్‌కు ఇండియన్ ఆర్మీ సరైన గుణపాఠం : విఎస్. బోస్

**ప్రజాపక్షం/చర్లపల్లిః** పాకిస్థాన్ మద్దతుతో ఉగ్రవాదులు పహల్గాంలో చేసిన దాడికి బదులుగా పాకిస్థాన్‌కు సరైన గుణపాఠంతో మన ఇండియన్ ఆర్మీ ఘన విజయం సాధించిదని సిపిఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు విఎస్ బోస్ అన్నారు. బుధవారం ఇసీఐఎల్ ఏఐటియుసి ఆధ్వర్యంలో నిర్వహించిన అభినందన సభలో దేశం కోసం ప్రాణాలను పణంగా పెట్టి పోరాడి విజయం సాధించిన ఇండియన్ ఆర్మీ,ప్రభుత్వానికి ఎఐటియుసి నాయకులు అభినందనలు తెలియ జేశారు. ఈ సందర్భంగా విఎస్ బోస్ మాట్లాడుతూ దేశ భద్రత వ్యవస్థలకు ఆయుధాలు తయారు చేసి అందించిన ప్రభుత్వ రంగ సంస్థలకు అభినందనలు తెలిపారు. యుద్ధంలో శత్రువులను మట్టుపెట్టిన




బ్రహ్మోస్, ఆకాశ్, సుక్కోయి వంటి అనేక మిసైల్స్, యుద్ధ విమానాలను డెవలప్‌తో పాటు పరికరాలను తయారీతో కృషి చేసిన డిఆర్‌డిఓ, బిడిఎల్, ఇసిఐఎల్, బిఇఎల్,హెచ్ఎఎల్ వంటి ప్రభుత్వరంగ సంస్థలను కొనియాడారు. దేశ భద్రతకు ప్రజల అవసరాలకు సమర్థవంతమైన పరికరాలను తయారు చేయగల సామర్థ్యం మన ప్రభుత్వరంగ సంస్థలకు మాత్రమే ఉందని ఆయన అన్నారు. ఎఐటియుసి ఎల్లవేళలా ప్రభుత్వ రంగ సంస్థలను కాపాడుకునేందుకు అనేక పోరాటాలు చేసిందని, చేస్తూనే ఉంటుందని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో జిల్లా నాయకులు శంకర్‌రావు, దామోదర్ రెడ్డి, నరసింహారావు,ఎన్ నరసింహ, శ్రీనారాయణ, మోహన్‌జోషి, బాలకృష్ణ, విటివర్లు, ఎఐటియుసి నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## నూతన చట్టం ప్రకారం భూ సమస్యల పరిష్కారానికి చర్యలు
### కలెక్టర్ ప్రతీక్‌జైన్

**ప్రజాపక్షం/వికారాబాద్ ప్రతినిధి :** వికారాబాద్ నియోజకవర్గం ధరూర్ మండల పరిధిలోని కేరెల్లి, కుక్కింద గ్రామాలలో ఏర్పాటు చేసిన భూ భారతి రైతు సదస్సులో జిల్లా కలెక్టర్ పాల్గొని మాట్లాడుతూ రైతుల నుండి స్వీకరించిన దరఖాస్తులను పరిశీలించారు. రెవెన్యూ గ్రామసభల ద్వారా అర్జీలను స్వీకరించి నూతన చట్టం ప్రకారం భూ సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకుంటున్నట్లు జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్ తెలిపారు. రాష్ట వ్యాప్తంగా భూ భారతి చట్టం అమలులో భూ సమస్యల పరిష్కారానికి రెవెన్యూ సదస్సులు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. భూ సమస్యలు ఉన్నవారు రెవెన్యూ సదస్సులో పాల్గొనాలని దరఖాస్తులు స్వీకరించి నూతన చట్టం ద్వారా ప్రభుత్వ ఆదేశాల ప్రకారం భూ సమస్యలు పరిష్కారానికి చర్యలు తీసుకోవడం జరుగుతుందన్నారు. గతంలో ప్రజలు తహాసీల్దార్, ఆర్డీఓ లేదా కలెక్టర్ కార్యాలయాలకు వెళ్లాల్సి వచ్చేదని, కానీ ఇప్పుడు అధికారులు స్వయంగా గ్రామాలకే వచ్చి ప్రజల నుండి దరఖాస్తులను స్వీకరిస్తున్నామని అన్నారు. ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలులోకి తెచ్చిన భూభారతి చట్టం కింద రైతులు , ప్రజల నుండి వచ్చిన దరఖాస్తు



లను క్షుణ్ణంగా పరిశీలన జరిపిన మీదట, క్షేత్రస్థాయిలో సమగ్ర విచారణ చేయాలని కలెక్టర్ రెవెన్యూ బృందాలను ఆదేశించారు.

వికారాబాద్ జిల్లా ధారుర్ మండల లోని గ్రామాల్లో నిర్వహించిన రైతు సదస్సు సందర్భంగా వచ్చిన దరఖాస్తులను ప్రభుత్వ మార్గదర్శకాలను తుచ తప్పకుండా పాటిస్తూ, నూతన ఆర్ఓఆర్ చట్టంలో పొందుపర్చిన నిబంధనలకు అనుగుణంగా పరిష్కరించాల్సి ఉంటుందని అన్నారు. రెవెన్యూ సిబ్బందికి వివిధ అంశాలపై మార్గనిర్దేశం చేశారు. పక్కాగ ఫీల్డ్ వెరిఫికేషన్ నిర్వహించాలని, మొక్కుబడిగా కాకుం డా ప్రతి అంశాన్ని ఎంతో జాగ్రత్తగా, సమగ్రంగా పరిశీలించాలని హితవు పలికారు. తప్పులు లేకుండా దరఖాస్తులను పరిశీలించాలని ఆదేశించారు.

అనంతరం ధారూర్ మండల అవుసుపల్లి గ్రామంలో ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణ పనులను పరిశీలించారు. అనంతరం గట్టెపల్లిలో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని తనిఖీ చేసి తగు సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ లింగ్యానాయక్, ఆర్‌డిఓ వాసుచంద్ర, తహసీల్దార్ దీపక్ శ్రీనివాస్, సజీద్ బేగం, నెమత్‌అలీ వెంకటేశ్వరి, సంధ్య, రైతులు పాల్గోన్నారు.



## మైనారిటీ గురుకుల పాఠశాలల్లో ప్రవేశాలు ప్రారంభం

**ప్రజాపక్షం/మేడ్చల్ ప్రతినిధి :** మైనారిటీ గురుకుల పాఠశాలల్లో విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందిస్తుండటంతో పాటు పూర్తి స్థాయిలో సౌకర్యాలను కల్పించేందుకు ప్రభుత్వం చార్జిలను పెంచిందని జిల్లా కలెక్టర్ గౌతం పేర్కొన్నారు. తెలంగాణా మైనారిటీ శాఖాధికారి కాంతమ్మ, జిల్లా ఆర్ఎల్‌సి జితేందర్, గురుకుల పాఠశాలల ప్రిన్సిపాళ్లతో కల్సి బుధవారం గురుకుల పాఠశాలల్లో ప్రభుత్వం కల్పిస్తున్న సౌకర్యాలకు సంబంధించి రూపొందించిన పోస్టర్లను కలెక్టర్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మైనారిటీ పాఠశాల విద్యార్థులకు వసతి గృహం విద్యార్థులకిస్తున్న కాస్మొటిక్ చార్జిలను ప్రభుత్వం గణనీయంగా పెంచిందని, పూర్తి సౌకర్యాలతో కూడిన ఉచిత విద్య లభిస్తోందన్నారు. జిల్లాలోని ఎనిమిది మైనారిటి గురుకుల పాఠశాలల్లో 2025–26 విద్యా సంవత్సరానికి గాను ప్రవేశాలు ప్రారంభమయ్యాయని తెలిపారు. 5 నుండి 10వ తరగతులతో పాటు ఇంటర్‌లో ఎంపిసి, బిపిసి, ఎంఇసి, సిఇసి గ్రూపుల్లో విద్యార్థులు చేరాలని కోరారు.



## కల్తీ నూనె, అల్లం పేస్ట్ పట్టివేత

**ప్రజాపక్షం/కొడంగల్ః** అర్ధరాత్రి అక్రమంగా కల్తీ వస్తువులను తరలిస్తు లక్షల వ్యాపారం సాగిస్తున్న అక్రమ వ్యాపారులను పోలీసులు చాకచక్యంగా పట్టుకున్న ఘటన కొడంగల్‌లో చోటు చేసుకుంది. ఎస్ఐ సత్యనారాయణ కథనం మేరకు బుధవారం తెల్లవారు ఝామున కొడంగల్ పట్టణంలోని అంబేద్కర్ చౌరస్తాలో పోలీస్ పెట్రోలింగ్ చేస్తున్న క్రమంలో హైద్రాబాద్ నుంచి అతివేగంగా ఓ వ్యాన్ కెఎ 32ఏఏ4072 గల వాహనం రావడంతో అనుమానం వచ్చిన పోలీసులు అట్టివాహనాన్ని ఆపి ఆరా తీశారు. ముందు పోలీసులను నమ్మించే ప్రయత్నం చేశారు కేటుగాళ్లు. ఆ తరువాత వారి ప్రవర్తనలో అనుమానం రావడంతో బులేరో వాహనాన్ని క్షుణ్ణంగా తనిఖీలు చేయగా అసలు బండారం బట్టబయలు కాగా వాహన డ్రైవర్ మహ్మద్ షాబాద్‌ను వాహనాన్ని స్టేషన్‌కు తరలించారు. అందులో అల్లం పేస్ట్ 1600 కేజీలు ఉండగా, కల్తీ మంచినూన్ 1500 కేజీలు ఉన్నట్లు గుర్తించారు. వీటి విలువ సుమారు 2 లక్షల పైనే ఉంటుందని దీనిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు వెల్లడించారు. ప్రతి ఒక్కరు ఎక్కడైన ఆహార వస్తువులను కొనుగోలుచేసే ముందు ఒకటికి పదిసార్లు ఆలోచన చేసి కోనాలని కొడంగల్ సిఐ శ్రీధర్‌రెడ్డి, ఎస్ఐ సత్యనారాయణలు తెలిపారు. వీరితో పాటు పోలీస్ సిబ్బంది తదితరులున్నారు.

## వేరువేరు ఘటనల్లో ఇద్దరు మృతి

**ప్రజాపక్షం/వికారాబాద్ ప్రతినిధి:** వికారాబాద్ నుండి మన్నెగూడ వెళ్లేటి డిసియం, బెలోనాకార్ అక్సిడెంట్ అయి డిసిఎం రోడ్డుకు అడ్డంగా ఉండటంతో టిజి 34 టిఎ 1995 గల బుల్లెట్ బండి పై కర్తీక్ ముదిరాజ్ వెనుకనుండి వెళ్లి కొత్రోపల్లి గేట్ సమీపంలో డిసిఎంను డీ కొట్టగా తలకి, ఇతర భాగాలకు బలమైన గాయాలలో అక్కడిక్కడే రాత్రి 11గంటలకు మృతి చెందారు. తండ్రి నారా



యణ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నాట్లు సిఐ తెలిపారు. వికారాబాద్ శివరెడ్డి పేట్ లో శ్రీ సరోజ్ మైన్స్‌లో, మినరల్స్ శుద్ధ కంపెనీయందు కూలీ పని చేసుకుని జీవిస్తున్నాడు. ఫిర్యాదుదారుడు రాకేష్ మంగరాజ్ తండ్రి సుశాంత్ మంగరాజ్ బ్లిష్లుపూర్, నాకబలి, బాలేశ్వేర్, ఓడిశా రాష్టం అని తెలిపారు. తన తండ్రి నిన్న చేపలు పట్టడానికి వెళ్లి ప్రమాదవశాత్తు చెరువులో పడి మృతి చెంది ఉండవచ్చుని ఫిర్యాదు ఇవ్వగా పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

## ఇంటిగ్రేటెడ్ పాఠశాల నిర్మాణానికి భూమి పరిశీలన
### పరిగి ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డి

**ప్రజాపక్షం/ పరిగి :** పరిగి మున్సిపల్ పరిధిలోని విద్యారణ్యపూరి తుంకుల్ గడ్డలో రూ.200 కోట్లతో త్వరలో ఇంటిగ్రేటెడ్ స్కూల్ నిర్మాణం చేపటడానికి పరిగి ఎమ్మెలే అధికారులతో కలిసి భూములను పరిశీలించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యేమాట్లాడుతూ అన్ని కులాల మతాలకు సంబంధించి విద్యార్థులు ఒకే పాఠశాలలో చదవాలని అంతర్జాతీయ స్థాయి విద్యను అందించలనే లక్ష్యంతో ప్రతి నియోజకవర్గంలో200కోట్లతో స్కూల్ నిర్మాణం పూర్తిచేసి విద్యా సంవత్సరం ప్రారంభించలనే లక్ష్యం తో ఇప్పటికే రాష్టంలో పలు నియోజకవర్గంలో పనులు ప్రారంభమయ్యాయని అన్నారు.త్వరలో కవలిసి స్థాలం సేకరించి ప్రారంభోత్సవం చేయడం జరుగుతుంది అని తెలిపారు.

అనంతరం పరిగి పట్టణంలో నూతనంగా ఏర్పాటు చేసిన కాకతీయ కోఆపరేటివ్ అర్బన్ బ్యాంక్‌ను ప్రారంభించిన ఎమ్మెల్యే , ముఖ్యమంత్రి సహయనిధి అందజేత ,అనారోగ్య సమస్యతోబాదపడుతున్నా పేదవారికి ముఖ్యమంత్రి సహయనిది ఎంతో ఉపయోగపడుతంది అని ఎమ్మెలే అన్నారు. పరిగి మండల పరిధిలోని రాపోలు గ్రామానికి చెందిన పరిగి తరుపతికి సంబందించిన 1,28,000చెక్కులనుఅయన భార్యకు ఎమ్మెల్యే నివసంలో అందజేశారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటి చైర్మన్ పరుశురాంరెడ్డి , కృష్ణ , లాల్‌కృష్ణప్రసాద్ , తహాసీల్దార్ అనంద్‌రావు, అయుబ్ ,అంజనేయులు తదితరులు పాల్గోన్నారు.



## సిబిఎస్ఇ పదవ తరగతి ఫలితాల్లో ‘విజ్ఞాన్’ విద్యార్థుల ప్రభంజనం

**ప్రజాపక్షం/ నిజాంపేట్ :** సిబిఎస్ఇ పదవ తరగ తి ఫలితాల్లో నిజాంపేట్ విజ్ఞాన్ స్కూల్ విద్యార్థు లు సత్తాను చాటారు. ఈ సందర్భంగా నిజాంపేట్ లోని విజ్ఞాన్ స్కూల్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో విజ్ఞాన్ విద్యాసంస్థల వైస్ చైర్మన్ రాణి రుద్రమ దేవి మాట్లాడుతూ ప్రణాళిక బద్ధమైన బోధన, రివిజన్‌లతో పాటు పిల్లల అవగాహన కొరకు బోర్డ్ ఎగ్జామ్స్ కంటే ముందుగా పూర్తి సిలబస్‌పై ఎన్నో పరీక్షలు నిర్వహించామని, దాని ఫలితమే సాధారణ విద్యార్థులు కూడా చాలా సునాయాసంగా ఆత్మవిశ్వాసంతో బోర్డు పరీక్షల ను రాసి ఉత్తమ ఫలితాలను సాధించారని అన్నారు. తెలంగాణ రాష్ట్రంలోనే ఒకే సంస్థ నుండి ముగ్గురు విద్యార్థులు 493, 492, 490 మార్కులను సాధించడం ఒక్క విజ్ఞాన్ సంస్థకు మాత్రమే దక్కిందని పేర్కొన్నారు. మార్కులే కాకుండా భవిష్యత్తులో ఏ రంగంలోనైనా రాణించడానికి అవసరమైన వ్యక్తిత్వ వికాసం, క్రీడా సాంస్కృతిక కార్యక్రమాల్లో తగిన శిక్షణను విద్యార్థులకు ఇస్తూ ప్రోత్సహిస్తున్నామని తెలిపారు. నిజాంపేట్ విజ్ఞాన్ స్కూల్ ప్రిన్సిపల్ పద్మావతి మాట్లాడుతూ ప్రతి టీచర్ యొక్క కృషికి ఈ ఫలితాలు నిదర్శనమని అన్నారు. ఎప్పటికప్పుడు విద్యార్థుల పురోగతిని తెలుసుకుంటూ టీచర్లకు తగిన సూచనలను ఇస్తూ, వారిని ప్రోత్సహించడం వలనే ఈ అద్భుత ఫలితాలను సాధించామని తెలిపారు. సుశిక్షుతులైన, అనుభవజ్ఞులైన ఉపాధ్యాయుల పర్యవేక్షణ లో విద్యార్థుల నిరంతర కృషి వల్ల ప్రతిఒక్కరు తమ సామర్థ్యానికి మించి ఫలితాలు సాధించారని అన్నారు. తమకు సంపూర్ణ సహకారం అందించిన విద్యార్థుల తల్లిదండ్రులకు కృతజ్ఞతలను తెలిపా రు. ఈ సందర్భంగా పదవ తరగతిలో ఉత్తమ ఫలితాలను సాధించిన విద్యార్థులు ఎం.జితేష్ 493/500, పి.హనిస్విత 492/500, ఎన్. మాన్విత 490/500, ఎ.హాసిని 490/500లను వైస్ చైర్మన్ రుద్రమ దేవి, ప్రిన్సిపల్ పద్మావతిలు అభినందించారు. ప్రతి మగ్గురిలో ఒకరు 95 శాతం మార్కులను సాధించగా 390 మంది విద్యార్థులు 80శాతం, ఆ పైగా మార్కులు పొందడం సంతోషమని వారు పేర్కొన్నారు.



# మహానగరి
గ్రేటర్ హైదరాబాద్ GREATER HYDERABAD

## కల్యాణలక్ష్మి, షాదీ ముబారక్ చెక్కుల పంపిణీ



ప్రజాపక్షం/గండిపేట : శంషాబాద్ మండలం పరిధిలో పలువురు లబ్దిదారులకు మంజూరయిన కల్యాణలక్ష్మి, షాదీ ముబారక్ చెక్కులను బుధవారం ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్ పంపిణీ చేశారు. శంషాబాద్ మండల పరిధిలో 13 గ్రామపంచాయతీలో ఉన్న 53 మందికి లబ్ధిదారులకు 53 06 148 చెక్కులను ఎమ్మెల్యే ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్ అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్ మాట్లాడుతూ పేద ప్రజల సంక్షేమమే ధ్యేయంగా ప్రభుత్వం పని చేస్తుందన్నారు. కల్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ పథకాలు నిరుపేదలకు ఎంతో ఉపయోగకరంగా ఉన్నాయన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ రవీంద్ర దత్తు, ఎంపిడిఒ మున్ని, మాజీ మున్సిపల్ చైర్మన్ తదితరులు పాల్గొన్నారు.

## అన్నిరంగాలలో అభివృద్ధే లక్ష్యం

మునిసిపల్ చైర్‌పర్సన్ బాతుక లావణ్య,



ప్రజాపక్షం/కొత్తూరు : మున్సిపాలిటీని అన్నిరంగాల్లో అభివృద్ధి చేయాలనే లక్ష్యంతోనే పనులు చేపడుతున్నట్లు చైర్‌పర్సన్ బాతుక లావణ్య దేవేందర్ యాదవ్ వివరించారు. బుధవారం మున్సిపల్ పరిధిలోని తిమ్మాపూర్ 3వ వార్డులో కౌన్సిలర్ కోస్గి శ్రీనివాస్ ఆధ్వర్యంలో నిర్మించనున్న అండర్‌గ్రౌండ్ డ్రైనేజీ నిర్మాణ పనులను ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా చైర్ పర్సన్ లావణ్య మాట్లాడుతూ ఆదర్శ మున్సిపాలిటీ లక్ష్యంగా ముందుకు వెళ్తున్నామని, అందుకు ప్రజలందరు సహకరించాలని కోరారు. కార్యక్రమంలో కమిషనర్ బాలాజీ, వైస్‌చైర్మన్ డోలీ రవీందర్, కౌన్సిలర్లు చంద్రకళ రాజేందర్‌గౌడ్, మాదారం నర్సింహ్మాగౌడ్, సోమ్లానాయక్, అనితా శ్రీనివాస్ గౌడ్, భ్యాగరి ప్రసన్న లత యాదయ్య, మాజీ సర్పంచ్ జనార్ధన్‌రెడ్డి, పెద్దాపురం కృష్ణయ్య, నరసింహా, నాగరాజ్‌గౌడ్, యాదయ్య పాల్గొన్నారు.

## ఇందిరమ్మ ఇండ్ల పనులు ప్రారంభం



ప్రజాపక్షం/షాబాద్ : నిరు పేదలకు ఇందిరమ్మ ఇండ్లను నిర్మించేందుకు తెలంగాణ సర్కార్ పనులు ప్రారంభించిందని గ్రామ కార్యదర్శి అశోక్ పేర్కొన్నారు. బుధవారం మండల పరిధిలోని పోతుగల్ గ్రామంలో ఇందిరమ్మ ఇండ్లను నిర్మించేందుకు గ్రామ కార్యదర్శి ఆధ్వర్యంలో ఇందిరమ్మ కమిటీ సభ్యులు పామెన నర్సింలు, కుమ్మరి శేఖర్, కేతవత్ పాండు, ప్రణిత, సునందలతో కలిసి ఇందిరమ్మ ఇండ్లకు ముగ్గు పరిచారు. ఈ సందర్భంగా కార్యదర్శి అశోక్ మాట్లాడుతూ గ్రామంలో నిరుపేదలకు ఇందిరమ్మ ఇండ్లు అందించేందుకు కృషి చేస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో గ్రామ ప్రజలు ఇందిరమ్మ కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా ఆంజనేయస్వామి జాతర



ప్రజాపక్షం/ఎల్‌బినగర్ : ఆంజనేయుడి కృపా కటాక్షాలు ప్రజలందిరిపై ఉండాలని బిఎన్‌రెడ్డి నగర్ డివిజన్ కార్పొరేటర్ మొద్దు లచ్చిరెడ్డి అన్నారు. బుధవారం డివిజన్‌లోని సాహెబ్ నగర్‌లో శ్రీ త్రినేత్ర ఆంజనేయ స్వామి జాతర సందర్భంగా స్వామి వారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జాతర ఉత్సవాలు సందర్భంగా భక్తులకు, ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు రాకుండా ఉత్సవ కమిటీ సభ్యులు చర్యలు తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఆలయ ఇఒ మురలీకృష్ణ, నాయకులు విష్ణువర్ధన్‌రావు, కొంగర మహేష్, చందు గౌడ్, నాగరాజు గౌడ్, శివశంకర్ గౌడ్, రాజు గౌడ్, సిద్దేశ్వర్, మహేందర్‌రెడ్డి, విజయ్, సురేష్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

## రక్తదానం అభినందనీయం




ప్రజాపక్షం/ఎల్‌బినగర్ : తలసేమియా బాధితులకు రక్తం అందించడానికి నిరంతరం మెగా రక్తదాన శిబిరాలు ఏర్పాటు చేస్తున్నట్టు మదర్ థెరిస్సా చారిటబుల్ సొసైటీ అధ్యక్షులు చేపూరి శంకర్ తెలిపారు. బుధవారం హరిహరపురం కాలనీలో మెగా రక్తదాన శిబిరం నిర్వహించారు. శిబిరాన్ని బిఎన్‌రెడ్డి నగర్ డివిజన్ కార్పొరేటర్ మొద్దు లచ్చిరెడ్డి, వనస్థలిపురం ట్రాఫిక్ సిఐ నాగమల్లు ప్రారంభించారు. అనంతరం వారు మాట్లాడుతూ మదర్ థెరిస్సా చారిటబుల్ సొసైటీ ఆధ్వర్యంలో రెడ్ క్రాస్ సొసైటీ సహకారంతో రక్తదానం శిబిరం ఏర్పాటు చేయడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో నాగర్ కర్నూల్ సివిల్ సప్లై డిస్టిక్ మేనేజర్ కట్ట బాలరాజు, స్ఫూర్తి సేవా సమితి అధ్యక్షులు కే.సంజయ్, కిరణ్‌కుమార్, సత్యనారాయణ, ప్రధాన కార్యదర్శి ఎస్.నాగేశ్వరరావు, సొసైటీ సభ్యులు చేపూరి సునిత, సుజాత, శ్రీనిత హాస్పిటల్ ఇంచార్జ్ దుర్గ, యోగిత. సందీప్‌రెడ్డి, రెడ్ క్రాస్ సొసైటీ డాక్టర్ జనార్ధన్‌రెడ్డి, రత్నకుమారి, షఫి తదితరులు పాల్గొన్నారు.

## 28న వనపర్తిలో 'జనభేరి' సభ



ప్రజాపక్షం/ఖైరతాబాద్ : వనపర్తి జిల్లాల్లో ఎన్నో ఏళ్లుగా పెండింగ్‌లో ఉన్న ప్రజా సమస్యల పరిష్కారానికి, హక్కుల సాధనకు ఈనెల 28న జనభేరి పేరిట బహిరంగ సభ నిర్వహించనున్నట్టు బిసి పొలిటికల్ జెఎసి రాష్ట్ర చైర్మన్ రాచాల యుగంధర్‌గౌడ్ తెలిపారు. వనపర్తి జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో జరిగే ఈ జనభేరికి సంబంధించిన వాల్ పోస్టర్‌ను బుధవారం బషీర్‌బాగ్‌లోని దేశోద్ధారకభవన్‌లో ఆయనతోపాటు జెఎసి ప్రతినిధులు ఆవిష్కరించారు. అనంతరం యుగంధర్‌గౌడ్ మాట్లాడుతూ గత 15ఏళ్లుగా ప్రజా సమస్యలపై పోరాడుతూనే ఉన్నానని, గత ప్రభుత్వం అక్రమ కేసులు పెట్టినా వాటిని ధైర్యంగా ఎదుర్కొని ముందుకెళ్తున్నానని తెలిపారు. వనపర్తి జిల్లాలోని అన్ని మండలాల్లో నెలకొన్న ప్రధాన సమస్యలను జనభేరి సభలో ప్రస్తావిస్తానని ఆయన వెల్లడించారు. జనభేరికి అన్ని రాజకీయ పార్టీలు, కులమాతాలకతీతంగా ప్రతిఒక్కరూ తరలిరావాలని ఆయన కోరారు. సమావేశంలో జెఎసి సలహాదారు బడేసాబ్, రైతు విభాగం రాష్ట్ర అధ్యక్షుడు పాండురంగ యాదవ్, యువజన విభాగం రాష్ట్ర అధ్యక్షులు చింతపల్లి సతీశ్‌గౌడ్, రంగారెడ్డి జిల్లా అధ్యక్షుడు రవీందర్, వనపర్తి జిల్లా ఉపాధ్యక్షులు గూడుషా, దేవర, శివ, అంజన్న యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

# హయత్‌నగర్ సిఐపై హైడ్రా కమిషనర్ ఎవి.రంగనాథ్ ఆగ్రహం

ప్రజావాణిలో భూ భాధితులు చేసిన ఫిర్యాదుపై స్పందించిన కమిషనర్




ప్రజాపక్షం/రంగారెడ్డి ప్రతినిధి : బాధితులు ఫిర్యాదు చేసినా కేసులు ఎందుకు నమోదు చేయలేదని హయత్‌నగర్ సిఐపై హైడ్రా కమిషనర్ ఎవి.రంగనాథ్ ఆగ్రహం వ్యక్తం చేశారు. తమ ప్లాట్లను కబ్జా చేశారని పలువురు భూ బాధితులు హైడ్రాకు ఫిర్యాదు చేశారు. బాధితుల ఫిర్యాదుతో హైడ్రా కమిషనర్ ఎవి రంగనాథ్ స్వయంగా రంగారెడ్డి జిల్లా తర్కయంజాల్ మున్సిపల్ పరిధిలోని కోహెడలో వివాదాస్పద స్థలాన్ని బుధవారం పరిశీలించారు. మారణాయుధాలు చూసి ఆగ్రహానికి లోనయ్యారు. ఈ సందర్భంగా బాధితులపై దాడి జరిగినా కేసు ఎందుకు నమోదు చేయలేదని హయత్‌నగర్ సిఐ నాగరాజుపై హైడ్రా కమిషనర్ ఎవి రంగనాథ్ ఆగ్రహం వ్యక్తం చేశారు. బాధితులకు అండగా ఉంటామని హామీ ఇచ్చారు. బాధితుల ఫిర్యాదులపై కేసులు నమోదు చేసి దర్యాప్తు చేయాలని సూచించారు భూ బాధితులకు న్యాయం చేయాలని ఆదేశాలు జారీ చేశారు. హైడ్రా కార్యాలయంలో ప్రజావాణి హైదరాబాద్ హైడ్రా కార్యక్రమం నిర్వహిస్తోంది. ప్రతి సోమవారం ప్రజ నుంచి ఫిర్యాదులు స్వీకరించేలా హైడ్రా ప్రజావాణి కార్యక్రమాన్ని ప్రారంభించింది.ఈ ప్రజావాణి కార్యక్రమానికి విశేష స్పందన వస్తోంది. బాధితుల నుంచి హైడ్రా కమిషనర్ ఎవి రంగనాథ్ ఫిర్యాదులను స్వయంగా స్వీకరిస్తున్నారు. అందిన ఫిర్యాదులపై విచారణ చేపట్టాలని అధికారులకు ఆదేశాలు జారీ చేస్తున్నారు. కార్యాలయంలో ప్రజావాణి అయితే, ప్రజావాణిలో కోహెడలో తమ భూమి కబ్జాకు గురైందని, ఫిర్యాదు చేసినా హయత్ నగర్‌లో సిఐ పట్టించుకోవడం లేదంటూ హైడ్రా కమిషనర్ ఎవి రంగనాథ్ ఎదుట భూ బాధితులు మొర పెట్టుకున్నారు. దీంతో బాధితుల ఫిర్యాదు మేరకు ఎవి రంగనాథ్ స్వయంగా వివాదాస్పద స్థలాన్ని సందర్శించి బాధితులతో మాట్లాడారు.

## హైదరాబాద్‌లో మాజీ సిఎం కొణిజేటి రోశయ్య కాంస్య విగ్రహం

లక్డీకాపూల్ మెట్రోస్టేషన్ సమీపంలో ప్రతిష్ఠాపనకు నిర్ణయం

టెండర్లను ఆహ్వానించిన జిహెచ్‌ఎంసి

తొమ్మిది అడుగుల విగ్రహం, జూలై 4న ఆవిష్కరణకు యోచన



ప్రజాపక్షం/హైదరాబాద్ : ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నేత దివంగత కొణిజేటి రోశయ్య స్మారకార్థం ఆయన కాంస్య విగ్రహాన్ని ఏర్పాటు చేయాలని గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ (జిహెచ్‌ఎంసి) నిర్ణయించింది. రోశయ్య చేసిన సేవలకు గుర్తింపుగా ఈ నిర్ణయం తీసుకుంది. హైదరాబాద్ నగరంలోని లక్డీకపూల్ మెట్రో స్టేషన్ సమీపంలో ఉన్న కూడలిలో ఈ విగ్రహాన్ని ప్రతిష్టాపించనున్నారు. తొమ్మిది అడుగుల ఎత్తు ఉండే ఈ కాంస్య విగ్రహం ఏర్పాటుకు సంబంధించి జిహెచ్‌ఎంజి అధికారులు ఇప్పటికే టెండర్ నోటిఫికేషన్‌ను జారీ చేశారు. అర్హులైన కాంట్రాక్టర్ల నుంచి బిడ్‌లను ఆహ్వానించారు. జూలై 4వ తేదీన కొణిజేటి రోశయ్య జయంతి సందర్భంగా ఈ విగ్రహాన్ని ఆవిష్కరించాలని జిహెచ్‌ఎంసి భావిస్తోంది. ఈ దిశగా ఏర్పాట్లు ముమ్మరం చేసేందుకు అధికారులు కసరత్తు చేస్తున్నారు. టెండర్ ప్రక్రియ పూర్తయిన వెంటనే విగ్రహ నిర్మాణ పనులు ప్రారంభం కానున్నాయని జిహెచ్‌ఎంసి అధికార వర్గాలు తెలిపాయి. కొణిజేటి రోశయ్య ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో సుదీర్ఘకాలం పాటు ఆర్థిక మంత్రిగా, ముఖ్యమంత్రిగా, ఆ తర్వాత తమిళనాడు గవర్నర్‌గా కూడా విశేష సేవలు అందించారు. ఆయన రాజకీయ అనుభవం, పరిపాలనా దక్షత తెలుగు ప్రజల మనసుల్లో చిరస్థాయిగా నిలిచిపోయాయి.

## కార్మిక చట్టాలు సాధించుకుందాం

బికెఎంయు జిల్లా ప్రధాన కార్యదర్శి బుద్దుల జంగయ్య



ప్రజాపక్షం/కొందుర్గు: హక్కుల కోసం పోరాటాలు చేసి కార్మిక చట్టాలను సాధించుకుందామని బికెఎంయు జిల్లా ప్రధాన కార్యదర్శి బుద్దుల జంగయ్య అన్నారు. ఈ నెల 20వ తేదీన నిర్వహించనున్న సార్వత్రిక సమ్మె నోటీసును బుధవారం జిల్లేడ్‌చౌదరిగూడ ఎంపిడివోకు అందజేశారు. ఈ సందర్భంగా జంగయ్య మాట్లాడుతూ 40 కార్మిక చట్టాలను నాలుగు కోడ్లుగా విభజించి కార్మికుల హక్కులను కాలరాస్తుందని, 100 సంవత్సరాలుగా ఉన్న చట్టాలను కేంద్ర ప్రభుత్వం విభజించి, కార్మిక హక్కులను కాలరాస్తు, కార్పోరేట్ శక్తులకు ఊడిగం చేయడం ఏమిటని ప్రశ్నించారు. ఇప్పటికే యాజమాన్యాలు కార్మికుల కష్టాన్ని దోచుకుంటున్నాయని, కార్మికుల శ్రమతో దోచుకున్న సోమ్మును స్విస్ బ్యాంకులో దాచుకుంటున్నాయని, అలాంటి వారికి కేంద్ర ప్రభుత్వం రక్షణ కల్పించడం ఏంటని ప్రశ్నించారు. దేశంలో కార్మికులకు, కర్షకులకు నేటికీ కనీస వసతులు లేవని, వాటిపై దృష్టి పెట్టకుండా, బీదలకు అనుకూలంగా ఉన్న చట్టాల జోలికి రావడం అంటే కొరివితో తలను గోక్కోవడమేనని అన్నారు. ఈ నెల 20న నిర్వహించే సమ్మెలో అధిక సంఖ్యలో కార్మికులు, కర్షకులు పాల్గొనాలని కోరారు. కార్యక్రమంలో గ్రామ పంచాయితీ వర్కర్స్ యూనియన్ మండల ఉపాధ్యక్షులు జి పాపయ్య, మండల నాయకులు జంగయ్య, రమేష్, చంద్రమ్మ, రాములమ్మ, ఈదమ్మ తదితరులు పాల్గొన్నారు.

## కల్నల్ సోఫియా ఖురేషిని అవమానించిన బిజెపి మంత్రి విజయ్‌షాను బర్తరఫ్ చేయాలి

సిపిఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు అందోజు రవీంద్రాచారి

ప్రజాపక్షం/రంగారెడ్డి ప్రతినిధి : ఆపరేషన్ సింధూర్ విజయవంతం చేసిన సోఫియా ఖురేషిపై అనుచిత వ్యాఖ్యలు చేసిన బిజెపి మంత్రి విజయ్ షాను వెంటనే బర్తరఫ్ చేయాలని సిపిఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు అందోజు రవీంద్రా చారి డిమాండ్ చేశారు. బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం నిర్వహించిన ఆపరేషన్ సింధూర్‌కు నాయకత్వం వహించి, విజయవంతం చేసిన సోఫియా ఖురేషిని మంత్రి అజయ్ షా పాకిస్తాన్ తీవ్రవాదుల సోదరి అని ప్రస్తావించడాన్ని తీవ్రంగా పరిగణించి షాని వెంటనే అరెస్టు చేయాలని రవీంద్రాచారి డిమాండ్ చేశారు. ప్రాణాలను సైతం లెక్కచేయకుండా ప్రభుత్వం ఆదేశించిన ప్రకారం పాకిస్తాన్‌లో ఉన్న ఉగ్రవాద శిబిరాలపై ధైర్యసహసాలతో దాడులు విజయవంతం చేసిన సోఫియా ఖురేషిని మతం పేరుతో కించపరచడాన్ని సిపిఐ తీవ్రంగా ఖండిస్తోందన్నారు. దేశం కోసం చేసిన త్యాగాలను పార్టీ ప్రయోజనాల కోసం వాడుకోవడం దుర్మార్గమన్నారు. ఈ వ్యాఖ్యలతో బిజెపి నాయకులపై దేశంపై ఎంత ప్రేమ ఉందో అర్థమవుతుందని, ఇలాంటి వ్యాఖ్యలను ప్రజలు క్షమించరని, గతంలో పార్లమెంట్‌పై దాడిని పుల్వామా దాడులను పార్టీ కోసం ఎన్నికల్లో వాడుకున్నారని, ప్రజలు అన్నీ గమనిస్తున్నారని, దీనిని తిప్పికొట్టాల్సిన అవసరం ఎంతైనా ఉందని రవీంద్రాచారి తెలిపారు. ఈ వ్యాఖ్యలు చేసిన బిజెపి మంత్రిని వెంటనే పదవి నుండి తొలగించి దేశద్రోహం కింద అరెస్టు చేయాలని ఆయన పేర్కొన్నారు.

## పోలీస్‌స్టేషన్‌లో కుప్పకూలిన ఆటో డ్రైవర్



ప్రజాపక్షం/గండిపేట: ఓ కేసు విషయంలో ఆటోడ్రైవర్ తన కుటుంబ సభ్యులతో కలిసి పోలీస్ స్టేషన్‌కు వచ్చారు. పోలీసులతో మాట్లాడాక పోలీస్ స్టేషన్ ఆవరణలో కుప్పకూలాడు. కుటుంబ సభ్యులు వెంటనే అతడిని స్థానిక ఆసుపత్రికి తరలించగా అప్పటికే మృతిచెందాడని డాక్టర్లు తెలిపారు ఈ సంఘటన రాజేంద్రనగర్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. ఈ సంఘటనకు సంబంధించిన పూర్తి వివరాలు రాజేంద్రనగర్ డివిజన్ ఏసిపి శ్రీనివాస్ కథనం ప్రకారం ఇలా ఉన్నాయి. దర్గా కాలేజ్ కాలనీలో ఇంట్లో నివాసం ఉంటున్న ఇమ్రాన్(35) వృత్తిరీత్యా ఆటో డ్రైవర్ తన కుటుంబ సభ్యులతో కలిసి జీవనం సాగిస్తున్నారు. ఇద్దరు భార్యలు, పిల్లలు ఉండగా మరో మహిళతో వివాహేతర సంబంధాన్ని కొనసాగిస్తున్నాడు. ఆ మహిళను వివాహం చేసుకోవడానికి సిద్ధపడ్డాడు ఈనెల 13న వివాహేతర సంబంధం పెట్టుకున్న మహిళ తన కుటుంబ సభ్యులతో కలిసి ఇమ్రాన్ ఇంటికి వచ్చింది. రెండో భార్యకు వివాహేతర సంబంధం పెట్టుకున్న మహిళకు మధ్య ఘర్షణ నెలకొంది. దీంతో ఇంటి యజమాని మీరు ఇక్కడ మాట్లాడొద్దు పోలీస్ స్టేషన్‌కు వెళ్ళమని అక్కడి నుంచి వారందరిని పంపించాడు. దీంతో వారంతా పోలీస్‌స్టేషన్‌కు చేరుకున్నారు. పోలీసుల సమక్షంలో అందరూ కలిసి ఉండడానికి అంగీకారం తెలిపి తిరిగి వెళ్లేందుకు వస్తుండగా ఇమ్రాన్ అక్కడికక్కడే పడిపోయాడు. దీంతో కుటుంబసభ్యులు ఆసుపత్రికి తరలించగా అప్పటికే మృతిచెందినట్లు డాక్టర్లు తెలిపారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

## వివాహిత ఆత్మహత్య

భర్తే చంపాడని యువతి తల్లిదండ్రుల ఫిర్యాదు



ఫైల్..

ప్రజాపక్షం/హైదరాబాద్ : పెళ్లి అయిన మూడేళ్లకే ఆ యువతి అత్తారింట్లో అనుమానాస్పద స్థితిలో మృతి చెందింది. తమ కూతురిని చంపేసి ఆత్మహత్య గా చిత్రీకరిస్తున్నారని మృతురాలి తల్లి దండ్రులు ఆరోపిస్తున్నారు. భర్త, అతడి కుటుంబ సభ్యులు తమ కూతురుని వేధించి, చిత్రహింసలు పెట్టి ఉరి వేసి చంపారని తల్లిదండ్రులు ఎల్‌బినగర్ పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. వివరాలు ఇలా ఉన్నాయి. ఖమ్మం జిల్లా కేబిఆర్ నగర్ నాయుడుపేటకు చెందిన ప్రభుత్వ ఉపాధ్యాయుడు కట్ట వెంకటేశ్వరరావు తన కుమార్తె జాస్మిన్(28)ను ఎల్‌బినగర్ మన్సూరాబాద్ పరిధిలోని శివపురి కాలనీ చెందిన రాజశేఖర్‌కు ఇచ్చి మూడేళ్ల క్రితం వివాహం చేశారు. అనంతరం తరచుగా అదనపు కట్నం కోసం రాజశేఖర్ తన భార్యను చిత్రహింసలకు గురి చేసేవాడు. గతంలో అనేక మార్లు ఇబ్బందులకు గురి చేస్తే ఖమ్మం మహిళా పోలీస్ స్టేషన్‌లో కేసు పెట్టారు. పెద్దమనుషుల సమక్షంలో అనేకమార్లు పంచాయతీ జరిగింది. అనంతరం తప్పయినట్లుగా అంగీకరించి రాజశేఖర్ తన భార్యను తీసుకుని వెళ్ళిపోయాడు. కాగా మంగళవారం సాయంత్రం తన అల్లుడు అయిన రాజశేఖర్ ఫోన్ చేసి మీ కూతురు ఉరి వేసుకొని చనిపోయిందని తల్లిదండ్రులకు సమాచారం అందించటం జరిగింది. యువతి తల్లిదండ్రులు వచ్చి చూసే సరికి తన కూతురు వంటిమీద విపరీతమైన గాయాలతో శరీరం అంత కమిలిపోయి ఉందని చిత్రహింసలు పెట్టి వైరుతో ఉరి వేశారని మృతురాలి తల్లిదండ్రులు ఆరోపించారు. తమ కుమార్తెను చిత్రహింసలు పెట్టి చంపిన రాజశేఖర్‌ను అతని కుటుంబ సభ్యులను వెంటనే అరెస్ట్ చేసి చట్ట రీత్యా చర్యలు తీసుకోవాలని మీడియా ముందు తల్లిదండ్రులు బోరున విలపించారు. తన కుమార్తె మరణం వెనుక ఉన్న వారి కుటుంబ సభ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని బాధితురాలి బంధువులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎల్‌బి నగర్ సిఐ వినోద్‌కుమార్ తెలిపారు.

## విద్యుత్ అధికారుల నిర్లక్ష్యం..

ప్రజాపక్షం/షాబాద్ : షాబాద్ మండల పరిధిలోని మాచన్ పల్లి గ్రామంలో అర్ధరాత్రి విద్యుత్ సమస్యతో ఇబ్బందులు ఎదురుకుంటున్నట్లు గ్రామస్తులు ఆవేధన వ్యక్తం చేస్తున్నారు. మాచన్‌పల్లి గ్రామంలో గత రెండు సంవత్సరాలుగా విద్యుత్ గ్రామంలో విద్యుత్ సమస్య వస్తుందని ఎంత చెప్పిన విద్యుత్ అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని పేర్కొన్నారు. ప్రతి రోజు అర్ధరాత్రి కాగానే ఓవర్‌లోడ్ కారణంగా విద్యుత్ వైర్లు కాలిపోయి విద్యుత్ సరఫరా ఆగిపోతుందని గ్రామస్తులు ఆవేధన వ్యక్తం చేస్తున్నారు. అర్ధ రాత్రి అంధకారంలో మాచన్ పల్లి గ్రామ ప్రజలు సమస్యలు ఎదురుకొంటున్నట్లు తెలిపారు. గత రెండు సంవత్సరాలు మాచన్ పల్లి గ్రామానికి చెందిన విఠల్ అనే రైతు గ్రామస్తులతో కలిసి విద్యుత్ అధికారులకు ఎన్ని సార్లు మొర పెట్టుకున్న విద్యుత్ సమస్య తీర్చాలేదని పేర్కొన్నారు. ఇప్పటికైన జిల్లా ఉన్నత శాఖ విద్యుత్ అధికారులు స్పందించి మాచన్‌పల్లి గ్రామంలో విద్యుత్ సమస్య పరిష్కరించాలని గ్రామస్తులు కోరుతున్నారు.

## కల్తీ మద్యం పట్టివేత..ఇద్దరి అరెస్టు

ప్రజాపక్షం/హైదరాబాద్: తక్కువ ధరకే ఢిల్లీ మద్యం అమ్ముతామని నమ్మించి నకిలీ మద్యం సరఫరా చేస్తున్న ఓ ముఠా గుట్టును ఎక్సైజ్ పోలీసులు రట్టు చేశారు. ఈ ముఠా ఫంక్షన్ హాల్స్ లో జరుగుతున్న పంక్షన్స్, నివాస గృహాల్లోను, ఇతర పార్టీలు జరుగుతున్నాయనే సమాచారం తెలిస్తే చాలు.. వారికి వల వేస్తారు. ఢిల్లీ నుంచి ప్రత్యేకంగా తెప్పించిన ఖరీదైన మద్యం బాటిళ్లు ఉన్నాయి.. మద్యం దుకాణాల్లో లభించే మద్యం బాటిళ్ల ధరలపై రూ. 500 నుంచి రూ.వేయి తగ్గింపు ధరలకు వస్తాయని నమ్మబలికి ఢిల్లీ లేబుల్స్ బాటిళ్లలో కల్తీ మద్యం, తక్కువ ధరల మద్యం బాటిళ్ల మద్యాన్ని మిక్సింగ్ చేసి సొమ్ము చేసుకుంటుంది. రాజేంద్రనగర్ కాటేదాన్ ప్రాంతంలో జరుగుతున్న ఒక ఫంక్షన్ కు ఒక ముఠా మద్యాన్ని సరఫరా చేస్తామని కుదుర్చుకున్న ఒప్పందం మేరకు కారులో నాలుగు కాటన్లలో మద్యం బాటిళ్లను తరలిస్తున్న సమయంలో శంషాబాద్ డిటిఎఫ్ సీఐ ప్రవీణ్ కుమార్ సిబ్బంది కలిసి పట్టుకున్నారు. ఢిల్లీకి చెందిన 72 బ్లాక్ లెబుల్ మద్యం బాటిళ్లను ,కారుతో పాటు ఇద్దరు నిందితులను అదుపులోకి తీసుకున్నారు. పట్టుకున్న బ్లాక్ లెబుల్ మద్యాన్ని పరిశీలించినపుడు అది ఫ్యూరియస్ లిక్కర్గా ఉందని గుర్తించారు. పట్టుకున్న మద్యం , కారు విలువ కలిపి రూ. 20 లక్షలుగా ఉటుందని అంచనా వేశారు. తక్కువ ధరలకు మద్యం వస్తుందని సేవిస్తే ప్రాణాలకు హాని జరుగుతుందని శంషాబాద్ ఎక్సైజ్ సూపరిండెంట్ క్రిష్ణ ప్రియ అన్నారు.

# ప్రైవేట్ ఆసుపత్రులకు రోగులను తరలిస్తే కఠిన చర్యలు

108సిబ్బందిపై ఆగ్రహం వ్యక్తం చేసిన ఎమ్మెల్యే వీర్లపల్లి





ప్రజాపక్షం/షాద్‌నగర్ : ప్రమాద పరిస్థితుల్లో ఉన్న రోగులను ప్రభుత్వ ఆసుపత్రులకు తరలించకుండా ప్రైవేట్ ఆసుపత్రులకు తీసుకువెళ్తె సహించేది లేదని షాద్ నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ హెచ్చరించారు. బుధవారం పట్టణంలోని క్యాంపు కార్యాలయంలో షాద్‌నగర్ ఏరియా 108 సిబ్బందితో ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రాణాపాయ స్థితిలో ఉన్న రోగులను ప్రభుత్వ ఆసుపత్రికి తీసుకువెళ్ళకుండా ప్రైవేట్ ఆసుపత్రులకు తీసుకువెళ్ళడం ఏమిటని ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రైవేట్ ఆసుపత్రుల యాజమాన్యాలు ఇస్తున్న కాసులకు కక్కుర్తి పడి ప్రభుత్వ 108వాహనంలో ప్రైవేట్‌కు తీసుకువెళ్ళడం సరైన పద్ధతి కాదని హెచ్చరించారు. ప్రభుత్వ నిబంధనల ప్రకారం 108వాహనంలో ప్రభుత్వ ఆసుపత్రికి తీసుకువెళ్ళేందుకు కృషి చేయాలని, నిబంధనలు అతిక్రమిస్తే సహించేది లేదన్నారు. ఆరోపణలు లేకుండా 108వాహనాలను నడిపించుకునేందుకు కృషి చేయాలని లేనిపక్షంలో చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. సమావేశంలో షాద్‌నగర్ హెల్త్ ఎడ్యుకేటర్ డాక్టర్ విజయలక్ష్మీ, హెల్త్‌ఎడ్యుకేటర్ డాక్టర్ జె.శ్రీనివాసులుతోపాటు 108సిబ్బంది పాల్గొన్నారు.

### అర్హులైన ప్రతిఒక్కరికి సంక్షేమ పథకాలు

అర్హులైన ప్రతి ఒక్క లబ్దిదారుడికి సంక్షేమ పథకాలను అందించాలన్నదే కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యమని ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ అన్నారు. ఫరూఖ్‌నగర్ మండల పరిషత్ సమావేశ మందిరంలో మండలంలోని వివిధ గ్రామాలకు మంజూరైన 190మందికి కళ్యాణ లక్ష్మీ, షాది ముబారక్ చెక్కులను పంపిణీ చేశారు. క్యాంపు కార్యాలయంలో నియోజకవర్గ స్థాయి ఎంపిడివోలు, మున్సిపల్ కమీషనర్లు, బ్యాంకర్లతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ మాట్లాడుతూ దరఖాస్తులు చేసుకున్న ప్రతి ఒక్కరికి ముఖ్యమంత్రి సహాయ నిధి నుండి మొదలు కళ్యాణలక్ష్మీ, షాది ముబారక్ వంటి అనేక పథకాలను అందిస్తున్నామని తెలిపారు. రాజీవ్ యువ వికాసం లబ్దిదారులకు సకాలంలో రుణాలు ఇచ్చేందుకు బ్యాంక్ అధికారులు కృషి చేయాలన్నారు.

### ప్రభుత్వ జూనియర్ కళాశాల భవన నిర్మాణానికి రూ.11లక్షల విరాళం

పేద విద్యార్థుల శ్రేయస్సు కోసం నిర్మిస్తున్న ప్రభుత్వ జూనియర్ కళాశాల భవన నిర్మాణానికి బింజుసారియా ఆస్పాత్ ప్రైవేట్ లిమిటెడ్ కంపెనీ యాజమాన్యం రూ.11లక్షలు విరాళం అందజేశారు. బుధవారం హైదరాబాద్‌లోని వారి కార్యాలయంలో ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్‌కు పరిశ్రమ యాజమాని వినోద్‌కుమార్ జీ కేడియా తన తండ్రి భన్వరీలాల్‌జి జ్ఞాపకార్థం ఈ విరాళం ఇచ్చినట్లు తెలిపారు. ప్రభుత్వ కళాశాలలో చదివే పేద విద్యార్థుల శ్రేయస్సు కోసం తాము ఎల్లప్పుడు ముందుంటామని వివరించారు. విద్యార్థులకు నాణ్యమైన విద్య అంధించాలన్న లక్ష్య ఎంతో గొప్పదని ఇందుకు తమ సహకారం ఎల్లప్పుడు ఉంటుందని పేర్కొన్నారు. కార్యక్రమంలో మోముల బసప్ప, హితేష్ కేడియా తదితరులు పాల్గొన్నారు.

# క్రీడ

## ఢిల్లీ క్యాపిటల్స్ లోకి బంగ్లాదేశ్ పేసర్..!



ఐపిఎల్ 2025 సీజన్ పున:ప్రారంభానికి ముందు ఢిల్లీ క్యాపిటల్స్ జట్టులో కీలక మార్పు చోటు చేసుకుంది. విధ్వంసకర ఓపెనర్ జేక్ ఫ్రెజర్ మెక్ గర్క్ స్థానంలో బంగ్లాదేశ్ పేసర్ ముస్తాఫిజుర్ రెహ్మాన్‌ను తీసుకుంది. ఐపీఎల్ 2025 సీజన్లోని మిగిలిన మ్యాచ్‌లను ఆడేందుకు జేక్ ఫ్రెజర్ మెక్ గర్క్ ఇండియాకు వచ్చేందుకు నిరాకరించినట్లు తెలుస్తోంది. ఈ క్రమంలోనే అతని స్థానాన్ని ముస్తాఫిజుర్ రెహ్మాన్‌తో ఢిల్లీ క్యాపిటల్స్ భర్తీ చేసింది. ఈ మేరకు ఐపీఎల్ నిర్వాహకులు బుధవారం ఓ ప్రకటనను విడుదల చేశారు. ముస్తాఫిజుర్ రెహ్మాన్‌ను రూ. 6 కోట్లకు ఢిల్లీ క్యాపిటల్స్ తీసుకుంది. ఓపెనర్ స్థానంలో పేసర్‌ను ఎంచుకోవడంపై అభిమానులు ఆశ్చర్యం వ్యక్తం చేస్తున్నారు.

**విఫలమైన ఫ్రెజర్..**

అయితే ఈ సీజన్‌లో జేక్ ఫ్రెజర్‌మెక్ గర్క్ దారుణంగా విఫలమయ్యాడు. 6 మ్యాచ్‌ల్లో 9.17 సగటుతో 55 పరుగులే చేసి తీవ్రంగా నిరాశపరిచాడు. పేలవ ప్రదర్శనతో తుది జట్టులో చోటు కూడా కోల్పోయాడు. గత సీజన్‌లో జేక్ ఫ్రెజర్ మెక్ గర్క్ మెరుగైన ప్రదర్శన చేశాడు. 234.04 స్ట్రైక్‌రేట్‌తో 330 పరుగులు కొట్టాడు. దాంతో అతన్ని మెగా వేలంలో రైట్ టూ మ్యాచ్ కార్డ్ వాడి మరి ఢిల్లీ కొనుగోలు చేసింది. కానీ అతను మాత్రం అంచనాలను అందు

**ముస్తాఫిజుర్ ట్రాక్ రికార్డ్.**

ముస్తాఫిజుర్ రెహ్మాన్ ఇప్పటి వరకు 57 ఐపీఎల్ మ్యాచ్‌లు ఆడి 61 వికెట్లు తీసాడు. అతను ఇప్పటి వరకు సీఎస్‌కే, రాజస్థాన్ రాయల్స్, ముంబై ఇండియన్స్, ఢిల్లీ క్యాపిటల్స్, సన్‌రైజర్స్ హైదరాబాద్‌కు ప్రాతినిథ్యం వహించాడు. కీలక ప్లే ఆఫ్స్ ముంగిట బలహీనంగా మారిన బౌలింగ్ విభాగాన్ని బలోపేతం చేసేందుకు ముస్తాఫిజుర్‌ను తీసుకున్నట్లు తెలుస్తోంది.

**ఢిల్లీ ప్లే ఆఫ్స్ చేరాలంటే..**

భారత్, పాకిస్థాన్ మధ్య నెలకొన్న ఉద్రిక్తతల కారణంగా ఐపీఎల్ 2025 సీజన్‌ను వారం పాటు వాయిదా వేసిన సంగతి తెలిసిందే. ఇరు దేశాల మధ్య కాల్పుల విరమణ ఒప్పందం జరగడంతో ఐపీఎల్ 2025 సీజన్‌ను రీస్టార్ట్ చేసేందుకు బీసీసీఐ సిద్ధమైంది. శనివారం నుంచి ఐపీఎల్ 2025 సీజన్ పున:ప్రారంభం కానుంది. ఇప్పటికే రివైజ్డ్ షెడ్యూల్‌ను బీసీసీఐ ప్రకటించింది. ప్రస్తుతం ఢిల్లీ క్యాపిటల్స్ 11 మ్యాచ్‌ల్లో 6 విజయాలతో ఐదో స్థానంలో కొనసాగుతోంది. ప్లే ఆఫ్స్ చేరాలంటే మరో 3 మ్యాచ్‌ల్లో రెండు గెలవాలి. రివైజ్డ్ షెడ్యూల్ ప్రకారం ఢిల్లీ క్యాపిటల్స్.. ఆదివారం గుజరాత్ టైటాన్స్‌తో తలపడనుంది.

## కోహ్లీ, రోహిత్‌లకు బిసిసిఐ గుడ్ న్యూస్!



టీ20, టెస్టులకు రిటైర్మెంట్ ప్రకటించిన తర్వాత కూడా టీమిండియా స్టార్ క్రికెటర్లు విరాట్ కోహ్లీ, రోహిత్ శర్మలకు బిసిసిఐ గుడ్‌న్యూస్ చెప్పింది. విరాట్, రోహిత్ శర్మలు టెస్టులు టీ20లకు రిటైర్మెంట్ ప్రకటించినప్పటికీ వాళ్లకు 'ఏ ప్లస్' కాంట్రాక్ట్ కొనసాగుతుందని భారత క్రికెట్ నియంత్రణ మండలి సెక్రటరీ దేవజిత్ సైకియా వెల్లడించారు. వారిద్దరు భారత క్రికెట్‌లో భాగమయ్యారని, ఏ ప్లస్ సౌకర్యాలు గతంలో మాదిరే లభిస్తాయని ఆయన తెలిపారు. సాధారణంగా మూడు ఫార్మాట్లలో అందుబాటులో ఉండే వారికే ఏ ప్లస్ గ్రేడ్ వర్తిస్తుంది. ఇదిలా ఉండగా టెస్ట్ ఫార్మాట్‌కు వీడ్కోలు పలికిన టీమిండియా కెప్టెన్ రోహిత్ శర్మ, మాజీ కెప్టెన్ విరాట్ కోహ్లీలు ఇంగ్లండ్ పర్యటనకు వెళ్లనున్నారు. ఐపిఎల్ 2025 సీజన్ ముగిసిన వెంటనే ఐదు టెస్ట్‌ల సిరీస్ కోసం టీమిండియా ఇంగ్లండ్‌లో పర్యటించనుంది. ఈ సిరీస్‌తోనే డబ్ల్యూటీసీ 2025–27 సైకిల్ ప్రారంభం కానుంది. అయితే ఈ పర్యటనకు ముందే రోహిత్ శర్మ, విరాట్ కోహ్లీ రిటైర్మెంట్ ప్రకటించి అందర్నీ ఆశ్చర్యపరిచారు. కెప్టెన్సీతో పాటు ఆటగాడిగా అవకాశం లేదని సెలెక్టర్లు చెప్పడంతోనే రోహిత్ శర్మ తప్పుకున్నాడని ప్రచారం జరిగింది. కానీ ప్రపంచ క్రికెట్‌లోనే అత్యంత ఫిట్టెస్ట్ క్రికెటర్ అయిన విరాట్ కోహ్లీ తనకు నచ్చిన ఫార్మాట్‌కు వీడ్కోలు పలకడం అందర్నీ అయోమయానికి గురి చేసింది.

విరాట్ కోహ్లీ లేని లోటు టీమిండియాలో కనబడనుంది. అయితే ఈ ఇద్దరి దిగ్గజాలను ఇంగ్లండ్ పర్యటనలోని తొలి టెస్ట్‌కు బిసిసిఐ ఆహ్వానించనున్నట్లు తెలుస్తోంది. జూన్ 20న లీడ్స్ వేదికగా జరిగే ఈ మ్యాచ్‌కు విరాట్ కోహ్లీ, రోహిత్ శర్మలు హాజరయ్యే అవకాశం ఉంది. మ్యాచ్‌కు ముందు ఈ ఇద్దరికి గార్డ్ ఆఫ్ హానర్ ఇవ్వాలని బిసిసిఐ భావిస్తున్నట్లు తెలుస్తోంది. భారత క్రికెట్‌కు చేసిన సేవలకు గుర్తింపుగా వారికి గౌరవ వందన కార్యక్రమం ఏర్పాటు చేయాలనే యోచనలో బిసిసిఐ ఉంది. కోహ్లీ, రోహిత్ శర్మలను ఇంగ్లండ పర్యటనలోని తొలి టెస్ట్‌కు హాజరవ్వాలని ప్రత్యేకంగా కోరనుందని ఓ బిసిసిఐ అధికారి మీడియాకు వెల్లడించారు. ఇప్పటికే విరాట్ కోహ్లీ, రోహిత్ శర్మకు ఫేర్‌వెల్ మ్యాచ్ ఏర్పాటు చేసి ఘనంగా వీడ్కోలు పలకాలని అనిల్ కుంబ్లే వంటి మాజీ ఆటగాళ్లు బిసిసిఐకి సూచిస్తున్నారు.


# రీల్

## 'ఛావా' తర్వాత మరో హిస్టారికల్ చిత్రం!




రీసెంట్ గా బాలీవుడ్ సినిమా దగ్గర భారీ హిట్ అయ్యిన చిత్రాల్లో ఒక రోరింగ్ హిట్ చిత్రం ఛావా కూడా ఒకటి. విక్కీ కౌశల్ అలాగే రష్మిక మందన్నా కలయికలో దర్శకుడు లక్ష్మణ్ రామ్ ఉటేకర్ తెరకెక్కించిన ఈ చిత్రం హిందీతో పాటుగా కేవలం తెలుగు డబ్బింగ్ వెర్షన్ లో మాత్రమే రిలీజ్ అయ్యింది. ఇక ఈ హిస్టారికల్ సినిమా తర్వాత తెలుగు ఆడియెన్స్ ముందు మరో రీసెంట్ హిట్ బాలీవుడ్ సినిమా రాబోతుంది. మరి ఆ చిత్రమే కేసరి చాప్టర్ 2. అక్షయ్ కుమార్ సహా మాధవన్ ప్రధాన పాత్రల్లో దర్శకుడు కరణ్ సింగ్ త్యాగి తెరకెక్కించిన ఈ చిత్రం కూడా హిందీలో మంచి హిట్ అయ్యి ఇప్పుడు తెలుగులో రిలీజ్ కి సిద్ధం అయ్యింది. సురేష్ ప్రొడక్షన్స్ సమర్పణలో ఈ మే 23న తెలుగు స్టేట్స్ థియేటర్స్ లో ఈ చిత్రం విడుదల కాబోతుంది. మరి ఈ చిత్రానికి తెలుగులో ఎలాంటి రెస్పాన్స్ వస్తుందో చూడాలి.

## ఓజి సెట్స్‌లో సలార్ బ్యూటీ



పవర్ స్టార్ పవన్ కళ్యాణ్ నటిస్తున్న లేటెస్ట్ చిత్రాల్లో దర్శకుడు సుజీత్ డైరెక్షన్‌లో తెరకెక్కుతున్న 'ఓజి' కూడా ఒకటి. ఈ సనిమా షూటింగ్‌ను మేకర్స్ తాజాగా తిరిగి ప్రారంభించారు. దీంతో పవన్ అభిమానులు ఈ సినిమా అప్డేట్స్ కోసం ఎంతో ఆసక్తిగా చూస్తున్నారు. అయితే, తాజాగా ఈ చిత్ర సెట్స్‌లో నటి శ్రియా రెడ్డి కూడా జాయిన్ అయ్యింది. ఆమె తన పాత్రకు సంబంధించిన షూటింగ్‌లో పాల్గొంటుందని సినీ సర్కిల్స్‌లో టాక్ వినిపిస్తోంది. ఈ సినిమాలో ఆమెది పవర్ఫుల్ పాత్ర అని తెలుస్తోంది. ఈ సినిమాలో అందాల భామ ప్రియాంక మోహన్ హీరోయిన్‌గా నటిస్తుండగా బాలీవుడ్ నటుడు ఇమ్రాన్ హష్మి విలన్ పాత్రలో నటిస్తున్నాడు. ఈ చిత్రానికి థమన్ సంగీతం అందిస్తుండగా డివివి ఎంటర్‌టైన్‌మెంట్స్ భారీ బడ్జెట్‌తో ప్రొడ్యూస్ చేస్తున్నారు.

## ట్రెండింగ్‌లో విశ్వంభర.. సాంగ్


మెగాస్టార్ చిరంజీవి లేటెస్ట్ సెన్సేషనల్ మూవీ 'విశ్వంభర' కోసం ప్రేక్షకులు ఎంత ఆసక్తిగా ఎదురుచూస్తున్నారో అందరికీ తెలిసిందే. ఈ సినిమాను దర్శకుడు వశిష్ఠ పూర్తి సోషియో ఫాంటసీ చిత్రంగా రూపొందిస్తున్నా డు. ఇక ఈ సినిమా నుం చి ఇటీవల 'రామ రామ' అనే ఫస్ట్ సింగిల్ సాం గ్‌ను మేకర్స్ రిలీజ్ చేశా రు. ఈ పాట ప్రేక్షకులను ఆకట్టుకోవడంలో విజయం సా ధించింది. ఇక తాజాగా ఈ పా ట యూట్యూబ్‌లో 25 మిలియ న్ వ్యూస్ మార్క్‌ను క్రాస్ చేసిం ది. దీంతో ఈ పాట ప్రస్తుతం యూట్యూబ్‌లో ట్రెండింగ్ అవుతోంది. ఇక ఈ సినిమాలో అం దాల భామ త్రిష హీరోయిన్‌గా నటిస్తోంది. ఈ చిత్రానికి ఎం.ఎం.కీరవాణి సంగీతం అం దిస్తున్నాడు.



## ఓరుగల్లులో సుందరీమణుల సందడి







**ప్రజాపక్షం/హనుమకొండ/ములుగు :** మిస్ వరల్డ్ పోటీల సందర్భంగా హెరిటేజ్ టూర్ లో భాగంగా హన్మకొండ, వరంగల్ పర్యటనకై బుధవారం సాయంత్రం హరిత కాకతీయ హూటల్‌కు చేరుకున్న వివిధ దేశాలకు చెందిన సుందరిమణులను అపూర్వ స్వాగతం లభించింది. భారీ పోలీసు బందోబస్తు మధ్య ప్రపంచ సుందరీమణులు వారి కోసం హైదరాబాద్ నుండి ఏర్పాటు చేసిన ప్రత్యేక బస్సులో హనుమకొండకు చేరుకోగా మహిళలు బతుకమ్మ,నృత్యాలతో ఘనంగా స్వాగతం పలికారు. వరంగల్ పోలీస్ కమిషనర్ సన్ ప్రీత్ సింగ్, హనుమకొండ, వరంగల్ జిల్లాల కలెక్టర్లు లావణ్య, డాక్టర్ సత్య శారద, వరంగల్ పోలీస్ కమిషనర్ సన్ ప్రీత్ సింగ్, గ్రేటర్ వరంగల్ మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ అశ్విని తానాజీ వాకడే, ఇతర అధికారులు సుందరీమణులను సాధరంగా ఆహ్వానించారు. అనంతరం హరిత హోటల్‌కు చేరుకున్న సుందరీమణులు తొలుత హనుమకొండలోని చారిత్రక వెయ్యి స్థంబాల దేవాలయంనకు చేరుకోగా అక్కడ విద్యార్థినిలు, చిన్నారులు స్వాగతం గీతం,నృత్యంతో వారిని ఆహ్వానించారు. ఈ సందర్భంగా వెయ్యి స్థంబాల దేవాలయంలోని శిల్పాలను,స్థంబాలను చూసి వారు మంత్రముగ్ధులయ్యారు. కాకతీయుల చరిత్రను, వారి గొప్పతనాన్ని అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా వెయ్యి స్థంబాల దేవాలయంలోని కాకతీయుల ఇలవేల్పు రుద్రేశ్వర స్వామిని సుందరీమణులు దర్శింపకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. దేవాలయానికి ప్రపంచ సుందరీమణులందరూ సాంప్రదాయ దుస్తులతో హాజరయ్యారు. వరంగల్ నగరంలోని ఖిలా వరంగల్ కోటను వారు సందర్శించారు. వరంగల్ కోటలోని కాకతీయుల కీర్తి తోరణంతో పాటు కోటలోని కాకతీయుల శిల్పాలను చూసి ప్రపంచ సుందరీమణులు అబ్బుర పడ్డారు.ఈ సందర్భంగా దారి పొడవునా వారికి ఘన స్వాగతం లభించింది.

**రామప్ప ఆలయ సందర్శన**

కాగా ములుగు జిల్లా రామప్ప ఆలయానికి ప్రపంచ సుందరీమణులు బుధవారం సందర్శించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ దివాకర, ఎస్‌పి శబరీష్, జిల్లా అధికారులు టూరిజం శాక అధికారులు ప్రపంచ సుందరీ మహిళలకు ఘన స్వాగతం పలికారు. గుస్సాడీ నృత్య ప్రదర్శన ఒగ్గుడోలు ప్రదర్శన ద్వారా కళాకారులు ఆత్మీయ వారికి స్వాగతం పలికారు. ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ విశిష్టత చరిత ఆలయ సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. పురాతన ఆలయం రామప్ప ఆలయాన్ని తిలకించి మంత్రముగ్ధులయ్యారు. ఆలయ తీరు తెన్నులను తనివి తీరా తిలకించి ఫిదా అయ్యారు. రామప్ప ఆలయం ఆవరణంలో ఏర్పాటు చేసిన సభా ప్రాంగణం వద్ద తెలంగాణ సాహిత్య అకాడమీ, భాషా సాంస్కృతిక శాఖ ఆధ్వర్యంలో కాకతీయు రాజుల పరిపాలన చారిత్రాత్మక అంశాలను నృత్య రూపంలో కళాకారులు ప్రదర్శించారు. రాణి రుద్రమాదేవి వేషాధారణలో తెలంగాణ సాహిత్య అకాడమీ చైర్‌పర్సన్ అలేఖ్య పుంజరి ప్రదర్శించారు. రామప్పను సందర్శించిన మంత్రి సీతక్క సుందరీమణులతో ఫోటో దిగారు. ప్రపంచ ప్రసిద్ధి గాంచిన రామప్ప దేవాలయాన్ని సందర్శించడం ఆనందంగా ఉందని మంత్రి తెలిపారు. ఈ సందర్భంగా వారు వేయి స్తంభాల గుడిని సందర్శించారు. వారికి తెలంగాణ సంప్రాదాయం ప్రకారం బతుకమ్మ, మేళతాళాలతో స్వాగతం పలికారు.

## రూ.3,706 కోట్లతో సెమీకండక్టర్ ప్లాంట్

### యు.పిలో హెచ్‌సిఎల్–ఫాక్స్‌కాన్ ప్రాజెక్టు

### కేంద్రమంత్రివర్గం ఆమోదముద్ర

**న్యూఢిల్లీ :** ఉత్తర ప్రదేశ్ జెవార్‌లో రూ.3,706 కోట్లతో నిర్మించే సెమీకండక్టర్ ప్లాంట్‌కు కేంద్రమంత్రివర్గం బుధవారంనాడు ఆమోదముద్ర వేసింది. హెచ్‌సిఎల్–ఫాక్స్‌కాన్ కంపెనీలు రెండూ ఉమ్మడిగా ఈ ప్రాజెక్టును చేపట్టాయి. 2027 నాటికి ఈ కర్మాగారం పూర్తవుతుంది. ఈ కర్మాగారాన్ని స్థాపించడంవల్ల 2000 మందికి ఉద్యోగాలు లభిస్తాయి. మనదేశంలో ప్రస్తుతం ఈ ఎలక్ట్రానిక్ మాన్యుఫాక్చరింగ్ ఇండస్ట్రీలో ఇప్పటివరకూ 25 లక్షలమంది ఉద్యోగాలు పొందారని కేంద్ర సమాచార ప్రసారాల శాఖామంత్రి అశ్వనీ వైష్ణవ్ పాత్రికేయులకు వివరించారు. మొబైల్‌ఫోన్లు, ల్యాప్‌టాప్స్, ఆటోమొబైల్స్‌కు సంబంధించిన డిస్‌ప్లే డ్రైవర్ చిప్స్ తయారీకి ఈ రెండు కంపెనీలు సన్నద్ధమయ్యాయి. ఒక్క నెలకు మైక్రోచిప్స్‌కు ఉపయోగించే 20,000 వాఫెర్స్‌ను నిర్వహించగల సామర్థ్యం ఈ కర్మాగారానికి ఉంది. నెలకు 3.60 కోట్ల చిప్స్‌ను ఈ కర్మాగారంలో తయారు చేస్తారు. జెవార్‌లో ఇప్పటివరకూ ఐదు సెమీకండక్టర్ చిప్ ప్లాంట్లు ఏర్పాటు చేశారు. దీనితో మొత్తం ఆరు సెమీకండక్టర్ ప్లాంట్లను జెవార్‌లో స్థాపించినట్లవుతుందని మంత్రి చెప్పారు. యాపిల్ ఐఫోన్లతో సహా ఎలక్ట్రానిక్ ఉత్పత్తులలో ఫాక్స్‌కాన్ కంపెనీ అతిపెద్ద తయారీ సంస్థ అని ఆయన చెప్పారు. ''ఒక్కసారి జెవార్‌లో ఈ కర్మాగారాన్ని గనుక నిర్మాణం పూర్తిచేసి ప్రారంభిస్తే డిస్‌ప్లే ప్యానల్ ప్లాంటు కూడా భారతదేశానికి వస్తాయి. దీనివల్ల భారతదేశంలో 40 శాతం సామర్థ్యాన్ని, అవసరాలను తీర్చవచ్చు. ఇది అతిపెద్ద ప్లాంట్. ప్రపంచందేశాలకు కూడా ఎగుమతి చేసి వాటి అవసరాలు కూడా తీర్చడానికి ఈ ఫాక్స్‌కాన్ కర్మాగారం ఎంతగానో ఉపయోగపడుతుంది'' అని మంత్రి వైష్ణవ్ చెప్పారు. ఈ చిప్స్ సంబంధిత వ్యవస్థల పనితీరును నియంత్రిస్తాయి, వాటి కంటెంట్ ఫార్మేట్‌ను నియంత్రిస్తాయి.

## నక్సల్స్ హతం (మొదటి పేజీ తరువాయి)

ఆపరేషన్ కగార్ పేరుతో దీనిని ప్రారంభించాం. దాదాపు 21 రోజులు పాటు జరిగిన భారీ ఆపరేషన్‌లో దాదాపు 20,000మంది సిబ్బంది పాల్గొన్నారు. చత్తీస్‌గఢ్ పోలీసులు, సిఆర్‌పిఎఫ్ సిబ్బంది ఉన్నారు. మే 11న ఆపరేషన్‌ను విరమించుకున్నాం. ఈ భారీ ఆపరేషన్‌లో మొత్తం 21 ఎన్‌కౌంటర్లు జరిగాయి. 16మంది మహిళ కేడర్స్‌తో సహా 31మంది మావోయిస్టులు మరణించారు. వారి నుంచి ఎస్ఎల్ఆర్, ఇన్సాస్, ఇతర ఆటోమేటిక్, సెమీ ఆటోమేటిక్ సహా 35 ఆయుధాలను స్వాధీనం చేసుకున్నాం' అని ఛత్తీస్‌గఢ్ డిజిపి అరుణ్ దేవ్‌గౌతమ్ తెలిపారు.

**భారీగా పేలుడు పదార్థాలు స్వాధీనం :** ఇక మృతుల్లో 28మందిని గుర్తించినట్లు సిఆర్‌పిఎఫ్ డిజి జ్ఞానేంద్ర ప్రతాప్ సింగ్ పేర్కొన్నారు. వారిలో రూ. 1.75 కోట్ల రివార్డ ఉన్న మావోయిస్టు కూడా చనిపోయినట్లు తెలిపారు. 'కర్రెగుట్టలో 214 బంగర్లు గుర్తించి ధ్వంసం చేశాం. 450 ఐఇడిలు, 818 బారెల్ గ్రెనేడ్ లాంచర్ల షెల్స్, 899 కార్డ్‌టెక్స్ డిటోనేటర్లు, భారీ మొత్తం పేలుడు పదార్థలను స్వాధీనం చేసుకున్నాం. అంతేకాకుండా దాదాపు 12,000 కిలోల ఆహార పదార్థాలను కూడా స్వాధీనం చేసుకున్నాం. దేశంలోని 6 జిల్లాలు నక్సల్స్ ప్రభావిత ప్రాంతాలుగా ఉన్నాయి. అందులో ఛత్తీస్‌గఢ్‌లో నాలుగు, మహారాష్ట్ర, జార్ఖండ్‌లో ఒక్కొక్కటి ఉన్నాయి. ఛత్తీస్‌గఢ్‌లో సుక్మా, బిజాపూర్, నారాయణపూర్, కాంకేర్ జిల్లాలు నక్సల్స్ ప్రభావిత జిల్లాలు. ఇక ఈ ప్రాంతంలో మా కదలికను తిరిగి ప్రారంభించడానికి ప్రయత్నిస్తున్నాం. పూర్వం, ప్రజలు ఆలయంలో పూజలు చేయడానికి ఇక్కడికి వచ్చేవారు. ఇక్కడ నక్సలైట్ శిబిరాలు ఏర్పాటు చేసినప్పటీ నుంచి ఈ కార్యకలాపాలు ఆగిపోయాయి. మేం దాన్ని మళ్లీ ప్రారంభించేందుకు ప్రయత్నిస్తున్నాం' అని డిజిపి తెలిపారు.

## సిద్ధమే (మొదటి పేజీ తరువాయి)

ఆదివాసీల అస్థిత్వానికి పెనుసవాల్ ఎదురైందని అందుకే శాంతి చర్చలపై పత్రిక ప్రకటనలు గుప్పిస్తుందని మోడీ మీడియా చేస్తున్న ప్రచారంలో నిజం లేదన్నారు. బాధ్యత కలిగిన వారి నుండి వచ్చిన ప్రస్తావనను మాత్రమే తాము పరిగణలోకి తీసుకుని శాంతి చర్చల ప్రకటన చేశామన్నారు. తెలంగాణలో ప్రత్యేకించి వామపక్ష పార్టీలు, ప్రజా సంఘాలు, ప్రజాస్వామిక వాదులు, శాంతికాముకులు సభలు, సమావేశాలు పెట్టి చర్చల అనుకూల వాతావరణాన్ని ఏర్పరచేందుకు కృషి చేస్తున్నారని వీరిపై అర్బన్ నక్సల్స్ ముద్ర వేసేందుకు ప్రయత్నాలు జరుగుతున్నాయని మావోయిస్టులు లేఖలో పేర్కొన్నారు.కేసిఆర్ బహిరంగ సభలో మావోయిస్టులతో చర్చలు జరపాలన్న మాటలకు ప్రజల నుంచి సానుకూల స్పందన వచ్చిందని ఆ స్పందనకు అనుగుణంగా తాము శాంతి చర్చలకు సంబంధించి ప్రకటన చేశామన్నారు. 31మార్చి 2026 నాటికి మావోయిస్టులను నిర్మూలించాలన్న లక్ష్యంతో కేంద్రం సైనిక బలగాలను ప్రయోగిస్తుందని అది అసాధ్యమని మావోయిస్టు పార్టీ స్పష్టం చేసింది. ఆపరేషన్ కగార్‌ను ఆపేందుకు ప్రజా సమస్యలపరిష్కారానికి శాంతి చర్చలు జరపాల్సిందిగా విప్లవ ప్రగతిశీల, ప్రజాస్వామ్య వాదులకు, శాంతికాముకులకు, జర్నలిస్టులకు, సామాజిక సంస్థలకు, ఆదివాసీ శ్రేయోభిలాషులకు మావోయిస్టు పార్టీ విజ్ఞప్తి చేస్తుందని ఆ లేఖలో అభయ్ తెలిపారు.

## యుద్ధాన్ని ఆపారా? (మొదటి పేజీ తరువాయి)

వెల్లడించారు' అని కాంగ్రెస్ కమ్యూనికేషన్స్ వ్యవహారాల ఇంఛార్జ్, ప్రధాన కార్యదర్శి జైరాం రమేశ్ బుధవారం ఉదయం తన 'ఎక్స్' ఖాతాలో రాశారు. 'సాధారణంగా ధాటీగా మాట్లాడే ప్రధాన మంత్రి...దీనిగురించి ఏం చెబుతారు? అమెరికా ఒత్తిడి నేపథ్యంలో వారు భారతదేశ భద్రతా ప్రయోజనాలను తాకట్టు పెట్టారా?' అని జైరాం రమేశ్ ప్రశ్నించారు. సౌదీ అరేబియాలో జరిగిన కార్యక్రమంలో ట్రంప్ తాజా వ్యాఖ్యల క్లిప్‌ను కాంగ్రెస్ మీడియా, ప్రచార విభాగం అధిపతి పవన్ ఖేరా పంచుకున్నారు. 'అమెరికా అధ్యక్షుడు మళ్లీ ఇలా అంటున్నారు : 'నేను వారి మధ్య ఒప్పందం కుదుర్చుకోవడానికి వాణిజ్యాన్ని ఉపయోగించాను. వారు అంగీకరించారు'. డొనాల్డ్ ట్రంప్ భారతదేశాన్ని పాకిస్థాన్‌తో అనుసంధానించడమే కాకుండా ప్రధాని మోదీని షెహబాజ్ షరీఫ్‌తో పోలుస్తున్నారు' అని ఆయన తన శీర్షికలో పేర్కొన్నారు. అలాంటి పోలిక ప్రధాన మంత్రి కార్యాలయానికి ఆమోదయోగ్యమేనా అని ఆయన ప్రశ్నించారు. కల్నల్ సోఫియా ఖురేషీపై అభ్యంతరకర వ్యాఖ్యలు చేసిన మధ్యప్రదేశ్ మంత్రి విజయ్ షాను ప్రధాని మోదీ ఇప్పటివరకు ఎందుకు తొలగించలేదని జైరామ్ రమేశ్ ప్రశ్నించారు. మంత్రి వ్యాఖ్యలు బిజెపి వ్యాధిగ్రస్త మనస్థత్వాన్ని ప్రతిబింబిస్తోందని ఆయన ''ఎక్స్''లో పోస్ట్ చేశారు.






Printed & Published on behalf of M/s Navachethana Vignana Samithi by its president **Palla Venkat Reddy,** Printed at M/s Navachethana Vignana Samithi, 12-1-493/VA, Giriprasad Bhavan, Bandlaguda (Nagole), GSI Post Hyderabad-500068, Telangana State, Published at H.No 12-1-493/VA, Giriprasad Bhavan, Bandlaguda Main Road, Nagole, Hyderabad - 500 068 RNI APTEL /1998/04664 **Editor : Makkena Subbarao,** Editorial : 040-29884450/51, E-mail : editorprajapaksham@gmail.com